శ్రీమతే రామానుజాయనమః.

ఆళ్వారాచార్యుల వైభవము

అగు

# గురుపరంపరాప్రభావము.

ఇది,

కోమాండూరు - అనంతాచార్యుల చేత

తెనిగింపబడి,

ఊ. పుష్పరథశెట్టిగారిచే

వారిదైన

కలారత్నాకర ముద్రాక్షరశాలయందు


ముద్రింపబడియె.

చెన్నపురి:

1885.

| | | | |
|---|---|---|---|
| 1) [illegible] | [illegible] | రూ.62,902. | |
| 2. [illegible] | " | " | |
| 3) [illegible] | " | " | |
| 4) [illegible] | " | " | 4870. [illegible] |
| 5) [illegible] | " | 8,66,879 | |
| 6) [illegible] | 500 [illegible] | 43 [illegible] | |
| 7) [illegible] | " | 28 [illegible]. | |
| 8) [illegible] | " | 47 [illegible]. | |
| 9) [illegible] | " | 97 [illegible] | |
| 10) [illegible] | [illegible] | 2 [illegible]. | |
| 11. [illegible] | " | 342 [illegible] | |
| 12 [illegible] | | 3 | |

శ్రీమతే రామానుజాయ నమః.



# ఆళ్వారాచార్యుల వైభవము.

లేక

## గురుపరంపరా ప్రభావము.

### ప్రకృతార్థ వివరణము.

శ్రియఃపతియు, శ్రీవైకుంఠ నికేతనుడును, శ్రీమదనంత ముఖ్య నిత్యసూరి పరిషన్నిషేవ్యమాణుడును, శ్రీభూమినీళా సమేతుడును, సర్వజ్ఞుడును, సర్వవ్యాపకుడును, సర్వాంతర్యామియు, సర్వోత్కృష్టుడును, అవాప్తసమస్త కాముడును, అనాథరక్షకుడును, ఆశ్రితఫలప్రదుడును, ఆదిమధ్యాంతరహితుడును, నిరతిశయసౌందర్య సౌకుమార్యలావణ్య యౌవనాద్యపరిమితోదార గుణగణ దివ్యమంగళవిగ్రహ విశిష్టుడును, పరమభాగవతోత్తమ హృదయకమల నివాసియు, లోకసంరక్షణార్థమై హంస మత్స్య హయగ్రీవ కూర్మవరాహాదులయిన అవతారములను ఎత్తినవాడును నయిన శ్రీమన్నారాయణుడు, అనాదికర్మవాసనా వశులయిన జీవాత్మలు జననమరణ దుఃఖములనుండి విడువబడి యుజ్జీవించు నిమిత్తము తన దేవీ భూషణాయుధ పరిజనములను భూలోకమునందు ఆళ్వారులుగాను ఆచార్యులుగాను అవతరింప ఆజ్ఞాపింపగా, వారు ఆయాజ్ఞను శిరసావహించి యీ భూమియందు అవతరించి సర్వచేతనోజ్జీవనపరులయి వర్తించిరి.

## ఆళ్వారుల వైభవము.

### ౧ - పొయ్గయాళ్వార్లు.

శ్లో॥ కాంచ్యాంసరసి హేమాబ్జే జాతంకాసారయోగినమ్,
కలయేయశ్శ్రియఃపత్యుః రవిందీపమకల్పయత్.

శ్రీపాంచ జన్యాంశమయిన పొయ్గయాళ్వార్లు (సరోయోగి) ద్వాపరయుగమునందు ఎనిమిదిలక్షల అరువది రెండు వేల తొమ్మన్నూట రెండవదియైన సిద్ధార్థినామ సంవత్సరము అల్పిశి నెల (ఆశ్వయుజమాసము) శుక్లపక్షమునందు అష్టమీమంగళ వారమునాడు శ్రవణనక్షత్రమున ముక్తిప్రదములని పేర్కొన బడిన నగరము లేడింటను ప్రధానమని అనిపించుకొన్న కాంచీ పట్టణమునందు నూటయెనిమిది దివ్యతిరుపతులందు నెన్నబడిన యథోక్తకారి సన్నిధి వెంబడి పొయ్గై (తామరకొలను) అను పుష్కరిణిలో వికసించిన బంగారు తామరయందు అవతరించి, ఇట్టిదట్టిదని చెప్పరాని భగవద్భక్తితో ఆశ్రితులను ఉజ్జీవింప జేయుచు వేంచేసి యుండిరి.

8,62,902

### ౨ - పూదత్తాళ్వార్లు.

శ్లో॥ మల్లాపురవరాధీశం మాధవీకుసుమోద్భవమ్,
భూతంనమామియోవిష్ణో ర్జ్ఞానదీపమకల్పయత్.

శ్రీగదాంశమయిన పూదత్తాళ్వార్లు(భూతయోగి)పొయ్గయాళ్వార్లు అవతరించిన మరునాడు నవమితోగూడిన ధనిష్ఠ నక్షత్రమునందు తిరుకడల్మల్లై (మల్లాపురము లేక మహాబలిపురము) అను దివ్యతిరుపతియందు ఒక పువ్వులగురివింద పూవునందు అవతరించి, శ్రీమన్నారాయణుని పాదపద్మములయందు అంతరంగభక్తిగలిగి వేంచేసి యుండిరి.

## ౩ - పేయాళ్వార్లు.

శ్లో ॥ దృష్ట్వానితీహోవాచ రమయామయిలాధిపమ్,
కూపేరక్తోత్పలేజాతం మహదాహ్వాయమాశ్రయే.

శ్రీనందకాంశమయిన పేయాళ్వార్లు (మహాయోగి) భూదత్తాళ్వార్లు అవతరించిన మరుసటినాడు దశమితోగూడిన శతభిషఙ్నక్షత్రమునందు దివ్యతిరుపతులలో నొకటియయిన తిరుమయిలై (మయిలాపురము లేక మయూరపురము) అను పట్టణమునందు మాధవస్వామిసన్నిధికి సమీపమున లతాహ్రదము అను కోనేటిలో వికసించియున్న ఎఱ్ఱగలువ పూవునందు అవతరించి, జగద్రక్షకుడైన శ్రీమన్నారాయణునియందలి నిరతిశయ భక్తి తాత్పర్యముతో వేంచేసి యుండిరి.

ఈ చొప్పున మూడు దివ్యతిరుపతులయందు అవతరించిన యీయాళ్వార్లు ముగ్గురును, జననమరణ దుఃఖవర్జితులయి పరమపదమును పొందగోరువారికి శ్రీమన్నారాయణపదారవింద సేవయు భాగవతసేవయు దక్కఁగతి వేరొక్కటి లేదనెడి యథార్థ జ్ఞానము లేనివారును, ఆజననమరణ దుఃఖములకు హేతు భూతములయిన కృత్యములను చేసి పరితపించువారునైన ఆత్మలు అట్టి దుఃఖములనుండి తొలగి శ్రీమన్నారాయణుని పాదపద్మసేవచేసి పరమపదము నొందుటకు దగినమార్గములను సూచింపదలచి, తమతమ యవతారస్థలములలోనే వేంచేసి యుండక, అనిత్యములైన పాంచభౌతికదేహములను ధరించి, నిస్సారమయిన సంసారసాగరమునందు మునిగిపోక సదా భగవద్గుణానుభవముచే కాలము గడపునట్టి పరమభాగవతులను, కంచి మొదలుగాగలదివ్యదేశములయందు అర్చావతారములను పొంది వేంచేసి యుండు శ్రీమన్నారాయణుని సేవింపతలంపు జనింపగా యాత్రవెడలి ప్రతిదివ్యదేశమునందునున్న పెరుమాళ్లను సేవించుచు, అందందుగల భాగవతులను వెదకివెదకి కనుగొనుచు, యాత్రచేయు

నపుడు ఎవరంతట వారువచ్చి, ముగ్గురు ఆళ్వారులును ఒక్కనాడే దక్షిణపినాకినీనది దక్షిణపుగట్టున శ్రియఃపతియగు ఆయనార్ అను అర్చావతారమూర్తి వేంచేసియుండు తిరుక్కోవలూరు (వామనక్షేత్రము) అను దివ్యదేశము చేరి, అచ్చటి పెరుమాళ్ల సన్నిధికి బోయి మంగళాశాసనముచేసి, బహువిధముల వినుతించి, అందువలని ఆనందాతిశయముచేత పరవశులై తిరుమంత్రమును జపించుచు ఎవరికి అబ్బినచోట వారు వేంచేసియుండిరి.

అంతట క్రమముగా సూర్యాస్తమయమును అయ్యెను. అప్పుడు తొలుత పొయ్‌గయాళ్వార్లు తాము శయనింప చోటు వెదకువారై ఆయూరిభాగవతుల తిరుమాళిగలను విచారించుచు బోయి ఒకవైష్ణవుల తిరుమాళిగ నడవయరుగు దొరకగా అచట శయనించిరి. వెంటనే పూదత్తాళ్వార్లు తాము శయనింప చోటు వెదకుచు ఆతిరుమాళిగవాకిట వచ్చి నిలువబడి, ఎవరు తిరుమాళిగస్వాములు? అడియనికి ఈరాత్రి పండుకొనుటకు కొంచెము స్థలము సాదించెదరా? అనిరి. ఆమాటలు చెవినిపడగానే ఆనడవయరుగుపై శయనించియున్న పొయ్‌గయాళ్వార్లు తలుపు తెరచి బయటికివచ్చి వారిని ఎచ్చరించుకొని స్వామీ దాసుడు ఉండుచోటు, ఒకరికైన పండుకొనను ఇరువురికైన కూర్చుండను చాలునదిగా ఉన్నది. దేవరవారు వేంచేసిన పక్షమున ఇరువురము నుండవచ్చును. అనగా, అందులకు హర్షించి వారును ఆయరుగుమీద చేరుకొనిరి. మరికొంత సేపటికి పేయాళ్వార్లును పడుకకు తావు వెదకుచువచ్చి ఆతిరుమాళిగకెదుట నిలిచి, ఓతిరుమాళిగ స్వాములారా! దాసునికి పండుకొనుటకు కొంచెము చోటుకావలెను. ఇచట చిక్కునా? అనిరి. ఆమాట విని మునుపటి యాళ్వారులిద్దరును ఎచ్చరించుకొని, స్వామీ! ఈనడవయరుగు ఒకరు పండుకొనను, ఇరువురు కూర్చుండను, ముగ్గురు

నిలుచుండను తగినదిగా నున్నది. ఇందు మీదాసులము ఇద్దరము ఉన్నాము. దేవరవారును వేంచేయుదురేని ముగ్గురమును సరుదుకొని నిలుచుండవచ్చును అని చెప్పి తలుపు తెరచిరి.

ఈవిధముగా పాంచజన్యగదా నందకాంశ సంభూతులైన ఆయాళ్వార్లు ముగ్గురుగూడి ఒకరి వృత్తాంతము ఒకరికి చెప్పుకొని, ఇష్టగోష్ఠినుండగా, భక్తవత్సలుడయిన శ్రీమన్నారాయణుడు వారి యోర్పు తెలియగోరి ఆనడవలోని చోటు వారికి నిలువనుగూడ చాలక మిక్కిలి యిరుకు అగునట్లు చేసెను. అప్పుడు వారు ఇంత పర్యంతము లేని యిరుకటము ఇప్పుడు కలుగనేల? ఈయొరపిడికి ఎట్లు సహింపవచ్చును? ఇందులకు కారణమేమో కనిపింపుడు అని ఒకరికొకరు చెప్పుకొనుచు జ్ఞానదృష్టిచే వీక్షించి అని తమ్మనను గ్రహింప శ్రీలక్ష్మీసమేతుడై వచ్చిన శ్రీమన్నారాయణుని రాకడచేనైన యిరుకటమని తెలిసికొనిరి. అట్లు తెలిసికొని, ఆనందపారవశ్యముచే కన్నులనుండి వెడలునట్టి బాష్పములు ఏరులై పారగా, ఆశ్రితవత్సలా! అపారకరుణాంబుధీ! ఆపద్బాంధవా! అనాధరక్షకా! అని బహుప్రకారముల గొనియాడి, మాటిమాటికి సాగిలబడి మ్రొక్కుచు, చేతులు జోడించుకొని నిలుచుచు, కొంతప్రొద్దుజరపి, శ్రియఃపతి నుద్దేశించి, ఓ తండ్రీ! ఎల్ల యండములును కడుపున నిముడుకొనగా వాసుదేవుడనబరగిన నీవు, జరాయుజములు అండజములు స్వేదజములు ఉద్భిజ్జములునైన నరమృగపక్షి సరీస్రుప క్రిమి కీటక స్థావరముల నెడు పదువిధములైన జీవకోటులను సృజింప, నీనాభికమలము వలన బ్రహ్మను, ఆజీవకోటులను సంహారింప బ్రహ్మవలన రుద్రునిని పుట్టించి, సర్వమునకు రక్షకుడవై యొప్పుచుందువు. కావున, నీదగు సత్వకృత్యముచే మేలిమివహించిన యడుగు దామరల యందలి భక్తి పెరుగను, నీభక్తులయిన పరమ భాగవతులతోడి సాంగత్యము సర్వదా కలిగి మెలగను, దేవరవారి దివ్యమంగళ

గుణవర్ణనాత్మకములయిన మాటలనెడు పుష్పులతో పద్యరూపసరములనుగూర్చి నీమృదుపదములను ఆలంకరింపను అనుగ్రహింపుము అని ప్రార్థించిరి.

అంతట లక్ష్మీవల్లభుడగు శ్రీమన్నారాయణుడు శంఖచక్ర గదా ఖడ్గ శార్ఙ్గములనెడి పంచాయుధములను ధరించినవాడును, శ్రీవత్సలాంఛనలాంఛితుడును, లక్ష్మీలక్షిత విశాలవక్షుండును నై సాక్షాత్కరించి, కన్నులయందుండి యానంద బాష్పములు నిరంతరధారలై కురియగా బద్ధాంజలులై నిలువబడియున్న యాళ్వారులను చల్లగా కటాక్షించి, నాయెడల నిరతిశయ భక్తిగలిగిన యో భాగవతశిఖామణులారా! ఎన్నడును నేను మీహృదయములను విడిచి తొలగనేరను. మీరు ఈలోకము నావరించియుండు అజ్ఞానమనెడు చీకటిలో తగులుకొని దాని దప్పించుకొని నన్ను గాంచునట్టి యుపాయము నెరుగక మరుగునట్టి యాత్మలను ఆయజ్ఞానాంధకారమునుండి తొలగింపజాలిన నాయందలి భక్తిమార్గము అను జ్యోతినిపొందించి, వారు నాదైన పరమపదమును పొందుటకు సాధనములయిన వేదాంతార్థములను బయలుపరిచి పిమ్మట నాసన్నిధానమును పొందగలవారు అని యానతిచ్చి అంతర్ధానము నొందెను.

అప్పుడు ఆముగ్గురుయోగులును, శ్రియఃపతి తమయెడల మించిన కృపనుంచి కర్తవ్యాంశము నెరిగించి వేంచేసిన వైఖరి నెంచి, అత్యంతమైన యానందము వహించియు, స్వామి వేంచేసి సేవ సాదించి మెరపుమెరసినట్టు క్షణమాత్రమున కానరాక పోయినందులకై మనసులు తపింపగా, ఓగజేంద్రవరదా! అనంతఫలదా! కృపాసముద్రా! సంప్రాపితజ్ఞానముద్రా! నీదాసులమగు మాకు సదా నీసేవలభింప ననుగ్రహింపవే అని ప్రార్థించిరి.

అందు, పొయ్గయాళ్వార్లు దేహళీశుడు అను తిరునామముతో తమకు సాక్షాత్కరించిన శ్రీమన్నారాయణుని తాము

సేవించిన యనుభవము తెలియబడ జననమరణముల నెడు వ్యాధులను తొలగించుటకు పరమౌషధమును, సంసారమ నెడు సముద్రమును దాటుటకు చేటులేని యోడయునై శ్రీమన్నారాయణ దివ్యగుణానుభవ రూపమయిన తిరువందాదియను దివ్య ప్రబంధమును అచంచలభక్తి యుక్తులయి అమృతమువలె మధురములయిన మాటలతో * "వైయందగళియా" అని ప్రారంభించి నూరు వెణ్ బాలుగా రచియించిరి.

పూదత్తాళ్వార్లు తాము శ్రీమన్నారాయణుని సేవించిన యనుభవము తేటపడ పరమపద సోపానమోయనునట్లు వేద సారాంశములను బోధించునట్టి తిరువందాదియను దివ్య ప్రబంధమును ప్రేమరసాస్పదములయిన ముద్దుపలుకులతో † "అన్ బేదగళియా" అని యారంభించి నూరు వెణ్ బాలుగా రచియించిరి.

---

* "వైయందగళియా వార్కడలే నెయ్యాగ
వెయ్యకదిరోన్ విళక్కాగ,— శెయ్య
చ్చుడరాళియాన నడిక్కే శూట్టినేన్ శొన్నమాలై
ఇడరాళినీంగవే యెన్ఱు."

† "అన్ బేదగళియావర్వమే నెయ్యాగ
ఇన్ బురుగు శిందై యిడుతిరియా — వెన్బురుగి
ఞానచ్చుడర్ వళక్కేత్తినే నారణర్కు
ఞానత్తమిళ్ పురిందనాన్."

ఈయర్థములుగల తెనుగుపద్యములు.

"తే॥ ధరణిప్రమిదయును సముద్రములు చమురు
తరణిదీపంబుగాఁగఁ జిత్తంబులోన
భావనయొనర్చి కావించెభక్తితోడ
హరికి నీరాజనా సేవ యాదరమున."

"ఉ॥ రెండవయోగి పుంగవుఁడుఁ బ్రేమసమాహ్వయమైన ప్రమిదన్
నిండఁగభక్తియన్ చమురునించి హృదబ్జమువత్తిగాఁగను
ద్దండతరప్రమోదసముదంచితదీపము సర్వలోకనా
థుండగుచక్రికిం బ్రియముతోడ సమర్పణచేసెనయ్యెడన్."

పేయాళ్వార్లు తాము శ్రీమన్నారాయణుని సేవించిన యనుభవము చెప్పిన సంసారదుఃఖమువలని తాపము నార్పునట్టి జడివానయోయనునట్లు లక్ష్మీసమేతుడైన శ్రీమన్నారాయణ స్వరూపమును ప్రతిపాదించునట్టి శ్రుత్యర్థములనెల్ల నిమిడ్చి భక్తి రసాస్పదములైన పలుకులతో * "తిరుక్కండేన్" అని మొదలు పెట్టి నూరువెణ్బాలుగల తిరువందాది అను దివ్యప్రబంధమును రచియించిరి.

ఇట్లు మొట్టమొదటివారైన ఆళ్వారులు ముగ్గురును ఋగ్వేదము, యజుర్వేదము, సామవేదము అను మూడువేదముల సారాంశమయిన అర్థములను అరవమున మూడుతిరువందాదులుగా రచియించి, అన్యమతములు అణగిపోవను, తమమతమువృద్ధి పొందను అనువుగా ఆతిరువందాదులను ఎల్లయెడల వ్యాపింప జేసి, బహుకాలము తమమహిమను వెలయించుచు ఈలోకము నందుండి పిమ్మట శ్రియఃపతి యానతిచొప్పున పరమపదమునకు వేంచేసిరి.

ఇతి ఆదియోగులయిన

పొయ్గ పూదత్త పేయాళ్వార్ల వైభవము.

---

* "తిరుక్కండేన్ పొన్మేనికండేన్ తిగళుం
మరుక్కణినిరముంగండేన్ — శెరుక్కిళరుం
పొన్నాళికండేన్ పురిశంగంగైక్కండేన్
నెన్నాళివణ్ణన్ పాలిన్ఱు."

ఈయర్థముగల తెనుగుపద్యము.

"లయగ్రాహి॥ కంటిపదపద్మములుఁ గంటినఖచంద్రికలుఁ గంటికనకాంబరముఁ గంటిశుభనాభిన్, గంటినుదరాంబుజముఁ గంటిభుజమధ్యమును గంటినవకౌస్తుభముఁ గంటిసిరిసొంపున్, గంటివనమాలికయుఁ గంటినలుచేతులును గంటినిసుదర్శనముఁ గంటిజలజంబున్, గంటిగద నందకముఁ గంటినగునెమ్మొగముఁ గంటిముకుటంబునిదె కంటినిదె కంటిన్."

# తిరుమళ్రిశయాళ్వార్ల వైభవము.

శ్లో॥ విభవాబ్దేపుష్యమాసే దశమ్యాంకృష్ణపక్షకే,
తులాలగ్నేభక్తిసారో మఖాయాంగురువాసరే,
కనకాంగ్యాంభార్గవస్య జజ్ఞేచక్రాంశజోమహాన్,
శ్రీదివ్యసూరిచరితేహ్యవతారోస్యగీయతే,

శ్రీమన్నారాయణునియందు అవిచ్ఛిన్నమయిన భక్తి గలిగిన భాగవతాగ్రగణ్యులగు భార్గవాదిమునులు భూలోకమునందు శ్రీమన్నారాయణుడు తన్ను సేవించునట్టి జీవాత్మలను జననమరణాది దుఃఖములనుండి తొలగించి యుజ్జీవింపజేయుటకై అర్చావతారములతో వేంచేసి యుండుదివ్యదేశములలో సదా పెరియ పిరాట్టిని (శ్రీలక్ష్మీదేవిని) ఎడబాయక విజయముచేసియుండు దివ్యదేశము ఏదో తెలిసికొని అందు వసియించువారై సత్యలోకమునకుబోయి, బ్రహ్మసన్నిధివడసి, అతనికి తమకోరిక తెలియజేయగా, అతడు చక్కగావిచారించి, భరతఖండముయొక్క దక్షిణదిగ్భాగమునందు తూర్పుసముద్రమునకు సమీపమున కాంచీపట్టణమునకు తూర్పుతట్టు * తిరుమళ్రిశ (మహీసారపురము) అను దివ్యదేశము ఒకటి కలదు. అందు, శ్రీమన్నారాయణుడు మంగవల్లియన బరగిన పెరియపిరాట్టితో జగన్నాథుడు అను పేర అర్చావతారమును పొంది సర్వదా పూర్ణాంశముతో వేంచేసి యుండును. అని చెప్పి వారు ఆదివ్యదేశముయొక్క మహిమను మాకు ప్రత్యక్షముగాచూపి మన్నింపవలెను అని ప్రార్థింపగా, విశ్వకర్మనుపిలిచి కర్తవ్యాంశము తెలిపి వారివెంట బంపించెను. అతడు ఆమునులవెంట భూలోకమునకు వచ్చి, ఒకత్రాసును

* ఇప్పటివారు తిరుమళ్రిశను తిరుముషి అని వాడుచున్నారు.

కల్పించి, దానియందు ఒకతట్టు తిరుమళిశను మఱియొకతట్టు తక్కిన దివ్యదేశములను ఉంచి తూపగా తిరుమళిశతట్టే మొగ్గుగానవచ్చెను. అదిచూచి ఆమునులు అట్టివిశేషమును తమకు తెలియబరిచినందులకై బ్రహ్మను బహువిధముల కొనియాడి, తిరుమళిశయందు వేంచేసియుండు శ్రీజగన్నాథుని సేవించుచు, తిరుమంత్రమును జపించుచు వసించియుండిరి మఱియు ఆమునులలో ముఖ్యుడైన భార్గవుడు ఒకయాగముచేసి శ్రీమన్నారాయణుని ప్రత్యక్షముచేసికొని, ఆదేవుని యనుగ్రహమువలన నిరతిశయజ్ఞానభక్తి వైరాగ్యములనుబడసి తపస్సుచేయుచుండగా, అతని తపస్సునకు భంగము కలుగజేయుటకై కనకాంగి అను నప్సరస యింద్రునిచే బంపబడినదై వచ్చి, ఆయనయెదుట బహువిధములైన విలాసచేష్టలను కనబరుచుచు సంచరించెను. అప్పుడు మునీశ్వరుడు దానిని మోహించి, తపముచాలించి దానితో చిరకాలము క్రీడించెను. అంతట ఆయిరువురి సంయోగముచేత కనకాంగియందు సద్యోగర్భమున మొదటివారైన ముగ్గురు ఆళ్వార్లు అవతరించిన సంవత్సరమునందే తై నెల(పుష్యమాసము) ద్వాపరయుగము 8,62,902. కృష్ణపక్షము పాడ్యమినాడు భానువారముతో గూడిన మఘానక్షత్రమునందు శ్రీసుదర్శనాంశమయిన తిరుమళిశ యాళ్వార్లు (భక్తిసారయోగి) అవతరించిరి. వెంటనే కనకాంగి తానుగన్న శిశువును భార్గవునకు అప్పగించి దేవలోకమునకు పోయెను. భార్గవుడు చిరకాలముచేసిన తపస్సంతయు క్షీణమయ్యెనను విచారముతో ఆశిశువును అచ్చటి* పేపయడవిలో ఒకచెట్టునీడను దిగవిడచి తపస్సుచేయబోయెను. పిమ్మట దిక్కుమాలిన యాపసిబిడ్డ దిశలయందు ప్రతిధ్వనులు చెలగ రోదనము చేయసాగెను. ఆయేడ్పువిని లోకమాతయయిన శ్రీమహాలక్ష్మి అచ్చటికివచ్చి శిశు

* కొన్నిప్రతులలో వెదురు అడవి అని యున్నది. అదియే యుక్తమని తోచెడి.

పునకు స్తన్యమిచ్చి ఆకలిదప్పులు లేకుండజేసి వేంచేసెను. అనంతరము తిరుమళిశకు సమీపమున వాసముచేయుచు, ప్రతిదినము ఆపేపయడవికివచ్చి పేములు నరకికొనిపోయి తట్టలు గంపలు అల్లి అమ్ముకొని జీవించునట్టి హరిదాసుడైన తిరువాళ్ళ అను మేదరవాడు తన భార్యయయిన పంకజవల్లి అను నాపెతోడ అచటికివచ్చి వట్టినేలబడి యేడ్చుచున్న ముద్దుల బిడ్డనుజూచి, చిరకాలముగా సంతానాపేక్షచే కృశించుచున్న మనకు శ్రియఃపతి అనాయాసముగా నీపుత్రుని కలుగజేసెనని చెప్పి, ఎత్తి తనభార్యచేత ఇయ్యగా, ఆమె అతిప్రేమతో ఎత్తుకొని రొమ్ములనొత్తుకొనగా, గొడ్డురాలైన ఆమె రొమ్ములందు పాలుపడి చేపెను. అంతట ఆమె పరమానంద భరితురాలైనా ముద్దుల పాపడా భగవదనుగ్రహమువలన బంగారువంటి బిడ్డవు నీవు లభించుటయేగాక నిన్ను చనుగుడుపు భాగ్యమును నాకు అబ్బెను. కడుపార పాలుత్రాగుమని మాటుపట్టు మూర్కొనుచు చన్నియ్యగా, ఆళ్వార్లు పిరాట్టి అనుగ్రహమువలన ఆకలిదప్పులు లేకయుండు వారు కాబట్టి చనుగుడువకయే నానాట పెరుగుచుండిరి. ఈవృత్తాంతము తిరుమళిశయందుండునట్టి దృఢవ్రతుడు అను శూద్రవృద్ధుడువిని, తన యింటనున్న ఆవుపాలను పరిశుద్ధముగా పిదికించి తీసికొనిపోయి ఆళ్వార్ల ఎదుటబెట్టి తిరుపుళ్లపట్టవలెనని బహువిధముల ప్రార్థించెను. ఆప్రార్థనకు మనసు కరగి ఆళ్వార్లు అతడు తెచ్చిన పాలుత్రావిరి. అదిమొదలుకొని ప్రతిదినము ఆశూద్రవృద్ధుడు ఆళ్వార్లకు పాలు తెచ్చియిచ్చుచు, వారు ఆరగింపగా శేషించినదానిని కొనిపోయి భక్తిపూర్వకముగ తానును తనభార్యయు పుచ్చుకొనుచువచ్చెను. అంతట కొన్నాళ్లకు ఆళ్వార్ల భుక్తశేషముయొక్క మహిమచేత ఆదంపతులకు కణికృష్ణుడు అను కొమారుడుపుట్టి విద్యయను సముద్రమును బుద్ధికుశలతయను తెప్పవలన పారము ముట్టనీది మహాకవియన వన్నె

కెక్కెను. భార్గవపుత్రులును కొన్నాళ్లు మేదరియింట పెరుగుచు, భగవదనుగ్రహమువలన ఒకరు చెప్పకయే సమస్తశాస్త్రములందును ప్రవీణతను సంపాదించుకొని, అనంతరము దేశయాత్ర చేయవలెనను తలపుజనింపగా మేదరియింటనుండి బయలువెడలి యిచ్చకు వచ్చిన చోటులకెల్ల పోయి, అందందు వ్యాపించియుండు ప్రసిద్ధములయిన మతములందెల్లజొచ్చి, ఆయామత తత్త్వములను సాకల్యముగా పరిశీలించి, ఎందునను మనసు పొందుపడక నానావిధముల విచారించుచు నన్నూరేండ్లుగడపి, ఈమతవిచారముల చేత యధార్థవస్తుతత్త్వము నెరుగగోరుట గ్రుడ్డివానిగొని గ్రుడ్డివాడు దారి తెలిసికోగోరుటవంటిది అని నిశ్చయించి శ్రీమన్నారాయణుని ధ్యానముచేయుచు ఒక ఏకాంతస్థలమునందు గూర్చుండిరి. అప్పుడు శ్రియఃపతి తన నిజస్వరూపమును వారికి కనబరిచి, తానే నిత్యవస్తువు అనుటను వారు తెలిసికొనునట్లు అనుగ్రహింపగా, తిరుమழிశయాళ్వార్లు శ్రీమన్నారాయణుని స్వరూపమును తమ యెదుట తోచిన రీతిగానే అంతరంగమునందును గని మిగుల హర్షించి, చేతులు జోడించుకొని, ఇన్నాళ్లదాక నీవేనిత్యవస్తువు అను విషయమును తెలిసికొని నిత్యానందమును అనుభవింపనేరక వ్యర్థముగా కాలముకడపితిని. ఇంతకాలమును నానావిధ మతముల నెడు క్రిమికూపములందుబడి కాకియరచినట్లు అరచి యరచి యలత నెందనయ్యెను. అయ్యో! నాయందు ఇంత కరుణలేకపోవలెనా? ఓపురుషోత్తమా! ఇక నన్ను కడతేర్ప చిత్తగింపుము. అని శ్రీమన్నారాయణుని ప్రార్థించి, బహువిధముల వినుతులుచేయుచు నిలువబడగా, శ్రీవైకుంఠనాథుడు ఆమహానుభావుని నిరతిశయభక్తి తాత్పర్యమునకు మెచ్చుకొని, ఓ ప్రపన్నశిరోమణీ! నీకు ఎల్లమతముల స్వరూపములును తెలియక నిత్యవస్తు తత్త్వజ్ఞానముకుదిరి స్వమతసిద్ధాంతమును నిర్ణయించుటకు అనువుపడదని యెంచి, నేనే నిన్ను బహుమతము

లంపు ప్రవేశపెట్టి యెల్ల మతతంత్రములను విచారించునట్లు చేసి, కడపట సారాంశమును బోధించితిని. ఇకనీవు అమతవిచారములన్ని మాని నానిజస్వరూపమును తెలిసికొని, భక్తిచేసి, పరమపదము నొందునట్లు లోకములోని జీవాత్మలకెల్ల బహువిధముల మహిమలను కనబరిచి, భక్తిసారుడు అను పేరు వహించి, కడపట నాదగుపరమపదమును పొందుము అని యానతిచ్చి కనుమొరగెను.

అనంతరము తిరుమళిశయాళ్వార్లు భగవదాజ్ఞాప్రకారము ఒక రహస్యప్రదేశమునందు యోగసమాధియందుండగా తొలుతటి యాళ్వార్లు ముగ్గురును దివ్యదేశయాత్ర చేయుచు తిరుమళిశకువచ్చి, ఆదివ్యతిరుపతియందలి మంగవల్లీసమేతుడైన శ్రీజగన్నాథస్వామిని సేవించి, అందుండి వెడలిపోవుచు భక్తిసారులను జూచి సంభాషించి, ఆసంభాషణమువలన పరస్పరము అత్యంతమయిన ప్రీతిజనింపగా అచ్చటకొన్నాళ్లు వేంచేసియుండి, పిమ్మట నలుగురునుగూడి తిరువల్లికేణి అను దివ్యదేశమునకు పోయి, అచ్చటి నారసింహస్వామిని, పార్థసారథి మొదలుగాగలతక్కిన యర్చావతారములను సేవించి, తిరుమళిశయాళ్వార్లు అచ్చటనే వసింపగా తక్కిన ముగ్గురును దివ్యదేశయాత్రాపరులయి యథేచ్ఛముగా వేంచేసిరి.

తిరుమళిశయాళ్వార్లు అది మొదలుకొని ఏళ్నూరుసంవత్స 700
రములదాక తిరువల్లికేణిలోనే వేంచేసి ఉండి, పిమ్మట తిరు
వెక్కాకు (కంచియందలి తిరుకచ్చి అను ప్రదేశమునకు) పొమ్మని
భగవన్నియమనము కాగా కంచికి వేంచేసి, అచ్చటి పేరరుళాళ
పెరుమాళ్లను (వరదరాజస్వామిని) సేవించి, తిరువెక్కాకు
పోయి అందు వేంచేసియుండు శేషశాయిని ఆరాధించుచు అచ్చట
700 ఏళ్నూరేండ్లు యోగమునందుండిరి.

ఆకాలమునందు మునుపు భక్తిసారుల భక్తశ్రేష్ఠప్రధాన మహిమవలన శూద్రవృద్ధ దంపతులకు కొడుకై అవతరించిన కణికృష్ణుడు శ్రీమన్నారాయణభక్తియు, శ్రీభక్తిసారచరణారవింద భక్తియుకలవాడై, భగవదనుగ్రహముచేతను ఆళ్వారుల యనుగ్రహముచేతను సకలశాస్త్రపరిజ్ఞానమును పొంది కవిశిరోమణియన నెగడి భక్తిసారుల సన్నిధియందు కైంకర్యము చేయగోరి, వారు తిరువెక్కాలో యోగనిష్ఠయందుండు వర్తమానము తెలిసి, అచ్చటికివచ్చి వారి యనుగ్రహమును పడసి, కైంకర్యము చేయుచుండగా, కణికృష్ణుడు * అచ్చటి శేషశాయి సన్నిధియందు సమ్మార్జన కైంకర్యముచేయుచున్న ఒక వృద్ధస్త్రీని జూచి దాని భక్తిశ్రద్ధలకు మెచ్చుకొని, అది ఎప్పుడును సొలవక సన్నిధి కైంకర్యములుచేయుటకు దృఢశక్తికలదై యుండునట్లు ఒక పాశురముచెప్పి శేషశాయిని ప్రార్థింపగా దానికి క్రొత్తయౌవనము కలిగెను. అది తెలిసి ఆపట్టణము నేలుచున్న పల్లవరాయడు అనురాజు, కణికృష్ణుని తనయొద్దకు రప్పించుకొని నీకు వెలలేని వస్త్రభూషణములును, వలసినంత ధనమును ఇప్పించెదనుగాని నేను సర్వదా ముదిమినొందక యుండునట్లు నావిషయమయి ఒక ప్రబంధము రచియింపుము అని వేడుకొనెను. అందుకు కణికృష్ణుడు శేషశాయియైన శ్రీమన్నారాయణుని, ఆదేవుని సేవకులయిన భాగవతులను వినుతి చేయునానాలుకకు పామరులును ధనమత్తులునయిన నీబోటివారిని వర్ణించుటయందు రుచిపుట్టదు. నీవిచ్చుధనమును వస్త్రాభరణములనుజూచి మోహమునొంది నీయాదరమును అపేక్షించునట్టివారికయిన నీమాటలయందు రుచిపుట్టును. అని తిరస్కరించి పలికెను. ఆమాటలకు రాజు కోపించి నావిషయమయి ప్రబం

---

* ఇచట భక్తిసారులే ముసలిదానికి యౌవనముకలుగ ననుగ్రహించినట్టు ప్రపన్నామృతము మొదలగు వానియందు చెప్పబడియున్నది.

ధము రచింప రుచింపనివారికి నాదేశమునందలియునికి మాత్రము ఎట్లు రుచించును. ఇక క్షణకాలమయిన మీరు నాపట్టణమునం దుండకూడదు. మీకు తగినచోటికి పొండు అని ఖండితముగా చెప్పగా, కణికృష్ణుడు, సర్వధా పరతంత్రుడవైన నీరాజ్యమెంత? నీవెంత? సర్వస్వతంత్రుడై సర్వలోకరక్షకుడైన పరమపదనాథునిచే నేలబడు మహారాజ్యము మాకు యథాయోగ్యముగా వసింపననువైయుండగా నీ గ్రుడ్డిబెదరింపులకు బెదరవలసినదే మున్నది. ఇదిగో వెడలిపోయెదను. అని యలక్ష్యముగా పలికి, తనగురువుల సన్నిధికి బిరబిరపోయి, రాజు చేసిన వెలితిప్రసంగము నెరిగించి, ఇక నిక్కడనుండుటకు దాసునికి సరిపడదు ఎక్కడికైన పోయెదను ఆజ్ఞ సాదింపుడు అనగా, ఆళ్వార్లు నీవు లేనిచోట నాకుమాత్రము పనియేమి? ఇదిగో ఈ శేషశాయి య నుజ్ఞపడసి నేనును నీవెంటనే వచ్చెదను. అని, ఆతిరుపతియందు వేంచేసియుండు పెరుమాళ్ల సన్నిధిలో వినయశ్రద్ధాభక్తులు కనబడ పెక్కులు దండప్రణామములుచేసి, జరగిన వర్తమాన మంతయు విజ్ఞాపనముచేసి, భక్తవత్సలా! నీభక్తులకు కొర గానిచోటు నీకును కొరగానిదే గనుక మావెంటరా నవధరింపు మని ప్రార్థించి, కణికృష్ణునివెంట బయలుదేరగా, భక్తపరాధీను డైన పెరుమాళ్లును పిరాట్టి వెంటరాగా శేషశయ్యనుచుట్టి చంక బెట్టుకొని భక్తిసారుని వెంబడించెను.

అంతట అర్చక పరిచారకులు తిరువారాధన చేయుటకై ఆకోవెలకువచ్చి అచ్చట పెరుమాళ్లనుగానక వెరపును వింతయు తమ్ము కలవరపెట్టగా తత్తరపాటుతో పోయి రాజునకు ఆవృత్తాంతమును తెలియపరిచిరి. అందులకు రాజు ఆశ్చర్యపడి తనమంత్రులనుజూచి యిదియేమి యీవింత అని యడుగగా, వారు, కణికృష్ణునియెడల నీవు మిక్కిలి అపచారపడితివి. ఆయన శేషశాయికి అంతరంగభక్తుడు. ఇది, ఆయపచారమువల్లనైన

అసంభవము అని తోచుచున్నది అని చెప్పిరి. అదివిని రాజు
దిగులుపడి, అధికవినయ భయభక్తులతో పాదచారియై కదలి,
కాళ్లుతడబడగా, దేహమున చెమటలుగ్రమ్మగా, కన్నుల శోకబా
ష్పములురాలగా, గడగడవడకుచు, కిరీటాదిభూషణములు చలిం
పగా, మూపుపై యుత్తరీయముజారి తూలాడగా కడువడిగ
నడచి లక్ష్మీసమేతుడై వేంచేయుచున్న శ్రీహరికి అడ్డముపోయి,
ఆదేవునియడుగుల పైబడి, ఓదీనపరాధీనా! బ్రహ్మరుద్రాది దేవ
తానాయకులచే అర్చితములగు నీమృదుపదారవిందములు ముండ్ల
తోను రాళ్లతోను నిండుకొన్న కటికినేల యొత్తుకొని నొవ్వగా,
నీళ్లచేనిండుకొన్న వానకాలపు నల్లమబ్బునుల్ల సమాడు కోమల
దేహము సూర్యుని వేడికిరణములుసోకి వాడు వారగా, సకల
సంపదలకు నాస్పదమగు మాతల్లియయిన పెరియపిరాట్టియొ
క్క చెలువుగులుకు కోమలాంగమును బడలించుచు ఇట్లు కాలి
నడతో వేంచేయనేల? దాసుడు తెలిసితెలియక యేమేని యప
రాధము చేసియున్నను క్షమించి ఎప్పటివలె తిరువేక్కాలో
వేంచేసియుండ చిత్తగింపుము. అని బహువిధముల వేడుకొనగా,
భక్తపరాధీనుడైన యాశ్రియఃపతి, రాజా! నీవు నాయెడల ఏ
మియు నపరాధము చేసినవాడవు కావు. నీయపరాధమును క్ష
మించువాడను నేనును కాను. నాప్రియభక్తుడైన భక్తిసారునిమ
నసునకు అప్రియముచేసితివి. అదికారణముగా అతడు ఇందుండి
వెడలెను. అతని నెడబాసియుండ మనసురాక నేను అతనిని
వెంబడించితిని. అతడునిలిచిన నేనును నిలుతును. అని యానతియ్య
గా, దూడవెంట ఆతురత్వముతో నడచునట్టి ఆవువలె కణికృష్ణుని
వెంటనంటి నడచుచున్న తిరుమళిశయాళ్వార్లకు అడ్డముపోయి,
వారి పాదములపైబడి, దాసునితప్పు మన్నించి తిరువేక్కాకు
వేంచేయవలయునని ప్రార్థింపగా, వారు, నీనేరమును లోగొని
కావగలవాడు కణికృష్ణుడుగాని నేనుగానని పరిహరించిరి. అం

తట రాజు, కోపావేశముచే తిరిగి చూడక ముందుపోవుచున్న కణికృష్ణునికి అడ్డముగాపోయి, ఆయనయడుగులమీదబడి దాసునితప్పు దండముతో తీరెను. అని రెండుచేతులతోను ఆయన అడుగులుపట్టుకొని విడువకపోగా, కృపపుట్టి, రాజా! నీవు నీదేశమునందు ఉండవలదంటివి గనుక పోవుచున్నాను ఇప్పుడు నన్నేలనిలిపెదవు. అనగా, అతడు దాసుడు తెలివిలేక అన్నమాటలు ఎన్నియున్నను మన్నించి, ఎప్పటివలె మీరు తిరువెక్కాలోనే వేంచేసియుండవలెనని ప్రార్థించెను. అందులకు పరమ సాత్త్వికుడగు నాకణికృష్ణుడు ఒప్పుకొని మరలి తిరువెక్కాకువచ్చెను. ఆయన వెంటనే తిరుమళిశయాళ్వార్లును, వారి వెంట లక్ష్మీసమేతుడగు శేషశయనుడును వేంచేసి, ఎప్పటివలె తిరువెక్కాలో నెలకొనిరి. అది కారణముగా నాటనుండి యాశేషశాయి యథోక్తకారియని పేర్కొనబడెను. అట్టి యథోక్తకారి సన్నిధియందు భక్తిసారులు కణికృష్ణ సహితముగా మరికొన్నాళ్లు నివసించి, అనంతరము తిరుకొడంద (కుంభకోణము) అను దివ్యదేశమునకు పోయి అచ్చట వేంచేసియుండు శార్ఙ్గపాణిని సేవింప తలంపుగొని, యథోక్తకారి సన్నిధినుండి బయలుదేరి పోవుచు మార్గవశమున పెరుంబులియూరు (శార్దూలపురము) అను దివ్యదేశము చేరి, ఒకబ్రాహ్మణవీధిని మేదర వేషముతో పోవుచుండగా, అందలి బ్రాహ్మణులు శూద్రుడువచ్చెను అని తాముచెప్పుచున్న వేదపాఠమును నిలిపి పిమ్మట చెప్పుటకు నిలిపినచోటు జ్ఞప్తికిరాక కళవళపడి, అందులకు కారణము వీరియందు శూద్రత్వదృష్టిచే అపచారపడుటగా తెలిసి, వెంటనే "నశూద్రా భగవద్భక్తాః విప్రా భాగవతాస్స్మృతాః, సర్వవర్ణేషు తేశూద్రా యేహ్యభక్తా జనార్దనే." అను న్యాయమును విచారింపక అపచారపడితిమి అని క్షమాపణముచేసికోగా, వారికి ఒకనల్లవస్త్రగింజను గోటి

తో ఒలిచిచూపి పాఠము నిలిపినచోటు జ్ఞప్తికి వచ్చునట్లుచేసె, ఆయూరి పెరుమాళ్లకోవెలకు వేంచేసి గర్భగృహామునకు ప్రదక్షిణముగా వచ్చునప్పుడు ఆ పెరుమాళ్లు వీరు తిరిగినతట్టునకు ముఖమును త్రిప్పుచు వచ్చెను. అప్పుడు ఆవింతను అర్చకులు చూచి చెప్పగా అచ్చటి బ్రాహ్మణులు కొందరువచ్చి ప్రత్యక్షముగా చూచి యాశ్చర్యము నొందిరి. ఆ బ్రాహ్మణులలో ఒకడు యాగము చేయుచుండి తనయాగమునందు ఈ మహాయోగిని అర్చించినపక్షమున తనకు యాగఫలము సిద్ధించునని నిశ్చయించి, భక్తిసారులను భక్తిపూర్వకముగా యాగశాలకు పిలుచుకొనిపోయి అర్చింపగా, అందలి ధూర్త బ్రాహ్మణులు కొందరు మునుపు రాజసూయమునందు శ్రీకృష్ణ భగవానులకు అగ్రపూజ యిచ్చిన ధర్మరాజును ఆక్షేపించిన శిశుపాలాదులవలె అసూయాపరులై ఆదీక్షితుని, నీవు బ్రాహ్మణుడవుగానుండి యాగముచేయుచోటికి రాగాని శూద్రుని పిలుచుకొనివచ్చుటయే కాక వానిని అర్చించి బ్రాహ్మణావమానమును చేసితివి అని నిష్ఠురములాడి నిషేధించిరి. అప్పుడు అతడు భాగవతాపచారమునకు మనసున నొచ్చుకొనుచు తమ్ము శరణుచొరగా, తిరుమళిశయాళ్వార్లు తమ్మునిందించు ధూర్తులకు భయమును, దీక్షితునికి చిత్తశాంతియు కలుగునట్లు దేవీభూషణాయుధపరివారములతోడ శ్రియఃపతి నచ్చట సాక్షాత్కరింపజేసి, తమవక్షోభాగమునందు జ్వాలామయమై వెలుగొందునట్టి శ్రీసుదర్శనచక్రమును కనబరిచిరి. ఆమహిమకు ఆశ్చర్యపడుచు ఆధూర్తులందరు భయభక్తులతో ఆళ్వార్లకు దండప్రణామములుచేసి, తమయవజ్ఞతను సహింపవలెనని క్షమాపణముచేసికొనగా, ఆళ్వార్లు ఎప్పటివలె శాంతమూర్తిని వహించి, వారికి, శ్రీమన్నారాయణుడే పరతత్త్వము, ఆనారాయణసేవాపరాయణులే యథాధికార పూజ్యులు అనువిషయమును విశదముగా తెలియనానతిచ్చి, దీక్షితునికి

యోగఫలము నిరతిశయముగా సిద్ధింప ననుగ్రహించి, అందుండి కుంభకోణమునకు వేంచేసి, అందు నిజసేవక జనోద్ధారకుడై అర్చావతారము నొందియున్న ఆరావముదని (అపర్యాప్తామృతుని-లేక-శార్ఙ్గపాణిని) దివ్యకల్యాణగుణవర్ణనా పూర్వకముగా సేవించి, ఆపెరుమాళ్ల విషయమునందు ఎల్లజీవాత్మలను ఉజ్జీవింపజేయు నర్థమునుప్రతిపాదించునట్టి, నాన్ముగన్ తిరువందాది తొంబదియారును, తిరుచ్చందవిరుత్తము నూటయిరువదియును రచియించి, రెండువేల యేడునూర్లు సంవత్సరములు ఆదివ్యదేశ 2700
మునందే సకలచేతనోజ్జీవనము చేయుచు వేంచేసియుండి, పిమ్మట పరమపదమునకు వేంచేసిరి.

ఈ లీలావిభూతియందు వీరు వేంచేసియుండిన సంవత్సరములు-౪౮౭౦. 4870

---

శ్రీభక్తిసారాయనమః.

---

## నమ్మాళ్వార్ల వైభవము.

శ్లో॥ వకుళాభరణంవందే జగదాభరణంగురున్,
యశ్శ్రుతేరుత్తరంభాగం చక్రేద్రామిడభాషయా.
ఆపౌకలేర్హికురుకాపురిపాండ్యదేశే
వైశాఖమాసివిఘవానలభేంశజాతమ్,
సేనాపతేఃపదజకారిగృహేవతీర్ణం
శ్రీశాస్పదంశఠరిపుంశరణంప్రపద్యే.

శ్రీవైకుంఠమునందు సోమసూర్యాగ్నులను మిణుగురుబూచులవలె తోచునట్లుచేయునట్టి, అవాఙ్మానసగోచరమును, అప్రా

కృతమునైన దివ్యతేజోమయమగు మణిమండపమునందు శ్రీలక్ష్మీసమేతుడై నివసించియుండు శ్రీమన్నారాయణుడు తనయెదుట బద్ధాంజలియై నిలువబడియున్న శ్రీయనంతుని కటాక్షించి, భూలోకమునందు అనాదికర్మ వాసనావశులై జననమరణ దుఃఖములను పొంది తపించుచుండు జీవాత్మలను ముక్తులనుగా జేయుటకై తిరుక్కురుగూరు అను దివ్యదేశమునందు, మనసేనమొదలియారిని (విష్వక్సేనుని) అవతరింపజేయ బోవుచున్నాము. కనుక, నీవు ముందుగాబోయి ఆతిరుక్కురుగూరిలో ఒక తింత్రిణీవృక్షము (చింతచెట్టు) గాజనించియుండుము. అని యానతియ్యగా, అనంతుడు ఆయాజ్ఞను శిరసావహించి తత్క్షణమే భూలోకమునకువచ్చి తొలుతటి యాళ్వార్లు అవతరించిన సంవత్సరమునందే చైత్రమాసమున మూలతారయందు పాండ్యదేశ మధ్యవర్తియగు తామ్రపర్ణీ నదీతీరమునందలి కురుగూరిలో, హరియర్చావతారమయిన ఆదిప్పిరాన్ (ఆదినాథుని) సన్నిధికి ఉత్తరపుతట్టు తింత్రిణీరూపముగా నవతరించి, చూచువారికి కనుపండుగు చేయుచు పెరుగుచుండెను.

పిమ్మట కొరతలేని సంపదలకు ఉనికిపట్టయిన ఆతిరుక్కురుగూరిలో ఎల్ల అంగములును ఒప్పియుండగా నీతితప్పక రాజ్యము చేయుచు, ఎడతెగని కలుములతో నిరతిశయమయిన భగవద్భక్తిగలిగి, శ్రియఃపతి సన్నిధియందు యథోచితకైంకర్యములను నడపుచు, అణకువతో భాగవతుల నుపచరించుచు వర్తించునట్టి పరమభాగవతశిఖామణియయిన కారియనురాజు ఎల్ల సంపదలు కలిగియు పుత్రసంపదలేమిచే పతివ్రతా శిరోమణియగు ఉడయనంగయను భార్యతోగూడ తిరుక్కురుంగుడియను దివ్యదేశమునకుపోయి, అచ్చటనుండు తిరుప్పార్కడల్ అను పుణ్యతీర్థమునందు జలకములాడి, అచ్చట వేంచేసియుండు ఆదినాథుడను పెరుమాళ్లను సేవించి తమకు నొకసత్పుత్రుడు కలుగ ననుగ్ర

హింపుమని ప్రార్థించుచు కొంత కాలము* తపస్సు చేయగా, భక్త పరాధీనుడైన ఆదిప్పిరాన్ (ఆదినాథుడు) వారితపస్సునకు మెచ్చి, స్వప్నమునందు సాక్షాత్కరించి, మీభక్తికి మెచ్చితిని, మీయందు వైకుంఠ సేనాధిపతియైన విష్వక్సేనుని యంశమున ఒక సుపుత్రుడు ఉదయించును అని యానతిచ్చెను. అంతట వారు కృతార్థులమైతిమి అని యానందించుచు అందుండి తిరుక్కురుగూరికి వచ్చి తమకు ఆదినాథుడు స్వప్నమునందు సేవసాదించి పుత్రుడు కలుగ ననుగ్రహించిన విషయమును తలచి తలచి వినోదించుచుండిరి.

అనంతరము శ్రీమన్నారాయణుని యనుగ్రహము చొప్పున సేనమొదలియారి యంశము ఉడయనంగ గర్భమునందు అమానుషమయిన తేజస్సుతో ప్రవేశించి, లోకమునందు ప్రసిద్ధములయి వర్తిల్లుచున్న అన్యమత సిద్ధాంతములను అణచివేయను, విశిష్టాద్వైత సిద్ధాంతమును స్థాపింపను, అజ్ఞానమను చీకటిని తొలగించి జ్ఞానమను సూర్యుని సమాగమముచే కళంక రహితమయిన భక్తిమార్గమనెడు చంద్రబింబము పూర్ణముగ వెలుంగను, పరమభాగవతులకు కుడిబుజము అదురను, తదితరులకు ఎడమబుజము అదురను, అనువుగా, కలియుగము ప్రారంభమయిన నలువదిమూడవనాడైన ప్రమాదినామసంవత్సర వైశాఖశుక్ల పూర్ణిమా శుక్రవారమునాడు విశాఖానక్షత్రయుక్త కర్కాటక లగ్నమునందు నమ్మాళ్వార్లయి అవతరించెను.

ఆనమ్మాళ్వార్ల యవతార దినమునందు ఈలోకములోని సర్వమతములవారికిని శ్రీమన్నారాయణుడే పరాత్పరమయిన

* కారి అత్తవారియింటనుండి ఉడయనంగను పిలుచుకొని మార్గవశమున కురుంగుడికివచ్చి ఆదినాథస్వామిని సేవించునపుడు ఉడయనంగ ఆపెరుమాళ్లను పుత్రుడుకలుగ అనుగ్రహింపుమని వేడినట్లు గ్రంథాంతరములందు చెప్పబడియున్నది.

నిత్యవస్తువు అను తలఁపు వారివారికి తెలియకయే ఉత్పన్నమయ్యెను. కన్నుగాననివారును, తెలివిలేనివారును, చెవిటివారును, మూగవారును తమతమ లోపములు తొలఁగి, మంచి మంచి వ్యక్తులతో ప్రవర్తిల్లిరి. గొడ్డురాండ్రందరు గర్భిణులయిరి. ఆకాశము నిర్మలముగ ప్రకాశించెను. మింటనుండి పువ్వులవాన కురిసెను. ఇట్టి యాశ్చర్యకరములయిన చిహ్నములకు ఆకరమయిన సత్పుత్రజనన వృత్తాంతమును కారి విని అందువలని యానందాతిశయముచే తన్నుతాను మఱచి, అంతలో కళదెలుపుకొని లేచి స్నానముచేసి శుచిర్భూతుఁడై వేదోక్తరీతిని బ్రాహ్మణులకు గోభూహిరణ్యాదులయిన దానములుచేసి, జాతకర్మము యథావిధిగా నడపి, కొడుకునకు 'మారుఁడు' అని నామకరణముచేసెను. పురజనులందరు ఆశిశు జననకాలమునందు తోఁచిన శుభలక్షణములనుజూచి పరమానంద పరవశులై యుండిరి.

అట్లు జనించి జాతకర్మములు చేయబడిన ఆశిశువు ప్రాకృతశిశువులవలె కన్నులుతెరచిమూడకయు, నోరుతెరచి యేడువకయు, స్తన్యపానముచేయకయు, కాలుసేతులు కదలింపకయు, ప్రపంచాతీతమయి తేటపారిన మొగముతో సదా యోగమునందు నిలిచి భగవద్గుణానుభవము చేయునట్టి మహాయోగివలెనే యుండెను. అట్టియెడ ఉదయనంగ కోటిసూర్యు లుదయించినట్లు మహాతేజస్సంపత్తితోడి దివ్యాంగముతో వెలుఁగొందుచున్న బిడ్డనుజూచి మేరలేని యానందమును పొందఁదగినదిగానుండియు, ఆబిడ్డయొక్క తత్త్వము తెలియక స్తనములయందు పాలుఉబ్బగా, బిడ్డనుఎత్తి ఒడిలోనుంచుకొని, పుత్రసంపద లేకపోవుటవలని చింతాసముద్రమును దాటింప లభించిన గొప్ప యోడవైన నాముద్దులపాపఁడా! చిరకాలముచేసిన తపస్సునకు ఫలముగా నిన్నుపొందియు నీకు ఉగ్గుపెట్టి చనుగుడిపి లాలించు భాగ్యమును పొందనేరనైతినే. తామరరేకులను బోలిననీనేత్ర

ములు విరియబారకపోనేల? పచ్చి పగడమును బోలిన నీ పెదవులు తెరవబడవేల? అతికోమలములయిన చిగురుటాకులవంటి నీచేతులు నారొమ్ములను పుణుకవేమి? బంగారువంటి దేహము ఇటునటు పొరలదేమి? అందెలుగజ్జెలు చెవులకానందముగ మ్రోగ నీమృదుపదములు కదలవేల? అని బహువిధముల కొడుకును పేర్కొని పలవరించి పలవరించి, కడపట ఆవృత్తాంతము భర్తకు తెలియజేసెను. అంతట ఇదియేమిమాయ? ఇట్టి వింతలు ఎన్నఁడును విన్నదిలేదే? అని ఆయన కొలువుచాలించి వచ్చిచూచి, ముఖమునందలి వికాసమును, దేహమునందలి తేజస్సును చూడజూడ కన్నులకు నానందమును సంపాదించుచున్నవి. ఉనికిమాదిన చిత్తరు బొమ్మ యనవలసి యున్నది. కాబట్టి భగవదనుగ్రహసంభూతుడైన యీబిడ్డడు మనుష్యాకృతి వహించిన భగవంతుడే యనియెంచి, ఉడయనంగకు ఊరటకలుగునట్లు అప్పటికి తగిన మాటలు కొన్ని చెప్పి కొలువుకూటమునకు బోయెను. ఉడయనంగయు ఉయ్యాలలో పండబెట్టినప్పుడుగాని తాను ఎత్తుకొన్నప్పుడుగాని, కన్ను తెరవక యేడువక చనుగుడవక కదలక మెదలక తోలుబొమ్మవలెనే యుండియు దినదినమునకు కళ హెచ్చగా వృద్ధిపొందుచువచ్చు బిడ్డనుజూచి, బహువిధముల విచారించుచు ప్రొద్దులు గడపుచుండెను.

ఇట్లుండగా ఒకనాడు కారి పుత్రునియొక్క యపూర్వచరిత్రమునుగురించి తన మంత్రులతో యోచింపగా, వారు ఇది సర్వజ్ఞత్వ సర్వశక్తత్వాది గుణములకు నిధానమయిన శ్రీయాదినాధుని తిరువుళ్లమునకే తెలియవలసినది. కనుక బిడ్డను ఎత్తుకొనిపోయి ఆపెరుమాళ్ల సన్నిధిలో ఉంచి ప్రార్థించినయెడల అంచుల కీడుమేలు బయలుపడునని చెప్పిరి. అంతట కారి భార్యయు తానును బిడ్డను బంగారు ఉయ్యాలలో నుంచి యెత్తుకొనిపోయి ఆదినాధుని సన్నిధిలో నిలిపెను. అప్పుడు ఆబిడ్డను

తల్లిదండ్రులును తక్కినవారును చూచి యుప్పొంగగా ఉయ్యాలలోనుండి జరగిజరగి నేలకుదిగి మెల్లగా దోగాడుచు కోవెలకు ఉత్తరపుతట్టు వర్ధిల్లుచున్న చింతచెట్టుక్రిందికి పోయి, అక్కడ పద్మాసనమున గూర్చుండి కుడిచేత చిన్ముద్రనుబూని, ఎడమచేయి ఒడినుంచుకొని, కన్నులుమూసికొని, మెడనిక్కించి, తల ఒడలు కదలింపక జ్యోతిస్స్వరూపుడై వెలుగుచుండెను. అదిచూచి కారి ఉడయనంగ మొదలగువారందరు మేనులు పులకింపగా ఈబిడ్డ భగవదంశమేగాని యితరముకాదని బహువిధముల పొగడుచు ఆయననే అత్యాశ్చర్యముతో చూచుచు తమయిండ్లకు సయితము పోవుటకు మనసురాకయుండిరి.

ఆసమయమునందు శ్రీవైకుంఠములో సర్వలోకమాతయగు పెరియపిరాట్టి పెరుమాళ్లనుజూచి, ఓ యేలినవాడా! లోకములోని జీవాత్మలు ఉజ్జీవించు నుపాయము సులభముగా బోధించునట్లు ఎల్లరహస్యములను కారిపుత్రునికి ఉపదేశింప చిత్తగింపరాదా అనగా, శ్రీమన్నారాయణుడు సేన మొదలియారినిబిలిచి నీవు భూలోకమునకుపోయి నీయంశమునందు కారియనునవికారికి తనయుడొకడు ఉదయించి కురుకేశ్వరుని సన్నిధానమున నున్నవాడు, అతనికి సకల రహస్యములను ఉపదేశించిరమ్ము. అని నియమింపగా, ఆమహానుభావుడు అట్లే ఆదినాథునిసన్నిధికి వేంచేసి అచ్చటి తింత్రిణీ మూలమునందు నివసించియున్న ఆళ్వార్లకు సమాశ్రయణాదులు ప్రసాదించి విజయముచేసెను.

శ్రీశఠగోపాయనమః.

# మధురకవియాళ్వార్ల వైభవము.

శ్లో॥ ఈశ్వరాబ్దేచైత్రమాసే శుక్లపక్షేచ చైత్రభే,
నారాయణాభిధానస్య పుత్రోజజ్ఞేగదాంశజః.
గణేశఃకుముదోనామ కవిర్మధురసంజ్ఞికః,
చైత్రమాసేశుభేచిత్రా తారకాయామజాయత.

శ్రీసేన మొదలియారి గణాధిపతులలో నొకడగు కుముదుని యంశమైన శ్రీమధురకవియాళ్వార్లు ద్వాపరయుగమునందు ఎనిమిదిలక్షల అరువదియారువేల యెనమన్నూట డెబ్బది తొమ్మిద 8,66,879
వదియగు ఈశ్వరసంవత్సరమున చైత్రశుక్ల చతుర్దశి శుక్రవారమునాడు చిత్తానక్షత్రమునందు తిరుక్కోళూరు అను దివ్యదేశమునందు ఒక పురశ్శిఖాడ శ్రీవైష్ణవునికి పుత్రుడై యవతరించి, బహుకాలము దివ్యదేశయాత్ర చేయుచు పోయి, శ్రీఅయోధ్యలో వేంచేసియుండి, ఒకనాటిరాత్రి దక్షిణముఖముగా తిరిగి శ్రీతిరుక్కోళూరు పెరుమాళ్లను ధ్యానించునపుడు ఆకస్మత్తు కోటిసూర్య ప్రకాశమానమయిన గొప్పవెలుగొకటి కానవచ్చెను. అంతట ఇదియేమో వింత తేజస్సుగానున్నది దీనిస్వరూపమును తెలిసికొనక పోరాదు అని నిశ్చయించి, అప్పుడే అందుండి బయలుదేరి, ఆ తేజస్సునందు గురియుంచి దారి డొంక విచారించక రాత్రులే నడచినడచి కొన్నాళ్లకు తిరుపతికివచ్చిచేరి, అచ్చట వేంచేసియుండు తిరువేంగడముడయాని (శ్రీ వేంకటేశ్వరస్వామిని) సేవించి, ఎప్పటి జ్యోతినిజూచుచునే శ్రీరంగమునకువచ్చి, శ్రీరంగనాథుని సేవించి, అందుండి కదలి నడుమనడుమ సన్నిహితములైన దివ్యదేశములయందు విశ్రమించి, అందందుగల పెరుమాళ్లను సేవించుచు క్రమముగా తామ్రపర్ణీతీరముచేరి, శ్రీవైకుంఠము

అను దివ్యదేశమునందు కళ్లప్పిరాణ్ (చోరరాట్టు) అను అర్చా
వతారమూర్తిని సేవించి, తామ్రపర్ణియందు స్నానపానముల
తోడ నిత్య కర్మానుష్ఠానములన్ని తీర్చుకొని, ఆయేటికి దక్షిణపు
గట్టుననుండు తిరుక్కురుగూరు సమీపించునపుడు అంతకుముందు
కానవచ్చుచున్న దివ్యతేజస్సు కానరాకపోయెను. అంతట మ
ధురకవులు నిదానించి నాలుగుప్రక్కలనుజూచి తిరుక్కురుం
గుడిలో వేంచేసియుండు ఆదిప్పిరాణ్ కోవెలలో ఆతేజస్సు
అణగియున్నట్టు తెలియరాగా, అచ్చటికివేంచేసి ఆపెరుమాళ్ల
ను సేవించి కోవెలకు ప్రదక్షిణముగా వచ్చునపుడు, చింతమ్రాని
క్రింద అనంతకోటిసూర్య తేజస్సుతో వేంచేసియున్న నమ్మాళ్వార్ల
సేవసాధించిరి. అప్పుడు మధురకవులు అచ్చట గుంపుగూడి
యున్న జనసముదాయమును జూచి ఇదియేమి వింతయని అడు
గగా, కారి, తనభార్యయు తాను సంతానార్థులై తిరుక్కురుం
గుడి ఆదినాథుని సేవచేయుటయు, ఆపెరుమాళ్లు పుత్రుడుకలుగ
ననుగ్రహించుటయు చెప్పి, స్వామీ! అట్లు కలిగినపుత్రుడే యీ
దివ్యమంగళ విగ్రహము. ఈయన అవతరించిన నాటనుండి కన్నుల
లు తెరచి యెరుగడు. స్తన్యపానము చేసినదియు లేదు. లేకు
న్నను విగ్రహపుష్టియు ముఖవిలాసమును నానాటహెచ్చగా
వర్ధిల్లుచున్న యీవ్యక్తినిజూచి యేమితోచక ఈసన్నిధికి ఎత్తి
కొనివచ్చి విడిచిపెట్టితిమి. వెంటనే యీదివ్యమూర్తి తనంతట
మెల్ల మెల్లగా జరగివచ్చి ఈచింత చెట్టు మొదట పద్మాసనము
వేసికొని కూర్చుండెను. ఇప్పటికి ఈయనపుట్టి పదియారేండ్లు
ఆయెను. ఇంతమట్టుకు కన్నులు తెరవగాగాని నోరు మెదలింప
గాగాని శరీరమును కదలింపగాగాని మేముచూచి యెరుగము.
అని సర్వవృత్తాంతమును విశదముగా తెలియజేసెను. అదంతయు
విని మధురకవులు పరమానందభరిత మానసులై కన్నులయందు
ఆనంద బాష్పములు ధారలుధారలుగా స్రవింపగా, దేహము

గనుచెప్పెడువగా, ఆళ్వార్ల సమీపమునకుపోయి చేతులుజోడించుకొని, ఓస్వామీ! "చెత్తదిన్‌వయత్తిల్ సిరియదుపిరందాల్ ఎత్తైత్తిన్ను ఎంగేకిడక్కుం" (అనగా చచ్చినకడుపున చిన్నదిపుట్టిన పదుతిని యెచ్చటపడియుండును.) అని యడుగగా, అంతకుముందు నోరుతెరచి యెరుగని యావింత చెట్టుక్రింది మునీంద్రుఁడు, వినువారికి వింతగా "అత్తైత్తిన్ను అంగేకిడక్కుం" (అది తిని అక్కడనేపడియుండును) అని యానతిచ్చెను. అందులకు మధురకవులు మిక్కిలి యానందించి, ఈ మహాయోగి మనము అడిగినదానికి సరియయిన యుత్తరము చెప్పెను. ఈయన మనుష్యమాత్రుఁడని తలపరాదు. మనలను కడతేర్చుటకై పరమపదమునుండి యీ లోకమునకు అవతరించిన యేలినవాఁడగు పరమ పురుషుఁడేయని తలపవలసినది. అని నిశ్చయించి పలుమారుసాగిలబడి దండములు సమర్పించి చేతులు జోడించుకొని నిలిచి "శ్లో॥ పద్మాసనోపవిష్టం వరపదయుగళీసన్నివిష్టచైతన్యం, పరతత్త్వబోధముద్రం పరమాచార్యం పరాంకుశం వందే" అని యిట్లు బహువిధముల వినుతిచేసి, తోడనే కారికిని ఉడయనంగకును నమస్కరించి, మీరేమి తపస్సుచేసితిరో కదా? మీభాగ్యమే భాగ్యము. బ్రహ్మరుద్రాదులును పొందనేరని మహిమను పొందితిరి. మీకుసమానులగు భాగవతోత్తములు స్వర్గమర్త్య పాతాళములనెడు మూఁడులోకములందును లేరు. అని ప్రశంసచేసి, అంతట చింతక్రిందియాళ్వార్లను జేరి, స్వామీ! అప్రాకృతములయిన మీచరిత్రములు మీదివ్యమహిమను సూచించుచున్నవి. దేవరవారి దివ్యసూక్తులును దాసుని ప్రశ్నమునకు తగిన వేదాంతార్థబోధకములగు నుత్తరములయ్యెను. కావున దేవరవారు దాసునికి విహితపురుషార్థములనుప్రసాదింప తిరువుళ్లపట్టవలయునని ప్రార్థింపగా, శ్రీమన్నారాయణుఁడు దేవీభూషణాయుధ పరిజనములతోడ గరుడవాహనారూఢుఁడై

సేవసాదింపగా సేవించి యానందించుచున్న నమ్మాళ్వార్లు, కను దామరలువిచ్చి అంతరంగమందు తమకు సేవసాదించిన శ్రియః పతిని భావ్యాదృష్టిచేతను సందర్శించి, ఎగుపుమించిన బంగారు కొండపై నావరించిన నీలమేఘమును దలపించుచు దివ్యపరిమళ మును వ్యాపింపజేయు కమలమాలిక మూపులపైవ్రేలగా, స్వా భావికమైన యుష్ణగుణమును విడిచి వెలుగుచున్న సూర్యబింబ మో యనదగిన ముత్యాలుదాపిన బంగారుగొడుగును బట్టు కొని, నిలుకడగలిగి మెరయుచున్న మెరపువలె శ్రీపెరియపిరాట్టి కనుపట్టగా, శ్రీసుదర్శపాంచజన్య ప్రముఖములైన దివ్యాయుధ ములు నిజప్రభలు దశదిశలను వ్యాపింపజేయుచుండగా సాక్షా త్కరించిన యావైకుంఠనాథునిజూచి, లేచి, కన్నులయందానంద బాష్పములు నిండుకొనగా, భక్తిపారవశ్యముచే మనసులయిం పగా సాష్టాంగదండప్రణామములు పెక్కులుచేసి, ఇన్నాళ్లనుండి దాసునికి నిట్టిసేవలభింపదయ్యెనే, వ్యర్థముగా చిరకాలముకడ చెనేయని చింతించియు, చతుర్ముఖుడు మొదలుగాగల దేవతాధి పతులు చిరకాలము అతినిష్ఠతో తపస్సుచేసియు పొందనేరని శ్రీ వైకుంఠనాథుని పాదపద్మసేవ నిర్హేతుకహముగా లభించెను. నాభాగ్యమేభాగ్యము అని యానందనృత్యముచేసియు, ఇటువంటి సేవ యొకక్షణముకాలమయిన లేకపోవునేని యాక్షణమే యుగ మగునుగదాయని నవ్వుకొనియు, అత్యద్భుతామల నిరతిశయదివ్య మంగళ విగ్రహమయివేంచేసి పరమానందము నొందించిన నా యేలినవాని విషయమయి చేయగల ప్రతిక్రియ యేదియుకానమే యని పరితపించియు, శ్రీశ్రియఃపతియొక్క దివ్యమంగళ గుణాను భవముచేయుచు, భక్తిపారవశ్యముచేత చేతులు జోడించుకొని నిలువబడగా, శ్రీమన్నారాయణుడు, లోకములోని యాత్మలు మాయనుగడచి జ్ఞానమార్గవర్తులయి నిత్యానంద ప్రదమయిన పరమపదమును పొందుటకు సాధకమగునట్లు నిఖిలవేదాంతార్థ

ములను ప్రకటవేదముగా రచియింపుము అని యానతిచ్చి యంతర్ధానము నొందెను.

అంతట నమ్మాళ్వార్లు చింతక్రిందనే వేంచేసియుండి, శ్రీమన్నారాయణుడే పరాత్పరుడనియు, ఆయనతప్ప ఆత్మలకు గత్యంతరము లేదు అనియు, ఆపరమపురుషుని పాదసేవ చేయుచు వర్తింపవలెను అనియు, అట్లువర్తించువారికి తప్ప తక్కినవారికి బ్రహ్మాదు లంతటివారికైనను ఆదేవుని యనుగ్రహము లభింపదనియు, సృష్టి స్థితి సంహారము లనెడు మూడుకార్యములకు మూడుమూర్తులై వర్తించునట్టి యాశ్రీమన్నారాయణుడు భక్తపరాధీనుడు కాని యితరుడు కాడు అనియు, శీలవతియైన పతివ్రత తనభర్తను ఎడబాసినప్పుడు దేహము వాడగా, గాజులువదలగా, రూపము మారగా, పడక నడక మాట పాట వీనియందలి జ్ఞప్తి లేక పెనిమిటివలన తానుపొందిన కరణసుఖములను తలచితలచి అందువలని తాపాతిశయముచేత మనసు మైనమువలె కరగగా, కన్నులనీరుకారుచు పిచ్చిపట్టినదానివలె మెలగునట్లు, శ్రీమన్నారాయణుని సేవవలన ఎడబాటునొందినందులకై మరల లభించుట యెన్నటికోయని వస్త్రభూషణాద్యలంకారములను తొలగించి, అద్భుతమయిన దేహము మయిలకప్పిన మణివలె కాంతిహీనము కాగా, చూపు మాట మొదలగు వానిని సంకోచింప జేసికొని, శ్రీభగవచ్చరణసేవవలన తాము అనుభవించిన మహానందసుఖానుభవమును తలచితలచి, అందువలని సంతాపముచేత మనసు కరగి కన్నులవెంట నీళ్లుకారగా, అవయవములను చలింపజేయక కొన్నాళ్లుండి, భర్తనెడబాసిన పతివ్రత తనచెలికత్తెలు మొదలగువారితో తన పెనిమిటియొక్క సద్గుణములను, నెమ్మదిని చెప్పిచెప్పి, ఆపెనిమిటిని పిలుచుకొనిరమ్మని చెలికత్తెలను పంపునట్లు, ఆళ్వార్లును తమపార్శ్వములందు మెలగుచున్న పక్షులనుజూచి, శ్రీమన్నారాయణుని కల్యాణగుణములను, ఆపరమ

పురుషుని యెడబాటువలన తమకుగలిగిన విచారమును వానితో చెప్పి వానిని రాయబారమంపునట్లు మాటలాడుచు, ఆపత్రుంటు పోయి యిటువంటి సేవసులను ఎడబాయవచ్చునాయని శ్రీను న్నారాయణుని వేడుకొనగా ఆపురుషోత్తముడు కృపపుట్టి వేం చేసె నోయనునట్లు మరల సేవసాదింపగా, లోపలను వెలుప లను ఆదివ్యమూర్తిని సేవించి యానందించి, అందువలని యను భవము తెలియబడునట్లు సకల వేదాంతసారమయిన తిరుమం త్రార్థమును నాలుగు దివ్యప్రబంధములుగ ప్రకాశింపజేయువారై ఋగ్వేదసారమయిన తిరువిరుత్తము, యజుర్వేదసారమైన తిరు వాశరియవిరుత్తము, అథర్వవేద సారమైన పెరియతిరువందాది, సామవేదసారమైన తిరువాయ్మొళ్రి అను నాలుగు దివ్యప్రబంధ ములను రచియించి, వానిని మధురకవులచే వ్రాయించిరి.

ఇట్లు నమ్మాళ్వార్లు తమదివ్యానుభవమును ప్రకాశింపజే సిన, సర్వ వేదాంత సారమయిన నాలుగు ప్రబంధములను మధు రకవులు వ్రాసి పాఠముచేసి, అందలి యనుభవార్థములను ప్రక టించుచు, ఆనందరసప్రవాహామునందు సదా మునిగి తేలుచు, రే లుంబగళ్లు ఎడతెగక నమ్మాళ్వార్ల చరణారవిందముల నారాధిం చుచు నెమ్మదిగా వేంచేసియుండిరి. ఇట్లు మధురకవులచే సే వింపబడుచున్న నమ్మాళ్వార్లు శ్రీ ఆదిప్పిరాణ్ ప్రసాదించినపొగడ ప్పూలమాల ధరించి వకుళాభరణులనియు, పరసమయములను నిరసించి పరాంకుశులనియు, శతులను (కుత్సితులను) మరుగు పరిచి (స్వరూపనాశముచేసి) శఠగోపులనియు తిరునామములు వహించి, తమ్ము ఆశ్రయించియున్న కారి, ఉడయనంగ మొద లగువారిని పరమపదమునందు నిత్యానందానుభవమును పొంద ననుగ్రహించి, మధురకవులును తాముసుగా కొంతకాలము భగ వద్గుణానుభవము చేయుచు వేంచేసియుండిరి.

పిమ్మట ఒకనాఁడు నమ్మాళ్వార్లు ఈలోకమునందీదేహమును ధరించి ఇంక నెన్నాళ్లుందును, ఈ దేహరూపమయిన మోపును ఇక ధరింపజాలను. నీపాదములతోడు. నిన్నువిడిచి యిక క్షణకాలమయిన గడపుట నాకు అశక్యముగానున్నది. నన్ను నీసన్నిధిని జేర్చుకో ననుగ్రహింపవలెను. అని శ్రీవైకుంఠనాథుని ప్రార్థింపగా, ఆక్కృపానిధి ప్రత్యక్షుమై తన్నుజూచి మేరమీరిన యానందముతో లేచి పలుమారు సాగిలబడి దండములు సమర్పించి కన్నులయందానంద బాష్పములు వర్షింపగా బద్ధాంజలియై బహువిధముల వినుతించుచు నిలువబడిన శఠారిని కటాక్షించి, ఏలవిచారము? ఇక మావెంట పరమపదమునకు రమ్ము అని యానతియ్యగా, మధురకవులు, స్వామీ! అడియను నమ్మాళ్వార్లను ఎడబాసి ప్రాణములనుభరించుట యెట్లు? దాసునిని వెంటబెట్టుకొని వేంచేయ గటాక్షింపుము. అని ప్రార్థించి, నమ్మాళ్వార్లతట్టుతిరిగి కన్నుల నీళ్లుపెట్టుకొని, ఆయాళ్వార్లవిషయమయి "కణ్ణినుణ్ శిఱుత్తాంబు" అని మొదలుపెట్టి పదిపాశురములను రచియించి, దేవరవారిని ఎట్లు ఎడబాసియుందును అని విన్నవింపగా, శ్రియఃపతి తిరువుళ్లముకరగి, ఓమధురకవీ! నీవు ఇంకను కొన్నాళ్లు నీకవిత్వమాధుర్యమును లోకమునందు వ్యాపింపజేయుము, ఈచింత్రమానిక్రింద నమ్మాళ్వార్లను అర్చారూపమున వేంచేయింపజేసి ఆరాధించుచు, తిరువాయిమొళ్లిని లోకములోని జనులు సాధారణముగ అనుసంధించునట్లుచేసి పిమ్మట నాడగుపరమపదమునకు రమ్ము అని యానతిచ్చి, శ్రీవైకుంఠనాథుడు నమ్మాళ్వార్లతోడ పరమపదమునకు వేంచేసెను.

అంతట మధురకవులు పెరుమాళ్ల నియమనము చొప్పున తామ్రపర్ణీనదీతీరమునందు త్రవ్వియెత్తిన ధాతువర్గముచే ఎప్పటి చింత్రమాని మొదటకో వెల యొకటికట్టించి, అందు ఆళ్వార్లను అర్చారూపమున వేంచేయింపజేసి, సర్వోపచారములతోను ఆ

రాధించుచు, ఆళ్వార్లు పాడించిన నాలుగు దివ్యప్రబంధములను లోకమునందు ప్రసిద్ధపరచుచు, ఇమ్మాట నలువదియేండ్లు ఈ మనుష్యలోకమునందు వేంచేసియుండి పిమ్మట నిత్యవిభూతికి వేంచేసిరి. 240.

శ్రీమధురకవయేనమః.

ఇతి నమ్మాళ్వారులయు మధురకవులయు వైభవము.

---

## కులశేఖరాళ్వార్ల వైభవము.

---

శ్లో॥ కుంభేపునర్వసూజాతం కేరళేకోళిపట్టణే,
కౌస్తుభాంశంధరాధీశం కులశేఖరమాశ్రయే.

మలయాళము అనబరగిన కేరళ దేశమునందలి కొల్లి అను పట్టణములో వంజికళం (కుక్కుటకూటము) అను ప్రదేశము నందు రాజ్యముచేయుచుండిన చేరకులతిలకుడగు దృఢవ్రతుడు అను రాజు సంతానార్థియై శ్రీమన్నారాయణునిగూర్చి తపస్సు చేయగా ఆయన తపస్సునకు మెచ్చి శ్రియఃపతి ప్రత్యక్షమై యా యన కోరికయీడేర ననుగ్రహించి వేంచేసెను. అంతట దృఢ వ్రతుడు కృతార్థుడనైతిని అని యానందించుచు తనకు సాక్షా త్కరించిన శ్రీమన్నారాయణుని. దివ్యమంగళ విగ్రహమును పలు మారు ధ్యానించుచు తన పట్టణమునకువచ్చి యెప్పటివలె ప్రజ లను పరిపాలించుచుండెను. అటుపిమ్మట ఆదృఢవ్రతుని పట్టపు దేవి గర్భముధరించి పదినెలలు నిండగా, కలియుగాదిని ఇరువది యెనిమిదవ సంవత్సరమయిన పరాభవనామ సంవత్సరమున మాఘ శుక్లద్వాదశీ శుక్రవారమునాడు పునర్వసు తారయందు దేవతలు పూవులవాన కురియింపగా, మునిగణములు దీవింపగా, బహువిధములయిన శుభసూచక చిహ్నములు కానబడగా, ది 28. కలియుగ

దిక్కులు తెల్లనికాంతులతో వెలుగొందగా, కౌస్తుభాంశమయిన దివ్యతేజోమూర్తియగు బిడ్డడు తూర్పుదిక్కునందు సూర్యుడు ఉదయించునట్లు ఆపతివ్రతాశిరోమణియందు ఉదయించెను. ఇట్టి పుత్రునిగన్న యారాజభార్య కోటిసూర్య ప్రకాశమానుడైన కొడుకునుజూచి పరమానంద భరితురాలై దేవతలయందు జనిం పదగిన యీబిడ్డను గనుటకు నేను పూర్వజన్మమునందు ఎటువంటి తపస్సుచేసి యుంటినోయని తనభాగ్యమునకు ఆశ్చర్యపడుచుండెను. ఇట్టికుమారుడు పుట్టెనన్న వృత్తాంతమును అంతఃపురముననున్న దాదులుపోయి చెప్పగా దృఢవ్రత మహారాజు విని, అప్పటికిదగిన స్నానము మొదలగు కృత్యములుజరపి, వేదోక్తమార్గమున జాతకర్మమును జేసి, యోగ్యులగు బ్రాహ్మణులకు షోడశమహాదానములుచేసి, కొడుకునకు కులశేఖరుడు అని నామకరణమును గావించెను. పిమ్మట క్రమముగా ఆయాకాలములయందు అన్నప్రాశనము చౌళము మొదలయిన కర్మములను తమ గౌరవమునకు దగిన వైభవముతో నడపి రత్నఖచితములయిన బహువిధాభరణములను చేయించి యలంకరించి పెంచుకొనుచుండగా, ఆకుమారుడు పదియేండ్ల ప్రాయమువాడయ్యెను. అంతట దృఢవ్రతమహారాజు తమకులాచారము చొప్పున కుమారునికి వడుగుచేయించి, ఆచార్యునొద్ద వేదాధ్యయనము చేయ నొప్పగించెను. అంతట కులశేఖరరాజు ఋగ్యజుస్సామాథర్వణములనెడు నాలుగువేదములను, తర్క వ్యాకరణాదులయిన సమస్త శాస్త్రములను అభ్యసించి, ధనుర్వేదమునందును, ఆయుర్వేదమునందును, గాంధర్వ వేదమునందును (సంగీతవిద్యయందును) ప్రవీణుడై, ఏనుగునెక్కి తిరుగుట, గుఱ్ఱపుసవారిచేయుట, రథమునెక్కి మెలగుట మొదలగువానియందు గడిదేరి, మల్లవిద్యయందు చతురతవహించి, దొరతనమునకు వలయు తంత్రములెల్ల నేర్చి, వయఃపాకమును పొందెను. తోడనే ఆరాజకుమారు

నకు నాతని తండ్రియైన దృఢవ్రతమహారాజు తగిన వయస్సును రూపమును కులమును శీలమునుగల యొక కన్యకామణిని దెచ్చి వివాహముచేయించి, పిమ్మట కిరీటమును ధరింపజేసి, తనరాజ్యమునందాయనను నిలిపి, భార్యయు దానును తపస్సుచేయువారై పట్టణమును విడిచిపోయెను.

ఇట్లు రాజ్యభారము వహించిన కులశేఖరమహారాజుగారు తనయేలుబడికిలోబడిన బ్రాహ్మణాదివర్ణముల జనులు తమతమ వర్ణాశ్రమాచారములను క్రమముతప్పక నడపను, పాడిపంటలు నానాట పెచ్చుపెరుగను, కాపులయెడల ధనధాన్యసంపదలును, విద్యావివేకములును పొడకొనను, ఖనిజములవలనను, కృషిజన్యములవలనను అగు ధనాగమమువలన బొక్కసము నిండుకొని యుండగా, భగవద్భాగవతభక్తియుక్తులును, ధర్మసంరక్షణానురక్తులునై భూమిని పాలించుచుండెను.

అట్టియెడ ఒకానొకనాడు రాజశిఖామణియైన కులశేఖరాళ్వార్లు తెల్లవారిలేచి, రాచకార్యములన్ని క్రమముగానడపి, సూర్యాస్తమయముకాగానే అప్పటికితగిన వైదికక్రియలు జరపి, భోజనముచేసి శ్రీమన్నారాయణ స్మరణచేయుచు హంసతూలికాతల్పమునందు శయనించి నిద్రింపగా, స్వప్నమునందు శ్రీమన్నారాయణుడు తనదగు నిత్యవిభూతియు లీలావిభూతియు గనబడ సేవసాదించి వేంచేసెను. వెంటనే కులశేఖరాళ్వార్లు మేలుకొని తమ మనసులోని యానందము లోపల నిలువకపొంగి వెడలివచ్చుచున్నదో యన్నట్టు కన్నులయందు ఆనందబాష్పములు వానగాకురియగా, లేచి చేతులు జోడించుకొనినిలిచి, శ్రీశ్రియఃపతియొక్క నిత్యలీలావిభూతులు వ్యాజములేకయే సేవింపనయ్యెను. ఇట్టి భగవత్కృపకు పాత్రుడనుగా నేనేమి తపస్సు చేసితినో యనుకొనుచు, ఇన్నాళ్లు ఇటువంటి దివ్యానుభవమును పొందనేరక వ్యర్థముగా కాలము గడపనయ్యెగా అని విచా

రపడుచు, తమ మనస్సును ఆపెరుమాళ్ల దివ్యచరణారవిందముల యందు లయింపజేసి లోకవ్యాపారములయందు ప్రవృత్తి లేక జడభావమును వహించినవారై భగవద్గుణానుభవము చేయు చుండిరి.

అంతట తెల్లవారగా వాడుకచొప్పున అరుణోదయమున వచ్చి మేలుకొలుపువారు వీణె మొదలుగాగల మనోహరవాద్యములను గొని మేలుకొలుపులు పాడగా, వందిమాగధులు కైవారములు చేయగా, ప్రతిదినమునువలె మహారాజుగారు నిద్రలేచి బయటరాకుండుటను జూచి మంత్రులు మొదలగువారు కలవరము నొందినవారై ఇందులకు కారణమేమో తెలిసికోవలెనని తగిన వారిని అంతఃపురములోనికి బంపగా, వారుపోయి తామరరేకుల నపహసించు వికాసముగల విశాలనేత్రములనుండి బంగారునీటి బొట్లుపడునట్లు ఆనందబాష్పములు రాలగా, చేతులు జోడించుకొని చిత్తరుపతిమవలె కదలక మెదలక నిలువబడిన యేలినవారిని జూచి యాశ్చర్యము నొందుచువచ్చి మంత్రులు మొదలగువారికి తెలియజేసిరి. వారును అట్టి యునికికి హేతువు పలానిదని తెలిసికోలేక యెవరికితోచినట్టు వారు చెప్పుకొన నారంభింపగా గొప్ప కలకలముపుట్టెను. ఆకోలాహలధ్వనికి ఆళ్వార్లు ప్రపంచస్మృతిని వహించి, కనులుదెరచి నాలుదిక్కులు పారజూచి, తమదృష్టికి గోచరులుగాను వెలిచి యెల్లవారు మరుగుపడిపోగా, భయభక్తులుగలిగి తమసంగతి తెలియ గోరుచున్న ప్రధానమంత్రితో, ఇంతకాలము వివేకముమాలి వ్యర్థముగా కాలముగడపిన నన్నును ఒకవస్తువుగా పరిగ్రహించి నేటిరాత్రి సర్వరక్షకుడగు శ్రీమన్నారాయణుడు సాక్షాత్కరించి విభూతిద్వయమును అనుభవింపజేసి వేంచేసెను. ఇట్టి నిత్యపదవిని కన్నులారగాంచిన నేను అనిత్యమయిన యీలోకమునందలి జీవనమును నిత్యముగానమ్మి, ఎట్లు కాలమును వ్యర్థపుత్తును, నేను మొదలు పరమ సాత్త్విక

లయిన భాగవతులతోఁ గలసి శ్రీమన్నారాయణుని దివ్యమంగళ గుణానుభవము చేయుచు ఆత్మలాభము నొంది యానందింపఁగోరుచున్నాఁడను. అని చెప్పి, అదేప్రకారము ప్రతిదినము భగవద్భక్తు లెక్కడెక్కడనుండురో అక్కడికెల్ల తామేపోయి వారిని సేవించుచు, తమస్థితి తెలిసి తమ్ము వెదకుకొనివచ్చిన పరమ భాగవతోత్తములను తగినయుపచారములు చేసి నగళ్లకు పిలుచుకవచ్చి శ్రీ రామాయణాది గ్రంథ కాలక్షేపముల చేతను, మొదటియాళ్వార్లు ముగ్గురును తిరుమళిశయాళ్వార్లును, నమ్మాళ్వార్లును పాడిన దివ్యప్రబంధములను సేవించుటచేతను, ప్రొద్దులుపుచ్చుచు, క్షణకాలము సింహాసనమున గూర్చుండి రాచకార్యములు నడపుచు, తామరపాకుపై నీటిబిందువువలె సర్వవిషయములందును అంటీయంటని చిత్తముతో రాజ్యమేలుచుండిరి.

అట్టియెడ ఒకనాఁడు *తమ తిరువారాధన పెరుమాళ్ల ఆభరణములు కొన్ని కానరాకపోఁగా పరిచారకులుచూచి భయపడి కార్యకర్తలకు తెలియజేసిరి. వారు మంత్రులకు నెరిగించిరి. మంత్రులు రాజుగారితో మనవిచేసిరి. రాజుగారు పెరుమాళ్లయాభరణములను అపహరింప తెంపుగలపాపిష్ఠు లిందు ఎవరుగలరు, చక్కఁగా విచారింపుఁడని యానతియ్యఁగా, మంత్రులు కావలివారిని బిలిచి ఆభరణములు కొల్లపోవుటకు మూలము మీయజాగ్రత్త. మీరు వానినిపోబడి విచారించి ఆరాధనకాలమునకు తప్పక తెచ్చి యొప్పగింపుఁడు. ఒప్పగింపకున్న మీకు దండనతప్పదు. అని

---

* ఈ ఘట్టమునందు కులశేఖరాళ్వార్లు ఎడతెగక భాగవతగోష్ఠియందే ప్రొద్దుపుచ్చుచుండుట రాజ్యవ్యవహారములకు భంగముగానుండినందున మంత్రులు రాజుగారికి భాగవతులయందు ద్వేషము పుట్టింపదలచి, వారు అభ్యంగ కాలమునందు తీసియుంచిన రత్నాభరణములను దాచియుంచి, వానిని భాగవతులు అపహరించిరని రాజుగారితో చెప్పినట్లు గ్రంథాంతరములయందు చెప్పబడియున్నది.

కఠినముగా ఉత్తరువుచేసిరి. అందుకు ఆకావలివారు భయపడి మేము రేయుంబగలు ఏమరక కాచియున్నాము. అట్లుండగా ఈయాభరణములుపోవుట యెట్టిదో మేము ఎరుగము. అయినను రాజుగారి యాజ్ఞకువెరచి భాగవతులనుమాత్రము ఎడతెగక వచ్చుచు బోవుచుండ జూచుచుందుము. వారిలో నెవరయిన ఆభరణములను అపహరించుకొనిపోయిరేమో అని మాకుతోచు చున్నది. ఇంతకంటె మరియెవరియందును మాకు అనుమానము లేదు. అని విన్నవించిరి.

ఆమాటలు చెవినిపడగానే కులశేఖరాళ్వార్లు చాలపరిత పించుచు, మంత్రులనుజూచి, ఈ బుద్ధిమాలిన కావలివాండ్రమా తలు కాలిన నారసములవలె నాచెవులకు వేదన కలుగజేయు చున్నవి. ఈనీచులు కలలోనైన తలపరానిపాపమునకు ఒడిగట్టి యిట్టిమాతలు మాయుచున్నారు. ఇట్టి భాగవతద్రోహులు పొంద గలగతి యేదియోగదా? అది యటుండనిండు. వీరిమాటలువిని కొందరయినను పరమ పావనులయిన భాగవతోత్తములయందు సంశయబుద్ధిగలవారు అగుదురు. వీరిమాటలు నమ్మదగినవికావని నేను ఊరకుండినను అట్టివారు రాజు భాగవత పక్షపాతముచేత కావలివారిమాటలను ఆదరింపకపోయెను అందురు. కాబట్టి ఇందు వలన లోకులకు గలుగు సందేహమును నివర్తిచేయ వలయును. అని నిశ్చయించిపలికి, అప్పుడే పాములవాండ్రవలన ఒకకృష్ణస ర్పమును పట్టి తెప్పించి, దానిని ఒక బుంగలోనునుప నుత్తరువు చేసి,తనవ్రేలి ముద్దుటుంగరమును ఆబుంగలోవేసి, కావలివారిని జూచి, మీరు ఇప్పుడుకానకపోయిన యాభరణములను వైష్ణవులే అపహరించిరనిచెప్పి యీబుంగలోని యుంగరమును చేయిపెట్టి యెత్తుకొనుదురేని మీమాట నిజమని నేనునమ్మెదను. అనగా, కావలివారు గడగడలాడుచు నోరతడిలేక పెదవులు తడుపు కొనుచు మొగములు వేలవేసికొని ఒకమూలనొదిగి నిలిచిరి.

అప్పుడు ఆళ్వార్లు వారిని జూచి నవ్వుచు సభవారితో ఈ నీచులు భాగవతులయందు లేనిపోని పాపములు గడించిరని నేనీ బుంగలో చెయిపెట్టి ఉంగరము ఎత్తుకొనెదను. అని బుంగలో చేయి పెట్టగా, తాకినమాత్రమున బుస్సుమని పైబడికరచునట్టి స్వభావముగల క్రూరసర్పము ఆబుంగలో అణగి యూరకుండెనుగాని ఉంగరమెత్తునపుడు ఇటు అటు పొరలించినను కరవనేరదయ్యెను. అదిచూచి సభవారు ఆశ్చర్యపడి ముక్కుమీద వ్రేలిడుకొనిరి. శ్రీవైష్ణవులు పరమానంద భరితచిత్తులై ఆళ్వార్లను పొగడి వారికిగల భాగవతులయందలి విశ్వాసమును శ్లాఘించిరి. దేవతలు పూవులవాన కురియించిరి.

ఇట్లు పరమభాగవత భక్తియుక్తులై రాజ్యముచేయుచున్న కులశేఖరాళ్వార్లు ఈసంసారసముద్రమునందు మునిగి తేలుచున్న నాకు శ్రీరంగనాథుని సేవింపలభించుట యెన్నటికోయని "ఘుష్యతే యత్ర నగరే" అన్నట్టు ప్రతిదినము రంగయాత్రపోయెదము అని పట్టణమునందు చాటించి, బయలుదేరునప్పుడు భాగవతులు ఎదురుపడగా వారిని పూజించుటకై నిలుచుచు "శ్రీవల్లభేతి" అని యారంభించి ముకుందమాలయనెడు స్తోత్రమును శ్రీరంగనాథుని విషయమునందు గీర్వాణభాషతో రచియించి, సర్వదా శ్రీరంగయాత్రయందే చిత్తముంచి, రాజ్యవిషయములయందు విరక్తి పెరుగగా, ఒకనాడు శ్రీవైష్ణవ గోష్ఠితోడ శ్రీరంగమునకు వేంచేసి, అచ్చటి వైష్ణవోత్తములు తమ్ము ఎదుర్కొని యుపచరింపగా వారిని సేవించి, తిరుకావేరిలో తీర్థమాడి, ఏడు ప్రాకారములనుదాటి, జ్యోతిర్మయమై వెలుగుచున్న శ్రీరంగవిమానమును దర్శించి ప్రదక్షిణముచేసి, అందు శేషశాయియై వేంచేసియుండు (అళగియమణవాళర్) అనబడిన శ్రీరంగనాథుని సేవించి, బహుపర్యాయములు ఆదివ్యమూర్తియొక్క ఆపాదమస్తక పర్యంతమయిన అవయవములను కన్నులారచూచిచూచి యానందించుచు,

మాటిమాటికి నేలసాగిలబడి దండములు సమర్పించి చేతులు ముకుళించుకొని యానందపారవశ్యము చేత మైమఱచి నిలువబడియుండి, పదపడి "ఇరుళిరియచ్చుడర్ మణి" అని ప్రారంభించి ఒక్కొకటికి పదిపది పాశురములుగా ముప్పదిప్రబంధములు రచియించి శ్రీరంగనాథుని వినుతింపసాగిరి.

* శ్రీరంగనాథుడు ఆయాళ్వార్లభక్తివిశేషమునకు మెచ్చి చల్లని దయారసము లొలుక కటాక్షించి, కులశేఖరా నీవిచ్చట నుండి శ్రీవేంకటాచలమునకుపోయి అచ్చట శ్రీనివాసమూర్తినై యుండెడు నన్ను సేవింపుము అని యానతియ్యగా, కృతార్థోస్మి అనుచు అక్కడినుండికదలి తిరుక్కచ్చికివచ్చి శ్రీవరదరాజస్వామిని సేవించి, అందుండి తిరుపతికి విజయంచేసి శ్రీవేంకటాచలపతి సన్నిధిచేరి, నిప్పుసెగసోకిన మైనమువలె మనసుకరగి భక్తిరసముగా పరిణమించి ఆనందబాష్పరూపమున కన్నులనుండి బయలువెడలుచుండగా, దేహము పులకరించి రోమములు నిక్కపొడుచుకొనగా, పెక్కులు సాష్టాంగదండములు సమర్పించి, "ఊనేరిశల్వం" అని మొదలుపెట్టి కొన్నిప్రబంధములు రచియించి యా శ్రీనివాసునికి సమర్పించి, కొంతకాలమునకు పిమ్మట అందుండి బయలుదేరి తిరువాయర్పాడికి (వ్రేపల్లెకు) వేంచేసి, అందు శ్రీగోపాలమూర్తిని సేవించి, ఆ పెరుమాళ్లవిషయమయి గోపికల

---

* గ్రంథాంతరమునందు ఈకథ కానబడదు. ఇందులకు మారుగా ఆళ్వార్లు శ్రీరామభక్తిపరవశులై రామాయణకథాశ్రవణము చేయుచుండి సీతాపిరాట్టిని రావణుడు ఎత్తుకొనిపోయెనన్నమాటవిని అతిపరితాపముతో పట్టాకత్తిచేతపట్టుకొని రావణునిచంపి పిరాట్టిని విడిపించుకొని వచ్చెదనని కదలి చొరరాని యడవినిజొచ్చి పోవుచుండగా సీతాలక్ష్మణులతోడ శ్రీరామచంద్రుడు ప్రత్యక్షమయి ఆళ్వార్లకు మోక్షమిచ్చి వేంచేసినట్లు చెప్పబడియున్నది.

వాక్యములుగా ఒక ప్రబంధమును రచించి నివేదించి, అచ్చట నుండి శ్రీ అయోధ్యకు వేంచేసి అచ్చట చక్రవర్తి త్తిరుమగనారును (శ్రీరాముని) సేవించి, కౌసల్యాలాలన చేయునట్లును, దశరథచక్రవర్తి పుత్రవిరహముచేత విచారపడునట్లునుగా ఒకప్రబంధమును గల్పించి, అందుండి చిత్రకూటమునకు వేంచేసి అచ్చట రుద్రుడుకొలువగా శయనించియుండు గోవిందరాజపెరుమాళ్లను సేవించి, పదిపాటలతో వాల్మీకి రామాయణకథను ఒకప్రబంధముగా రచించి, అందుండి తమపట్టణమునకు వేంచేసి, ఈలీలావిభూతియందు నూటయిరువది సంవత్సరములు గడపి పిమ్మట బ్రహ్మరుద్రాదిదేవతలకు సయితము పొందరానిదై, శ్రీమన్నారాయణుడు దేవీభూషణాయుధ పరిజనములతోడ నివసించునదియై యొప్పునట్టి శ్రీవైకుంఠస్థానమునుపొంది, అనంతగరుడ విష్వక్సేనాది నిత్యసూరులతో గలసి శ్రీ శ్రియఃపతియొక్క దివ్యమంగళగుణానుభవముచేయుచు సుఖముండిరి.

శ్రీకులశేఖరాయనమః.

## పెరియాళ్వార్ల వైభవము.

బ్రహ్మాదులయిన దేవతాప్రభువులకును చిరకాలము సహ త్తరమయిన తపస్సుచేసినైన పొందరానిదై, నిత్యానందానుభవస్థానమయి, అప్రాకృత దివ్యదేశమై వెలుగొందునట్టి పరమపదమునందు, సర్వలోక నియామకుడై వేంచేసియుండు శ్రీమన్నారాయణుడు, తనసన్నిధానమునందు అచంచల భక్తియుక్తుడై కైంకర్యముచేయుచుండు గరుడాళ్వార్లను జూచి, ఓసుగుణనిధీ భూలోకమునందలి యాత్మలు అజ్ఞానమనెడి కాలకూటవిషము తలకెక్కి మైకము పుట్టింపగా మందమతులై నిష్ఫలములయిన సామాన్యమతములను అవలంబించి వాస్తవమయిన పరవస్తువు

ఇట్టిదని తెలియక యలయుచున్నారు. కాబట్టి నీవు భూలోకమునందు మనుష్యరూపమున నవతరించి వారియజ్ఞానము నివర్తింపను, వాస్తవార్థము తేటపడను సాధనమయిన శ్రీవైష్ణవ సిద్ధాంతమును స్థాపించి ఎల్లయాత్మలను ఉజ్జీవింపజేయుము. అని యాజ్ఞాపింపగా, భూలోకమునందు భరతఖండముతో జేరిన చోళ దేశమునకు దక్షిణముననుండు పాండ్యదేశమునందలి దివ్యదేశములలో వాసికెక్కిన శ్రీవిల్లిపుత్తూరు(ధన్వీపురము)అనుదివ్యదేశమునందు సప్తసాగరతీర్థము తీరమున శ్రీవడపెరుంగోయిలాళ్ (శ్రీవటపత్రశాయి) అను అర్చావతారమూర్తి సన్నిధియందు వసించియుండునట్టి బోధాయన సూత్రుడును, యజుశ్శాఖియు, పురశ్శిఖుడును నైన ముకుందాచార్యులు అను వైష్ణవోత్తమునికి తనయులై పద్మ అనుభార్యయందు కలియుగాదిని నలువదియేడవది యయిన క్రోధననామ సంవత్సరమునందు జ్యేష్ఠశుక్లఏకాదశీ భానువాసరమునాడు స్వాతీనక్షత్రమున శ్రీవైనతేయాళ్వార్లు అవతరించిరి.

అట్లు అవతరించి కోటిసూర్యులు వెలుగునట్లు వెలుగుచున్న దివ్య తేజస్సుగల స్వర్ణవిగ్రహమయిన యాకుమారరత్నమును కన్నులారజూచి తల్లి పరమానందభరితురాలు కాగా, తండ్రియైన ముకుందాచార్యులును అసదృశ లక్షణములుగలిగి యొప్పునట్టి కొడుకును చూడజూడ దేహముప్పొంగ తమకులాచారము చొప్పున పుత్రోత్పత్తికాలమున జేయదగిన జాతకర్మాదులను జేసి పిమ్మట విష్ణుచిత్తుడు అని నామకరణమును జేసెను. విష్ణుచిత్తులును ఆ తల్లిదండ్రులు ఎంతోగారాబముగా పెంపగా పెరిగి యేడవయేట ఉపనయనమును చేయింపబడి, వేదాదివిద్యలెల్లను పూర్వజ్ఞాన సంబంధమువలన అతిసులభముగా నభ్యసించి, భగవంతునియందును భాగవతులయందును భక్తిహెచ్చగా, ఎవడు సత్వగుణప్రధానుడై తననాభికమలమునందు బ్రహ్మనుబుట్టించి

అతనికి సృష్టికర్తృత్వమిచ్చి చరాచర జంతుజాలమునకు నెల వైన యాబ్రహ్మాండమును కలుగజేయించెనో ఆశ్రీమన్నారాయణుడే పరవస్తువు, ఆభగవంతుని చరణారవిందములనే మన ము పూజింపవలసినవారము అను దివ్యజ్ఞానమును పడసి, ఎల్ల ప్పుడు శ్రీవటపత్రశాయిని సేవించుటయే పనిగాచరించుచు, చతు ర్వేదసారమయిన తిరుమంత్రార్థమును సర్వదా మననచేయుచు, భక్తియనునది యిట్టియాకారమును వహించి చరించుచున్నదో అనునట్లు ప్రకాశించుచుండిరి.

ఒకనాడు శ్రీవిష్ణుచిత్తులు వటపత్రశాయిని సేవింపబోయి అప్పుడు ఆపెరుమాళ్ల తిరుమేనునందు అలంకరింపబడిన దివ్యపరి మళముగల పుష్పహారములనుజూచి, ఈతిరుమాలలు ఈ పెరు మాళ్ల తిరుమేనునందు పొందియుండుటకై యెటువంటిపుణ్యము చేసినవో తెలియదు. ఆదియటుండ, వీనిని ఇట్లుకూర్చికట్టి సమ ర్పించువారు ఎంతటి భాగ్యవంతులు అనవలె. అట్టిభాగ్యము లభించుటయేగదా ఈదేహమును ధరించినందులకుఫలము. నేనిది విచారింపక యింతకాలము వ్యర్థముగా కడపితినే. అనితలపోసి తలపోసి చాలసేపు సన్నిధినుండి యీవలరాక నిలిచియుండి, ఇక ఈ పెరుమాళ్ల విషయమై పుష్పకైంకర్యము చేయుటకు దగిన ప్రయత్నము చేయవలసినదని నిశ్చయించుకొని తిరుమాళిగకు వచ్చి, తమపెద్దలు ఆర్జించిన మంచిసారవంతములయిన చేలనన్ని టిని వెలుగులునాటించియు కరగోడలెత్తించియు తోటలుగాజేసి, వానిలో తొళసి, మరువము, దవనము మొదలగు పరిమళపత్రము లను, మల్లెలు, మొల్లలు, జాజులు, విరజాజులు, గొజ్జెంగలు, సం పెంగలు, కస్తురిపట్టెలు, గన్నేరులు, పొన్నలు, పొగడలు మొదలు గాగల పూలచెట్లను నాటించి, వానికినీరెత్తుటకు మంచికినీరుగల ప్రదేశములందు దొరువులు గుంటలు బావులు త్రవ్వించి, వాని యందు తామరలు కలువలు మొదలగువాని వేయించి, మ్రాకుల

వలనివియు, పొదలవలనివియు, చిరుచెట్లవలనివియు, తీగలవలనివియునైన నాలుగు తెగల పువ్వులును ఎడతెగక కలుగుచుండవలెనని రేలుంబగల్లు నిద్రాహారములుమాని దేహశ్రమకు వెఱవక తగినకొరముల్లు సంపాదించి త్రవ్వటము పెట్టుట, కలుపుతీయుట, అంట్లొత్తుట, నీరుకట్టుట, మొదలగు పనులయందు పదురక పదినెలలుమోసి కన్నబిడ్డలను తల్లియైనది యెచ్చరికతో పెంచునట్లు పూలచెట్లను పెంచుచు, ప్రతిదినము వేకువజామున లేచి స్నానాద్యనుష్ఠానములు చేసికొని తోటలకుపోయి అంపలి పువ్వుల పరిమళము తనముక్కునచొరకుండ మూతికి అడ్డముగా తిరుప్పరివట్టము గట్టుకొని నాలుగు తెగల పువ్వులనుగోసి తిరుపగూడలలో నుంచి యెత్తుకొనివచ్చి తిరుమాళిగలో ఇతరులు రాని ప్రత్యేకపు గదిలో పెట్టి తిరుమాలలు, హారములు, ఎత్తులు, చెండ్లును గాకట్టి శ్రీవటపత్రశాయి సన్నిధిలో అర్చనవేళకు తప్పక కొనపోయి సమర్పించుచువచ్చిరి.

ఇట్లు పెరియాళ్వార్లు శ్రీవడపెరుంగోయిలాన్ అనబరగిన వటపత్రశాయికి అచంచల భక్తితో పుష్పకైంకర్యము చేయుచుండు కాలమునందు పాండ్యదేశమునకు రాజధానియైన మధురలో రాజ్యము చేయుచున్న శ్రీవల్లభదేవుడు అనురాజు ఒకనాటిరాత్రి నగరశోధనమునకై మారువేషము వేసికొని వీధివీధి తిరుగుచు వచ్చువాడు ఒకవీధిలో ఒకయింటిపంచలో ఒంటిగా పండుకొని నిద్రపోవుచున్న బ్రాహ్మణుని జూచి నిద్రలేపి, ఈయర్ధరాత్రమునందు ఇచ్చటతోడులేక ఒంటరిగా పండుకొనియున్నావే నీవెవరు అని యడుగగా, అతడు, అయ్యా నేనుపరదేశపు బ్రాహ్మణుడను, గంగాస్నానము చేసికొని సేతుస్నానమునకై పోవుచు, ఇచ్చటికివచ్చునంతలో ప్రొద్దుగ్రుంకి చీకటిపడినందున ఇక్కడ పండుకొన్నాను అనెను. అందులకు రాజు, అయ్యా! నీవు బ్రాహ్మణుడవు బహుదేశ సంచారము చేసినవాడవు. నీకు బహువిషయ

ములు తెలిసియుండ వచ్చును. నీకు తెలిసినవానిలో సారవంతమయిన యొకవిషయమును నాకు ఆనతిమ్ము, అని ప్రార్థింపగా, బ్రాహ్మణుడు అతడు రాజు అగుట తెలియకున్నను అతనివినయముతోడి విచారణకు సంతోషించి, ఇతడెవడో పెద్దమనుష్యుడుగా నున్నాడనియెంచి, "శ్లో॥ వర్షార్థమష్టౌప్రయతేతమాసాన్ నిశార్థమర్థందివసంయతేత, వార్ధక్యహేతోర్వయసానవేన పరత్రహేతోరిహజన్మనాచ". అనుశ్లోకమును చదివెను. (ఈశ్లోకార్థమును దెలిపెడు పద్యము ॥ సీ ॥ వానకాలమునకు వలసినయవియెల్ల నార్జింపవలయుమూ సాష్టకమున, రాత్రులకొనరు నర్థములెన్ని యన్నియుఘటియింప వలయుబగళ్లయందు, యపరవయోయోగ్య మగువస్తుజాలంబు సాధింపవలయు నుజవ్వనమున, పరలోకమునకు సంపాద్యమెయ్యదియది గడియింపవలయునీ యొడలియందు.) అనునీయర్థముగల శ్లోకమును చదువగానే రాజు అందలి తాత్పర్యమును గ్రహించి, అయ్యో, ఈయర్థమును విచారింపక పరలోకమునకై యేధర్మమును చేయక యింతవరకును ఊరక కాలము పుచ్చితినే అని మనసుననొచ్చుకొనుచు తననగరికిపోయి, సకలవేదాగమ శాస్త్రార్థముల నెరిగినవాడును శ్రీమన్నారాయణ చరణారవింద సేవవలన నానందించు స్వభావముగలవాడును చెల్వనంబియను పేరుగలవాడునైన తనపురోహితుని పిలిపించి, ఆయనను తగినపీఠమునందు గూర్చుండబెట్టి యథోచిత సన్మానములచేత గౌరవించి, స్వామీ అజ్ఞానమనెడు చీకటిలో మునిగి జ్ఞానమనెడి సూర్యోదయమును గోరుచున్న అడియడు పరలోకసాధకతమమయిన యుత్తమకర్మమును అనుష్ఠించి ఆముష్మికపదవిని పొందదలచుచున్నాడు. ఆతలపు నెరవేరుటకు తగిన పురుషకారము చేయ మీకంటె నాకు దక్కు లెవరు. ఈవిషయమునందు తిరువుళ్లముంచి నన్నుగృతార్థునిగా జేయవలయునని ప్రార్థించిరు.

అందులకు చెల్వనంబి సంతోషించి, ఓరాజా తత్త్వపరిజ్ఞానముగల భాగవతోత్తముల సేవయు, అట్టివారు ఆనతిచ్చువిషయముల యనుష్ఠానమును, వారివలన నెరిగిన యర్థముల నేమరక మననముచేయుటయు పరలోకసాధనములలో ముఖ్యతమములు. అనగా, రాజు, అటువంటి భాగవతోత్తములు ఎక్కడనుందురో వారిస్వరూపము ఎటువంటిదో తెలియనానతిచ్చితిరేని, అట్టివారిని జేరి దేవరవారు ఆనతిచ్చినచొప్పున సేవచేసెదను, అని అడుగగా చెల్వనంబి, ఆమహానుభావులు ఇట్టిచోటనుందురు. వారి స్వరూపము ఇట్టిది. అని తెలిసిచెప్పుటకు ఎవరితరము. అయినను నాకుతోచినయుపాయ మొకటిచెప్పెదను. దానివలన నట్టి భాగవతోత్తములను తెలిసి సేవింప అనువుపడినను అనువు పడవచ్చును. ఆ యుపాయము ఏదియనగా, మనకొలువు కూటమునకెదుట ఒక స్తంభము నాటించి, దానికొసను వరాలజాలెయొకటి వ్రేలగట్టించి, ఈ లోకమునందు ఏమతస్థులైననేమి పరవస్తువు పలానిదని సిద్ధాంతముచేసి నాకుసరిపడచెప్పి, ఈవరాలజాలెను పుచ్చుకోవలసినది. అని యెల్లదేశములకు ప్రకటనపత్రికలను పంపిన పక్షమున ఆయాదేశములందుండెడు మతసిద్ధాంతప్రవర్తకులందరువత్తురు. అందువలన పరతత్త్వపరిజ్ఞాతలు ఎవరో వారిని తెలిసికొని సేవింపవచ్చును. అనిచెప్పెను. అందులకు రాజు సంతోషించి తనపురోహితుడైన చెల్వనంబిని పూజించి, స్వామీ దేవరవారివంటి తత్త్వవేత్తలు నాకుదొరకుట గ్రుడ్డివానికి కన్ను కలిగినట్టును, నిరుపేదకు సంపదలభించినట్టును అగును గాని వేరు కాదు. అనిబహువిధములపొగడి, ఆయన చెప్పినచొప్పున వరాలజాలె వ్రేలగట్టించి, ఎల్లదేశములకు పత్రికలనుబంపెను.

అంతట బౌద్ధులు, శైవులు, శాక్తేయులు, మాయావాదులు, వైశేషికులు, సాంఖ్యులు, పాశుపతులు, శ్రమణులు మొదలుగాగల నానామతస్థులలో సిద్ధాంతప్రవర్తకులగు వారందరు

తమతమ శిష్యగణములతోడ తత్క్షణమే తమతమ దేశములనుండి బయలుదేరి మధురకువచ్చి చేరిరి. అట్టియెడ శ్రీవిల్లిపుత్తూరిలో సర్వవిషయములందును ఇచ్ఛాద్వేషములు లేక శ్రీవటపత్రశాయికి పుష్పకైంకర్యము చేయుచు సదా నారాయణస్మరణమానక వర్తించుచున్న పెరియాళ్వార్లు ఒకనాటిరాత్రి తమతిరుమాళిగలో నిద్రించునప్పుడు శ్రీమన్నారాయణుడు వారికలలో సాక్షాత్కరించి, ఓవిష్ణుచిత్తా మధురలో వల్లభదేవరాజు పరవస్తువు నెరుగగోరి తనకు నిత్యమయిన పరవస్తువు ఇట్టిదని తెలియజెప్పినవాడు పరిగ్రహింపదగినదిగా నిర్ణయించి ఒకవరాలజాలెను తనకొలువు కూటములో వ్రేలగట్టించి యున్నాడు. అనేకులు సిద్ధాంతప్రవర్తకులు తమతమ మతములను స్థాపించి ఆజాలెను కొనిపోవలెనని మధురకు వచ్చియున్నారు. వారిసిద్ధాంతములు ప్రామాణికములు కావు గనుక నీవు తెల్లవారిబయలుదేరి మధురకుపోయి పురుషసూక్తోక్త ప్రకారమున విశిష్టాద్వైత సిద్ధాంతమును స్థాపించుము. అంతట ఆజాలె తనంతట తెగి నీముందర పడును. అందువలన ఆరాజును నీకుదాసుడగును. పిమ్మట నీవు వానికి నాదైన నిత్యస్వరూపమును ప్రకాశింపజేయునట్టి తత్వార్థమును బోధించి, వైష్ణవ మతోద్ధారకుడవైరమ్ము. అని యాన తియ్యగా, పెరియాళ్వార్లు నీలమేఘమువలె వెలుగొందునట్టి పెరుమాళ్ల తిరుమేను కన్నులారకనుగొనియు, ఆయన తిరువాక్కులు చెవులారవినియును అదరిపడిలేచి, సాగిలబడి పెక్కులు దండములు సమర్పించి చేతులుజోడించుకొని నిలువబడి, కన్నులయందానందబాష్పములు ఒలుకుచుండగా దేవతలకైన కనరాని దివ్యమంగళ విగ్రహమును కనగాంచితిని, నేనెంత భాగ్యవంతుడనోయనుకొనుచు, ఓ నాయేలినవాడా! నీవేప్రత్యక్షముగ వేంచేసి యానతిచ్చినపనికిపోవ నాకుశంకయేల? ఇదిగో పోయెదను. నీసేవకుని గెలిపించుభారము నీదేకదా? అని తనగుణగణములను

వర్ణింప నారంభింపగా, ఆభగవంతుడు అంతట అంతర్ధానము నొంది, ఆదివ్యదేశమునందలి భాగవతోత్తములైన బ్రాహ్మణులకును కలలో సేవసాదించి నాప్రియభక్తుడయిన విష్ణుచిత్తుడు స్వామతోద్ధరణము చేయుటకై మధురకు పోబోవుచున్నాడు. మీరందరును అతనిని పరివేష్టించి పోవలసినది. అని యానతిచ్చెను. అందులకు వారు వారు మేరలేని యానందమును పొంది లేచి చక్కగా తెల్లవారునంతలో ప్రయాణసన్నాహములతోడ పెరియాళ్వార్ల సన్నిధానమునకు వచ్చిరి. అప్పుడు పెరియాళ్వార్లు వారిరాకకు కారణమును అడిగి తెలిసికొని, శ్రీశ్రియఃపతియొక్కయవ్యాజకరుణకు ఆశ్చర్యపడుచు, ఆవైష్ణవగోష్ఠితోడ బయలుదేరి వటపత్రశాయి సన్నిధికిపోయి సేవించియనుజ్ఞ పుచ్చుకొని, శ్రీవిల్లిపుత్తూరినుండి కదలి మహావైభవముతో మధురకు వేంచేయగా, మంత్రులు పురోహితుడు తక్కినపరివారజనులును పరివేష్టించికొలువ, విద్వాంసులు శ్రుతిస్మృతీతిహాస పురాణాముల యర్థములను ప్రకటింప, శైవశాక్తేయాది మతస్థులు తమ తమ మతతత్త్వముల సిద్ధాంతీకరింప, పరమభాగవతుల రాకకు ఎదురుచూచుచు సింహాసనాసీనుడై యున్న శ్రీవల్లభదేవరాజు తనపరిచారకులవలన శ్రీవిష్ణుచిత్తులరాకవిని, అతిసంభ్రమముతో సింహాసనమునుండి లేచి పురోహితుడైన చెల్వనంబిని వెంటదీసికొని ఎదురుగా బోయి అర్ఘ్యపాద్యాది షోడశోపచారములతోను పూజించి వేంచేపుచేయించుకొనివచ్చి, ఆకొలువుకూటమునడుమ ఒక యున్నతాసనమునందు నిలిపి సాగిలబడిమ్రొక్కి! స్వామీ కాళ్లుచేతులులేని మొండివానికి మిక్కిలిపొడవైన వృక్షముయొక్క కొనకొమ్మలలోనున్న తెట్టెలోని తేనె అనాయాసముగా లభించినట్లు ఎక్కడనో వేంచేసియున్న పరమభాగవత శిఖామణులయిన తమ సేవరాజ్య సంపత్తియందుమునిగి కన్నుగానక వర్తించునట్టి అడియనికి లభించెను. ఇట్టి మీసేవ లభించుట ప

సుకృతఫలమో తెలియబడదు. అని నైచ్యానుసంధానము చేయు చుండగా, * అచ్చటి మతాధికారులు చేయు సిద్ధాంతములను పూర్వపక్షములను వినగోరి ఆకాశమార్గమునందు గుంపులుగూడి యుండు దేవతలలో ఇంద్రుడు తనగురువైన బృహస్పతినిజూచి, గురువర్యా మీరు బ్రాహ్మణరూపముతో ఈసభకుపోయి విష్ణుచిత్తునితో వాదించి, ఆయన సామర్థ్యముకొలదిని ఎరిగిరావలయునని విన్నవింపగా, బృహస్పతి అట్లేకానిమ్మని బ్రాహ్మణాకృతితో రాజుసభచొచ్చి రాజునుజూచి, నీవు ఏదిసత్తగలమతమో తెలిసికోవలెననిగదా ఈసభను గూర్చితివి. అటువంటి నీవు ఈయనను ఇంతగౌరవింపనేల? ఇప్పుడు ఈయనయందు ఏమిమహిమ నీకు గానవచ్చెను? ఇందరు సిద్ధాంతప్రవర్తకులముందర ఈయన నింతగౌరవించుట తక్కినవారిని అవమానించుటగాని వేరుకాదు. అని యాక్షేపింపగానే, అక్కడనున్నవారందరు అతనికి సహాయులై నిలిచి, ఇకమాప్రసంగములవలన ఫలములేదు. నీవు మెచ్చుకొన్న యీపురశ్శిఖుడే సిద్ధాంత స్థాపకుడు కావలసినవాడు. అనిచెప్పి పెరియాళ్వార్లతో వాదింప ప్రయత్నపడిరి. అప్పుడు ఆళ్వార్లు మొట్టమొదట ఆక్షేపించిన కపట బ్రాహ్మణునిజూచి, అయ్యా! నీవు మాత్సర్యముచే మ్రింగబడిన వానివలె నున్నావు. ఇది పండితధర్మము కాదు. వలయునేని నీమతము ఏదియో, ఆమతమునకు కర్తయైన దేవతయెవరో, ఆమతమును అనుష్ఠించు వారు పొందగలఫలమేదో చెప్పుము అని అతనివాదమును పూర్వపక్షముచేసెను. అందులకు ఆబ్రాహ్మణుడు ఇప్పుడు నీవు అడిగిన మాటలు నేను అడిగినవిగానే యెంచుకొని వానికిదగినయుత్తరములను నీవేచెప్పుము. అనగా, ఆళ్వార్లు చిరునవ్వునవ్వుచు ఆసభలోని మతసిద్ధాంతప్రవర్తకులు అందరువినునట్లు గట్టిగా గొంతెత్తి నామతము చతుర్వేదనిశ్చితములయిన తత్వార్థములను

* గ్రంథాంతరమునందు ఈచోట ఇట్లు చెప్పబడలేదు.

ప్రతిపాదించునదియగు విశిష్టాద్వైతము. ఆమతమునకు కర్తమాయాతీతుడును ఆద్యంత రహితుడును సర్వవల్లభుడును నైన శ్రీమన్నారాయణుడు. బుద్బుదప్రాయములయిన లోకములనన్నిటిని తనకడుపులో నిముడ్చుకొని తననాభికమలమునందు సృష్టికర్తయైన బ్రహ్మను, అతని నొసటియందు లయకర్తయైన రుద్రునిని జనింపజేసి, సృష్టిస్థితిలయములను జేయించుచుండునట్టి యానారాయణునికి ఉనికిపట్టు శ్రీవైకుంఠము. అప్రాకృతమయిన ఆవైకుంఠలోకమునందు దివ్యరత్న మండపములో నిత్యసూరులు సేవింపగా వేంచేసియుండెడి యాపెరుమాళ్ల చిన్మయ గుణానుభవముచేయుటయే ఆమతానుష్ఠానమువలని ఫలము. అని పెరియాళ్వార్లు ఆనతిచ్చిరి. మరల ఆబ్రాహ్మణుడు, నీమత తత్వమును చెప్పితివి; ఇక నీమతమునకు అభిమానియైన శ్రీమన్నారాయణునికి నీవుచెప్పిన విశేషణములను లక్షణ సమన్వయముచేసి చెప్పుము అనగా, విష్ణుచిత్తులు ఇంద్రజాలముచేయువానివలె ఎల్లయాత్మలను తనమాయలోముంచి మోహింపజేసి తానామాయకు లోబడకయుండుటచే శ్రీమన్నారాయణుడు మాయాతీతుడు ఆయెను. సత్వగుణ ప్రధానుడయ్యును ఎల్లయాత్మలను సృష్టికిని సంహారమునకును లోబరిచి తాను వానికిలోనుగాక వెలయువాడు అగుటవలన ఆద్యంతరహితుడు. అండములను వానిలోని చరాచర జంతుజాలమును ఇచ్ఛామాత్రమున కలుగజేసి వానిని పొందుపడ పెంచి కడపట సర్వమును తనకడుపులో ఇముడ్చుకొనునట్టి సర్వశక్తులు గలవాడు అయినందున సర్వవల్లభుడు. అని చెప్పి, అందులకు బ్రాహ్మణుడు సర్వవల్లభుడు నారాయణుడే అననేల ఎల్లలోకములను సృజించు నేర్పుగల బ్రహ్మదేవుడు సర్వవల్లభుడు కాడా అని యడుగగా, విష్ణుచిత్తులు, బ్రహ్మతనకుగల అయిదుతలలలో ఒక దానిని రుద్రుడు గోటితో గిల్లివేయగా మరలకలుగజేసికో లేకపోయెను కాబట్టి, అతడు

సర్వవల్లభుడు కానేరడు. అని పూర్వపక్షముచేసిరి. అంతట బ్రాహ్మణుడు బ్రహ్మసర్వ వల్లభుడు కాకపోయిన పోనీ రుద్రుడు సర్వవల్లభుడు కాడా? అందుకు ఆక్షేపమేమి అని ప్రశ్నచేసెను. అదివిని విష్ణుచిత్తులు ఓరా మంచి ప్రశ్నచేసితివి బ్రహ్మతలను గిల్లినదోషమునకై కపాలమును చేతబట్టుకొని భిక్షుకుడును శ్మశానవాసియునై చిరకాలము అల్లాడి కడపట శ్రీమన్నారాయణుని యనుగ్రహమువలన బ్రహ్మహత్యను బాపుకొన్నవాడు సర్వవల్లభుడు ఎట్లు అగునో నీవే విచారింపుము. అనగా, బ్రాహ్మణుడు కాలవిపర్యాసముచేత ఆ బ్రహ్మహత్యతటస్థమయినది. కాబట్టి అదియే సర్వవల్లభము అనెను. విష్ణుచిత్తులుకాలము జడము గనుక దానికి సర్వవల్లభత్వము కలుగనేరదు. అని, అది సర్వవల్లభము కాకపోయినను దానిని నడపునట్టి సూర్యుడు సర్వవల్లభుడు అనగా, శ్రీమన్నారాయణుని కన్నులలో నొకటియయిన సూర్యుడు సర్వవల్లభుడెట్లగును ఇది అన్నిటికంటెను అసంభవము అని నిరాకరించిరి. బ్రాహ్మణుడు అందులకు ప్రత్యుత్తరము చెప్పను తోచక ఊరక ఉండెను. అటుపిమ్మట ఇతర మతస్థులు కొందరు తమతమ సిద్ధాంతముల చొప్పున ఆయాయిదేవతలకు పరత్వము స్థిరపరుప పలుతెరగుల వాదములుచేసియు తుదకు ఓడిపోవుటయేగాక మొగములు వేలవేసికొని తొలగి పోయిరి.

అప్పుడు శైవులనెడు మదపుటేనుగులకు సింహమును, శ్రమణులనెడు మేకలకు పెద్దపులియు, బౌద్ధులనెడు గాఢాంధకారమునకు సూర్యుడును తక్కిన మతస్థులనెడు క్రూరసర్పములకు గరుడాళ్వార్లునునై తేజరిల్లుచున్న పెరియాళ్వార్లు విశిష్టాద్వైత సిద్ధాంతమును స్థాపింపగా, అచ్చట వ్రేలగట్టియున్న వరాలజాలె తనంతట తెగి ఆళ్వార్లముందర పడెను. దేవతలు పువ్వులవాన కురియించిరి. శ్రీవైష్ణవులందరు జయజయ ధ్వనులతో విష్ణుచిత్తులను పొగడుచు పరమానందముతో పరివేష్టించి

నలిచిరి. శైవులు మొదలుగాగల ఇతరులు తమతమ మతముల యందలి విశ్వాసముచెడి, విశిష్టాద్వైతమే యుత్కృష్టతమ మయిన మతమనియు, శ్రీమన్నారాయణుడే పరవస్తువు అనియు తలపోయుచు, శ్రీవిష్ణుచిత్తుల యనుగ్రహమును గోరువారైరి. చెల్వనంబియు రాజును ఆనందబాష్పము లెత్తి కన్నుల నొత్తు కొని దీని మూలమున నేకడా మనము తెలియరాని వైష్ణవసిద్ధాంతమును తెలిసికొంటిమి. అని యుప్పొంగుచు దానిని పెరియాళ్వార్ల చరణారవిందములపై నుంచి యర్చించి, ఆపాదపద్మములు తమతలలు సోక పెక్కులు దండములు సమర్పించి, స్వామీ దేవరవారి యనుగ్రహమువలన ఎల్లవారి సంశయములును తీరెను. అస్మదాదులందరు పరమతత్త్వార్థము నెరిగిరి. మాపూర్వపుణ్యములు సఫలములయ్యెను. అని మందలించిరి. మాయామనుష్యుడైన బృహస్పతి తనవృత్తాంతమును ఎల్లవారికి తెలియ పరిచి విష్ణుచిత్తులకు వందనములుచేసి బహుప్రకారముల కొనియాడుచు అంతర్ధానము నొందెను.

పిమ్మట రాజు పట్టణమును అలంకారము చేయించి శ్రీవిష్ణుచిత్తులను తనపట్టపు ఏనుగుమీద వేంచేపుచేయించి పురమునకు ప్రదక్షిణముగా ఊరేగింపు చేయింపగా, శ్రీమన్నారాయణుడు గరుడవాహనారూఢుడై వారికి సేవసాదించెను. అప్పుడు పెరియాళ్వార్లు ఏనుగుమీదనుండి దిగి ఆశ్రియఃపతి తిరువడుగులకు మ్రొక్కి తా మెక్కిన యేనుగుపై వ్రేలవేసిన గంటలే తాళముగా జేసికొని * ''పల్లాండుపల్లాండు'' అని ప్రారంభించి పదునొకండు పాశురములచేత పెరుమాళ్లను మంగళాశాసనముచేసిరి. అంతట చెల్వనంబియు రాజును ఆళ్వార్ల యనుగ్రహమువలన భాగవతసేవ మాత్రముగాక భగవత్సేవయుగూడ లభించెనని దేహ

---

* పల్లాండుపల్లాండు పల్లాయిరత్తాండు పల్కోడినూరాయిరం । మల్లాండదిండోళ్ మణివణ్ణా ఉన్ సేవడిసెవ్వి తిరుక్కాప్పు.

ములు పరవశములుకాగా రాతిపతిమలవలె చలింపక నిలువబడి యుండిరి. శ్రీమన్నారాయణుడు ఆళ్వార్లను కటాక్షించి ఓవిష్ణుచిత్తా నేడు ఈరాజసభయందు పరతత్వ నిర్ణయముచేసినందులకై యిదిమొదలు నీకు పట్టరబిరాన్ (భట్టనాథుడు) అను బిరుదుపేరు వెలయగలదు. ఈ పేరితో ఇంకను కొంతకాలము నాయపర మూర్తియగు వటపత్రశాయికి పుష్పకైంకర్యముచేయుచు, వేదార్థప్రతిపాదకములైన దివ్యప్రబంధమాలికలచేతను నన్ను అలంకరించుచు, ఈలోకములోనుండి, ఎల్లజీవాత్మలను సన్మార్గమునందు ప్రవర్తించునట్లుచేసి తరువాత నాదగు సన్నిధానమును పొందరమ్ము అని యానతిచ్చి యంతర్ధానమునొందెను.

అంతట పెరియాళ్వార్లు మధురాపట్టణము నాలుగు వీధులందును ఊరేగి రాజువలన షోడశోపచారములతోడి పూజలను పడసి శ్రీవిల్లిపుత్తూరికి వేంచేసి, తిరుప్పల్లాండు తొడక్కముగా నన్నూటడెబ్బదిరెండు పాశురములుగల పామాలైయను దివ్యప్రబంధమును రచియించి, శ్రీమన్నారాయణునికి సమర్పించి భగవద్గుణానుభవము నేమరక చిరకాలము పుష్పకైంకర్యము చేయుచునుండిరి.

శ్రీమతే రామానుజాయనమః.

---

## ఆండాళ్ వైభవము.

పరాత్పరుడైన శ్రీమన్నారాయణుడు పాలసముద్రమధ్యమునందు యోగనిద్రయందుండి మేలుకొని శ్రీభూనీళాదేవులు ముగ్గురును సేవింపగా శ్రీవైకుంఠ నగరమునందలి నవరత్నఖచితమయిన సింహాసనమున వేంచేసి యుండగా, భూదేవి తన యేలినవానిని జూచి, స్వామీ! దేవరవారికి ఎటువంటి ఆత్మలయెడల నిర్హేతుక వాత్సల్యముగలిగి యుందురో, దాసురాలికి

తెలియ ఆనతియ్యవలయునని వేడగా, శ్రీమన్నారాయణుడు చిరునవ్వుతో ఆభూపిరాట్టిని ప్రియముమీర కటాక్షించి, ఎవరు అనిత్యమయిన ప్రపంచమువలని తగులులేక నిత్యమయిన పరమపదమును పొందగోరి యెడతెగక నాదగు పాదద్వయమునందు భక్తియుంచి నన్నే తలచుచు, నావిషయమై పా అనబడు వృత్తముల మాలికలను, పరిమళయుక్తములయిన మల్లెలు మొదలయిన పుష్పమాలికలను రచియించి నన్ను అలంకరింతురో అటువంటి భాగవతులు నావాత్సల్యమునకు పాత్రులు అగుదురు. వారిని నేను కృపతో ఏలుకొందును, అని ఆనతిచ్చెను. అదివిని భూదేవి దేవరవారు సాదించిన చొప్పున కైంకర్యముచేసి దేవరవారి తిరువడుగులను పొందవలెను అను కోరిక దాసురాలికి కలిగియున్నది. ఆకోరిక నెరవేర ననుగ్రహింపుడు అని ప్రార్థించెను. అందులకు శ్రీమన్నారాయణుడు సంతోషించి నీకు అటువంటి కోరిక కలిగియున్న పక్షమున భూలోకమునందు శ్రీవిల్లిపుత్తూరు అను దివ్యదేశములో గరుడాళ్వార్ల యంశమున శ్రీవిష్ణుచిత్తుడు అను పేర అవతరించిన భాగవతోత్తముడు ఒకడుకలడు. ఆయన సదా ఆదివ్యదేశమునందు అర్చారూపమున సేవ సాదించునట్టి వటపత్రశాయికి కైంకర్యము చేయుచుండును. నీవు ఆయనకు కూతురవై నీయభీష్టమును నెరవేర్చుకో అని యానతియ్యగా, భూపిరాట్టి మేరలేని యానందమును వహించి, స్వామీ! దేవరవారి యానతి చొప్పున దాసురాలికి ఆదివ్యదేశమునందు అవతరించుట సమ్మతమే. అయినను, ముందు ఆదివ్యదేశమునకు ఆపేరు కలుగుటకు కారణము మొదలయినవృత్తాంతములతో దానిమహిమను, అచ్చట వేంచేసియుండు దేవరవారి లీలావిభూతివిధమును, ఆపరమభాగవతోత్తముని వృత్తాంతమునువిన నభిలాషయగుచున్నది. అని విన్నవించెను. శ్రీమన్నారాయణుడు ఆవిన్నపమును ఆదరించి, ఓ నాప్రియురాలా విను

ము. భూలోకమునందలి యేడుద్వీపులలోపల వన్నెకెక్కిన జంబూ ద్వీపమునందు దక్షిణభాగములో పాండ్యము అను పుణ్యదేశము ఒకటికలదు. ఆదేశమునందు పరిశుద్ధమయిన యొకదివ్యక్షేత్ర ముకలదు. అందు పూర్వకాలమునందు నిన్ను పీడించుచున్న హిరణ్యాక్షుడు అను దైత్యుని వధించుటకై వరాహావతార మెత్తి వానినివధించి, నిన్ను ఉద్ధరింపగా, నీవు ఆరూపముతోనే ఆక్షేత్రమునందు వసింప నన్ను వేడుకొంటివి. అంతట ఆవరాహ రూపముతోనే అచ్చట అనేకకల్పములు నీతోగూడి వసించియుం టిని. ఆప్రదేశము జనసంచారము లేమిచే అదిమొదలు బహు కాలముదాక అడవిగానే యుండినందున భృగువు మార్కండే యుడు మొదలుగాగల ఋషులు అచ్చటికివచ్చి నన్ను సేవించి తపస్సుచేయనారంభించిరి. అప్పుడు కాలనేమి మొదలగు రాక్ష సులు వారితపస్సులకు విఘ్నములు చేయబూనిరి. అందులకు స హింపజాలక ఆఋషులు నాతో మొరపెట్టుకొనగా నేను చక్రా యుధప్రయోగముచే రాక్షసులనందరిని సంహరించి, ఆచక్రము నందు పేరుకొనియున్న రక్తమునంతయు కడిగివేయుమని వరు ణునికి ఆజ్ఞాపించితిని. వరుణుడు గంగా యమునా సరస్వతీనదు లను మూటిని ఆక్షేత్రమునకు రప్పించి వాని యుదకములతో సుదర్శనమును కడిగెను. నాడు మొదలు ఆ మూడు తీర్థములు చేరినచోటు తిరుముక్కూళం అని పేరొక్కనబడుచుండును.

అట్టి పుణ్యక్షేత్రమునందు ఆఋషులు పాలసముద్రములో శయనించి యుండునట్లు వటపత్రశాయివై సేవసాదింపవలెనని ప్రార్థింపగా అట్లే అచ్చట వారికి సేవయొసగితిని. అది కార ణముగా ఆపట్టణము వటపేశ్వరపురము అనియు, అందు అర్చా రూపమున వసించిన నాకు వటపేశ్వరుడు అనియు పేరులు కలి గెను. అదిమొదలు అరువదినాలుగు మహాయుగములు కడచు నంతవరకు దేవతలు మునులును ఆరాధింపగా అచ్చట వసించి

తని. పిమ్మట ఆక్షేత్రము పూర్వవత్తుగానే మహారణ్యమై పోయెను. ఆయరణ్యము వెంబడి చిన్న ఊరు ఒకటి యేర్పరుచుకొని అందు కొందరు బోయలు వాసముచేయుచుండిరి. ఆయూరికి పుత్తూరు అని పేరు. అందు వళ్లి అనుదానికి కొడుకులైన విల్లి, కండడు అనువారు కొంత వివేకముగలవారైనందున తమజాతి వారికందరికి ప్రభువులైయుండిరి.

ఆయన్నదమ్ములు ఇరువురును ఒకనాడు వేటాడువారై అడవిప్రవేశించి నేను శయనించియున్నచోటికి దాపున ఒకపెద్ద పులినిజూచి తరుముగా అది ఒదిగి ఒదిగి పోయి ఒకపొదమాటున దాగెను. అది తెలియక కండడు తనయన్నను ఎడబాసి యేదయిన మృగముచిక్కునోయని పొదపొదను వెదకుచు పోవుచుండగా మునుపు వానిచేత తరుమగొట్టబడిన పులి ఒక పొదలోనుండి ఆదాటున వానిపైబడి చంపివేసెను. పెద్దవాడైన విల్లియు తమ్మునివలెనే మృగములను వెదకుచు తమ్ముడుపడియున్న తావునకువచ్చి వాడు పెద్దపులిచే చంపబడినసంగతి తెలిసికొని, అందువలని విచారముచేత కళతప్పి నేలబడి చచ్చినవానివలెనే యుండెను. అప్పుడు వానికి నేను ప్రత్యక్షుడనయి అబ్బీ నీవు విచారపడకుము. ధైర్యమునువిడిచి యిట్లుతపించుట నీబోటివానికి తగిన పనికాదు. నేను ఇచ్చట శయనించియుండెడి వటపత్రశాయిని. నాకు కోవెలయొకటి కట్టించి ఆరాధనము తిరునాళ్ల మొదలయినవి నడచునట్లు చేయుము. అందువలన నీవు మేలుపొందుదువు. అని చెప్పగా, వాడు తెలివివహించి లేచి స్వామీ నీవు నాయేలినవాడవే అయినపక్షమున నాతమ్మునిబ్రతికించి, నాకు కావలసిన ధనములభింప ననుగ్రహింపుము. నీయాజ్ఞచొప్పున కైంకర్యము నడపెదను అనెను. అంతట నేను వానితమ్మునిప్రాణములిచ్చి, వానినిచంపిన పులియున్నగుహానుజూపి, ఆగుహాలో మేరమీరినధనము రాసులు రాసులుగా పడియున్నది. ఆపులినిజంపి

అందలిధనమును పుచ్చుకొని కైంకర్యముచేయ యత్నింపుమని చెప్పి కనుమొరగితిని. అందులకు వాడు అత్యంతము సంతోషించి, గుహలోనున్న పులినిచంపి, అందున్న ధనమును పుచ్చుకొని నేనుశయనించియుండుచోటు తెలియక ఆయడవియంతయు నరకించి బయలుచేసి, అచ్చట ఒక మఱ్ఱిమ్రాని మొదట శయనించియున్న నన్నుజూచి, ప్రదక్షిణ నమస్కారములుచేసి, కోవెల గర్భగృహము విమానము ముఖమండపము గోపురము ప్రాకారము మొదలగునవికట్టించి, అందు నన్ను నెలకొనజేసి, కోవెల నాలుగుప్రక్కలను మాడవీధులేర్పడ, అర్చకులు, పరిచారకులు మొదలగువారికి తిరుమాళిగలు కట్టించి, నాకు సంప్రోక్షణము మొదలగునవి చేయించి, పుత్తూరునందున్న శ్రీవైష్ణవులును తనకు తోడుపడగా, తిరువారాధనము తిరుణాళ్లు మొదలయినవి యథావిధిగా మహావైభవముతో జరపించుచు వచ్చెను. అదియాదిగా విల్లిచేత కట్టింపబడిన యాయూరు శ్రీవిల్లిపుత్తూరు అని వ్యవహరింపబడుచున్నది. ముందు ఖిలమయి క్రొత్తగా జీర్ణోద్ధారము చేయబడినది అగుటచేత దానికి పుదువై అనియు ఒకపేరు కలిగియున్నది.

అట్టి మహాకైంకర్యపరుడైన విల్లియు తన తమ్మునితోడ చిరకాలము వటపత్రశాయికి ఉత్సవాది కైంకర్యములు నిరతిశయములుగా జేయుచు, పూర్వపుణ్యముచే తనకు లభించిన వటపత్రశాయి సేవకు నానందించుచునుండి కొన్నాళ్లకు శ్రీవైకుంఠపదవిని పొందెను. అటుపిమ్మట పట్టరబిరాన్ (భట్టనాథుడు) అను బిరుదు వహించిన శ్రీవిష్ణుచిత్తుడు లోకములోని చేతనులను ఉజ్జీవింపజేయు నిమిత్తము నాయానతిచొప్పున నతవరించి శ్రీవిల్లిపుత్తూరిలో వటపత్రశాయికి పుష్పకైంకర్యము చేయుచునున్నాడు. అని శ్రీమన్నారాయణుడు ఆనతియ్యగా విని యానందించి మేలినవాని యానతిపడసి దేవతలు పువ్వులవానకురి

యింపగా, మునులు వినుతింపగా, అనేకములయిన శుభసూచక చిహ్నములు తోచుచుండగా భూదేవి శ్రీవిల్లిపుత్తూరిలో శ్రీవిష్ణుచిత్తుల తులసీవనమునందు, కలియుగాదిని తొంబదియేడు సంవత్సరములు కడచిన పిమ్మటిదైన నళనామసంవత్సరము ఆషాఢశుక్లచతుర్థీ మంగళవారమునాడు పూర్వఫల్గునీ నక్షత్రమునందు అయోనిజయై యవతరించి కోటిసూర్యులు వెలుగునట్లు వెలుగుచుండెను.

ఆదినము తెల్లవారి విష్ణుచిత్తులు తమవాడుక చొప్పున పూదోటకు వేంచేసి పువ్వులుకోసికొని తులసి మెత్తుకొనుటకై తులసివనము ప్రవేశింపగా జ్యోతిస్స్వరూపురాలైన కన్యకామణి వారికి కానబడెను. ఆమెనుజూచి ఆళ్వార్లు ఈబిడ్డ విలాసార్థముగా భూమికి అవతరించిన నాయేలినవాని పలికసానియైన పెరియపిరాట్టియే అనదగియున్నది. కాబట్టి యీమెను ఎత్తుకొనిపోయి శ్రీవటపత్రశాయి సన్నిధిలో సమర్పింతునుగాక అని అడ్డపాపగా ఎత్తుకొని దేహము పులకములచే నిండుకొనగా మనసు పొంగగా కోవెలకుపోయి వటపత్రశాయి సన్నిధిలో నిలువబడి, ఓ యేలినవాడా ఈబిడ్డ దేవర యేలుకొనుటకు పాత్రము. ఈమెను పరిగ్రహింప నంగీకరింపుము అని విన్నవింపగా ఆగర్భగృహమునందుండి, ఈబిడ్డను నీకుకొమార్తెగా గ్రహించి గోద అని నామకరణముచేసి పెంచుకొనుము అని ఒకమాట వినబడెను. అది విని మహాప్రసాదమని అచ్చటి శ్రీవైష్ణవులు తమ్ము పరివేష్టింపగా ఆళ్వార్లు గోదాదేవిని తమ తిరుమాళిగకు ఎత్తుకొనిపోయి, బహువిధములయిన యుపచారములతోను, చతుర్విధాలంకారములతోను గారాబముమీర పెంచుకొనుచుండిరి. అట్లు పెరుగుచు గోదాదేవి బాల్యముననే శ్రీమన్నారాయణుని దివ్యచరణారవిందములందలి భక్తి యుదయింపగా, తన తండ్రి శ్రియఃపతి విషయమునందుచేయు కైంకర్యములను తాను

ను చేయునదియై నిష్కపటమయిన యాసక్తితో వేకువజామున లేచి తండ్రి వెంట తోటకుపోయి పూలచెట్లకు త్రవ్వటము పెట్టుట, అంట్లుతొక్కుట, నీళ్లుకట్టుట, పువ్వులుకోయుట అనునవియే ఆటలుగా మెలగుచు, శ్రీమన్నారాయణ దివ్యమంగళగుణానుభవము చేయుచు, తిరుమంత్రమును జపించుచు, అందువలని యానందాతిశయముచే కన్నులయందు బాష్పములను విడుచుచు, తన్ను జూచు వారందరు ఇట్టి బిడ్డ యెందైనగలదాయని మెచ్చుకొనుచుండగా బాల్యదశను గడపి, యౌవనము అంకురింపగానే తోటకు పోవుటనుమాని తిరుమాళిగలో నివసించి, తండ్రి రచించిన తిరుప్పల్లాండును పఠించుచు, తండ్రి తోటనుండి వచ్చునంతవరకు భగవన్నామస్మరణ చేయుటయందే ప్రొద్దుపుచ్చి, పిమ్మట తండ్రివలన శ్రీమన్నారాయణుని లీలావతారకథలు వినుచు, ఆయన తెచ్చిన పువ్వులు తోమాలలు, పత్రిమాలలు, హారములు, ఎత్తులు, చెండ్లు మొదలయినవిగా కట్టియిచ్చుచు నుండెను. అట్టియెడ ఒకనాడు తాముకట్టిన హారములు మొదలగువాని ఒక తిరుపమాడలోనుంచి, ఒకగదిలో ఒంకెకు తగిలించి ఆళ్వార్లు తమ పనులవెంట మెలగుచుండగా గోదాదేవి అందలి యెత్తులన్ని యెత్తి కొప్పునముడుచుకొని అద్దమునందు సొగసుచూచుకొని, మరల కొప్పువీడ్చి యెత్తులను ఎప్పటివలె తిరుపమాడలోనుంచి ఒంకెను తగిలించెను. అది తెలియక ఆళ్వార్లు తమవాడుక చొప్పున ఆయెత్తులను ఎత్తుకొనిపోయి వటపత్రశాయికి సమర్పించిరి. నాడు గోదాదేవి ధరించిన కారణముచేత ఆపుష్పములయందు లేనిపరిమళము ఒకటికలిగి శ్రీవిల్లిపుత్తూరి తిరువీధులయందంతటను వ్యాపించెను. అందులకు ఎల్లవారును ఆశ్చర్యమునొంది ఔరా ఆళ్వార్ల కైంకర్య మహిమ అని ప్రశంసించిరి. అది మొదలుకొని నాంచారు ప్రతిదినమును పూవుటెత్తులన్ని తాను ముడుచుకొని సొగసుచూచి తిరుపమాడలో పెట్టుచు

కాగా ఆళ్వార్లు వటపత్రశాయికి సమర్పించుచు వచ్చుచుండిరి. అట్లు జరగుచుండగా ఒకనాడు విష్ణుచిత్తులు పెరుమాళ్లకు పూవుటెత్తులు సమర్పించునపుడు వానిని చాతుబడి చేయుచు అర్చకుడు అందొక వెండ్రుక చిక్కుకొనియుండగాజూచి, ఆళ్వార్లతో స్వామీ అపచారమపచారము. ఈ పువ్వులు పెరుమాళ్ల చాతుబడికి అర్హములుకావు. నేడేకాదు కొన్నాళ్లుగా వాడినలగినపువ్వులే కాని పరిశుద్ధములయిన పువ్వులు దేవరవారు తెచ్చుట కానము. అది తెలిసియు కారణము తెలియక విన్నపించుకొనుటకు వెరచి యూరకయుంటిని. నేను ప్రత్యక్షముగా తలవెండ్రుకయు కానవచ్చినందున ఎవరో ముడుచుకొన్నవి అపరిశుద్ధములు అని ఊహింపనయ్యెను. అనగా విష్ణుచిత్తులు చాలక్లేశము నొందినవారై ఇవి ఇట్లు అపరిశుద్ధములగుటకు కారణము ఏమియని విచారించుచు తమ నిత్యకైంకర్యమునకు లోపము రాకుండ వెంటనే తోటకు వేంచేసి క్రొత్తపువ్వులు తెచ్చి యెత్తులుకట్టి పెరుమాళ్లకు సమర్పించి తిరుమాళిగకు వేంచేసిరి. అయినను వారికి పెరుమాళ్ల విషయమునందు అపచారపడితిమే అను చింతమాత్రము అప్పటప్పటికి హెచ్చగా, శ్రియఃపతీ ఇట్టియపచారము దాసునికి పొసగించుటయు నీకొకలీలయే కాబోలు అని తదేకధ్యానముగా నాటిరాత్రి సయితము నిద్రపట్టక వేగించి వేకువజామున లేచి యెప్పటివలె పువ్వులుకోసికొనివచ్చి మాలలు హారములు ఎత్తులు మొదలయినవికట్టి తిరుపమాడలో పెట్టి ఒంకెనుతగిలించి యింటికి బయటికి తిరుగుచు కొంతకాలము గడపి పిమ్మట సమయము చూచి ఆపువ్వులుండుగది తలుపుసందునదాగి యేమిజరగునో చూడవలెనని కనిపెట్టియుండిరి. అప్పుడు గోదయు వాడుకమేరకు తిరుపమాడదించి అందలియెత్తులు కొప్పునతురిమి హారములు మాలలు మెడను వ్రేలవేసికొని అద్దమున సొగసు చూచుకొనుచుండెను. ఆళ్వార్లు అదంతయు చూచి తాము కనిపించుకొను

టకు సమయము ఇదియేయని, అమ్మా ఇది యేమిపని? మనము ముడుచుకొన్న పువ్వులు పెరుమాళ్ల చాతుబడికి యోగ్యములు అగునా? ఎంత అపచారమునకు ఒడిగట్టితివి? ఇటువంటి పిచ్చి బిడ్డలుగూడ లోకములో నుందురా? నీవివేకము కడపట ఈవిధముగా పరిణమించినందులకే నేను విచారించుచున్నాను. అని నిష్ఠురముగా అడుగగా, గోదాదేవిభయపడి దేహము గడగడ వడకగా తడబడుచు తానుధరించిన పువ్వులన్ని వీడ్చి మరల తిరుపకూడలోనుంచి ఒంకెనుతగిలించి మొగము చిన్నపుచ్చుకొని మరుమాట చెప్పను నోరురాక ఊరక ఒకమూలను నిలువబడెను. అంతట ఆళ్వార్లు అమ్మా విచారపడకుము. చేయరాని పనిచేసినందున ఇంత అనవలసివచ్చెను. ఇక నెన్నటికిని ఇట్టిపని చేయబోకుము. అని మంచిమాటలుచెప్పి ఆమెను ఊరడించి తొలునాటివలెనే క్రొత్తపువ్వులుతెచ్చి కట్టుకొనిపోయి వటపత్ర-శాయి సన్నిధిలో సమర్పించిరి.

నాటిరాత్రి పెరియాళ్వార్ల స్వప్నములో వడపెరుంగోయిలాన్ (వటపత్రశాయి) సాక్షాత్కరించి, మాప్రియురాలైన గోదభూమ్యంశ సంభూతురాలు. ఆమె ముడుచుకొన్న పరిమళముగల పువ్వులవలె తక్కిన పరిమళములేని పువ్వులు మాకు ప్రియములుకావు. రేపటినుండి ఆమెధరించినవానినే మాకుసమర్పింపవలసినది. ఇట్లుసమర్పించుటచేత ఆమె "చూడికొడుత్తాళ్, ఆండాళ్" అనుపేళ్లు వహించి వెలయగలదు. అని యానతిచ్చి, అట్లే సన్నిధి వైష్ణవులకును అర్చకులకును స్వప్నములో సేవ సాదించి యానతిచ్చెను.

అంతట తెల్లవారగా, ఎల్లవారును మేలుకొని లేచి తమ తమ స్వప్నవృత్తాంతములను ఒకరికొకరు చెప్పుకొని, చూడికొడుత్తనాచ్చియారు సాక్షాద్భూదేవి యేయనువిషయము తెలిసి

కొన్నవారై శ్రీవిష్ణుచిత్తుల తిరుమాళిగకుపోయి ఆయమ్మగారిని సేవించికొనియాడిరి. ఆళ్వార్లును తనపుత్రిక వడపెరుంగోయి లోకకృపకు పాత్రురాలైనందులకును, ఆమెకు తమయేలినవాని యందుగల భక్తివిశేషమునకును మెచ్చుకొని పరమానందభరిత చిత్తులయి పెరుమాళ్లు తమకు స్వప్నములో సేవసాదించి యానతిచ్చినచొప్పున కైంకర్యమునడప నారంభించిరి. చూడికొడుత్త నాచ్చియారును (ఆముక్తమాల్యదయు) ఈడేరి తనయేలినవానికి సాక్షాత్తుగా కైంకర్యముచేయను అనువైన యుపాయము ఏదియగునని విచారించి, ఆవిచారముచేత ఆహారనిద్రలను సయితము ఒల్లక, పూర్వము తాముపొందిన శ్రీమన్నారాయణుని తోడి సుఖములును తలపునకురాగా వలపుహెచ్చి, ఆప్తులయిన చెలికత్తెలను చేరబిలిచి, చెలులారా మీరు నాప్రాణమునకు ప్రాణముగా వర్తించుచున్నారు. కాబట్టి నామనసులోనిగుట్టు మీకు తెలుపదలచితిని. ఇందుకు తగినవారు మీరుగాక మరియెవరు. అని వారిని ఒకరహస్య ప్రదేశమునకు తోడుకొనిపోయి సంకోచముమాని మాయయ్య నూటొక్క దివ్యతిరుపతుల యర్చావతారములను వర్ణించిచెప్పునపుడు శ్రీరంగనాథుడు దివ్యసుందర విగ్రహుడని పలుమారు వినుచున్నదానను. అది కారణముగా ఆ దివ్యసుందరమూర్తియయిన శ్రీరంగనాయకునియందు నామనసు మరులుకొనియున్నది. ఆ మోహనాంగుని సాంగత్యము నాకు ఎట్లు లభించును. మీకుదోచినయుపాయము చెప్పుడు అనగా వారు పూర్వము ద్వాపరయుగాంతమునందు గోపికలు తమప్రియుడయిన శ్రీకృష్ణదేవుని పొందగోరి ఆచరించిన మార్గశీర్షవ్రతమును తలపింపగా తామును ఆనోము నోచి మనోరథసిద్ధి పొందగోరి, "మార్గళిత్తింగళ్" అని మొదలుపెట్టి ఆనెల ముప్పదిదినములకును ముప్పదిపాశురములను తిరుప్పావై అను పేరితో రచియించి తమయభిప్రాయమును శ్రీరంగనాథునికి

తేటపడ విన్నవించి, అందులకు అనుకూలుడవుకమ్ము అని మన్మ థుని వేడుకొనుచు ఆయర్థము తేటపడ "తయ్యొరుతింగళ్" అని ప్రారంభించి యొకప్రబంధమును రచించి, మరియు శ్రీరంగ నాథుని వేడికోలుగా బహువిషయములను జేర్చి నూటనలువది పామాలలు రచియించి, సర్వదా శ్రీరంగనాథునినే స్మరించుచు మెలగుచున్న నాచ్చియారు, ఒకనాడు తమతండ్రియైన పెరి యాళ్వార్లతో, అయ్యా, దాసురాలికి శ్రీరంగనాయకుని సేవింప మనసగుచున్నది. అందులకు దేవరవారు అనుకూలురు కావల యును అని విన్నవింపగా, వారు ఆవిషయమును శ్రీవడపెరుం గోయిలాన్ సన్నిధిలో విజ్ఞాపనము చేసి, ఆపెరుమాళ్ల యానతిని పొంది, ఒక బంగారుపల్లకీయందు గోదాదేవిని వేంచేయింప జేసికొని శ్రీరంగమునకు వెడలి కావేరి దక్షిణతీరము చేరునపుడు నాచ్చియారు ఇక వాహనముదిగి నడచిపోవలసినదేయని తలచిరి. ఆయభిప్రాయము రంగశాయియెరిగి ఆమెకు నడచుటవలని శ్రమ కలుగకూడదని, తత్క్షణమే తన యోగబలముచేత ఇతరులెవరు నెరుగకుండ సన్నిధిని జేర్చుకొనెను. గోదాదేవియు ఆదివ్య మోహనమూర్తిని సేవించి పరవశత్వమువహించి యుండెను.

అప్పుడు ఆసంగతి తెలియని బోయీలు పల్లకి బరువులేక పోవుటకు హేతువేమియని యాశ్చర్యపడుచు స్వామీ ఇంతసేపు దాక బరువుగానున్న పల్లకి ఇప్పుడు ఎందుచేతనో మిక్కిలి తేలికగానున్నది. అని విన్నపము చేయగా, ఆళ్వార్లు పల్లకిపై కప్పియున్న పచ్చడమును ఎత్తిచూచి అందున్న నాచ్చియారును కానక మిక్కిలి పరితపించుచు జరజర శ్రీరంగమునకు వేంచేసి రంగనాథుని సన్నిధిచేరి కన్నులనీళ్లు పెట్టుకొని, ఓయేలినవాడా నాప్రాణపదమైన ఆముక్తమాల్యదను ఎక్కడదాచినావు? ఆ మెను మాయముచేసి దాసునికి దుఃఖముకలుగజేయుట సర్వ

రక్షకుడవగు నీకుతగునా? ఇది నీబిరుదునకు ఊనముగాదా? ఇప్పుడు నాతల్లిని నాకుజూపితివా చూపు లేనిపక్షమున ఇప్పుడే నీచరణారవింద సన్నిధిని దేహత్యాగముచేయుదును అని మొర యిడగా, శ్రీరంగనాథుడు చిరునవ్వుతో భట్టనాథా నీసాహస ముచాలును. ఇదిగో నీకూతురు చూడుము. దీనికై యింతతొంద రపడుదువు అని నేనెంచలేదు. అని ఆండాళును గనబరచుచు ఆనతియ్యగా, విష్ణుచిత్తులు, స్వామీ దేవరకు ఈబిడ్డను పలుకో వలెనన్న తాత్పర్యము ఉన్నయెడల అందులకు కాదనువారు ఇక్కడ ఎవరు? అయినను దాసునిమనుక్కవ యేమనగా పరిజన పరిచారకులతో మహావైభవమును ప్రాభవమును మెరయ శ్రీవిల్లి పుత్తూరికి వేంచేసి పరమభాగవతోత్తములయిన శ్రీవైష్ణవులందరు హర్షింప దాసునిగుడిసెను పావనముచేసి యథోచితరీతిని నా బిడ్డను పరిగ్రహింప తిరువుళ్లపట్టవలెననిగాని వేరుకాదు. దాసుని కటాక్షించి యీవరము కృపచేయుము అని ప్రార్థింపగా, శ్రీ రంగశాయి ఆళ్వార్లను కనికరించి, భట్టనాథా నీయిష్టముచొప్పున నడచుకొనెదను. చింతింపకుము, నీకొమార్తను సుఖముగా పిలుచుకొని పొమ్ము. మేము పంగునియుత్తరము (ఫాల్గునమాసమునందలి యుత్తరానక్షత్రము) నాటికి శ్రీవిల్లిపుత్తూరికివచ్చి నీకొమార్తను పెండ్లాడెదము అని యానతిచ్చెను.

అంతట విష్ణుచిత్తులు ధన్యోస్మియనుచు నంబెరుమాళ్లను వీడుకొని చూడికొడుత్తనాచ్చియారును ఎప్పటివలె బంగారు పల్లకిలో వేంచేయింపజేసికొని శ్రీవిల్లిపుత్తూరికి వేంచేసి, తమ తిరుమాళిగను మాణిక్యపకట్టెలు మొదలగువానిచే అలంకరించి, వాకిట పోకచెట్లు అరటిచెట్లు నిలిపి, మధ్యరంగమును పట్టుమేలు కట్లతోను నానావిధ చిత్రములతోను, ముత్యాల ముగ్గులతోను, పచ్చలతోరణములతోను ప్రకాశింపజేసి, భేరీ భాంకారాదులైన చతుర్విధ వాద్యఘోషములు బోరుకలగగా శ్రీరంగనాథుని

రాకకు ఎదురుచూచుచుండిరి. ఊరివారందరును ఆవృత్తాంతము విని ఆళ్వార్ల తిరుమాళిగకువచ్చి, ఆండాళును, ఆళ్వార్లను సేవించి, మీయనుగ్రహమువలన బ్రహ్మాదులకును దుర్లభమయిన శ్రీరంగనాథుని లీలావిభూతిని కన్నులారగాంచి సేవింప పాత్రులమయితిమి. ఇందులకుదగిన ప్రత్యుపకారము మేమేమి చేయగలము. అని దండములు సమర్పించుచు తమతమగృహములకుబోయి ప్రతిగృహద్వారముననను అరటిబోదెలను పోకబోదెలను నిలిపి సర్వాలంకార సంపన్నములుగాజేసిరి. అందువలన ఆయూరి తిరువీధులన్ని చూడజూడ నేత్రోత్సవము చేయుచుండెను. శ్రీరంగనాథుడును ఆళ్వార్లతో ఆనతిచ్చినచొప్పున పెండ్లికొడుకై గరుడవాహనమును ఆరోహించి సర్వశుభలక్షణ లక్షితమయిన సుముహూర్తమునందు శ్రీరంగమునుండికదలి బ్రహ్మ, రుద్రుడు, ఇంద్రుడు మొదలుగాగల దేవతలు పరివేష్టించి సేవింపగా, గంధర్వులు కర్ణానందముగ గానముచేయగా, అప్సరసలు నృత్యములుచేయగా, సిద్ధసాధ్యులు పొగడగా, మునులు పుణ్యాహవాచనంబులు పఠింపగా పంగునియుత్తరము నాటికి శ్రీవిల్లిపుత్తూరికి వేంచేసి అందలి వైష్ణవబృందముల కన్నులకు ఆనందము కలుగజేయుచు శ్రీవటపత్రశాయి కోవెల్లో ప్రవేశించెను.

అది తెలిసి పెరియాళ్వార్లు తమపుత్రికను పిలుచుకొని భాగవత గోష్ఠితోసన్నిధికి వేంచేసి శ్రీరంగనాథుని సేవించి అర్చించి వేదోక్తవిధానమున ధారాపూర్వకముగా గోదాకన్యాదానము చేసి, ఓ యేలినవాడా ఇది నీసొమ్ము నీకు సమర్పించితిని. అని మంగళవాద్యములు మ్రోగగా, ముత్తైదువలు పెండ్లిపాటలుపాడగా, ఆదంపతులను తెల్లయేనుగుపై వేంచేయింపజేసి శ్రీవిల్లిపుత్తూరి తిరువీధులందెల్ల ఊరేగింపుచేయించి ధనకనకవస్తువాహనములతో వీడుకొలుపగా, శ్రీరంగనాథుడు ఆళ్వార్లతో మామా మీరు శ్రీరంగమునకు వేంచేయుడు అని యానతిచ్చి,

తమ తిరుకల్యాణమహోత్సవము చూడవచ్చిన వైష్ణవోత్తములనెల్ల చల్లగా కటాక్షించియనిపి, శ్రీరంగమునకు వేంచేసి, చూడికొడుత్తాళ్ తోడ కోవెల ప్రవేశించి శ్రీరంగవిమానమునందు నెలకొనెను.

అనంతరము ఆళ్వార్లు వటపత్రశాయిని సేవించి శ్రీవిల్లిపుత్తూరినుండి వెడలి నంబెరుమాళ్ల సన్నిధికి వేంచేసి రంగశాయియైన యాపెరుమాళ్లకు అనేకదండములు సమర్పించి చేతులు జోడించుకొని నిలువగా, రంగనాధుడు, మామా! మీరు ఇచ్చట నూతనముగా ఒక కోవెలకట్టించి అందు నన్ను, గోదను, గరుడాళ్వార్లను ప్రతిష్ఠచేసి, ఆరాధనము చేయుచు ఉండుడు. అని యానతియ్యగా ఆళ్వార్లు ఆకైంకర్యమునకు సమ్మతించి, కోవెలకట్టించి అందు గోదాసమేతుడైన రంగనాయకునిని గరుడాళ్వార్లను వేంచేయింపచేసి, ఈలీలావిభూతియందు ఎనుబదియైదు సంవత్సరము వేంచేసియుండి అనంతరము శ్రీమన్నారాయణ చరణారవిందములను పొందిరి.

ఆండాళ్ వైభవము.

---

శ్రీమతేరామానుజాయనమః.

## తొండరడిప్పొడి యాళ్వార్ల వైభవము.

పాడిపంటలచే మేలిమిపొందిన చోళదేశమునందు తిరుమండంగుడి అను పట్టణము ఒకటికలదు. అందు సదాచారసంపత్తియు దేవతాగురుభక్తియుగల పురశ్శిఖబ్రాహ్మణుడు ఒకడు కలడు. ఆయన తనకుదగిన కులము రూపము వయస్సునుగలిగి పతివ్రతాశిరోమణియయిన భార్యను పరిగ్రహించి పుత్రార్థియై సర్వరక్షకుడయిన శ్రీమన్నారాయణుని ఆరాధించుచుండగా ఆదంపతులకు కలియుగమున ఇన్నూట ఎనుబది తొమ్మిదవదైన

ప్రభవనామసంవత్సర మార్గశిరకృష్ణచతుర్దశీ మంగళ్వారము నాడు జ్యేష్ఠానక్షత్రమునందు బహువిధ శుభసూచకములు తోచుచున్న శుభముహూర్తమునందు లోకములోని భాగవతులకెల్లను ఆహ్లాదము పుట్టుచుండగా శ్రీవనమాలాంశమయిన తొండరడిప్పొడి ఆళ్వార్లు అవతరించిరి.

అట్లు అవతరించిన యాపుత్రరత్నముయొక్క అత్యద్భుతమైన తేజస్సునుచూచి తల్లిదండ్రులు పరమానందభరిత చిత్తులగుచు వేదోక్తవిధిని జాతకర్మాదులునడపి విప్రనారాయణుడు అని నామకరణము చేసి మిక్కిలి ప్రీతితో పెంచుకొనుచుండిరి. ఆళ్వార్లును దినదిన ప్రవర్ధమానులై యేడవయేటనే ఉపనయనమును కాగా వేదాదివిద్యలెల్ల అభ్యసించి, పరమవైదిక శిఖామణులును శ్రీవైష్ణవకుల శేఖరులునై తల్లిదండ్రులకును చుట్టములకును సంతోషమును కలుగజేయునట్టి నడవడితో మెలగుచుండి, * నానాట వైరాగ్యము పెరుగ శ్రీవిష్ణుచిత్తులవలె శ్రీమన్నారాయణునికి పుష్పకైంకర్యము చేయగోరి, శ్రీరంగమునకు పడమటి దిక్కున కావేరినడుమ శ్రీమకుటము అను పేరుగల దీవియందు పూదోట పెట్టి పెంచి శ్రీరంగనాథునికి పుష్పకైంకర్యము చేయుచు, మాధుకరము చేసి దేహపోషణము చేసికొనుచు కాలము గడుపుచుండిరి.

---

* ఈఘట్టమునందు మాతృకలో విప్రనారాయణులకు తల్లిదండ్రులు వివాహముచేయగా వారు చిరకాలము స్త్రీలోలురై యుండి అనంతరము భగవదనుగ్రహముచే జ్ఞానోదయముకాగా ఎల్ల దివ్యదేశముల యర్చావతారములను సేవించి తొండరడిప్పొడి అను పేరు వహించి శ్రీరంగనాథునకు పుష్పకైంకర్యముచేసి భగవత్సన్నిధిచేరినట్లున్నను ఇట్లు ఇతర గ్రంథములు అనేకములయందు కానబడుచున్నందున ఈరీతిగా వ్రాయనయ్యెను.

అప్పుడు భగవదిచ్ఛానుగుణముగా కావేరియుత్తరపు గట్టునందు తిరుక్కరంబనూరు అను గ్రామమునందు దేవదేవి అను పేరితో అప్సరాంశయయి పుట్టిన యొకవేశ్య వాసము చేయుచుండెను. అది ఒకనాడు తన తోడబుట్టువుతోగూడ నిచుళానగరమునందు ప్రభుత్వము చేయుచున్న చోళరాజునొద్దకుబోయి వచ్చుచు ఎండవలని తాపమునకు సహింపలేక దారిలోనున్న విప్రనారాయణుల పుష్పవనముచేరువ నొకచెట్టు నీడను విశ్రమించెను. అప్పుడు ఆపుష్పవనమునట్టునుండి పరిమళముతోడి చల్లని గాలి వీవగా, అందువలని పరిమళమునకు ఆశ్చర్యపడుచు, ఈ యెగువతట్టు ఒకపూదోట ఉన్నట్టున్నది. లేనిపక్షమున ఈవాసన యొక్కడనుండి వచ్చునని అటునిక్కిచూడగా విప్రనారాయణుల పువ్వుదోట యగపడెను. అంతట ఆయిరువురును ఆతోటలోనికిపోయి అందు పువ్వుచెట్లకు త్రవ్వటము పెట్టుచున్న విప్రనారాయణులనుజూచి బహువిధవిలాస చేష్టలుచేయుచు పరిహాసపు మాటలాడుచు నిలువగా చిలుకపలుకులచే చలింపని ప్రానివలె చలింపకయున్న విప్రనారాయణుల చిత్తస్థైర్యమునకు అరుదొందుచు, దేవదేవి తనతోడబుట్టువునుజూచి, అక్కా, ఇతడింత విరక్తుడై యున్నాడుగదా, ఈయనను ఆరునెలలోపల స్త్రీలోలునిగా జేయుదునా? అనెను. అందులకు అది యశక్యమని దానియక్క చెప్పెను. అట్లయిన నాత్రాణచూడుము అని తాను ధరించిన వస్త్రాభరణములను దానిచేతనిచ్చి యింటికిపంపి, విరక్తురాలైన వైష్ణవస్త్రీవలె కావివస్త్రము కట్టుకొని నొసట తిరుమణి తిరుచూర్ణము పెట్టుకొని మెల్ల మెల్లగా ఆయాళ్వార్ల దగ్గరకుబోయి సాగిలబడి దండములు సమర్పించి, అతిదీనురాలివలె మాయ యేడ్పులు ఏడ్చుచు, కన్నులనీళ్లు కార్చుచు మొగము వ్రేలవేసికొని నిలబడగా, కృపానిధియైన యాళ్వార్లు, నీవెవరు, ఇక్కడికేలవచ్చితివి, నీయేడ్పునకు కారణమేమి అని యడిగిరి.

అందుకు ఆవగలాడి స్వామీ ఏమిచెప్పుదును నాబ్రతుకు. నేను ఈ చేరువనుండు తిరుక్కరంబ నూరిలోనుండు వేశ్యను. నన్ను దేవదేవియందురు. లోకములో ఆడుపుట్టుకే దుఃఖభాజనము. అందును బోగముదిగా పుట్టినదాని దుఃఖము చెప్పవలెనా? ధనమిచ్చుపట్ల మనసునకు రోతపుట్టించునట్టి విటునినైనచే పట్టకపోరాదు. ధనమియ్యనిపట్ల ఎంతమోహనాంగునినైనను కూడగూడదు. ధనాశవదలిన ఏలకూడరాదన్న అందులకు తల్లియను ధనపిశాచి యొప్పక బాధించును. కనుక ఎన్నాళ్లు బ్రతికినబోగము దానిబ్రతుకు ఇంతేగదాయని విరక్తిపొందినదాననై, ఇల్లువాకిలివిడిచి, చుట్టపక్కములనురోసి యీవలవచ్చియు మునుపటియవస్థ తలచుకొన్న ఇట్లు దుఃఖము పొరలిపొరలి వచ్చుచున్నది. పరమభాగవతోత్తములయిన మిమ్ము సేవించి మీరు అనుగ్రహించిన కైంకర్యము చేసికొనుచు నిశ్చింతముగా జీవింపవచ్చునని యిచ్చటికి వచ్చితిని. అని విన్నవింపగా ఆళ్వార్లు దాని మాటలు విశ్వసించి తమతోటపనులకు అది తోడుపడునట్లు ఒప్పుకొని తాము తెచ్చుకొను మాధుకరాన్నములో కొంచెము దానికి నిచ్చుచునుండిరి. ఇట్లు ఒకసంవత్సరకాలము గడచినంతట దేవదేవి తన యత్నము ఫలింపకపోవుటకు పరితాపము నొందినదై ఒకనాడు తనలోతాను అయ్యో నేనేల యిటువంటిపనికి పూనుకొంటిని. నాసౌందర్యగర్వమే నన్ను మొక్కపరిచెను. రాతిపతిమకు చక్కిలిగింతలు అన్నట్టు ఈ వైరాగ్యనిధియైన భాగవతోత్తముని వలపింప తలంపుగొంటిని. ఎవరికిగాని గర్వము కొరగాదుగదా? అని యిట్లు తలపోయుచు ఆచింతచేత నాటిరాత్రి కంటికి నిద్రపట్టక చాలసేపు మేలుకొనియుండి వేకువజామున కొంచెము కన్నుమూయగా దానికలలో శ్రీరంగనాథుడు ప్రత్యక్షమై, రేపు నీకోరిక నెరవేరును. ఊరక విచారపడకుము అని యానతిచ్చెను. అంతట దేవదేవి మేలుకొని తనయందు రంగనాయకు

నపుగల కరుణకు సంతోషించుచు, రహస్యముగా తనయింటి నుండి కావలసిన వస్త్రాభరణములను తెప్పించి యొక పాదరింటిలో దాచియుంచి యెప్పటివలె నావిప్రనారాయణులతోగూడ తోటపనులుచేయుచు నాటిపగలు గడపెను.

అంతట సూర్యాస్తమయముకాగా దేవదేవి తాను ఇంట నుండి తెప్పించుకొన్న వస్త్రాభరణములను ధరించి సర్వాలంకారములుగలదై విప్రనారాయణులను వలపించు నుపాయము ఏదియగునోయని ఆలోచించుచుండెను. అప్పుడు ఈదరగాలితో మేఘములు ఆకాశమును ఆవరింపగా వానకురియ నారంభించెను. ఆవానకు చలిహెచ్చి గాలికి దేహము వణకుపట్టగా గడగడవడకుచు దేవదేవి విప్రనారాయణులు వసించు పర్ణశాలకెదుటనున్న యొకరావిమ్రానిక్రింద నిలువబడియుండెను. ఆసమయమునందు వానవెలియు జాడ యేమైనగలదోయని పర్ణశాల తలుపు తెరచి బయలు పారజూచి, ఎదుటరావి మ్రానిక్రిందమానిసి పొలకువ కానరాగా ఎవరక్కడ దేవదేవియాయనిరి. అందులకు అది గజగజవడకుచు ఔను అని ప్రత్యుత్తరము చెప్పెను. అప్పటి దానియునికియు, అది మాటలాడు రీతియు మనసున జాలిపుట్టింపగా ఆళ్వార్లు దానినిబిలిచి యీచలిలో వణకుచు ఆచెట్టుక్రింద పడియుండనేల? ఇటురమ్మని యానతిచ్చిరి. అంతట ఇన్నాళ్లకు దాసురాలియెడల కరుణపుట్టెనా? ఇదిగోవచ్చెద అని పర్ణశాల ప్రవేశింపగా, దాని యలంకారమునుజూచి విప్రనారాయణులు ఇదియేమి నేడు మంచివాసనగల పువ్వులుగందము వస్త్రాభరణములు మనసునకు ప్రియములుగాతోచినట్టున్నది. అని యడుగగా నేడైనను నాసింగారమునుజూచితిరే ఇంతేచాలును. ఇప్పటికి సంవత్సరకాలమాయెను మీపాదసేవకైవచ్చి ఇన్నాళ్లుగా ఒకనాడైనను నన్నుకన్నెత్తిచూచి, మనసుచల్లగా ఒకనవ్వునవ్వియెరుగుదురా? నేనేమి ఆడుపుట్టుకపుట్టలేదా? అందరివలె నా

కును పురుషాసక్తి లేకపోవునా! ఇకనైన ఊరకత్రోసి పుచ్చకుండ నన్ను ఏలుకొనుడు అని రెండుపాదములు గట్టిగా పట్టుకొనెను. పట్టుకొన్నమాత్రముచేతనే "పొలతిదావవహ్ని పురుషుడాజ్యఘటంబు, కరగకుండరాదు కదిసెనేని." అనుట సార్థకముగా మనసుమెత్తపడి దేహముగగుర్పొడువగా ఆళ్వార్లు ప్రాకృతలీలాసక్తులైరి. అది తెలిసి యావేశ్యయు తన నేర్పుమెరయరమించి మెప్పించెను. ఇట్లు దేవదేవి విప్రనారాయణులకు విషయాసక్తిబుట్టించి మరులుకొలిపి వారిని వెంటదీసికొని తన యింటికిపోయి తనయక్కతో నాడిన పంతము చెల్లించుకొనెను.

ఇట్లు స్త్రీలోలురై విప్రనారాయణులు దేవదేవితోడి వినోదములలో మునిగితేలుచు చిన్ననాటనుండి తాము చేయుచు వచ్చు భగవత్కైంకర్యమునందు ఆదరములేక వర్తించుచుండగా, దేవదేవితల్లి తమ కులాచారముచొప్పున ధనమియ్యనేరని విప్రనారాయణులను నిష్ఠురములాడి యిల్లువెడలగొట్టెను. అప్పటికి దానివిడిచిపోను మనసురాక ఆళ్వార్లు దానియింటి పంచయరగుపై పండుకొని విరహవేదనచే సంకటపడుచుండిరి. అది శ్రీరంగనాయకి తిరువుళ్లపట్టి శ్రీరంగనాథునితో ప్రాణనాథా మనకు నంతరంగభక్తుడైన విప్రనారాయణుని ఇట్లు ప్రాకృతసుఖాసక్తునిగాజేసి కడపట రెంటనుజెరిచి వేడుకచూచుట భక్తపరాధీనుడు అను బిరుదువహించిన మీకు ధర్మమా? సర్వమోహకమయిన మీమాయకు గురిగాదగినవాడు ఇతడేనా? చంద్రునందు వేడిమియు అగ్నియందు శైత్యమును కలుగనేరనట్లు మీభక్తులయందు దూష్యగుణమెట్లు పొందును? ఎట్లు చరియించినను వారు పావనులే గనుక ఇతనిరక్షింప జిత్తగింపుడు అని విన్నవింపగా, శ్రీరంగనాథుడు తన ప్రియురాలి విన్నపమునాదరించి, లోకములో తండ్రికంటె తల్లికి బిడ్డలయందు ప్రేమ మిక్కుటమగుట న్యాయమేకదా, నీవు చెప్పినట్లు నాదగువనమాలాంశమునందు

జనించిన విప్రనారాయణునిమనస్సున దుర్వికారము లేమియు నంట రాదు. ఇప్పుడు అంటను లేదు. ఇది యొకలీల సలుపదలచి యిట్లు నటింపజేసితిని. ఇంకను నొక వినోదముచూపెదజూడుము. అని యానతిచ్చి అప్పుడే యొక బ్రహ్మచారిరూపమునుపొంది తనకు మునుపు విభీషణుడు సమర్పించిన బంగారుగిన్నెలలో ఒకదానిని చేత బుచ్చుకొని తిరుక్కడంబనూరికి వేంచేసి ఆవేశ్యయింటి తలుపుతట్టి దానితల్లి యెవరక్కడనని అడుగగా నేను విప్రనారాయణుని శిష్యుడను. నాపేరు *రంగదాసుడు, మాగురువు ఈ బంగారుగిన్నెను నీకు ఇచ్చిరమ్మని చెప్పెను అనెను. బంగారు గిన్నె అనుమాట చెవినిపడగానే ఆబోగముది బిరబిరవచ్చి తలుపుతెరచి గిన్నెపుచ్చుకొని ఓరా ఈగిన్నెయెంత సొగసుగానున్నది. ఇటువంటిగిన్నె లోకములో ఎక్కడను లేదు. అని మెచ్చుకొనుచు, అబ్బీ! మీ అయ్యాగారెక్కడ? వారు ఇదియొకటి యిప్పుడు పంపవలెనా? వారికృపచేత మాకు ఎందునను కొరత లేదు. వారు సర్వదా ఒకరీతిని మాబిడ్డను గూడియుండక పోవుట యొకటే యిప్పుడు కొరత. నీవు శీఘ్రముగపోయి వారు ఎక్కడనున్నారో రమ్మనిచెప్పుము. వారువచ్చి యిల్లుచేరునంత వరకు మాబిడ్డ నిద్రాహారములు ఒల్లదు. అని ప్రీతిగలదానివలెనే మాటలాడు వృద్ధవేశ్య మాయమాటలకు తనలో నవ్వుకొనుచు, ఆబ్రహ్మచారి ఇదిగో మాఅయ్యగారిని పంపెదను అనిచెప్పి తల వాకిటికివచ్చి పంచతిన్నెమీదబడి విరహవేదనచే పొరలుచున్న విప్రనారాయణులనుజూచి, అయ్యా మిమ్మేమనవచ్చును? అరువదియేండ్లయిన అరులోమరులో అనునట్లు మతిదప్పిన ముసలి ముండమాటకు కోపించుకొని ప్రియురాలివలపైనదలపక యిటు రావచ్చునా? ఆమోహనాంగి నీపోబడిగానక ఎక్కడనున్నను

---

* గ్రంథాంతరమునందు కాంతోపయంత అని యున్నది.

ప్రియముచెప్పి పిలుచుకరమ్మని అనేకులను పంపగా వారు ఊరాద్యంతము నిన్ను వెదకుచున్నారు. నాభాగ్యము మంచిది గనుక నాకు ఇక్కడనే నీవు చిక్కితివి. ఇక ఆలస్యముచేయక లోపల పోయి నీప్రియురాలి పరితాపమును పోగొట్టుము అనెను. ఆమాటలకు వెరగుపడుచు ఔరా నాభాగ్యమ, అనుచు విప్రనారాయణులు తటాలునలేచి లోపలపోయి దేవదేవియు దానితల్లియు అప్పటికిదగిన ప్రియవాక్యములుచెప్పి యుపచరింపగా ఎప్పటివలె దానితోగూడి సుఖించిరి.

అంతట తెల్లవారగా శ్రీరంగనాథుని యారాధకులు ఆరాధనముచేయ సన్నిధికివచ్చి తిరుకాపులువుచ్చి పంచపాత్రలు శోధింపబోయి అందు ప్రధానమయిన బంగారుగిన్నెను గానక యచ్చటి పరిచారకులనెల్లను అడిగి యెవరివల్లను పోబడి తెలియక యాసమాచారము నచ్చటి యధికారులకు తెలియజేయగా, సన్నిధిలో సర్వదా మెలగుచున్న మీకన్నదొంగలు ఇందెవరు వచ్చెదరు అని వారు ఆనంబులను కావలిలోనుంచిరి. అప్పుడు దైవికముగా ఏమోపనిగలిగి యచ్చటికివచ్చిన వేశ్యయింటిదాసి, అయ్యో ఈపెద్దపెద్ద అయ్యగార్లను ఒకగిన్నెకోసమా ఇంత నిర్బంధపెట్టుచున్నారు. ఆగిన్నెయేపాటిది, అని కావలివారిని అడిగెను. కావలివారు ఏపాటి అయిన నీకేమి, బహుగిన్నెలు ఎరిగినదానవు, పోపొమ్మని గద్దించిపలికిరి. అందుకు అది, మా అక్కగిన్నెను పోలియుండునేమోయని అడిగితిని,అడిగినమాత్రానికేయింతగద్దింపులా అని గిరుక్కునమరలెను. అప్పుడా కావలివారు దానినిపోనీక అడ్డగించి, మీ అక్కగిన్నె యెటువంటిది? అది దానికి ఎట్లువచ్చినది. అని ఆగిన్నెయొక్క స్వరూపమును విశదముగా అడిగి తెలిసికొని, ఆవృత్తాంతము రాజునకు తెలియజేసి, ఆయనవలన ఉత్తరువు పుచ్చుకొనిపోయి, దేవదేవియిల్లు ముట్టడించి శోధించి గిన్నె అందుదొరకగా విప్రనారాయణ దేవదేవు

లతో గూడ తీసికొనిపోయి రాజుసమ్ముఖమునందు నిలిపిరి. రాజు వారి వృత్తాంతమంతయు విశదముగావిచారించి విప్రనారాయణులయందు నేరమునుమోపిశిక్షింప సిద్ధపడెను.

అప్పుడు భక్తపరాధీనుడయిన శ్రీరంగనాథుడు, తెల్లదామరలవలె తేటమీరిన విశాలనేత్రములును, నీలమేఘచ్ఛాయగలిగి నిగనిగలాడు తిరుమేనును, మెరపును తిరస్కరించి మెరయు బంగారుపచ్చడమును, కోటిసూర్యప్రకాశమానమై కన్నులకు మిరుమిట్లు గొలుపుచున్న సుదర్శనచక్రమును, ఏతట్టుచూచిన వెన్నెలలు వెదచల్లుచున్న పాంచజన్యశంఖమును, మరియునుగల ఖడ్గము గద శార్ఙ్గము మొదలగు నాయుధములును, గలిగి శ్రీరంగనాయకీయుం దాను గరుడవాహనారూఢుడై యచ్చటికి వేంచేసి, రాజును కటాక్షించి, నాగిన్నెకై యీభాగవతోత్తముని నీవు దండింప బనిలేదు. ఈయన కోరిక తీర్పగోరి నేనే బ్రహ్మచారినై యీగిన్నెతీసికొనిపోయి బోగముదానికిచ్చితిని. కనుక నేనే యీయనయని భావించి ఆబంగారుగిన్నె మరల దేవదేవికి ఇప్పింపుము. అని యానతిచ్చి యచ్చటివారందరు చూచునే యుండ శ్రీరంగనాథుడు విప్రనారాయణులయందు ప్రవేశించెను. అందులకు రాజు ఆశ్చర్యపడుచు ఆళ్వార్లకు పరమభక్తి పరుడయి దండములు సమర్పించి, తన పల్లకియందు వేంచేయింపజేసి దానిని తానే మోచుచును ఊరేగింపుచేసి వీడుకొలిపెను.

అంతట విప్రనారాయణులు ఎప్పటి వైరాగ్యమును వహించి, ఒక యేకాంతస్థానమునందు జేరి, నరమృగపశు పక్ష్యాదులయిన సప్తవిధప్రాణులలోపల మనుష్యుడు సర్వోత్కృష్టుడు. అట్టి మనుష్యజన్మము లభించుట మిక్కిలి దుర్లభమని పెద్దలు చెప్పుదురు. అందును గూని గ్రుడ్డి కుంటి చెవిటి అనునట్టి లోపములేవియు లేకుండుటయరుదు. అట్లు ఏలోపములేక పోయినను సప్త

ద్వీపములలోపల నత్యుత్తమంబయిన యీజంబూద్వీపమునందు సర్వవర్ణములలోను ప్రధానమయిన బ్రాహ్మణవర్ణమున జనించి, చదువరియు తెలివరియునైన వైష్ణవుడగుట మిక్కిలియరుదు. అట్లు సర్వథాదుర్లభమయిన యీజన్మము లభించియు శుద్ధమును, నిత్యమును, అమృతమునునైన భగవద్గుణానుభవముచే ప్రొద్దు పుచ్చుటమాని, అశుద్ధమును, అనిత్యమును, మృతప్రాయమునైన స్త్రీవిషయపు అల్పసౌఖ్యమనెడు అడుసులో దిగబడి అందుండి లేచు నుపాయము విచారింపక బంగారువంటి కాలమును వ్యర్థముగా గడపితినే, అని చింతించి, కడపట మైమరచి నేలకొరగగా, కృపానిధియు, జీవరక్షాపర తంత్రుడును, శ్రీవైకుంఠనివాసియు, సర్వలోక విభాసియునైన శ్రీమన్నారాయణుడు కరుణారసము తిరుముఖమండలమునుండి ప్రవాహరూపమున వెడలి సేవకబృందము సేవదేర్పగా గరుడారూఢుడయి వేంచేసి సేవసాదించెను. అంతట ఆళ్వార్లు వస్తుపడియున్న వానికి పరమాన్నము లభించినట్లు తమయేలినవాని సేవగానక పరితపించుచున్న తమకు శ్రియఃపతి సాక్షాత్కరించెనని పరమానంద భరితాంతఃకరణులై దేహముగగుర్పొడువగా, కన్నుల నానందబాష్పములు వరదలై ప్రవహింపగా చేతులు జోడించుకొని నిలువబడి, నాయేలినవాడా నీతిరువడినమ్మిన దాసుని ప్రాకృతసుఖమను బురదలోదిగ్రుక్కి వేడుకచూచుటయు దేవరకొక లీలయకాబోలు, ఇందులకు దాసుడు విన్నవింపగలదియేమున్నది. అనగా, శ్రీరంగశాయి భక్తాభీష్టదాయి గావున నా భాగవతశిఖామణి నాదరించి, ఓ వైరాగ్యనిధీ! నీవుచేయు పుష్పకైంకర్యమువలని ఫలము నిట్లు అనుభవింపజేసితిని. ఇంకను నీకు వలసినవి యేమైనను కోరుము ఇచ్చెదను అని యానతిచ్చెను. అందులకు పొంగుచు శ్రీవిప్రనారాయణులు ఓ యేలినవాడా దేవరకు దాసునియందు కృపచేసి వరమియ్యను మనసగునేని తొండ

రడిప్పొడి (భక్తాంఘ్రి రేణువు) అను పేరు ప్రసాదింపుము. అదియె నాకు పరమపదవి. అని ప్రార్థింపగా శ్రీరంగనాయకుడు అట్లే యనుగ్రహించెను. అంతట భక్తాంఘ్రి రేణువు నంబెరుమాళ్ల సన్నిధియందు "కావలిఱ్పులనై వైత్తు" అని యారంభించి తిరుమాలై (శ్రీమాలిక) అను ప్రబంధము నలువది పాశురములును; "కదిరవన్ గుణదిశై" అని ప్రారంభించి తిరుప్పళ్లియెళుచ్చి (ప్రాబోధకి) అను ప్రబంధము పదిపాశురములును శ్రుతిరహస్యార్థములనెల్లను ఇముడ్చి రచియించి సమర్పించి, యథాపూర్వముగా పుష్పకైంకర్యము చేయుచుండి కడపట కాలిన యినుముపైబడిన జలబిందువు విధమున శ్రీరంగనాథుని తిరుమేనునందు ఐక్యమును పొందిరి.

దేవదేవియు శ్రీరంగనాథుడు తనకిచ్చిన బంగారు గిన్నెతోడ తన సర్వస్వమును ఆపెరుమాళ్ల సన్నిధిలో సమర్పించి కృతార్థురాలాయెను.

ఇది శ్రీతొండరడిప్పొడి యాళ్వార్ల వైభవము.

---

శ్రీమతేరామానుజాయనమః.

## తిరుప్పాణాళ్వార్ల వైభవము.

కలియుగముపుట్టిన మున్నూటనలువది రెండుసంవత్సరములకు పిమ్మటిదైన దుర్మతినామసంవత్సర కార్తికబహుళ ద్వితీయాబుధ వాసరమునాడు రోహిణీ నక్షత్రమునందు, నిచుళాపురమను నామాంతరముగల ఉరయూరిలో బంగారైన పండునట్టి యొక బ్రాహ్మణుని క్షేత్రమునందు వరిగంటలో శ్రీవత్సాంశమైన తిరుప్పాణాళ్వార్లు అవతరించిరి. అట్లు అవతరించి శ్రీమన్నారాయణుని యనుగ్రహమువలన సూర్యోదయమైనట్లు

మహాతేజస్సుతో వెలుగుచుండగా, పూర్వజన్మ సంచితమైన
పాపలేశమువలన నీచమయిన పంచమ వర్ణమునందు జనించి
యథోచిత భగవద్భక్తివైరాగ్యములుగలిగి, మెలగుచున్న యొక
మాలదాసరి, తన పెండ్లామును తానును ఆవరిమళ్లదారిని తమ
వాడకుబోవుచు, తేజోమూర్తియై వెలుగుచున్న యాభాగవత
శిశువును కన్నులారజూచి, బిడ్డలులేక చింతించుచున్న తనకు
నిర్హేతుక కృపానిధియైన శ్రీమన్నారాయణుడు ఈబిడ్డను అను
గ్రహించెను అనుకొనుచు మేరలేని సంతోషముచేత దేహము
పరవశముకాగా రెండుచేతుల గ్రుచ్చియెత్తి రొమ్మునహత్తుకొని
తన పెండ్లాముచేతికిచ్చెను. ఆపుణ్యవతియు అందులకు అపారమైన
సంతోషమునుపొంది పదినెలలుమోచి కన్నబిడ్డనువలె ప్రేమ
మీర లాలించుచు అడ్డపావగా ఎత్తుకొని యింటికిపోయి, స్తన్య
పానము చేయింపబోగా ఆశిశువునోరు తెరవకపోయెను. అందు
లకు ఆదంపతులు ఆశ్చర్యపడుచు పరిశుద్ధమయిన ఆవుపాలు
తెప్పించి త్రాగింపగా త్రాగెను. అంతట వారు ఇదయే యీ
పాపనిబెంచు నుపాయము అని ప్రతిదినము పరిశుద్ధముగా పిదికి
తెచ్చిన ఆవుపాలుపోసి పెంచుకొనుచుండిరి.

ఆవిధముగా మాలదాసరియింట పెరుగుచున్న తిరుప్పా
ణాళ్వార్లు శ్రీమన్నారాయణుని యనుగ్రహమువలన లభించిన
జ్ఞానవిశేషముచేత పిన్ననాడే సర్వరహస్యములు నెరిగి, తల్లిక
డుపున నుండగానే భక్తిజ్ఞానవైరాగ్యములు వహించిన పరమ
భాగవతోత్తముడైన ప్రహ్లాదాళ్వార్లను తలపించుచు సర్వదా
వీణచేత బుచ్చుకొని భగన్నామసంకీర్తనము చేయుచు, క్రమ
ముగా కొన్నాళ్లకు మాలవాడయందలి యునికిమాని కావేరిదరి
జేరి, ప్రతిదినము వేకువజామున కావేరిలో నీరాడి శ్రీరంగనాథుని
విమానమున కెదురుగానిలిచి భగవద్గుణానుభవము చేయుచు, భగ
వంతుని లీలలుపాడుచు ప్రొద్దుపుచ్చుచుండిరి. ఆగానము అప్రా

కృతముకాబట్టి దేవలోకమునుండి గంధర్వులు అప్సరసలు మొదలగువారు విమానములెక్కివచ్చి ఆకాశమార్గమున బారులుగట్టి నిలిచి వినియానందించి, దేవమునియైన నారదునిగానము సయితము ఈగానమునుపోలియుండదని శ్లాఘించుచుందురు. భూలోకమునందు ఆగానమువిని జ్ఞానోదయముకాగా అంతకుముందు తమ్ము అంటియున్న దుఃఖము అను అడుసును పరమవైరాగ్యము అను పరిశుద్ధోకముచేతకడిగి ఆనందసాగరమునందు మునుగనివారులేరైరి. మరియు "పశుర్వేత్తి శిశుర్వేత్తి వేత్తిగానరసం ఫణిః" అను వచనము సార్థకముగా సర్పములు, మృగములు మొదలైనవికూడ ఆగానమునువిని హర్షించుచుండెను. శ్రీమన్నారాయణుడు పెరియపిరాట్టితోడ పెరియతిరువడి మూపున వేంచేసి శ్రీతిరుప్పాణాళ్వార్ల తిరుముడికి మీదుగా ఆకాశమార్గమునందు నిలిచి ఆగానమాధుర్యమును సర్వదా తిరువుళ్లపట్టుచుండెను. అట్టియెడ ఒకనాడు శ్రీరంగనాయకి పలినవాని తిరుముఖమండలమునందు చూపునిలిపి, స్వామీ! ఈపరమభాగవత శిఖామణి తన గానరసముచేత నామనసును కరగించుచున్నాడు. ఇది దేవరవారికిని అనుభవవేద్యమేకదా. ఇటువంటి భక్తశిరోమణిని వెలివాడనుంచి వేడుకచూచుట నాకు భావ్యముగా నుండలేదు. ఈయనను సన్నిధికి రప్పించి, చెవులుసోగియ మనసుతనియ సదా ఆగానసుఖమును అనుభవింప మక్కువ అగుచున్నది. అయ్యో, ఇటువంటి భాగవతునిగూడ చండాలత్వము పొందవచ్చునా, అని మందలింపగా, శ్రీపెరియపెరుమాళ్లు పిరాట్టివాక్కులకు నవ్వుకొనుచు, ప్రాణనాయకీ నీకు ఇంతవిచారపడనేల. ఇదిగో ఇప్పుడే నీప్రియభక్తుని నిచ్చటికి రప్పించెదను. అని యానతిచ్చి, అర్చకముఖమున అచ్చటి పరిచారకులకు కావేరిగట్టున రంగమునకు అభిముఖముగానిలిచి వీణాగానము చేయుచుండె

డు తిరుప్పాణుని మాలడను శంకమాని మా సన్నిధికి పిలుచుకొని రండు అని యాజ్ఞాపించెను. అంతట వారు వింతయు సంతోషమును తమ మనసులలో పెనగొనగా కావేరితీరమునకుపోయి అచ్చట భగవద్గుణానుభవము చేయుచు నిలువబడియున్న ఆళ్వార్లనుజూచి సేవించి, స్వామీ దేవరవారు కోవెలకు వేంచేయునట్లు పెరియపెరుమాళ్లు ఆజ్ఞ అయినది. జాగుచేయక వేంచేయుడు అని విన్నవింపగా ఆళ్వార్లు హరిహరీ అని చెవులుమూసికొని, అధికభయముతో గడగడవడకుచు మిక్కిలి యెడముగా బోయి సాగిలబడి దండము బెట్టి, ఓరా, బ్రహ్మాదిదేవతా ప్రభులకును పొందరాని శ్రీరంగనాథుని సన్నిధియెక్కడ, ఎల్లజాతులలోను నికృష్టమయిన చండాలజాతియందు బుట్టిన దాసుడెక్కడ. అని కోవెలకురాను సమ్మతింపకపోగా, వారువచ్చి ఆ వర్తమానము శ్రీరంగనాయకుని సన్నిధిలో విన్నవించిరి. అంతట శ్రీనంబెరుమాళ్లు బ్రాహ్మణాదివర్ణ విభాగమును ఆయావర్ణమునకు నుచితమైన ఆచారములును భాగవతేతరులకొరకు కల్పింపబడినవి కాబట్టి నాభక్తుడగువాడు ఏనీచకులమున జనించినవాడైనను సదాచార సంపత్తిగల యుత్తమ బ్రాహ్మణునితో తుల్యుడగును. ఈవిషయము ఆతిరుపాణునికి తెలిపి పిలుచుకొనిరండు అని మరల ఆజ్ఞాపించెను. ఆయాజ్ఞ శిరసావహించి యాపరిచారకులు మరల కావేరీతీరమునకుపోయి శ్రీరంగనాథుడు ఆనతిచ్చిన శ్రీసూక్తులు ఆళ్వార్లకు విన్నవించిరి. అందులకు ఆళ్వార్లు అట్టి భాగవతప్రపత్తి దాసునికిలేదు. అడియని నీవిధముగా ఆడించుట యొకలీలగా పెరియపెరుమాళ్లు తిరువుళ్లపట్టినట్లున్నది అని, సమ్మతింపకపోయిరి. పరిచారకులు మరల రంగమునకువచ్చి తాము పోయివచ్చిన వృత్తాంతమును సన్నిధిలో శ్రుతపరిచిరి. అంతట శ్రీరంగనాథుడు సన్నిధిలో తిరుమజ్జన కైంకర్యము చేయుచుండు సారంగమహామునికి స్వప్నములో సాక్షాత్కరించి మా

మంతరంగ భక్తుడగు తిరుప్పాణాళ్వార్లను నీబుజములమీద ఎక్కించుకొనివచ్చి మాసన్నిధిలో విడువుము అని ఆజ్ఞాపించెను.

ఆసారంగ మహాముని కలగని మేలుకొని అద్భుతానంద భక్తులు ముప్పిరిగొనగా శ్రీరంగములోని భాగవతోత్తములకెల్ల వారికిని ఆస్వప్నవృత్తాంతమును తెలియజేసి వారందరు పరివేష్టించిరాగా కావేరియావలిదరిని భగవన్నామసంకీర్తనముచేయుచున్న ఆళ్వార్లయొద్దకుబోయి, ఆయన తనకు భయభక్తివినయములు కనబడ సంభ్రమించుచు సాగిలబడి పెక్కుదండములు సమర్పించి, అపచారమపచారమనుచు దూరముగా తొలగిపోయి చేతులు జోడించుకొని నిలువబడగా సారంగమహాముని పెరియపెరుమాళ్ల యానతి చొప్పున చేరబోయి తొలగిపోనీక కవిసి పట్టుకొని, ఎంతప్రార్థించినను విడువక యెత్తి మూపుమీద కూర్చుండబెట్టుకొని, ఆళ్వార్లు, స్వామీ, రంగనాధా నాయేలినవాడా ఇది యేమిలీల అని దీనత్వముతో మొరపెట్టుకొనుచుండగా, శ్రీవైష్ణవగోష్ఠి పరివేష్టింపగా, శ్రీరంగక్షేత్రమునకు ప్రదక్షిణముగా వచ్చి కోవెలజొచ్చి శ్రీరంగనాథుని సన్నిధిలో డించెను. అప్పుడు ఆళ్వార్లు శ్రీపాదము మొదలు శిరస్సుపర్యంతమయిన శ్రీరంగేశుని తిరుమేను సేవించి, అఴగియమణవాళా అపచారములవలన బాపి అడియని నేలుకొనుము అనుచు పెక్కులు దండవత్ప్రణామములుచేసి నోరార దివ్యనామసంకీర్తనమును గావించి, అనంతరము "అమలనాదిప్పిరాన్" అని మొదలుపెట్టి శ్రీరంగనాథుని తాము సేవించిన యనుభవము తేటపడ పాదాదికేశపర్యంతమైన అఴగియమణవాళని అవయవముల వర్ణనాంశములను గూర్చి పదిపాశురములుగల ప్రబంధమొకటి రచియించి, ఆప్రబంధమును పెరియపెరుమాళ్లకును పిరాట్టికిని ఆనందము అతిశయింప పాడగా, పెరియపెరుమాళ్లు భక్తజన దురితాపనోదకమగు

శ్రీపాదమును ఆయాళ్వార్ల తిరుముడియందు జేర్చి, శ్రీసారంగ మహామునిచే వహింపబడిన కారణమువలన మునివాహనుడు అను నామమును వహింపుము అని యనుగ్రహించెను.

ఈలీలావిభూతియందీయాళ్వార్లు శ్రీమన్నారాయణుని నామసంకీర్తనారూప కైంకర్యముచే నానందింపజేయుచు ఇరువది సంవత్సరములకాలము వేంచేసియుండిరి.

తిరుప్పాణాళ్వార్ల వైభవము.

---

శ్రీమతే రామానుజాయ నమః.

## తిరుమంగయాళ్వార్ల వైభవము.

---

అమృతప్రాయమయిన కావేరిజలముల పారుదలచేత బంగారైనను పండునట్టి దివ్యక్షేత్రములుగల చోళదేశముతో చేరిన ఆవినాడు అనబరగిన దేశమునందు పూర్వసముద్రపు పడమటిగట్టునందు పూర్వము బిల్వాటవిలో ఘోరమైన తపస్సుచేసిన ప్రియురాలికి శ్రీమన్నారాయణుడు ప్రసన్నుడై పరిరంభసుఖము నొసగినందున పరిరంభ పట్టణమని పేర్కొనబడిన నగరమొకటి కలదు. దానికి సమీపమున తిరుక్కురయిల్లూరు (కమలాపూర్ణపురము) అను ఊరిలో కళ్లర్ అను శూద్రకులమున బుట్టిన నీలుడు అను పుణ్యాత్ముడొకడు కలడు. అతడు చోళరాజువలన నాదేశము నధికారమునుపొంది ఆవినాడుదయార్ అను పేరితో ధనధాన్యసమృద్ధియు గలిగి శైవమత ప్రవర్తనులలో ప్రధానుడై వర్తిల్లుచుండెను. అతనికి పూర్వపుణ్యవశమున శ్రీమన్నారాయణుని పంచాయుధములలోను ప్రధానమయిన శార్ఙ్గాంశమైన శ్రీతిరుమంగయాళ్వార్లు కలియుగమున మున్నూటతొంబది యేడెం

ష్ఠకు సమ్మతమైన నలనామసంవత్సర కార్తికశుక్లపూర్ణిమా గురువాసరమునాడు కృత్తికానక్షత్రమునందు దివ్యతేజోరాశియైన పుత్రుడై యుదయించిరి. అప్పుడు ఆవినాడుదయార్ తన కలిమికి తగినట్టు మహావైభవముతో పుత్రోత్సవము నడపి, ఆ పుత్రునికిని నీలుడు అని తనపేరే పెట్టి ప్రేమమీర పెంచుకొనుచుండెను. తిరుమంగయాళ్వార్లును నానాట వర్ధిల్లుచు ఏడవయేట విద్యాపరిశ్రమము చేయ నారంభించి తమపూర్వపుణ్యావశముచేత పదునొకండేండ్లు నిండునంతలో సమస్త శాస్త్రములు నేర్చి చతుర్విధకావ్యకల్పనా సమర్థులై పిమ్మట ధనుర్విద్యయందును ఆయుధపరిశ్రమమునందును పూర్ణులై పగవారి నెల్ల నదిమి పరకాలుడు అను పేరువహించి, దొరతనమునకువలయు తెలివియు వయసును గలవారై తండ్రికిని తక్కిన బంధుమిత్రులకును ఆహ్లాదము పుట్టించుచుండిరి. ఆకాలమునందు ఆవినాడుదయార్ మృతినొందగా చోళరాజు అతనికి మారుగా నాదేశమును పాలించుటకు తగినవారెవరైన కలరాయని విచారించి పరకాలుని శౌర్యము, ఔదార్యము, ధైర్యము, సాహసము మొదలుగాగల గుణవిశేషములను విని మెచ్చుకొని తత్క్షణమే యాయాధిపత్యమునిచ్చెను.

పరకాలుడును అట్లు దొరతనము రాగా కేవలము లౌక్యవ్యవహారములచేతనే కాలముగడపక, ఒకొ్కకప్పుడు, శ్రీమన్నారాయణుడే పరమదైవతము, ఆయన చరణారవిందములే తమకు ప్రాపకములు, ఆపరమపురుషుని దివ్యమంగళగుణానుభవమే సకలసుఖాస్పదమైన వ్యాపారము, ఆయేలినవానికి నివాసభూతమైన శ్రీవైకుంఠమే తమకు ప్రాప్యస్థానము అని విచారించుచుండును. ఒకొ్కకవేళ కేవలప్రాకృతునివలె విషయసుఖానుభవమునందు మునిగి తేలుచుండును.

అష్టేయొడ పరిరంభపట్టణమునకు దాపుననుండు తిరువాలి (నాగపట్టణము) లో ధవళపుష్కరిణి అనబడు కొలకునందు శ్రీమన్నారాయణుని యాజ్ఞచొప్పున ఒక తెల్లగలువలో ఒక కన్యక యవతరించెను. ఆపట్టణమునందు వాసముచేయుచు ప్రతి దినము వేకువజామున ఆసరస్సులో స్నానముచేసి వచ్చుచుండు నొక భాగవతోత్తముఁడు కుముదమునందు అవతరించిన ఆకన్యకనుజూచి హర్షించి తాను బిడ్డలులేనివాఁడైనందున తమకముతో ఎత్తుకొనిపోయి తనభార్యచేత ఇచ్చి పెంపుమని చెప్పెను. ఆకన్యకయు కుముదమునందు బుట్టిన కారణముచే కుముదవల్లియను పేరు వహించి శుక్లపక్ష చంద్రరేఖవలె దినదిన ప్రవర్ధమానయై వయఃపరిపాకమునుపొంది, నవమోహనాంగియగుచు ప్రతి దినము తెల్లవారిలేచి ధవళపుష్కరిణికిపోయి తీర్థమాడి అందలి తామరలు కలువలుకోసికొని, అచ్చట అర్చావతారమున వేంచేసియుండు శ్రీసుందరరాజ పెరుమాళ్లను అర్చించి సేవించి, భక్తియే యిట్లు మూర్తీభవించెనోయన భగవద్గుణానుభవము చేయుచు తిరుమాళిగకు వచ్చుచుండును.

ఆకాలమునందు తిరుక్కురయిల్లూరిలో ప్రభుత్వముచేయుచున్న పరకాలుఁడు ఏమోపనిగలిగి నాగపట్టణమునకుపోయి అచ్చటి వారివల్ల కుముదవల్లి చారిత్రమును విని ఆమెయందు మక్కువపడి తగినరాయబారులను పంపగా, ఆమెను పెంచిన భాగవతుఁడు అంతకుముందే పరకాలునిసౌందర్య విద్యావివేకములువిని ఆయనయందు మనసుపెట్టియున్న కుముదవల్లి యభిప్రాయమును తెలిసికొని, పరకాలుఁడు విడిసియున్న తావునకుపోయి తగిన మర్యాదలతో తమ తిరుమాళిగకు పిలుచుకొనివచ్చి, ఉచితాసనమునందు గూర్చుండబెట్టి, అయ్యా! మీకు మాబిడ్డయందువలె మాబిడ్డకును మీయందు మక్కువకలదు. అయినను అందులకు పెద్ద అడ్డంకి యొకటి కలిగియున్నది. అదియేమియనగా, మాకన్యక

స్వప్నమందైనను వైష్ణవులుకానివారిని కన్నెత్తి చూడనేరదు. నీవో శైవుడవు. అదిగాక మాకుముదవల్లి పిన్ననాడే నాతో నన్నమాట యొకటిగలదు. అదియు వినుము. "ఏపురుషుడు శంఖచక్రముద్రాధారియై ద్వాదశోర్ధ్వ పుండ్రములు ధరించి, శ్రీమదష్టాక్షరీ మంత్రమును జపించుచు భక్తియుక్తుడై ప్రతిదినము వేయింటికి శ్రీవైష్ణవులకు ఆరగింపుచేయించి, వారి శ్రీపాదతీర్థము పుచ్చుకొని, వారారగింపగా మిగిలిన ప్రసాదమును స్వీకరించునో అట్టి వరునకు నన్ను పెండ్లిచేయుము:" అని చెప్పియున్నది. నేనును అదియె ఓలిగాజేసికొని కన్యనియ్య దలచియున్నాను. నీవు పంచసంస్కారము చేకొని, ఇప్పుడు నేను చెప్పిన చొప్పున నడుచుకొనోపిన పక్షమున నీకోరిక కొనసాగుటకు అనుమానము లేదు. అనిభాగవతుడు నుండలింపగా, పరకాలుడుగారు అయ్యా! మీరానతిచ్చు మాటలు వెట్టికి చెరకునమలు మన్నట్టున్నది. ఎట్టి వెట్టివాడుగాని అందుకు సమ్మతింపకపోవునా? ఇంతేకాదు, నేను పూర్వజన్మసంచితమైన పాపలేశముచేత వైష్ణవేతరునింటబుట్టి యీవేషముతో నున్నానుగాని, నాచిత్తము సదా శ్రీమన్నారాయణ స్మరణముతప్ప వేరొకవృత్తి నెరుగదు. దానికి మెరుగుపెట్టినట్లు పంచసంస్కార శక్తనుడనై సుదర్శన పాంచజన్యాంకనాదులతో శ్రీవైష్ణవారాధనమును నడపుమార్గమును మీరుపదేశించితిరి. ఇది నాకు మేలేకదా! అని, అప్పుడే శైవమతచిహ్నములు సర్వము త్యజించి పంచసంస్కారము చేసికొని ద్వాదశోర్ధ్వపుండ్రధారియై తిరుమంత్రముజపించుచు భాగవతుని తిరుమాళిగచేరి, ఆయనయడిగిన ఓలియిచ్చి, అనగా సహస్ర వైష్ణవారాధనము దినముతప్పక చేయునట్లొప్పుకొని కుముదవల్లిని పెండ్లాడి 'తిరుమంగయాళ్వారు' అను తిరునామము చాటుకొని సహస్రవైష్ణవారాధనమునకు నారంభించిరి.

ఈవృత్తాంతము కర్ణాకర్ణిగా చోళరాజువిని నగరికి చెల్లింపవలసిన పగిదిపైకమంతయు వైష్ణవతదీయారాధనలకు వెచ్చపెట్టుచున్నారని యెంచి కొందరాప్తులను బిలిచి, పరకాలుడు తనమీద రాజొకడున్నాడు అను మాటలేక నగరిధనమంతయు స్వేచ్ఛగా వెచ్చించుచున్నట్టున్నది. మీరుపోయి ప్రతిసంవత్సరము పలినవానికి చెల్లింపవలసిన పైకము క్రమముగా చెల్లింపకున్నావు. ఇందువల్ల నీకు హానికలుగును. ఇంతటనైన నిలువబాకీ పైకము చెల్లించి గౌరవమును కాపాడుకో అని తెలియజెప్పి మనకురావలసిన ధనము రాబట్టుకొనిరండు అనిచెప్పి పంపెను. వారురాజు నాజ్ఞచొప్పున తిరుమంగయిల్లూరికివచ్చి పరకాలుని చర్యలెల్లను కన్నులారజూచి ఆయనధీరత్వమునకును శ్రీవైష్ణవకైంకర్యపరత్వమునకును మిక్కిలి యాశ్చర్యపడి బహువిధముల నయభయములుచూపి పైక మడుగగా, తిరుమంగయాళ్వార్లు అందులకు శంకింపక వారికితగిన యుత్తరమును చెప్పనివారైరి. అట్లు అవమానితులై వారుపోయి రాజునకు వారి చరిత్రమంతయు విశదపరిచిరి. అంతట రాజు మంచిమాటలచే కార్యము కొనసాగనేరదని నిశ్చయించి, ఒక దళవాయిని క్రూరులైన వీరభటులతో తిరుమంగయాళ్వార్లమీదికి పంపెను. అందులకును ఆళ్వార్లు శంకింపక యథోచితసేనలను గూర్చుకొని యెదిరించి పోరాడగా దళవాయి సరిపోరలేక తనసేనలతోగూడ వెరచి పారిపోయెను. ఆవృత్తాంతము రాజువిని, తొండముదిరి ఊసరవెల్లి యయ్యెనని యాగ్రహించి చతురంగబల సమేతుడై తానే దండువెడలివచ్చి పరకాలునితో తలపడిపోరాడి వైష్ణవతేజోవిరాజితులైన యాయాళ్వార్లధాటికి నిలువలేక పలాయనము నొందెను. అట్లు ఆళ్వార్లు జయశాలులయ్యు స్వామిద్రోహ పాతకశంకచే మరల రాజుతో సంధిచేయ గోరుచుండిరి. రాజును ఆమడదూరము పారిపోయి, అచ్చటనిలిచి, పరకాలుని ఎదిరించి

జయింప శక్యముకాదయ్యెను. అట్లని యూరక మరలినయెడ లోకమునం దపకీర్తియేగాక, ఇతరులగు నధికారులకును రాజు అను విషయమునందు అలక్ష్యముపుట్టును. అందువలన రాజ్యము చెడును అని విచారించి, తగిన తీర్పరులనుబంపి సంధిమాటలాడించి వంచించి యాతనివంచుకొనుట మంచిదని నిశ్చయించి, నేర్పరులగు తీర్పరులను కొందరిని పరకాలునితో సంధికై పంపెను. వారును తిరుక్కురయిల్లూరికివచ్చి తగుమాటలాడి పరకాలుని రాజున్నచోటికి పిలుకొనిపోయిరి. రాజు పరకాలునిజూచి తక్కిన మాటలేపియు నాడక ఈతనివలన మనకు రావలసిన పైకమును రాబట్టుకొని వదలుడు అని తనమంత్రుల కాజ్ఞాపించి తన రాజధానికిపోయెను. అంతట మంత్రులు పైకమునకై నిర్బంధింపగా తిరుమంగయాళ్వార్లు ధనమువచ్చు మార్గము గానకయు, వైష్ణవారాధనమునకు అంతరాయము కలుగుటచే సాపాటుచేయ సరిపడకయు ఏమిచేయుదమని విచారగ్రస్తులై పస్తుపడియుండిరి. అప్పుడు భక్తరక్షకుడైన పేరరుళాళప్పెరుమాళ్లు (వరదరాజస్వామి) ఆళ్వార్ల స్వప్నములో సేవసాదించి, పరకాలా! అప్పుపైబడెనన్న విచారము నీకు అక్కరలేదు. శ్రీవైష్ణవ కైంకర్యమునకు లోపమునురాదు. నీవు రేపుతెల్లవారి మాయునికి పట్టయిన కాంచీపట్టణమునకు వచ్చితివేని నీకు కావలసిన ధనమిచ్చెదము అని యానతిచ్చెను. అట్లు ఆళ్వార్లు కలగని మేలుకొని నాయేలినవాని కృపకలిగియుండ ఇంతమాత్రమునకు చింతింపనేలయని ధైర్యమును, పేరరుళాళని యనుగ్రహము నాపైనింత యొప్పియుండునాయని యాశ్చర్యమును వహించినవారై లేచి మంత్రులనుజూచి, ఊరక ఇచ్చటపడి మిడుకుచున్న నేమి ఫలము. మీరు నాతోగూడ ఇప్పుడే బయలుదేరి తిరుక్కచ్చికి రండు. మాపితురార్జితమయిన ధనము అపారముగ నచ్చటనున్నదిగాన మీయప్పు నిశ్శేషముగా తీర్చివేసెదను అనెను. అందు

లకు వారు ఒప్పుకొని తమవెంట కంచికిరాగా, ఆళ్వార్లు శ్రీకరిగిరివరముని సన్నిధికి వేంచేసి భక్తిపురస్సరముగా ధ్యానించి సేవించి స్వామీ దేవరయాజ్ఞచొప్పున వచ్చితిని, ఇక అప్పుతీర్చి అడియని కృతార్థుని గావింపవలసిన భారము దేవరదేయని విన్నవించి, ఆపరమపురుషుడు నీవు నీయప్పులవారితోగూడ వేగవతీతీరమునకుపోయి యుండుము పేరరుళాళదాసుడను రెడ్డినై వచ్చి నీకు ధనమిచ్చెదను అనియానతియ్యగా ఆళ్వార్లును అప్పులవారును వేగవతిగట్టున పోయియుండిరి. అప్పుడు పేరరుళాళదాసుడు అచ్చటికివచ్చి రాజునకు చెల్లింపవలసిన పైకమును మంత్రుల పరముగా చెల్లించి, వైష్ణవగోష్ఠీ తదీయారాధనకు వలసినంతధనమును కొనిపొమ్మని ఆళ్వారులకును ఇచ్చిపోయెను. అంతట శ్రీపరకాలురు మహోత్సాహముతో తమయూరికి వచ్చి కుముదవల్లియు దామును మనసువచ్చినట్టు భగవద్భాగవత కైంకర్యములు నడపుచు సుఖముండిరి.

అక్కడ చోళరాజు పరకాలుని చరిత్రమంతయు మంత్రుల వలన సవిస్తరముగావిని, అయ్యో ఇటువంటి భగవద్భక్తుని మంచి చెబ్బర విచారింపక కేవలద్రవ్యపరుడనై నిర్బంధించితినే నావంటి పామరుడెక్కడనైనగలడా అని చాల నొచ్చుకొని తత్క్షణమే పరకాలుని రప్పించి, తగినసన్మానముచేసి అపరాధక్షమాపణము చేసికొని, అయ్యో! నీమహిమ తెలియక యింతచేసితిని. అది మనసున పెట్టుకొనక యెప్పటి నీయధికారము వహించి వైష్ణవ సహస్రారాధనము చేయుచు సుఖముండుము అని పంపెను. శ్రీవరదరాజస్వామియు తన సేవకుడైన యాళ్వార్ల ఋణము తీరెననిపించి మరునాడే యాధనమంతయు నపహరించుకొనెను. రాజు బొక్కసములోని ధనమంతయు వేసినతాళాలువేసినట్టే యుండగా మాయమైనదిచూచి, తన మంత్రులతో "పరకాలుడు పరమసాత్వికుడు, అధర్మభీరువు, భాగవతకైంకర్య

పరుడు అని నమ్మి మరల చేరబట్టితిమి. పట్టి విచారింప అతడు ఋణశుద్ధి కాగోరినవానివలె ఏమేమోటక్కులుచేసి తానియ్యవలసిన ధనమంతయు నిచ్చినట్టు మాయపన్నించెను. కాకున్న నిప్పుడాపదార్థము ఏమియు లేక మాయము కానేల? ఇట్టిజాలకాని నెన్నడును నమ్మరాదు. కాబట్టి మనసీమ మనముకట్టుకొని అతని నెక్కడికైన పొమ్మనుట మంచిది" అని చెప్పగా, వారు అది యెప్పుడు ఒనగూడునోయని ఎదురుచూచుచున్నవారు అగుట బట్టి ఆదేసరియని యట్లుకావించిరి.

*అంతట ఆళ్వార్లు చింతాక్రాంతులై కుముదవల్లినిజూచి, ప్రాణనాయకీ! మనము వైష్ణవారాధనకు ప్రారంభించిన దినము మొదలు నేటిదాక వేయింటికి వైష్ణవులకు నారగింపుచేయక సాపడియెరుగము. ఇట్లు మనము ప్రవర్తించుటనుజూచి యోర్వజాలక రాజు ఇచ్చిన సీమను మరల అపహరించుకొన్నాడు. ఎట్లయిన వ్రతము చెరుచుకోరాదుగదా? మరల రాజును ఆశ్రయింతమన్న అతడు ఇక నన్ను అంగీకరింపడు. నేనును ఆతామసుని ఆశ్రయింపనుజాలను. తామసద్రవ్యము సాత్వికారాధనమునకు అర్హమునుకాదు. కాబట్టి పూర్వము పరవాసుదేవుడు తన్నుగూర్చిచేయు పాపకృత్యమును పుణ్యఫలమునిచ్చును అని

---

* ఈఘట్టమునందు ఆళ్వార్లు ద్రవ్యాభావముచే వైష్ణవారాధనము చేయక తమ తిరుమాళిగకు రాగా కుముదవల్లి తలుపుమూసి, శ్రీవైష్ణవులకు ఆరగింపుచేయక మీరు ఈయింటిలోపల రాగూడదు. ధనములేని పక్షమున దారులుకట్టిదోచియైన ధనము ఆర్జించి తదీయారాధనము నడపియే నాయొద్దకు రావలసినదని నిర్బంధపెట్టగా, ఆళ్వార్లు అందులకు దగిన పరిజనులను గూర్చుకొని దారులడ్డగించి దోచ నారంభించిరని మాతృకలో నున్నది. అయినను అది యుత్తమస్త్రీ లక్షణముకాదు గనుకను ప్రపన్నామృతము మొదలగు మూలగ్రంథములందట్లులేదు గనుకను ఆమూలగ్రంథానుసారముగానే ఇందు వ్రాయబడెను.

సాధించిన శ్రీసూక్తి ననుసరించి, నేనిక తదీయారాధనమునకై దొంగిలించి సొమ్ముగడింప యత్నించెద. అని పలికి తిరుమంగ యాళ్వార్లు చోరవృత్తియందు దృఢనిశ్చయులై అందులకు వలయు సాధనములెల్ల సమకూర్చుకొని, కమలాపూర్ణపురము విడిచి, ఒక మహారణ్యము ఉనికిపట్టుగా జేసికొని అర్ధరాత్రమునందు బయలుదేరి పట్టణములు గ్రామములు పల్లెలు మొదలగు వానియందు ప్రవేశించి వైష్ణవులుగాని ధనవంతులయిండ్లు కన్నము వేసి దోచుచు అనుదినము వైష్ణవార్చన క్రమముగా నడపుచు కొన్ని దినములు గడపి, ఒకనాటిరాత్రి నలుదిక్కులను మబ్బు దట్టముగా కమ్ముకొనగా కన్ను పొడుచుకొన్నను కానరాని చీకటిలో ఒకవైష్ణవుల తిరుమాళిగకుపోయి లోపల దూరుటకు సమయము చూచుచు పంచలో తడికచాటున నిలువబడియుండి, ఆ వైష్ణవునిభార్య పెనిమిటియారగించిన బంగారు పళ్లెమును బయటికి తెచ్చి తోలుచుచుండగా తళతళలాడుచున్న యాపాత్రను అచ్చట పొంచియున్న తిరుమంగయాళ్వార్లుబడిసి పుచ్చుకొనెను. అందులకు ఆయిల్లాలు అదిరి 'అస్మద్గురుభ్యోనమః' అనుచు లోపలికిపోయి ఆసమాచారమును భర్తతో చెప్పెను. అదివిని యావైష్ణవోత్తముడు మనసొత్తు సద్వినియోగమాయెను. అందుకై విచారపడకుము. పళ్లెమును ఒడిసి పుచ్చుకొన్నవాడు పరకాలుడుగాని యితరుడుగాడు. ఆయన యీవిధముగా కటికి చీకటిలో కరచుపామును కొట్టుదయ్యమును ఎరుగక శ్రమపడి ధనమార్జించి శ్రీవైష్ణవారాధనము చేయుచుండును. తిరుమణి ధరించినవారి సొత్తన్న చేతముట్టడు కాబట్టి సందడి చేయకుము. సందడిచేసితివేని శ్రీవైష్ణవ కైంకర్యమునకు భంగముచేసిన దానవగుదువు అని చెప్పెను. ఈమాటలు ఆళ్వార్లువిని అపచారము అపచారము అనుచు తత్తరపడుచు ఆవైష్ణవుని యెదుటికిపోయి ఆయనపాదములపైబడి, స్వామీ! ఇది వైష్ణవుల తిరుమాళిగయని

తెలియకవచ్చితిని. ఈయపరాధమును క్షమింపుఁడు అని క్షమాపణచేసికొని, ఆవైష్ణవుఁడు హరిహరీయని తత్తరపడుచు వేచి ప్రతివందనములుచేయఁగా తగిన యుపచారోక్తులు పలికి ఆయన యనుజ్ఞ పుచ్చుకొని యునికిపట్టువచ్చి చేరిరి. ఇట్లు చౌర్యంబునను వైష్ణవద్రోహంబునకు జొరక నిత్యకైంకర్యమునడపుచు నానాట పెచ్చుపెరిగి తగినమందిని గూర్చుకొని దారులడ్డగించి దోఁచిదోఁచి లభించిన పదార్థంబంతయు వైష్ణవారాధనంబున వెచ్చించుచు కుముదవల్లికి ప్రియము పుట్ట తిరుమంగయాళ్వార్లు కాలము గడపుచుండిరి.

ఇట్లు భాగవతకామధేనువై వర్తిల్లుచున్న తిరుమంగయాళ్వార్ల కైంకర్యనిష్ఠకు దివ్యచిత్తమున మెప్పుజనింపఁగా శ్రీరంగనాథుఁడు వారిని కృతార్థులనుగాఁజేయఁగోరి, ఒకనాఁడు ఎక్కడను ఎవ్వరును దోపుడుకు దొరకకుండ మాయగావించి, శ్రీరంగనాయకియు దానును పెండ్లికొమార్తయు పెండ్లికొడుకునై వెలలేని రత్నాభరణములను ధరించి, బ్రహ్మపురోహితుఁడును విష్వక్సేనాది నిత్యసూరులతోడ ఇంద్రాదిదేవతలు పెండ్లివారునై వెంటరాఁగా సజ్జమైన వైనతేయాళ్వార్లపై నెక్కి తిరుమంగయాళ్వార్లు అడ్డకట్టుకొనియున్న యడవిమార్గమున నడవసాగెను.

అప్పుడు నేఁడు మూఁడుజాములు రావచ్చియు బాటసారి యొకఁడైన చిక్కినవాఁడుకాఁడు. పట్టణములు మొదలగుచోట్ల కన్నమువేసి దోఁచుటయందు సత్తలేక యీపనికి తలపడినందుకు ఇదియు నిట్లయ్యెను. నేటికైంకర్యమునకు మార్గమేమి అని చింతించి, అక్కడ మిక్కిలి పొడుగుగా పెరిగియున్న రావిమ్రానిపై నెక్కి నాలుగుదిక్కులు పారఁజూచునపుడు ఆరావిమ్రాని కెదుట వచ్చుచున్న పెండ్లివారి మూఁక కనఁబడెను. అంతట ఆళ్వార్లు అత్యంతము సంతోషించినవారై చెట్టునుండిదిగి ఈలలు వేయుట

మొదలగు సైగలచేత అంతటంతట నక్కియున్న పరిజనుల నెల్ల వారి నాక్రమింపబంపి తాము అట్టహాసముచేయుచు వారిని అడ్డగించి వారు ధరించిన వస్త్రాభరణములతోడ సర్వస్వమును దోచుకొని కడపట పెండ్లికొడుకైన రంగనాథుని వ్రేలియుంగర మొకటి బిగిసి ఊడదీయ రాకపోగా, దివ్యమైన యీయుంగరమును విడిచిపెట్టరాదు. ఒకవైష్ణవుని వ్రేలికైననౌను. అని ఆ వ్రేలునలిపినలిపి యూడదీయ ప్రయత్నించి, ఎట్టును అదిరాకపోగా ఆగ్రహించి కటుకుక్కన వ్రేలు త్రెగకొరికి ఉంగరమును పుచ్చుకొనిరి. అప్పుడు శ్రీరంగనాథుడు తత్సమయోచితమయిన ద్రావిడభాషతో 'కలియనో' అని పలికెను. అది కారణముగా తిరుమంగయాళ్వార్లకు కలివైరియను నామాంతరము కలిగెను. అట్లు దోచిన పరకాలుడు ఆదోపుడు పదార్థముల నెల్లను ఒక పెట్టెలోనుంచి బీగముద్రచేసి ఎత్తుకొనిపోబోగా అది కదలింప రాకపోయెను. అందులకు ఆళ్వార్లు కోపించుకొని, పురోహితవేషముతో ఎదుట నిలుచున్న బ్రహ్మనుజూచి, బాపడా పెట్టెకదలకుండ మంత్రించితివో, ఈమంత్రములకు నేను బెదరువాడను గాను, మరల పెట్టె తేలికయై యెత్తననువుపడునట్లు మంత్రించితివా మంత్రించు, లేనిపక్షమున ఈకత్తితో నీతల తెగనరకెదను అని కత్తిదూసికొని మీదికిచుమికిరి. అందుకు అతడు గడగడలాడుచు, అయ్యా! నేను మంత్రాలు ఎరుగను తంత్రాలు ఎరుగను. ఈమాయలన్నియు చేసినవాడు ఆ పెండ్లికొడుకే. నీవేమిచేసినను అతనినిజేయుము. నీకు లాభముగలుగును. అనెను. ఆమాటవిని పరకాలుడు పెండ్లికొడుకుతట్టుతిరిగి యట్టహాసము చేయగా, ఆమాయకాడు, అయ్యా దీనికై నీకింతకోపమేల ? వలయునేని నీకు ఆమంత్రము నుపదేశించెదను. ఇటురమ్ము, అని చేరబిలిచి సర్వలోక శుభంకరమయిన కరకమలమును వారిశిరముజేర్చి, శ్రీమదష్టాక్షర మహామంత్రమును సరహస్యముగనుప

దేశించెను. ఇట్లు శ్రీరంగధాముడు తిరుమంగయాళ్వార్లకు తిరుమంత్ర నుపదేశించి, తత్క్షణమే ఆమంత్రముచే ప్రతిపాదింపబడిన దివ్యరూపమునుధరించి సేనముదలియారు మొదలగు నిత్యసూరులును, బ్రహ్మాదిదేవతలును సేవింపగా పెరియపిరాట్టితోడ శ్రీవైనతేయాళ్వార్లమీద వేంచేసి సేవసాదించెను. ఆళ్వార్లును సుదర్శన పాంచజన్య కౌమోదకీనందక శార్ఙ్గనామక పంచాయుధ పరిశోభితమును, దివ్యమణిమయ మంజీర మేఖలో దరబంధ తారహార కేయూర కంకణాంగుళీయక మకరకుండల కిరీటాది భూషణ భూషితమును, నీలమేఘసన్నిహిత విద్యుల్లతాయమాన రమారమణీ సమేతమును, మేరుశిఖరోపమిత సుపర్ణవాహనారూఢమును బ్రహ్మరుద్రాది నిఖిలదేవతాపరిషత్సేవ్యమానమును, విష్వక్సేనపరాంకుశాది నిత్యసూరి పరివార పరివృతమును నైన శ్రీపరవాసుదేవుని దివ్యరూపమును నేత్రోత్సవముగ సేవించి, కన్నుల నానందబాష్పములు జడిగొనికురియ, మేనపులకాంకురములు నిండుకొన నేలసాగిలబడి పునఃపునః ప్రణామములు ఆచరించి, డగ్గుత్తికపడి నోటమాట వెడలకున్నను బ్రయత్నమున నెలుగు దెచ్చుకొని, ఓభక్తవత్సలా! దాసుని కడతేర్పదలచి శ్రీ పెరియపిరాట్టితోడ వేంచేసిన నాయేలినవాడవైన నిన్ను నెఱుగలేక సామాన్యమనుష్యుడని తలచి మహాపరాధినైతినిగదా? పెండ్లికూతురైన మాయమ్మను నిలువబెట్టి తిరుమేననున్న దివ్యాభరణములన్ని యొలిపింప తెగించితిని. దేవతలకైన సేవింప లభింపని దివ్యసుందర విగ్రహుడైన నాయేలినవాని నిన్ను కత్తియెత్తి నరకసాహసించితిని. లోకములకెల్ల నభయప్రదానముచేసి వాసిగాంచిన పరిశుద్ధహస్తమును చౌర్యపంకమయమయిన యీపాడుచేతితో ఒడిసిపట్టి పాచికంపుతోడి నోటితోకరచి యెంగిలి చేసితిని. ఇట్టి మహాపాతకుడనైన నేను నీదాసవర్గముతోడి కూ

డికను ఎట్లు పాత్రుడనగుదును. అని తాముచేసిన యవజ్ఞ లెల్ల తలచి తలచి ప్రలాపింపనారంభింపగా, శ్రీరంగధాముడు కారుణ్య రసము చిలుక చల్లగ గటాక్షించి, పరకాలా! నీకు వెరవనేల ? మాయెడ నీవు నడపినవెల్ల ఉపచారములుగాని అపచారములు గావు. నీకుగల వైష్ణవభక్తియు మాకు నీయందు వాత్సల్యమును ఎల్ల వారికి వెల్లడిగావలసి మేము కావించిన లీలగాని యిది వేరు కాదు. నేటితో నీవాచరించు వైష్ణవసహస్రారాధనవ్రతము పరి సమాప్తి నొందెననుకో. అంచుల ఫలమును హస్తగతమాయెను. ఇక మా రంగధామమునకువచ్చి యచ్చట మాకు సప్తప్రాకార సహితమైన కోవెలకట్టింప యత్నింపుము. మరియు వాస్తవా ర్థము తెలియక నానామతములందు ప్రవేశించి కాళిదుర్గ మొద లుగాగల చిల్లరదేవతలనెల్ల గొలుచుచు సద్గతిగానక యలయు నాత్మలకు నిత్యవస్తువును ప్రాపింప పట్టుగొమ్మయగు విశిష్టా ద్వైత సిద్ధాంతమును ప్రకటించి, మావిషయమయి ద్రావిడభా షలో ఆశుమధురచిత్రవిస్తారరూపములయిన చతుర్విధ రచనల చేతను శ్రుత్యర్థ ప్రతిపాదకములయిన ప్రబంధములను రచియించి, కుముదవల్లితోడగూడి వివిధక్రీడల వినోదించుచు కొంతకాలము గడపి, కడపట మాదైన పరమపదమునందు వసింపరమ్ము అని యానతిచ్చి యంతర్ధానము నొందెను.

అంతట తిరుమంగయాళ్వార్లు ఆపరమధాముని దివ్య సేవ నేతలచుచు, అట్టి దివ్యమంగళవిగ్రహము నింకొకతూరి సేవింప లభించినగదా మేలగుననుచు శ్రీరంగమునకు వేంచేసి, ఆపరమ పురుషుడానతిచ్చినట్లు వేదాంతార్థ ప్రతిపాదకములైన దివ్య ప్రబంధములను ఆరింటిని రచియించి సమర్పించి, అందుండి నాగ పట్టణమునకువచ్చి శ్రీకుముదవల్లీ సమేతముగ దివ్యదేశయాత్ర వెడలి, ఆయా దివ్యదేశములందు వేంచేసియుండు శ్రీమన్నారా యణుని యర్చావతారములను సేవించి, మరల శ్రీరంగధామ

మునకువచ్చి కోవెలకైంకర్యమునకు సంకల్పించుకొని, తమకు ముఖ్య కింకరులయిన తాళూదువాన్, (తాళాలువీడిపడ నూదు వాడు.) నీర్మేల్ నడప్పాన్, (నీళ్లమీద నడచువాడు.) నిళలిల్ మరైవాన్, (నీడలోదాగువాడు.) తోరావళక్కన్ (ఓడిపోక జగడమాడువాడు.) అనువారిని పిలువనంపి * తమ సంకల్పము తెలియపరిచి, ఇందులకువలయు ధనమును ఆర్జించు నుపాయము

---

* ఈఘట్టమునందుండు గ్రంథాంతరములోని విశేషకథ.

అట్లు శ్రీరంగనాథుని యనుగ్రహమువడసిన తిరుమంగయాళ్వార్లు దివ్యదేశయాత్రచేయు తలపున శ్రీవేంకటాచలము కరిగిరి మొదలుగాగల నూటయెనిమిది దివ్యతిరుపతులను సేవించి శ్రీరంగమునకువచ్చి శ్రీరంగథాముని కోవెలకైంకర్యమునడప సంకల్పముచేసి, మూడు ప్రాకారములును పాకశాలయుగట్టించి, నాలుగవ ప్రాకారము జలాంతమును శిలాంతమునుగా స్థలశుద్ధిచేసి రాళ్లతోగట్టింప యత్నించి చుట్టునేల త్రవ్వించుచుండగా ఆభూమిలో ఒకచోట ఒకయోగీశ్వరుడు సమాధినిష్ఠుడై కూర్చుండియుండెను. అప్పుడు పరకాలుడు మనము చేయబూనిన కైంకర్యమునకు భంగముగా ఈయోగి యెక్కడనుండి వచ్చెను. ఈ మహాత్ముని నిచ్చటనుండి లేపునుపాయమేది? అని తలపోసి, వినయ భయభక్తులు ముప్పిరిగొనగా ఆమహాయోగి చేరువకుపోయి, మహాపురుషా మీరీ మట్టిలో పూడుకొని యిట్లుండుటకు కారణమేమి? దాసుడు వినదగునేని యానతిండు. అని యడుగగా, ఆయోగి తనయోగదృష్టిచే పరకాలుని మహిమయంతయు దెలిసికొని లేచి దండముసమర్పించి, భాగవతోత్తమా! నేనీ భూమండలమున గల దివ్యతిరుపతులెల్ల సేవించుచు నిచ్చటికివచ్చి శ్రీరంగనాథుని సేవించి, ఇందుండి యావలపోను మనసురాక యోగనిష్ఠబూని యిట్లున్నాను. అనగా విని ఆళ్వార్లు, స్వామీ దేవరవారు హిమపత్పర్వత గుహాయందు వేంచేసియుండు అష్టభుజ శ్రీనారసింహుని సేవించితిరా? ఆనారసింహుడు తన్నుసేవించు భక్తులతో మాటలాడుచుండును. అని చెప్పిరి. అట్లయిననా నావురుషసింహుని సేవింప బోయెదనని యోగీశ్వరుడు అందుండి లేచి పోయెను. అంతట, కలివైరి నిరంతరాయముగా నా ప్రాకారమును కట్టించి,

నాకు దెలుపుడని యడుగగా వారు నాగపట్టణమునందలి ప్రసిద్ధ బుద్ధాలయములో బంగారు ప్రతిమలున్నవి. వానిని గొనివచ్చితి మేని మనకైంకర్యము కొరతపడక నెరవేరును. అందులకువలయు ప్రయత్నముచేయ తిరువుళ్లపట్టుడు అని మందలించిరి. అంతట వారిని వెంటదీసికొని నాగపట్టణమునకుపోయి ఎవరికిని లోపల

---

అంతలో మునుపు కట్టించిన మూడవప్రాకారము ఖిలమయి పోయినది చూచి, ఇకసర్వము రాళ్లతోనే కట్టింపవలసినదని నిశ్చయించి, ఖిలమైన దానినంతయు నిడియగొట్టి కట్టింపవలెనన్న ధనము అపారము కావలెనని చింతించి, తమప్రియభటులైన దొంగలనెల్ల రావించి యింతులకేమి యుపాయమని యడుగగా భటులు చెప్పుచున్నారు. స్వామీ! దేవరవారు సాకగావర్ధిల్లిన యీభటులలో దొంగతనమునందు నేర్పుచాలనివాడు ఒక్కడునులేడు. అయినను సీమలవెంటదిరిగి దొంగిలించి తెచ్చునప్పుడు చిరకాలమునకుగాని విశేషధనముకూడదు. అట్లుగాక విశేషధనము కూడుటకు ఒక యుపాయమున్నదిగాని యది యసాధ్యము. అదియేమి యందురేని, పూర్వకాలమునందు నాగపట్టణములోని జైనులు తమకులగురువైన బుద్ధుని ప్రతిమను కుందనముకరగి పోయించి, దాని పరులు అపహరింతురనుతలపున అభేద్యమయిన గుడియొకటి కట్టించి అందుంచి యున్నారు. అది మనకులభించినయెడ కైంకర్యము కొరతపడక నెరవేరును అనగా నామాటలకు కలివైరి చాలహర్షించి మంచిదని వారును తామును జైనవేషములతో నాగపట్టణమునకుపోయి ఆబుద్ధాలయము ప్రవేశించి, దాని కట్టడపు బాగునకు నాశ్చర్యపడుచు మూలమూలజూచి తెలిసికోవలసిన మర్మములన్ని తెలిసికొని, ఎటుచూచినను భేదింపరాక ఒకరాతితోనే నిర్మించినదానివలె గనబడుచు వెలుతురుకొరకు చేయబడిన చిన్నచిన్నరంధ్రములవలని వెలుతురుచేత దగదగవెలుగుచున్న కుందనపు ప్రతిమనుజూచి బయటవచ్చి, దీనిగట్టినశిల్పివలనగాని దీనిమర్మమెరుగరాదని యూహించి, ఆశిల్పి ద్వీపాంతరమునందుండువాడనియు, ఆద్వీపము వలానిదనియు తెలిసికొని తమవారినెల్లను అక్కడనెనిలిపి తామొక్కరే యోడబేరగాండ్రతోడ ఆద్వీపమునకుపోయి, అచ్చటి శిల్పులెల్లవినుచుండ అప్పుడప్పుడు నాగపట్టణమునందుండు బుద్ధాలయములో దొంగలుచొరబడి యుండున్న

చోరరాకుండ తిరుగుచున్న చక్రమును తిరుగకుండ నిలిపివేసి, బుద్ధులగుడిచొచ్చి అందలి స్వర్ణవిగ్రహముల నన్నిటిని ఎత్తుకొని శ్రీరంగమునకువచ్చి, వాని గరగించివిక్రయించి అందువలన లభించినధనముచే సప్తప్రాకారములతోడ కోవెల గట్టించి కైంకర్యము కొనసాగించుకొనిరి. అప్పుడు కొందరు శిల్పులకు కూలియి

---

కుందనపుప్రతిమను ఎత్తుకొనిపోయిరి. అని చెప్పిచెప్పి తిరుగుచుండిరి. అట్టి యెడ నొకనాడు ఆగుడిగట్టినశిల్పి యీమాటలువిని ముక్కుమీద వ్రేలు పెట్టుకొని. ఔరా దొంగలతంత్రి అనెను. అందులకు కలివైరి నవ్వుచు దీనికేల ఇంతవింత. లోకములో దొంగమైనవానికి అందులకుదగిననేర్పు లేక పోవునా అని యడుగగా, అతడు అదియట్లుగాదు. నేనాగుడిని ఎందును ఐవులేకుండ నిర్మించి దానిపై నొకశిఖరమును నిలుపదలచి అందు ఒక మనుష్యుడు చొరగూడునంతటిగండిచేసి దానిలో శిఖరమును మలిచుట్టు పెట్టి నిలిపియున్నాను. ఇటు ఏడుమారులును అటు ఏడుమారులును త్రిప్పక అది వీడిరాదు. ఆకీలెరిగినవాడెవడో వాడుగాని యితరుడు ఆగుడిలో ప్రవేశింపనేరడు అని చెప్పెను. అట్లు కలివైరి బుద్ధాలయము జొచ్చునట్టి మార్గమునెరిగి, అందుండికదలి మరల నాగపట్టణమునకువచ్చి తమవారికి ఆవృత్తాంతము తెలియబరిచి, ఒకనాటిరాత్రి చీకటిప్రొద్దున గుడిపైకెక్కి శిఖరమును ఊడదీసి, తమతోడబుట్టినదాని పెనిమిటిని ఆదారిని గుడిలో పలికి దింపగా, అతడు లోపలప్రవేశించి బుద్ధప్రతిమను ఇనుపగొలుసులచే నంటగట్టి పైకి అందిచ్చెను. అప్పుడందరునుగూడి దానిని పైకిచేదుకొని పిమ్మట లోపలదిగిన మనుష్యునిగూడ చేదుకోబోగా. అతడు ముందెట్లుదిగెనోగాని పైకిరాబోవునప్పుడు అతనితలదక్క దక్కినదేహము కొంచెమయిన పట్టకపోయెను. అందులకుశంకించి యేమిచేయవచ్చునని యందరును చింతించుచుండగా, లోపలనున్న పరకాలునిమరది వారితో ఇక నాయాశ మానుకొనుడు. శ్రీరంగధాముని కైంకర్యమునకు సాధనమయిన సొమ్ము దొరకెను. కాబట్టి మీరు నావలని చింతమనసునసుంచక నాదేహమును రంగనాథార్పితముజేసి నాతలగోసికొనిపొండు. ''సర్వస్యగాత్రస్య శిరఃప్రధానమ్.'' అన్నట్లు తలలేక మొండెము మనజాడను గనబరపనేరదు గనుక మీరు నిశ్చింతముగా బుద్ధప్రతిమనుగొని రంగధామమునకు పోయి

న్నుటకు ధనములేక వారిని పరమపదముచేర్చెదనని యొడబరిచి పడవమీద ఎక్కించికొనిపోయి కావేరీప్రవాహములో ముంచగా వారందరు అప్పుడే దివ్యదేహధారులై చూచువారికి కనుపండుగుగా విమానారూఢులై శ్రీవైకుంఠమునకుబోయి చేరిరి.

అనంతరము నాగపట్టణమునందలి బౌద్ధులు తమ బంగారు విగ్రహమును దొంగిలించినవారు తిరుమంగయాళ్వార్లేయని తెలిసికొని చోళరాజుతో మొరపెట్టుకోగా, అతడు ఆళ్వార్లను

---

చేరవచ్చును. అనెను. అందులకు అందరును సరిసరి యనగా కలివైరి తమమరది తెలివికిని ధైర్యమునకును మెచ్చుకొనుచు తలగోసి చేతపుచ్చుకొని తక్కినవారు కుందనపుప్రతిమ నెత్తుకొని తమవెంటరాగా నెత్తురుబొట్లుపడి జాడయేర్పడునో యనుసందేహముచే ఆతలను ఒకపొదలో అనువుగాదాచి చనిరి. అది శ్రీరంగనాథు ననుగ్రహమువలన పొలకువగాన రాకపోయెను. అంతట వారుపోయిపోయి వేకువజామునకు కృష్ణపురము అను ఊరికివచ్చి యచ్చట నాటిప్రొద్దుపుచ్చువారై యచ్చటచేడ గట్టియున్నవరిమడిలో బయటికిగానరాకుండ బుద్ధప్రతిమనుబూడ్చిపెట్టి యక్కడనే యందరును గుంపుగూడుకొని యుండరాదని ఒక్కొక్క రొక్కొక్క తట్టునకుపోగా తోరావుక్కన్ (ఓడనివాడుకాడు) అను సేవకుడును దానును ఆమడిగట్టున గూర్చుండియుండెను. అంత కొంతసేపటికి ఆగ్రామమునందుండి మడియొడయడైన కాపువాడు నాగేలుమొదలగు నుపకరణములతో అడుసుదుక్కి దున్నువాడై రాగా వానిని మడిలో అడుగుపెట్టనియ్యక, ఓరీ! ఇది యెవరిచేనని దున్నవచ్చితివి. ఇన్నాళ్లదాక మావారెవ్వరును ఊరిలోలేక నీవు తేరకు అనుభవించుచుంటివి. ఇక అట్లుసాగరాదు. ఇది మాపెద్దలు ఏడుతరాలుగా అనుభవించుచున్న చేను. మంతరాన దీనికి ఇట్టిదశవచ్చెను. అని లేనిపోని సంబంధములు కల్పించుకొని గ్రామములోని పదిమందివచ్చి చెప్పినను వినక వాదుపెంచి నాటిపగలు తుదముట్టించెను. ప్రొద్దుగ్రుంకగానే అన్నివ్యవహారములు రేపువిచారించుకొందమని గ్రామస్థులందరు తమతమ నివాసములకు పోయిరి. పరకాలుడును అచ్చటవేంచేసియుండు పెరుమాళ్లసన్నిధిలో అప్పాలు పాయసము

ఫలిపించి ఈబౌద్ధులు కుందనముతో జేసిన తమగురుని విగ్రహము ను మీరు దొంగిలించికొనిపోతిరని చెప్పెదరు. అట్టి యకృత్యము చేయవచ్చునా అని యడిగెను. అందులకు ఆళ్వార్లు ఆబుద్ధ ప్రతిమను మేమెత్తుకొనిపోయినది నిజమే. దానివలన శ్రీరంగధాముని కైంకర్యము నెరవేరినది కాబట్టి అది యకృత్యము కాదు. ఇది గాక వేదబాహ్యములయిన మతములను పాడుచేయుట పరమ ధర్మమని పెద్దలు చెప్పుదురు. ఇది యట్టిదే కాబట్టి మేము చేసినపని సర్వవిధములచేతను శ్లాఘ్యమే అగును. అని దొంగతనపుమాట తొలగబెట్టి మతస్వరూపవిచారములో దిగిరి. అంతట బౌద్ధులు

---

బుచ్చుకొని తమసేవకులును తామును ఆరగించి, అడుసులోని బంగారు ప్రతిమను ఎత్తుకొని మన్నేటి మార్గముననడచి, తెల్లవారినచోట బుద్ధప్రతిమను దాచి విశ్రమించుచు, ప్రొద్దుగ్రుంకినతోడనే కదలినడచుచు కొన్నాళ్లకు శ్రీరంగముచేరి, తాముతెచ్చిన కుందనపుప్రతిమను పెక్కుతునుకలుగా గొట్టించి వన్నెపరీక్షకొరకు ఒకచేతి చిటికెనవ్రేలుమాత్రము నిలిపి, తక్కిన బంగారంతయు కరగించి నాణెములుచేయించి శిధిలమయిన మూడవప్రాకారమును గట్టించుటతోడ నిలువక తక్కినప్రాకారములను, పాకశాల కణజములోనుగా సర్వమును కొరతపడక కట్టించి, శిల్పులకూలి పైకము అప్పుపెట్టుకొని వారు అందుకై చేయునిర్బంధమునకు సహింపలేక, నీర్మేల్ నడప్పాన్ (నీళ్లమీద నడచువాడు) అను సేవకుని నొకపుట్టికట్టుకొని రమ్మని వాడు అట్లేచేయగా, శిల్పులనందరనుబిలిచి, నీపతీర్థమునందు నాధనమున్నది. మీరందరు నేడచ్చటివత్తురేని మీయప్పుతీర్చెవుత్తును అని అందులకు ఒప్పించి పుట్టియెక్కించుకొనిపోయి కావేరినట్టనడుమముంచి, తమభృత్యుని సహాయమువలన తాము దరిజేరిరి. శిల్పులును పరకాలుని ప్రయత్నముచేత కావేరిలోబడి మడిసి శ్రీరంగధాముని కైంకర్యముచేసిన పుణ్యవిశేషమువలన పరమపదముజేరి సుఖించువారైరి.

ఇట్లు కలివైరి అళగియ మణవాళని కోవెలకైంకర్యము నెరవేర్చి కృతార్థులైన వృత్తాంతము ఎల్లదేశములందును వ్యాపింపగా నాగపట్టణపు జైనులు పరకాలుడే తమగురుని ప్రతిమను గొనిపోయినవాడని నిశ్చయించి

మండిపడుచు రాజుతో, ఓయేలినవాడా! ఈపాపాత్ముడు మా దేవునిప్రతిమను దొంగిలించికొనిపోవుటయేగాక ఇప్పుడు దేవరయెదుటనే మామతమును నిందించి, తాను దొంగిలించినదియే న్యాయమని వాదించుచున్నాడు. చిత్తగింపుడు. ఈయన తనమతము వేదవిహితమనియు మామతము వేదబాహ్యమనియు నిర్ణయించి తన దొంగతనము సర్వోత్కృష్టకార్యముగా నిరూపించుచున్నాడు. ఈవిషయమయి దేవరసన్నిధియందే వాదించెదము. ఈ వాదమునందు మాయుభయులలోను మేము ఓడిపోతిమా మా విగ్రహమును వదలుకొనుటయేగాక దేవరవిధించిన దండనకును పాత్రులమయ్యెదము. అతడు ఓడిపోయెనా మాప్రతిమను మాకు ఒప్పించుటతోడ మేము కోరినదండనకు ఆతడు పాత్రుడు కావలసినది. ఇందులకు దేవరయే మధ్యస్థులు. అని తెగనాడు బౌద్ధుల

శ్రీరంగమునకువచ్చి, వారిని తొందరపెట్టగా, ఆ కలివైరి ఇంచుకయు శంకింపక, మీరు ఇదియొకవేడుక చేయవచ్చితిరా? లేక, మీకు పిచ్చిపట్టినదా? పొమ్ముపోయిన పోకడతెలియక నన్నుబాధించుచున్నారే ఇదియేమి? త్వరయుడిగి నిదానముగావిందురేని దానిజాడ నాకు తెలిసినంతలో తెలియజేసెదను వినుడు. అదియొక గొప్పవానిచేత చిక్కియున్నది. దాని పోబడి తీయవలెనన్న, విశేషించి ధనము వెచ్చింపవలసియుండును. అందులకు మీరు ఒప్పుకొన్నపక్షమున కొంతజాడ తీయగలను. అని అందులకై తమకు ఇయ్యవలసినపైకము ఇంతమాత్రమని సంకల్పించుకొని ఆమొత్తము వారికితెలియజేసిరి. వారును మాప్రతిమనుమాకొప్పించినపక్షమున మీరుకోరిన పైకము మీకిచ్చుటకు అనుమానింప బనిలేదు అనిరి. కలివైరి మీప్రతిమలో చిటికెనవ్రేలునుతప్పక మీకొప్పించెదనుగాని పైకము తెండు అని ఒడంబడిక వ్రాసియిచ్చి వారట్లే పైకముతెచ్చియియ్యగా, తాము మచ్చుకై యుంచుకొన్న బుద్ధప్రతిమ చిటికెనవ్రేలు తెచ్చి వారికిచ్చి, చిటికెనవ్రేలిచ్చిన ప్రతిమ యిచ్చినట్టేనాయని వారువాదింపగా, ఒడంబడికచూపి పదిమందిలో మాటనిలుపుకొనిరి. అంతట జైనులందరు చోళరాజునొద్దకు పోయి యావృత్తాంతమంతయుచెప్పి మొరపెట్టుకొనిరి.

మాటలువిని రాజు ఆళ్వార్లనుజూచి ఇందులకేమి యుత్తరము అని యడుగగా, వారు, నాయభిమతమును అదియేయని చెప్పి, ఒకటిరెండు మాటలలోనే వారినోళ్లు కట్టివేసి, నిత్యవస్తుస్వరూప బోధకమగు విశిష్టాద్వైతమత సిద్ధాంతమును స్థాపించిరి.

రాజు అందులకు చాలసంతోషించి బౌద్ధులను శిక్షించి పరకాలుని సన్మానించి వెలలేని వస్త్రాభరణములను అపారమైన ధనమును సమర్పించి, తనపట్టపు ఏనుగుమీద వేంచేయింపజేసి పట్టణము నాలుగువీధులను ఊరేగింపుచేయించి మంగళవాద్యములతోడ తనమంత్రులను పొలిమేర దాటునంతవరకు సాగనంపి రమ్మని యాజ్ఞాపించెను. అట్లు చోళరాజును వాదమున మెప్పించి యతనివలన సన్మానముపడసి, ఆరాజుచే నియ్యబడిన మదపుటేనుగుపైనెక్కి, తమముందర స్తుతిపాఠకులు బిరుదులుగ్గడించుచు, స్వకీయమయిన యాశుమధురచిత్ర విస్తరకవిత్వ సామర్థ్యాతిశయమును విస్తరించుచునడవ శ్రీరంగమార్గమునుగూర్చి వేంచేయుచున్నను, మధ్యమార్గమునందు త్రికవియను బిరుదు వహించిన సంబంధుడను శైవాచార్యుని శిష్యులు పరకాలుని బిరుదులనువిని యాక్షేపింపగా నా మహానుభావులు తాడాళ్ల సన్నిధికి వేంచేసి, ఆయన విషయమై యొక ప్రబంధము రచియించి, సంబంధుని విధేయునిగా జేసికొని, అందుండి కదలి ఎల్ల బిరుదులు చెల్ల మహావైభవముతో శ్రీరంగమునకు వేంచేసి శ్రీరంగధాముని సేవించి, తాము చేసిన కైంకర్యములవలన తృప్తిలేక రంగనాథునుద్దేశించి, “ఉ॥ అల్పపుబుద్ధితోడ నకటాకలుకోటల మాత్రకేనుసం, కల్పముమున్నెనర్చితిని గాని మణీమయముల్ రచింపసం, కల్పమొనర్చినం దిరముగా నెరవేర్తువె కా యటేలసం, కల్పము సేయలేనయితి గల్గునెయల్పుల కెంతభాగ్యముల్ ॥ శా॥ కైంకర్యంబులు నీకు నేమయినదా గావింతు నంచున్మదిన్, సంకల్పించినమాత్ర నీవఖిలముల్ సాధించుకోగా వృథా, శంకల్సాగునొ

సాగదోయనుచు నీచప్రజ్ఞుఁ డుండుఁ గాపిని, శ్వాంకత్వంబున నిన్ను నమ్మిబుధుఁ డిచ్చెంజేయ బ్రారంభముఁ" అని యీవిధముగా తమమనసులోని కొరతను విన్నవించి, శ్రీశేషశాయి యాకొరత తొలఁగజేయజాలు తిరువాక్కులు తమచెవి సోకించి తృప్తినొం దింపగా, ఆళ్వార్లు తాము రచించిన తిరునెడుం దాండకమును గానరూపమున పఠించుచు భక్తిపారవశ్యముచే ఇతరస్పృహ లేక నిలువబడగా శ్రీపెరియపెరుమాళ్లు కరుణించి నీభక్తికి మెచ్చితిని ఏమికావలసినను ఇచ్చెదనడుగుమని యానతిచ్చెను. అందులకు తిరుమంగయాళ్వార్లు హర్షించి, శ్రీశఠగోపులు సాదించిన ద్రవిడవేదములు నాలుగింటిని సన్నిధి తిరువధ్యయనోత్సవమునందు గీర్వాణవేదముతోడ శ్రీవైష్ణవులు అధ్యయనముచేయ ననుగ్రహింపుమని వేడి, పెరియపెరుమాళ్లు అట్లేయగునని యనుగ్రహింపగా, తిరుకుఱుగూరికి శ్రీముఖముపంపి శ్రీనమ్మాళ్వార్లను శ్రీరంగమునకు వేంచేపుచేయించి, వారి యనుగ్రహమును శ్రీరంగధాముని సన్నిధానమునందు పడసి, అధ్యయనోత్సవమునకు ఏకాదశినాడు తొడక్కముచేసి పదిదినములు పగలు గీర్వాణవేదమును, రాత్రి ద్రావిడవేదమును పారాయణము చేయించి, పదియవనాటిరాత్రి తిరువాయిమొళ్ళి సేవచేసి చాతుబడిచేయునపుడు జీవాత్మలు శ్రీరంగనాథుని పాదపద్మకైంకర్యము చేయు మార్గమును అనుసరింప శ్రీశఠారి తిరువుళ్ళ పట్టునట్లుచేసి, అది మొదలు ప్రతిసంవత్సరమును అధ్యయనోత్సవమునకు వేంచేయ శఠారిని ప్రార్థించి వారియంగీకారమును పడసిరి. ఇంతేకాదు, శ్రీరంగనాథుని తిరువుళ్ళము చొప్పున లోకులెవ్వరేనియు రంగక్షేత్రమునందు కొంతకాలమేని వసింతురేని తమపురాకృత పాతకములవలన విడువబడి పరమపదము నొందుదురని మంగళాశాసనములుచేసి, ఆవల కొన్నాళ్లు శ్రీరంగములోనే వేంచేసియుండి, పిమ్మట తిరుకుఱుంగుడికి వేంచేసి, నిన్రనంబి, ఇరుంద

నంబి, కిడందనంబి, తిరుప్పార్కడల్ నంబి, తిరుమలైనంబి అను పంచనంబులను సేవించి, అడియనికి పరమ పదము ప్రసాదింపవే యని అళ్గియనంబి పొన్నడి నాశ్రయించి, భక్తియే మూర్తీభవించినట్లు ఏకమనస్కులై సేవించి, ఆ అళ్గియనంబి యనుగ్రహమువలన సన్నిధి మర్యాదలతోడ శ్రీవైకుంఠమునకు వేంచేసి శ్రీమన్నారాయణునిదైన దివ్యమణిమండపమును అధిష్ఠించిరి.

---

శ్రీమత్తిరుమంగయాళ్వార్లు సాదించిన దివ్య ప్రబంధములు ఆఱు.

| | | |
|---|---|---|
| అందు—పెరియతిరుమొళ్రి ... | ౧౦౮౪ | - పాశురములు. |
| తిరుకుఱుందాండకము. | ౨౦ | ,, |
| తిరునెడుందాండకము. . | ౩౦ | ,, |
| తిరువెళ్గూత్తిరుక్కై. | ౧ | ,, |
| సిరియతిరుమడల్ ..... | ४० | ,, |
| పెరియతిరుమడల్ .... | ౭౮ | ,, |
| మొత్తము | ౧౨౫౩ | - పాశురములు. |

ఇది తిరుమంగయాళ్వార్ల వైభవము.

---

పన్నిద్దరాళ్వార్ల వైభవము

సంపూర్ణము.

# శ్రీమదాచార్యుల వైభవము.

శ్రీవైకుంఠమునందు నిత్యముక్తులు సేవింపగా వేంచేసియుండెడు అప్రాకృత దివ్యమంగళ విగ్రహుడైన శ్రీమన్నారాయణుని యనంతకల్యాణ గుణానుభవముచే సర్వదా ఆనందించుచు భగవన్ముఖోల్లాసకములైన దివ్యప్రబంధ ప్రవచనము మొదలుగాగల కైంకర్యములను చేయుచు ఎల్లయాత్మలును ఉజ్జీవింప అనేకాద్భుతములు వెలయ ఆళ్వారులచే రచియింపబడిన దివ్యప్రబంధములును తిరువధ్యయనోత్సవాది కైంకర్యములును కాలవైషమ్యమువలన జీర్ణములు కాగా, ఆదివ్యప్రబంధములను, వానివలన తెలియబడెడు ప్రపత్తి సంప్రదాయములను యథాపూర్వముగా వెలయజేయ తిరువుళ్లపట్టి శ్రీమన్నారాయణుడు ఆత్మీయ పరిజనములను ఆచార్యులనుగా అవతరింప నియమించెను. అట్టి పరమాచార్యులను పెరియపెరుమాళ్లు యానతిచొప్పున నవతరించిన శ్రీమన్నాథమునులు మొదలుగాగల పూర్వాచార్యుల వైభవములు క్రమముగా ఇందు వ్రాయబడుచున్నవి.

---

## శ్రీమన్నాథమునుల వైభవము.

శ్రీవీరనారాయణ పురమునందు శఠమర్షణ గోత్రోద్భవుడును శొట్టకులతిలకుడనగు ఈశ్వరభట్టు అను బ్రాహ్మణోత్తముడు వాసము చేయుచుండెను. ఆయనకు శ్రీవిష్వక్సేనునిమంత్రియైన గజాననుని యంశమున, కలియుగాబ్దములు మున్నూటఅరువదినాలుగు (కొ.. 364 సం) అగునప్పటి శోభకృన్నామ సంవత్సర జ్యేష్ఠ శుక్లత్రయోదశీ బుధవారము నాడు అనూరాధ నక్షత్రమునందు

ఒకకుమారరత్నము అవతరించెను. అప్పుడు ఈశ్వరభట్టారకుడు ఆకుమారునికి వేదోక్తవిధిని జాతకర్మమునడపి, పిమ్మట 'నాథముని' అని నామకరణముచేసి, అనంతరము క్రమముగా యథోచిత కాలములందు అన్నప్రాశనము, చౌలము, ఉపనయనము మొదలయినవానిని నడపుచు పెంపగా, ఆకుమారుడు వేదశాస్త్ర పురాణాది విద్యలెల్ల నభ్యసించి, యౌవనమును వహించెను. అంతట ఈశ్వరభట్టు 'వంగిప్పురత్తాచ్చియార్' అను వారికొమార్తను 'అరవిందప్పావయార్' అను కన్యకను తెచ్చి తనకొమారునకు వివాహము చేయించెను. ఇట్లు గృహస్థాశ్రమమును అవలంబించిన నాథమునులు వేదశాస్త్ర పురాణాది విద్యలయందు మహానిపుణులై సిద్ధాంత ప్రవచనముచేయుచు లోకమునందు మిగుల ప్రసిద్ధికెక్కి వర్తించుచుండగా, వారికి ఒకకుమారుడు అవతరించెను. ఆయనకు ఈశ్వరమునియని నామకరణముచేసి, ఎనిమిదవయేట ఉపనయనముచేసి, వేదశాస్త్రాగమములునేర్పి, యోగాభ్యాసమును గావించి, నాథమునులు యోగనిష్ఠాపరతంత్రులై వేంచేసియుండిరి.

అనంతరము కొన్నాళ్లు యోగనిష్ఠవదలి తండ్రితోను కొమారునితోను గూడుకొని, ఆవీరనారాయణ పురమునందు నెలకొనియుండెడు మన్నెనారుకు (శ్రీరాజగోపాల స్వామికి) సదా కైంకర్యము చేయుచునుండి, ఒకనాడు దివ్యదేశ యాత్రచేయ దలచి, శ్రీమన్నెనారును సేవించి యనుజ్ఞపుచ్చుకొని కుటుంబ సమేతముగా బయలుదేరి, ఉత్తరదేశమునందు ప్రసిద్ధములయిన బృందావనము మొదలుగాగల దివ్యదేశములకు వేంచేసి, అందందుగల అర్చామూర్తులను సేవించుచు గోవర్ధన క్షేత్రమునకు వేంచేసి, యమునానదిగట్టునందుండు గోవర్ధనము అను గ్రామమునందు నివసించి, అందలి యమునత్తురైవరు (శ్రీగోవర్ధనకృష్ణుని) కైంకర్యములను నడపుచు కొంతకాలము ఉండిరి.

అట్టియెడ ఒకనాడు వీరనారాయణ పురపతియగు మన్నెనారు నాథమునుల స్వప్నములో సేవసాదించి, "ఇక ఇందుండ వలదు వీరనారాయణ పురమునకు రావలసినది" అని యానతిచ్చెను. అంతట నాథమునులు యమునత్తురైవరువలన ఆనతి పుచ్చుకొని అందుండిబయలుదేరి కుటుంబసహితముగా వారణాసి (కాశి) మార్గమున జగన్నాథమునకు వేంచేసి, పురుషోత్తముడైన శ్రీజగన్నాథస్వామిని సేవించి, అందుండికదలి శ్రీఅహోబిలము, శ్రీవేంకటాచలము, శ్రీకాంచీపట్టణము, శ్రీముష్ణము మొదలుగాగల దివ్యదేశములను సేవించుచువచ్చి శ్రీవీరనారాయణ పురముచేరి మన్నెనారును సేవించి, ఆపెరుమాళ్ల నియమనము చొప్పున ఎప్పటివలె ఆదివ్యదేశమునందే నిత్యనివాసము చేయ సంకల్పించుకొని, పూదోటలువేయించి మన్నెనారు సన్నిధిలో పుష్పకైంకర్యమును తిరుత్తైలై కైంకర్యమునుచేయుచు వేంచేసియుండిరి.

అట్లుండగా ఒకనాడు పశ్చిమదేశమునుండి కొందరు భాగవతులు మన్నెనారు సన్నిధికివచ్చి "ఆరావముదే" అను ప్రబంధమునుపఠించి సేవింపగా, శ్రీనాథమునులువిని, ఆవైష్ణవులతో ఈ దివ్యప్రబంధము వినవిన నాసపుట్టించుచున్నది. కాబట్టి దానునియెడల నను గ్రహించి కడవెళ్ల సేవింపుడు అని ప్రార్థించిరి. అందులకు ఆవైష్ణవులు, స్వామీ మాకు ఈప్రబంధమునందు పది పాశురములే పాఠమయియున్నది. దీనిని కడవెళ్ల సేవించినవారిని ఎవ్వరిని మేముచూచి యెరుగము. ఆ శ్రీకోశమును మాకు చిక్కినదికాదు. అని మందలింపగా నాథమునులు వారివలన ఆ పదిపాశురములను సంగ్రహించి, పాఠముచేసి, ఇది శ్రీశఠగోపులు శార్ఙ్గపాణి విషయమునందు సాదించిన దివ్యస్తవము. ఇది వేయిపాశురములుగలది. ఆళ్వారుల అవతారస్థలమయిన తిరు

నాథమునులను తనసముఖమునకు రప్పించుకొని, సముచితముగా పూజించి నమస్కరించి, స్వామీ ఈ వెలయాలిపాట దేవరవారువింటిరా? అందలి సారస్యము ఎటువంటిది? అని అడిగెను. అందులకు నాథమునులు దీనిపాట వింటిమి. అందుల సారస్యమును గ్రహించితిమి. అది దేవతలకే వేద్యము. అని ఆయిరువురు వేశ్యలను మరల రాజు నాస్థానములో పాడించి, "మీరు మనుష్యగానము నెరిగినవారు గనుక మీకు అదియింపుగా తోచినది. మేము రెండును ఎరిగినవారముగనుక మాకు దేవగానమే శ్లాఘ్యముగా తోచుచున్నది" అని ఆనతిచ్చిరి. ఆమాటలువిని, రాజు, దేవరవారు దేవగానము నెరిగి యానతిచ్చినందుకు మాకు ఏదైన ఒక నిదర్శనముచూపిన మేలుగానుండును అనెను. అంతట నాథమునులు, అనేకములను తాళములను తెప్పించి అన్నిటిని ఏకకాలమునందు వాయింప నియమించి, ఆతాళముల శబ్దములను ఆలకించి, దీని మ్రోతను అనుసరించి యిది యింతయెత్తుగలది,-దీని మ్రోతను అనుసరించి యిది యింతయెత్తుగలది అని ఆయా తాళముల ధ్వనిచేతనే వానివాని యెత్తును ప్రత్యేకప్రత్యేకముగ విభజించి నిర్ణయించి చెప్పి, వీనిని తూచి పరిశోధించి నీసందేహమును తీర్చుకొమ్మని ఆనతిచ్చిరి. రాజు ఆతాళములన్నిటిని తూపించిచూచి, నాథమునుల మహిమకు హర్షించి, మహావిధేయుడై ప్రదక్షిణ పూర్వకముగా దండములు సమర్పించి, మేర లేని ధనము సమర్పింపగా, వారు పరమవిరక్తులు గనుక ఆధనమును అంగీకరింపక రాజునకు మంగళాశాసనము సాధించి మరల వీరనారాయణ పురమునకు వేంచేసిరి.

అనంతరము శ్రీపుండరీకాక్షులు, కురుగై కావలప్పన్ (కురుకానాథులు) నంబికరుణాకరదాసర్, ఏరు తిరువుడయార్, తిరుకణ్ణమంగై యాండార్, (శ్రీకృష్ణలక్ష్మీనాథార్యులు) వాన

తమును చింతక్రింది శఠారాతి సన్నిధిలో విన్నవించి, శఠారాతి యు ఈదివ్యప్రబంధమును శ్రీవైష్ణవులకెల్లను జెప్పి అనుసంధింప జేయుమని యానతిచ్చి వీడుకొలుపగా, అందుండి కదలి, మార్గస్థములయిన దివ్యతిరుపతులలో వేంచేసియుండు అర్చామూర్తులను దివ్యప్రబంధానుసంధానపూర్వకముగా సేవించుచు వీరనారాయణపురమునకు వేంచేసి మన్నెనారును సేవించి, ఆసన్నిధిలో సదా దేవగానపద్ధతిని దివ్యప్రబంధమును అనుసంధింప, తమ మేనల్లురైన 'కీఴైగత్తాళ్వాన్' (ప్రాగ్గృహవాసి) 'మేలగత్తాళ్వాన్' (పశ్చాద్గృహవాసి) అను వారినిద్దరిని సిద్ధపరిచి నియమించిరి.

ఆకాలమునందు దేవగానమునందు నేర్పుగలదియు, మనుష్యగానమునందు నేర్పుగలదియునైన యిద్దరు వేశ్యలు చోళరాజునొద్ద తమ విద్యాప్రావీణ్యమును చూపగా, మనుష్యగానరసజ్ఞుండైన ఆరాజు దేవగానముచేయు దానిని ఆదరింపక, మనుష్యగానముచేయు దానిని మాత్రము మిగుల ఆదరించి గౌరవించి పంపెను. అంతట ఆవేశ్య తన గానమునువిని హర్షింపగలవారు దేవతలేగాని యితరులుకారని నిశ్చయించి, ఈభూలోకమునందు ప్రసిద్ధి వహించిన దివ్యదేశములకెల్ల పోయి, ఆయా దివ్యదేశములలో వేంచేసియుండు శ్రీమన్నారాయణుని అర్చామూర్తుల సన్నిధులలో గానముచేయుచు యాత్రచేయునది మార్గవశమున వీరనారాయణపురమునకువచ్చి మన్నెనారు సన్నిధిలో గానము చేసెను. అప్పుడు అచ్చట వేంచేసియున్న నాథమునులు ఆగాన సారస్యమునకు మెచ్చుకొని, ఆవేశ్యను తీర్థప్రసాదాదులు ఇప్పించి మన్నించిరి.

అట్లు మన్ననపొందిన ఆవేశ్య అంతటితో ఊరకుండక మరల చోళరాజు సముఖమునకుపోయి తన వృత్తాంతమంతయు సవిస్తరముగా చెప్పుకోగా, అతడు ఆశ్చర్యపడి, తగిన మర్యాదలతో

నాథమునులను తనసముఖమునకు రప్పించుకొని, సముచితముగా పూజించి నమస్కరించి, స్వామీ ఈ వెలయాలిపాట దేవరవారువింటిరా? అందలి సారస్యము ఎటువంటిది? అని అడిగెను. అందులకు నాథమునులు దీనిపాట వింటిమి. అందుల సారస్యమును గ్రహించితిమి. అది దేవతలకే వేద్యము. అని ఆయిరువురు వేశ్యలను మరల రాజు నాస్థానములో పాడించి, "మీరు మనుష్యగానము నెరిగినవారు గనుక మీకు అదియింపుగా తోచినది. మేము రెండును ఎరిగినవారముగనుక మాకు దేవగానమే శ్లాఘ్యముగా తోచుచున్నది" అని ఆనతిచ్చిరి. ఆమాటలువిని, రాజు, దేవరవారు దేవగానము నెరిగి యానతిచ్చినందుకు మాకు ఏదైన ఒక నిదర్శనముచూపిన మేలుగానుండును అనెను. అంతట నాథమునులు, అనేకములను తాళములను తెప్పించి అన్నిటిని ఏకకాలమునందు వాయింప నియమించి, ఆతాళముల శబ్దములను ఆలకించి, దీని మ్రోతను అనుసరించి యిది యింతయెత్తుగలది, దీని మ్రోతను అనుసరించి యిది యింతయెత్తుగలది అని ఆయా తాళముల ధ్వనిచేతనే వానివాని యెత్తును ప్రత్యేకప్రత్యేకముగ విభజించి నిర్ణయించి చెప్పి, వీనిని తూచి పరిశోధించి నీసందేహమును తీర్చుకొమ్మని ఆనతిచ్చిరి. రాజు ఆతాళములన్నిటిని తూపించిచూచి, నాథమునుల మహిమకు హర్షించి, మహావిధేయుడై ప్రదక్షిణపూర్వకముగా దండములు సమర్పించి, మేరలేని ధనమును సమర్పింపగా, వారు పరమవిరక్తులు గనుక ఆధనమును అంగీకరింపక రాజునకు మంగళాశాసనము సాదించి మరల వీరనారాయణ పురమునకు వేంచేసిరి.

అనంతరము శ్రీపుండరీకాక్షులు, కురుగైకావలప్పన్, (కురుకానాథులు) నంబికరుణాకరదాసర్, ఏరు తిరువుడయార్, తిరుకణ్ణమంగై యాండాన్, (శ్రీకృష్ణలక్ష్మీనాథార్యులు) వాన

మాదేవియాండాన్, ఉరుప్పట్టూరాచ్చాంబిళ్లై, శోకత్తత్తాళా ళ్వాన్ అనువారు శ్రీనాథమునుల తిరువడినాశ్రయించిరి. అప్పుడు వారు వేదశాస్త్రార్థములను, దివ్యప్రబంధములను, తామురచియించిన న్యాయతత్త్వము, యోగరహస్యము అనువానిని ప్రసాదించుచుండి, ఒకనాడు పుండరీకాక్షులను, తమదేవులను పుట్టినింటికి పిలుచుకొనిపోయి విడిచిరా నియమించిరి. ఆ నియమముచొప్పున పుండరీకాక్షు లాయమ్మగారిని వెంటబెట్టుకొనిపోయి వారితిరుమాళిగలోవిడిచి, అచ్చట తళిగచేయు స్వాములు తమయందు నీచతారోపము చేసి పరిమారిన పర్యుషితమును "తదుచ్ఛిష్టంసుపావనమ్" అనునట్లు భాగవతభుక్తశేషములభించెనని హర్షించుచు పరమభక్తిపరులై యారగించి, నాథమునుల సన్నిధానమునకు రాగా, వారు వీరిముఖవికాసమును వీక్షించి యేమివిశేషము అని యడిగి జరగిన వర్తమానము తెలిసికొని "నమ్మై ఉయ్యక్కొండీరో" (మమ్మురక్షింపవలెకొంటిరో) అని యానతిచ్చి సన్మానించిరి. ఆకారణముచే పుండరీకాక్షులకు ఉయ్యక్కొండారు అను తిరునామము ప్రకటమాయెను. ఇట్లు పరమభక్తిపరులైన శిష్యులు సేవింపగా కాలక్షేపము సాదించుచున్న నాథమునులు ఒకానొకనాడు ప్రసంగవశమున మునుపు శ్రీరంగములో తిరుమంగయాళ్వార్లు నడపించుచువచ్చిన తిరువధ్యయనోత్సవ ప్రస్తావము వచ్చెను. అప్పుడు నాథమునులు ఆతిరువధ్యయనోత్సవ మర్యాదలు చెడిపోయియుండుట తెలిసికొని దానిని మరలనుద్ధరించువారై తత్క్షణమే శ్రీరంగమునకు వేంచేసి యథాపూర్వముగా ఆయుత్సవమును చేయించి, మరికొన్ని శ్రీవైష్ణవ సంప్రదాయములను కలుగజేసి, అక్కడ కొన్నాళ్లు ఉండి, పిమ్మట అందుండి వెడలి తిరుకొడందకు (కుంభకోణమునకు) వేంచేసి,

అచ్చటి ఆరావముదని (అపర్యాప్తామృతుని) సన్నిధిలో నమ్మాళ్వార్లను ప్రతిష్ఠచేయించి, అచ్చటను తిరువధ్యయనోత్సవము జరగించి, ఆదివ్యప్రబంధ సంస్థాపకుడగుటబట్టి శార్ఙ్గపాణికి ఆరావముదాళ్వారు అని తిరునామముచాతి, ఈసిద్ధాంతమును ప్రవర్తింపజేసిన పెరుమాళ్లు వీరేయని సాగిలబడి దండము సమర్పించి, శ్రియఃపతియైన ఆయారావముదాళ్వారు చల్లగా కటాక్షించి తీర్థశఠగోపాదులు ప్రసాదింపగా స్వీకరించి, మరల వీరనారాయణ పురమునకు వేంచేసి, అచ్చట కొన్నాళ్లు యోగనిష్ఠయందుండి, పిమ్మట కొన్నాళ్లు శిష్యగోష్ఠితో శ్రీవైష్ణవ సంప్రదాయ ప్రవచనముచేయుచు వర్తించి, గురుగైకాఁవలప్పనికి యోగక్రమము ననుగ్రహించి, ఉయ్యకొండారును సంప్రదాయప్రవచనము చేయ నియమించి, తనకొమారుడైన యీశ్వరమునులతో "నీకు శీఘ్రకాలములో ఒక కుమారుడుదయించును. ఆకుమారునికి యామునాచార్యులని పేరుపెట్టుము" అని యాజ్ఞాపించి, ఉయ్యకొండారును, కురుగైకాఁవలప్పనిని ఆయామునులకు సంప్రదాయ క్రమములను యోగక్రమమును ఉపదేశింపుడని యానతిచ్చి యథారీతిని యోగనిష్ఠయందు వేంచేసియుండిరి.

అంతట ఒకనాడు తన భార్యలతోడ మన్నెనారును సేవింప వచ్చిన చోళరాజు యోగనిష్ఠాపరులైయున్న నాథమునులను సేవించి మరల తనపట్టణమునకుపోవుచుండగా, నాథమునులు అతడు శ్రీకృష్ణభగవానులని, అతనిభార్యలు గోపికాస్త్రీలని తలచి, వారి వెంటనే బయలుదేరి అతని నగరద్వార పర్యంతము పోయి, ఇంతలో శిష్యులు మొదలగువారు పరుగెత్తివచ్చి స్వామీ ఏల యీ రాజువెంట ఇంతప్రయాసపడి నడచిపోయెదరని యడుగగా, కళదెలిసి గోపికాస్త్రీలతోగూడ శ్రీకృష్ణభగవానులు పోవుచుం

డగా వారిని సేవించుచు ఇంతదూరము వచ్చితినని చెప్పెను. అది విని పుండరీకాక్షులు మొదలగు వారందరు వారి యధ్యవసాయమునకు నాశ్చర్యపడుచు యథాస్థానమునకు వేంచేపు చేసికొని వచ్చిరి.

అనంతరము మరియొకనాడు ఇద్దరు వేటకాండ్రు ఒక ఆడుదానిని ఒకకోతిని వెంటదీసికొని నాథమునుల తిరుమాళిగకువచ్చి నాథమునులు ఉన్నారా అని అడిగి, యోగనిష్ఠయందున్నారని అచ్చటివారు చెప్పగా అక్కడ నిలువక బయలుదేరి పోయిరి. ఆవృత్తాంతమును వెంటనే నాథమునుల కొమార్తలు వారు నిష్ఠలో వేంచేసియుండు తావునకుపోయి విన్నవించిరి. అదివిని నాథమునులు ఆబోయవాడు చక్రవర్తి తిరుమగన్ (శ్రీరాముడు) అనియు, వానివెంటవచ్చిన మరియొకడు ఇళయపెరుమాళ్లు (లక్ష్మణుడు) అనియు, ఆయాడుది సీతాపిరాట్టి అనియు, వానరము సిరియతిరువడి (హనుమంతుడు) అనియు నిశ్చయించి, భక్తియు సంభ్రమమును అంతకంతకు హెచ్చుచుండ అందుండిలేచి, ఎదురువచ్చువారి నెల్ల ఒక వానరమును వెంటదీసికొని యిద్దరు మగవారును ఒక ఆడుదియు ఈదారిని పోయిరా అని అడుగుచు, వారువారు మేముకానము మేముకానము అని చెప్పుచురాగా వినివిని చింతించుచు, కన్నులనీళ్లు జడిగొనికారగా అడవిలో బడి పోయిపోయి తుదకు ఒకచోట కళతప్పిపడగా, శ్రీమచ్చక్రవర్తి తిరుమగన్ సీతాపిరాట్టితోను ఇళయపెరుమాళ్లతోను సిరియ తిరువడితోను సేవసాదించి యాదరించెను. అప్పుడు నాథమునులు భక్తిరసము ఒలుక దివ్యప్రబంధ గానముచేయుచు నాయమృతమూర్తిని జూచిన కన్నులతో తక్కిన ప్రాకృతమూర్తులను జూడనేరనని, ఆచక్రవర్తి తిరుమగనారు సేవ సాదించినచోటనే దేహమును విసర్జించి నిత్యవిభూతికి వేంచేసినవారలైరి. వీరు

లీలావిభూతియందు వేంచేసియున్న తిరునక్షత్రములు. (౩౪౦) మున్నూటనలువది.

ఇట్లు నాథమునులు పరమపదమునకు వేంచేసినచోటు తిరునగరికి దాపుననుండు ఆదినాథుని సన్నిధియే అయినందున అచ్చటి వారివలన ఆవృత్తాంతము ఉయ్యకొండారు, కురుగైకావలప్పన్ మొదలగువారు విని శోకాక్రాంతులై యీశ్వరమునుల తోడ అచ్చటికివచ్చి బ్రహ్మమేధవిధిని సంస్కారము చేయించి, అందుండి వీరనారాయణపురమునకు వేంచేసి యథావిధిగా చరమక్రియయును నడపిరి.

శ్రీమన్నాథమునులకు ప్రియశిష్యులయిన ఉయ్యకొండార్ కార్తికమాసమున చిత్తానక్షత్రమున నవతరించిరి. వీరు శ్రీజయత్సేనాంశమున జనించినవారు. వీరి తిరువడి నాశ్రయించినవారు మణక్కాల్ నంబి (రామమిశ్రులు) తిరువల్లిక్కేణి పాణ్ పెరుమాళరయర్, శొట్టైప్పూచ్చెండలంకారర్, శ్రీపుండరీకాక్షదాసులు, ఉలగుపెరుమాళ్ (లోకాచార్యులు) అను వారు అయిదుగురు. వీరిలో మొదటివారైన మణక్కాల్ నంబి, తమ ఆచార్య తిరుమాళిగలో కైంకర్యము చేయుచుండి, ఆయాచార్యులైన ఉయ్యకొండార్ పరమపదమునకు వేంచేయునపుడు వారిని ఇకను దర్శనప్రవర్తకులు కాగలవారు ఎవరు అని అడుగగా, ఉయ్యకొండారు నీవే అని సాదించి, ఇక కొన్నాళ్లకు శ్రీమన్నాథమునుల పుత్రులగు ఈశ్వరమునులకు ఒక పుత్రుడు అవతరింపగలడు. అతనికి నీవు యామునాచార్యులు అని నామకరణము చేయించి, సకల రహస్యములు ఉపదేశించి, దర్శనప్రవర్తకుడు అగునట్లు చేయుము. ఆయన దర్శనప్రవర్తకుడు అగును అని ఇంతకు మునుపే శ్రీమన్నాథమునులు సాదించియున్నారు. నీకు పరమ-

చార్యులను నాథమునుల నియమనమును కొనసాగించుట పర
మోపాదేయము అనియు నియమించి తిరునాటికి వేంచేసిరి.

అంతట రామమిశ్రులు తమ యాచార్యులయిన ఉయ్యా
కొణ్డారుకు బ్రహ్మమేధవిధి సంస్కారము మొదలయిన చరమ
కైంకర్యములను నడపి, గురూపదిష్టములయిన రహస్యార్థము
లను అనుసంధానము చేయుచు, దర్శనప్రవర్తకులై వేంచేసి
యుండిరి. వీరి తిరునక్షత్రము మఖ. వీరుకుముదాంశ సంభూ
తులు.

ఇది నాథమునుల వైభవము.

శ్రీమన్నాథమునయేనమః.

---

## శ్రీ యా ళ వం దా రు వై భ వ ము.

వీరనారాయణపుర నివాసులును శ్రీమన్నాథమునుల తన
యులునైన యీశ్వరమునులకు కలియుగాబ్దములు నాలుగువేలు
నూట పదునేడు కడచుకాలమున ధాతునామ సంవత్సరము
ఆషాఢశుక్లపూర్ణిమా బుధవాసరమునాడు ఉత్తరాషాఢ నక్ష
త్రమునందు శ్రీసింహాసనాంశమున నొక్కకుమారు డుదయిం
చెను. అప్పుడు ఆవృత్తాంతమును మణక్కాల్ నంబి (శ్రీరామ
మిశ్రులు) విని వీరనారాయణ పురమునకు వేంచేసి, ఆకాలము
నందు జరపవలసిన క్రియ లెల్ల ఈశ్వరమునులవలన జరగించి, ఆ
పుత్రరత్నమునకు యామునాచార్యులు అని నామకరణము చే
యించి మరల తమనివాసమునకు విజయంచేసిరి.

ఇచ్చట ఈశ్వరమునులును దినదిన ప్రవర్ధమానులగుచున్న
యామునాచార్యులకు అన్నప్రాశన చౌలోపనయనములను ఆ
యా కాలములయందు యథావిధిని కావించి మహాభాష్యభట్టరు
అను వారియొద్ద వేదశాస్త్రములు అభ్యసింపబంపగా యామునా

చార్యులు తొలునాఁడు చెప్పినదానిని చదివి, మరునాఁడును గురువులు దానినే చెప్పగా, ఇదియేమి వీరు చెప్పినదానినే చెప్పెదరు. ఈచర్విత చర్వణమువలన ఫలమేమి అని మరునాఁడు గురువుల యింటికిపోక పోయిరి. ఈశ్వరమునులు చూచి ఆటలాడమరిగి చదువబోకున్నావుగదాయని యదలించిరి. అందులకు బెదరక యామునాచార్యులు పాడినపదమే పాడునట్టివారియొద్దపోయి ఏమి చదువవచ్చును. ఆచదువునందు ఎవరికైనను ఎట్లు రుచిపుట్టును. ఉపాధ్యాయులు మొన్నచెప్పినదానినే నిన్నను చెప్ప నారంభించిరిగనుక ఆచదువునందు నాకురుచిపుట్టక యింటనేయుండి వేడుకగా ప్రొద్దుపుచ్చుచున్నాను. అని అట్లయిన నీవు చదివినదానినిప్పుడు చెప్పు చూతము అని ఘర్షించియడుగుచున్న తండ్రి యాశ్చర్యపడునట్లు తాము తొలునాఁడు చదివినదంతయు గడగడ యొప్పజెప్పి యూరకుండిరి.

అంతట ఈశ్వరమునులు తమకొమారుని యేకసంతగ్రాహిత్వశక్తిని తెలిసికొని ఆసంగతిని మహాభాష్యభట్టరుకు శ్రుతపరిచిరి. అందులకు వారు చాలసంతోషించి చెప్పినదానిని మరల చెప్పకయే సర్వశాస్త్రములు చదివింపసాగిరి. అట్లు యామునాచార్యులు వేదశాస్త్రములు అభ్యసించుచుండగా వారికి * తిరుకల్యాణమును ఆయెను. పిమ్మట కొన్నాళ్లకు, ఆదేశము నేలు రాజునింటిపురోహితుఁడైన అక్కియాళ్వాన్ అనునతడు శాస్త్రవాదమునందు అనేకులను విద్వాంసులను జయించి 'విద్వత్కోలాహలుడు' అను బిరుదుపేరువహించి ఆదేశములో వాసముచేయు విద్వాంసులందరు తనకు అరిపెట్టునట్లు రాజువలన అధికారపత్రమును పొందియుండువాడు తనకు వాడుకగా చెల్లుచువచ్చినపన్ను తండుకొని రాగలందులకై ఒకతరువుకానిని మహా

* గ్రంథాంతరమునందు రాజ్యపదస్థులు అయినపిమ్మట ఆళవందారుకు తిరుకల్యాణము అయినట్టు చెప్పబడియున్నది.

భాష్యభట్టునవద్దకు పంపెను. అప్పుడు ద్రవ్యము లేమినిబట్టి వారు చాలవ్యాకులము నొందసాగిరి. ఆసంగతి యామునాచార్యులు తెలిసికొని, ఆతరువుకాని చేతచీటి యిటుదెమ్మని చించిపారవైచి « మేము కేవలముకవులమయి సిద్ధాంతప్రవచనము చేయువారము కాము, ప్రతివాదులను మదపుటేనుగులనుపడగొట్టజాలిన విద్వత్సింహులము.” అను అర్థముగల శ్లోకమొకటివ్రాసి, దీనిగొని పోయి మీయేలినవానికి ఇమ్మని చెప్పి, ఆతరువుకానిచేత ఇచ్చి పంపిరి. తరువుకాడు దానిదీసికొనిపోయి అక్కియాళ్వాన్ చేత ఇచ్చి జరిగినవృత్తాంతమంతయు చెప్పగా, ఆరాజపురోహితుడును దానిజదువుకొని, అందలియర్థమును రాజునకు శ్రుతపరిచి, రాజే యామునాచార్యులను తనసముఖమునకు వచ్చునట్లు ఆహ్వానపత్రిక పంపునట్లుచేసెను. దానినిగూడ యామునాచార్యులు లక్ష్యపెట్టక చించిపారవేసిరి. అది రాజువిని మహావిద్వాంసుల గౌరవమునకుదగిన పల్లకీనిపంపి ఇందు ఆరూఢులై వేంచేయవలసినది అని విన్నపము వ్రాసికొనెను. ఆవిన్నపమును తిరువుళ్లపట్టి యామునాచార్యులు పల్లకీయెక్కి రాజు నాస్థానమునకు వేంచేసి, «ఆసేతుసీతాచలపర్యంతమైన యీభూమండలములో నన్నుమీరజాలిన విద్వాంసుడుకూడకలడా ?” అను అర్థముగల ఒకశ్లోకమును పఠించిరి. అదివిని రాజపురోహితుడు వీరితోడి వాదమునకు సిద్ధపడినవాడాయెను.

అప్పుడు భగవద్భాగవతభక్తియుక్తురాలయిన రాజభార్య తనభర్తనుజూచి, ఓ యేలినవాడా! ఈయిరువురిలోను వాదమునందు గెలువగలవారు ఎవరు అనుకొందురో ఊహించితిరా ? అనగా, రాజు పురోహితుడు గెలుచును అని చెప్పెను. రాణి పురోహితుడు గెలువనేరడు చూడుడు అనెను. ఇట్లు ఇరువురకును కొంతసేపు వాదుకాగా, కడపట రాజు, యామునాచార్యులే జయించినపక్షమున నారాజ్యములో సగము నీకుపంచి

మిచ్చెదను. పురోహితుడు జయించినయెడల నీవు నేను చేసిన యాజ్ఞకు లోబడవలసినదానవు అని చెప్పెను. అందులకు రాణి సమ్మతించెను. ఇట్లు రాజును రాణియు పరస్పరము పందెములు వేసికొని తమ్ము పురికొలుపగా వాదమునకు ఆరంభించి ఒకటి రెండు యుక్తులలోనే యామునాచార్యులు అక్కియాళ్వానుని ఓడించిరి. అందులకు రాణి పరమానందభరితచిత్తయై "నమ్మై ఆళవందీరో" (నన్ను ఏలుకోవచ్చితిరో) అని ద్రావిడ భాషతో పలుకుచువచ్చి, ఆస్థానమునందు జ్యోతిస్స్వరూపులై తేజరిల్లుచున్న యామునాచార్యులను ఎత్తి కౌగిలించి ముద్దుపెట్టుకొనెను. అదిమొదిగా యామునాచార్యులు ఆళవందారు (రక్షాగతగురువు) అనబరగిరి. అంతట, రాజు అతిసంభ్రమముతో ఆళవందారును ప్రదక్షిణనమస్కార పూర్వకముగా బ్రహ్మరథమునందు వేంచేపుచేసి పట్టణము నాలుగువీధులను ఊరేగింపుచేయించి, భార్యకు ఇయ్యనొప్పుకొన్న అర్ధరాజ్యమును ఆమె యిష్టముచొప్పున ఆళవందారుకు సమర్పించెను. అట్లు యామునాచార్యులు రాజ్యపదస్థులై యిష్టసుఖముల ననుభవించుచుండగా, వీరిజనకులయిన యీశ్వరమునులు తిరునాటికి వేంచేసిరి. అంతట వారికి బ్రహ్మమేధవిధిని సంస్కారముకావించి, యథావిధిగా చరమక్రియ యొనడపి సుఖముండిరి. పిమ్మట *తిరువరంగప్పెరుమాళరయర్ (వరరంగాచార్యులు) శొట్టనంబి (శొట్టపూర్ణులు), దైవత్తుక్కరశునంబి, పిళ్లయరశునంబి అను నలుగురుకొమారులు అవతరింపగా, ఆళవందారు రాజ్యసంపదచేతను, పుత్రసంపదచేతను అసదృశులై వర్తించుచుండిరి.

తరువాత ఈవృత్తాంతమంతయు మణక్కాల్ నంబి (రామమిశ్రులు) విని మిగుల హర్షించినవారై యామునాచార్యులను

---

* గ్రంథాంతరమునందు మొదటివారు కురువురే ఆళవందారుకు పుత్రులని వ్రాయబడియున్నది.

చూచి మాటలాడవలెనని వారిపట్టణమునకువచ్చి, వాకిటి కావలి వారి నిర్బంధముచే నగరు ప్రవేశింప ననువుపడక, అంతటంతట నివసించియుండి, మరప్పళి కైంకర్యము (తళిగ) చేయు శ్రీవైష్ణవుల నాశ్రయించి ఆళవందారుకు ముండ్లముస్తె కూరయందు మిక్కిలి ప్రీతియని తెలిసికొని, ఆరునెలలకాలము ప్రతిదినము తప్పక ఆకూరకోసి తెచ్చి యిచ్చుచువచ్చి, పిమ్మట ఒకనాడు ఎన్నాళ్లకును ఆళవందారుసన్నిధానము లభింపకపోయెనేయను విచారముచేత నాలుగుదినములదాక దేహస్మృతిలేక ఉన్నతావునుండి కదలకయుండిరి. అందువల్ల ఆకూర లేకపోయెనుకనుక ఆళవందారు ఆరగింపు సమయములో ప్రతిదినము తళిగచేయుచున్న ముండ్లముస్తెకూర యేల ఇప్పుడు లేకపోయెనని తళిగచేయు వైష్ణవులను అడుగగా, వారు, ఇన్నాళ్లును ఒకవృద్ధవైష్ణవుడు తెచ్చి యిచ్చుచుండగా తళిగచేసి యుంచుచుంటిమి. ఇప్పుడు ఏకారణముచేతనో నాలుగుదినములుగా ఆయన తెచ్చి యియ్యగానము. అని చెప్పిరి. ఆళవందారు ఆమాటలువిని ఇకమీద ఆవైష్ణవుడువచ్చిన పక్షమున మాయొద్దకు పిలుచుకొనిరావలసినది అని తళిగ వైష్ణవులకు ఆజ్ఞాపించిరి. అటుపిమ్మట మణక్కాల్ నంబి కొంత కలకదేరి యెప్పటివలె ముండ్లముస్తెకూర కోసికొనివచ్చి తళిగవైష్ణవులచేతికియ్యగా, వారు ఆవర్తమానము ఆళవందారుతో విజ్ఞాపనముచేసిరి. ఆళవందారు ఆమాటవినుచునే నంబినియెదురుకొనిపోయి సాగిలబడి దండములు సమర్పించి, స్వామీ దేవరవారు ఇంతకాలము దాసునికి కరియమును సాధించుచురాను ఏమికారణము. ధనాపేక్షచేనని యూహింతునన్న దేవరవారుపరమ విరక్తులుగ దోచుచున్నారు. కాబట్టి దేవరవారికిగల కోరికను అడియడు తెలియ గోరుచున్నాడు. ఆనతియుండు అని విన్నవింపగా, మణక్కాల్ నంబి నాకు ఏకోరికయు లేదు. అయినను మీపెద్దలు సంపాదించిన నిక్షేపము ఒకటి నాయధీనముగ

మున్నది. దానిని మీకు నివేదించిపోవలయునన్న కోరిక ఒకటిమాత్రము బాధించుచున్నది. అని యానతియ్యగా, యామునాచార్యులు మిక్కిలి సంతోషించి బహువిధములవారిని కొనియాడి సర్వదా వారు తమ తిరుమాళిగకు వేంచేసి మంగళాశాసనము సాదించి విచ్చేయుచుండునట్లు ఒప్పించుకొనిరి. అది మొదలు రామమిశ్రులు యామునాచార్యుల తిరుమాళిగకు ప్రతిదినము వేంచేసి శ్రీగీతార్థోపన్యాసము చేయుచురాగా యామునాచార్యులు ఎడతెగక శ్రవణముచేసి దివ్యజ్ఞాన సంపన్నులయి వైరాగ్యమును వహించి, ఆరామమిశ్రులవల్లనే పంచ సంస్కారాదులయిన వైష్ణవాంశముల నెల్లను పరిగ్రహించి కృతకృత్యులయి యుండగా, ఒకనాడు నంబెరుమాళ్లను సేవించువారై ఉభయులు శ్రీరంగమునకు వేంచేసిరి. అప్పుడు శ్రీరామమిశ్రులు యామునాచార్యులకు శ్రీరంగనాధునిజూపి నేను ముందు మీపెద్దలు నావశమునందు ఉంచియున్నారన్న నిక్షేపము ఇదేయని యానతిచ్చి, అప్పుడే తిరుమంత్రార్థ చరమార్థములను ఉపదేశించిరి. ఆళవందారును దుర్లభములయిన రహస్యార్థముల నెల్ల పరిగ్రహించి, అనిత్యమయిన యిహసుఖమువలన నిరాశులై సన్న్యాసాశ్రమమును స్వీకరించి సర్వదా రంగనాధుని సేవించి యానందించుచుండిరి.

వీరు రచియించిన ప్రబంధములు,—ఆత్మసిద్ధి, సంవిత్సిద్ధి, ఈశ్వరసిద్ధి, ఆగమప్రామాణ్యము, పురుషనిర్ణయము, చతుశ్శ్లోకీ, గీతార్థసంగ్రహము, స్తోత్రరత్నము, మాయావాద ఖండనము మొదలగునవి.

వీరిశిష్యులు,—పెరియనంబి, (మహాపూర్ణులు) తిరుక్కోట్టియూర్ నంబి, (శ్రీగోష్ఠీపూర్ణులు) పెరియతిరుమలనంబి, (శ్రీశైలపూర్ణులు) తిరుక్కచ్చినంబి, (కాంచీపూర్ణులు) తిరుమాలైయాండాన్ (మాలాధరులు) మొదలుగాగలవారు. వీరిలో

పెరియనంబి కుముదాక్షాంశమునను, పెరియ తిరుమలైనంబి సుముఖాంశమునను, తిరుకచ్చినంబి శంఖకర్ణాంశమునను, తిరుకోట్టియూరునంబి పుండరీకాంశమునను, తిరుమాలై యాండాన్ వామనాంశమునను అవతరించినవారు. వీరైదుగురును ఆళవందారు పుత్రులయిన తిరువరంగప్పెరుమాళరయరును, భవిష్యదాచార్యులగు శ్రీభాష్యకారులకు ఆచార్యులుకాగలవారు. ఇందు పెరియనంబి (మహాపూర్ణులు) ఆళవందారు నియమనము చొప్పున శ్రీభాష్యకారులకు పంచ సంస్కారాదులు సాదించిరి. ఈ పెరియనంబి తిరునక్షత్రము మార్గశిరమాసమున జ్యేష్ఠనక్షత్రము.

ఇట్టిశిష్య పరంపరతో సిద్ధాంత ప్రవచనము చేయుచు శ్రీరంగమునందు ఆళవందారు వేంచేసి యుండగా, ఒకనాడు మణక్కాల్ నంబి యచ్చటికి వేంచేసి ఆళవందారుచే సేవింపబడినవారై యేకాంతమునందు మీతాతగారగు నాథమునులు తమ శిష్యులలో ముఖ్యులైన కురుగైక్కావలప్పనికి యోగశాస్త్రమునుపదేశించి దీని నామనుమనికి నొసగుమని యాజ్ఞాపించి యుండిరి. కాబట్టి మీరిప్పుడు వారి సన్నిధికిపోయి సేవచేసి దానిని పరిగ్రహింప యత్నింపుడు. వారు గంగైకొండ పురమునందు (గంగాహారపురమునందు) యోగనిష్ఠతో వేంచేసి యున్నారు. అని యానతిచ్చిరి. అంతట ఆళవందారు అచ్చటికి వేంచేసి మిక్కిలి శిథిలమైన యొక యాకుటింటిలో కన్నులు మూసికొని యోగనిష్ఠాపరులై యున్న కురుకేశమహా యోగీశ్వరులను సేవించి వారియెదుట నిలిచియున్న సమాధికి భంగమగునేమో యను శంకచే శిష్యజనసహితముగ వారికి వెనుకప్రక్క గుమ్మమిక్కమునక కూర్చుండిరి. అనంతరము ఆమహాత్ములు తమ యోగనిష్ఠమాని కనులుదెరచి శొట్టకుల సంభవులైన ధన్యులెవ్వరైనను ఇచటవచ్చియున్నారా అని యడుగగా, ఆళవందారు

ఆశ్చర్యపడుచు తటాలున ఎదుటికివచ్చి సాగిలబడి దండము సమర్పించి, స్వామీ వెనుకతట్టు ఉండిన అడియనిని దేవరవారు ఎట్లు తెలిసికొంటిరో, ఇది మిగుల వింతగానున్నది అనిరి. అందులకు కురుకేశులు నాహృదయమునందు సదావసించి సేవసాదించుచున్న తిరుకణ్ణి తెలుపగా తెలిసికొంటిని. నీవువచ్చిన పనియేమి తెలియజేయుమని, ఆళవందారు యోగవిద్యకొరకు అని నుందలింపగా, నాచరమావస్థకువచ్చి యడిగితివేని నీయభీష్టము నెరవేర్చెదనని యానతిచ్చి, ఆకాలమును ఒకపత్రికలో వ్రాయించి యిప్పించిరి. అంతట యామునులు సంతోషచిత్తులై మరల శ్రీరంగమునకువచ్చి కొన్నాళ్లు అందుండి, పిమ్మట అనంత పద్మనాభుని సేవించువారై తిరువనంతపురమునకు వేంచేసి, అందు కొంతకాలముగడపి ఒకనాడు కురుకేశులు సాదించిన పత్రిక చదువుకొని వారి పరమపదయాత్రా ముహూర్తము అదియెయగుట తెలిసికొని, యోగోపదేశమునకు అవకాశము లేమికి ఖేదము నొందుచు మరల శ్రీరంగమునకువచ్చి తిరుమల, తిరుకోట్టియూరు మొదలుగాగల దివ్యదేశములలో సిద్ధాంత ప్రవచనము చేయను తిరుమలనంబి మొదలయిన శిష్యులను నిలిపి, భవిష్యత్కాలంబున దర్శనోద్ధరణ సమర్థులెవ్వరగుదురోయని విచారించుచు శ్రీమన్నారాయణ దివ్యమంగళ గుణానుభవము చేయుచు వేంచేసియుండిరి. వీరు ఈలీలావిభూతియందు వేంచేసియున్న తిరునక్షత్రములు నూటయిరువది.

అట్టి కాలమునందు శ్రీమన్నారాయణుని యానతిచొప్పున శ్రీయనంతాళ్వార్లు శ్రీభాష్యాదివివరణగ్రంథ ముఖమున వేదాంత ప్రతిపాదక నిత్యవస్తు ప్రదర్శనముచేయుటకై యీభూమండలమున నవతరించిరి.

ఇది శ్రీయాళవందారు వైభవము.

# శ్రీ భాష్యకారుల వైభవము.

శ్రియఃపతియైన శ్రీమన్నారాయణుని నియమనము చొప్పున నాలుగు సముద్రములు మేరగాగల యీభూమండలములోని దివ్యదేశములలో ఉత్కృష్టతమ మయిన శ్రీ పెరుంబూదూరు అను దివ్యదేశమునందు వసించి సదాభగవద్గుణానుభవముచే కాలక్షేపము చేయుచున్న శ్రీహరితగోత్ర పవిత్రులగు ఆసూరి కేశవాచార్యులకు శ్రీభూపిరాట్టితో పోల్పదగిన సుగుణవతియగు కాంతిమతీదేవియందు, ఇజ్జగమునందలి చేతనులనెల్లను ఉజ్జీవింపజేయుటకై కృతయుగమునందు శేషుడును, త్రేతాయుగమునందు లక్ష్మణుడును, ద్వాపరమున బలరాముడునై, అవతరించి జీవకోటుల నుజ్జీవింపజేసిన శ్రీయనంతాళ్వార్లు, కలియుగమునందు నాలుగు వేల నూటపదునెనిమిదియేండ్లకు పిమ్మటిదయిన పింగళనామ సంవత్సర చైత్రశుక్లపంచమీ శుక్రవారమునాడు ఆర్ద్రానక్షత్రమున నవతరించిరి అట్లు అవతరించి యిట్టిదట్టిదనరాని మహిమకు ఉనికిపట్టై కోటిసూర్యులు ఉదయించి వెలుగునట్లు వెలుగుచున్న యాపుత్రరత్నమునుజూచి శ్రీకేశవాచార్యులు కన్నులయందానంద బాష్పములు జడిగొనికురియగా మేరమీరిన సంతోషమునుపొంది మహావైభవముతో జాతకర్మను మహోత్సవమును నడపిరి.

ఈవృత్తాంతమును శ్రీకాంతిమతీ సహోదరులను పెరియ తిరుమలనంబి (శ్రీశైలపూర్ణులు) విని పరమానంద భరితులై కేశవాచార్యుల తిరుమాళిగకు వేంచేసి శ్రీమన్నారాయణుని యనుగ్రహము మూర్తీభవించెనో యనునట్లు ప్రసన్నమూర్తియై వెలు

గుచున్న బిడ్డను కన్నులకరవుదీర కటాక్షించి, అవతరించిన పదు మొకండవనాడు సకల శుభగుణములకు నాస్పదమగు నొక శుభ ముహూర్తమునందు ఇళయాళ్వారు (శ్రీరామానుజులు) అని నామకరణము చేయించి వేంచేసిరి.

అనంతరము ఇళయాళ్వార్ల తల్లిదండ్రులు ఎంతో గారాబముగా పెంపగా పెరుగుచు, గర్భాష్టమ సంవత్సరమున ఉపనీతులై వేదములు వేదాంగములు నభ్యసించి యౌవనావిర్భావముతోడ సర్వశాస్త్రప్రవీణతయును పొంది, తమకుతగిన రూపవయశ్శీలములుగల కన్యకను వివాహమై, పిమ్మట వేదాంతశాస్త్రవ్యాసంగము చేయువారై తిరుకచ్చికి వేంచేసి, అరుళాళప్పెరుమాళ్లను (శ్రీవరదరాజస్వామిని) సేవించి, తిరుప్పుగళ్లు అను స్థలమునందు యాదవప్రకాశుడు అను ఏకదండ సన్యాసియొద్ద పూర్వపక్షము చదువుచుండిరి. ఆకాలమునందు వీరితల్లి తోడబుట్టువయిన పెరియపిరాట్టిగారికి క్రోధననామసంవత్సర పుష్యశుద్ధపూర్ణిమా సోమవారమునాడు పునర్వసు నక్షత్రమునందు వైనతేయాంశమున పుత్రులై యుదయించి, పెరియ తిరుమల నంబిగారిచేతనే నామకరణము చేయబడిన గోవింధభట్టరు బ్రహ్మచర్యమునందే శాస్త్రాభ్యాసము చేయ నారంభించి, తరువాత గృహస్థాశ్రమమును అవలంబించి, యాదవప్రకాశునియొద్ద ఇళయాళ్వార్లు పూర్వపక్షము చదువుచున్నారన్న వర్తమానమువిని తామును వారితోడ పూర్వపక్షము చదువువారైవచ్చి యాదవప్రకాశునొద్ద చేరిరి.

అటుపిమ్మట ఒకనాడు ఇళయాళ్వార్లు యాదవప్రకాశునికి తలయంటుచు, అతడు శ్రుతివాక్యములకు చెప్పిన యపార్థములనువిని సహింపలేక కన్నీళ్లువిడువగా అందు ఒక బిందువు యాదవప్రకాశుని తొడమీదపడి తెర్లుచున్న నూనెబొట్టు పడ్డట్టు

చున్నదనగా యాదవప్రకాశుడు ఇదియేమియని యదిరిపడి తల యెత్తిచూచి యిళయాళ్వార్లు కన్నీళ్లు పెట్టుకొనుటనుజూచి, నీకు ఇంతదుఃఖము పొందనేలయని యడుగగా, భగవద్విషయిక ములయిన శ్రుతివాక్యములకు తత్త్వార్థమునువదలి విపరీతార్థము లను చెప్పితిరి. అందులకు నామనసుతపించి కన్నులనుండి శోక బాష్పములు వెడలనయ్యెను అని ప్రత్యుత్తరము చెప్పిరి. అందుకు అతడు కోపించి నేనుచెప్పిన యర్థము సరిపడనివాడవు నాయొద్ద నెట్లు చదివెదవు. ఇక నీకునాకు సరిపడదు పొమ్మని చెప్పెను. అంతట ఇళయాళ్వార్లు అతనితో చదువుటమానిరి. అంతటితో ఊరకుండక యాదవప్రకాశుడు ఇళయాళ్వారులను కపటస్నే హమున చేరదీసి చెరుపలసినదని తన శిష్యులతో దురాలోచన చేసి గోవిందభట్టరుగుండ రామానుజులను పిలిపించి అప్పటికి తగిన మంచిమాటలుచెప్పి ఆదరించి, నేను శిష్యులతోగూడ గంగాయాత్రపోబోయెదను. నీవును రమ్మని వెంటదీసికొని. బయలుదేరిపోవుచు మార్గములో గోవిందభట్టరును రామానుజు లను పరస్పరముకూడి యుండకుండ చేయుచువచ్చెను. ఇట్లు పోవుచుండగా, వింధ్యారణ్యములో ఇళయాళ్వారు జలస్పర్శ మునకైనిలిచి వెనుకచిక్కిరి. అప్పుడు అదేపనిగా నిలిచిన గోవింద భట్టరువారితో కలిసికొని యాదవప్రకాశుని కపటప్రయత్నము నెరిగించిరి. అంతట ఇళయాళ్వార్లు మిగుల వ్యాకులమునొంది కంచికి మరలిపోవువారై యాదారి వెంబడి ఒక వృక్షానినీడను గూర్చుండి యేమితోచక చింతించుచుండిరి. అప్పుడు పెరుమా ళ్లును పిరాట్టియు కిరాతదంపతులై యచటికివచ్చి: అయ్యా మీ రెవరు? ఎక్కడికి పోయెదరు? మేము సత్యవ్రతక్షేత్రమునకు పోయెదము. మీరును వత్తురేని మా వెంటరండు. ఒకరికొకరు తోడుగా పోవుదము అని పిలిచిరి. అందులకు ఇళయాళ్వార్లు నిర్మానుష్యమయిన యీమహారణ్యములో భగవత్కటాక్షమున

నింతమాత్రము తోడు దొరకెనుగదాయని సంతోషించి వారి వెంట బయలుదేరి నాటిసాయంకాలమునకు వింధ్యారణ్యమును దాటి ఆవెంబడి యొకమ్రానిక్రింద నాటిరాత్రి ముగ్గురును పస్తు పండుకొనిరి. అంతట కొంతసేపటికి బోయతబోయవానినిజూచి నాకు మిక్కిలి దాహమగుచున్నది. ఇక్కడ ఎక్కడను మంచి నీళ్లు చిక్కవా అని యడుగగా, బోయవాడు ఇక్కడికి దాపుననే యొక మంచినీళ్లబావి యున్నదిగాని యీచీకటిలో ఆబావికిపోను సరిపడదు. తెల్లవారనీ, కావలసినన్ని నీళ్లు త్రాగుదువుగాని అనెను. ఆమాటలువినుచున్న ఇళయాళ్వార్లు, అయ్యో పాపము ఆయిల్లాలికి ఎంతదప్పిగానున్నదోకదా? నేను పరదేశస్థుడనగుటచేత ఈసమయములో మంచినీళ్లు ఈమెకు తెచ్చి యియ్య సమర్థుడనుకాక యున్నాను. ఏమిచేయుదును. అని తమలోతాము విచారపడుకొనుచు నిద్రించి, తెల్లవారినిద్రనుండి మేలుకొని చూచునపుడు ఆయాలుమగ లిద్దరును కానరారైరి. వారు ఏతట్టుపోయిరోయని వెదకుచు కొంచెము ఇవతలికిరాగా, ఒకతోపును బావియు బావిచుట్టు కొందరు జనులును కానబడిరి. ఇళయాళ్వారు వారినిజూచి, ఓపుణ్యాత్ములారా! మీరుఎవరు? ఈతోపు ఎవరిది? ఇచ్చటికి దాపున ఏదేనియూరుకలదా? అని యడుగగా, వారు, ఇది కంచి వెంబడి సాలబావితోపు, అదిగో ఆకనబడునదియే పేరరుళాళనికోవెల, అని చెప్పిరి. అదివిని శ్రీరామానుజులు మేరలేని యానందమును ఆశ్చర్యమును పొంది, తొలునాడు తమ్ము వింధ్యాటవినుండి పిలుచుకొనివచ్చిన బోయవాడును బోయతయు శ్రీవరదరాజస్వామియు పెరుందేవితాయారును అగుదురు అని యూహించి, అయ్యో చేతికిచిక్కిన కల్పవృక్షములను తెలివిమాలి జారవిడచితినే, నాకంటె మూఢులెవ్వరగుదురని తమ్ముతాము నిందించుకొనుచు పెరుమాళ్ల కోవెలకు వేంచేసి పేరరుళాళనిని పెరుందేవిని సేవించి, తొలునాటి

రాత్రి మంచితీర్థముడుగుటను తలచుకొని, అది సాలబావితీర్థము తెచ్చి తిరుమంజనమునకును తిరువారాధనమునకును సమర్పింపుమని తమ్ము ఆజ్ఞాపించుటగా భావించి, నాడు మొదలు ప్రతిదినమును సాలబావితీర్థము తెచ్చి వరదుని తిరుమంజన కైంకర్యమునకై సమర్పించుచువచ్చిరి.

అక్కడ యాదవప్రకాశుడును తనవెంటవచ్చు శిష్యవర్గములో ఇళయాళ్వార్లు కానరాకపోగా వింధ్యారణ్యమార్గమునందు అచ్చటచ్చట వెదకి కానక వ్యాకులితచిత్తుడై గోవిందభట్టరుతోడ వారణాశికిపోయి గంగాస్నానము చేయునపుడు గోవిందభట్టరుచేతిలో ఒక లింగమువచ్చి యంటుకొనునట్లు ఒక మాయను కల్పించెను. అందువల్ల భట్టరు ఉళ్ళంగైకొండనయనార్ అను పేరితో శైవాచారము నవలంబించి యాదవప్రకాశుని యనుమతిచొప్పున అందుండి మరలివచ్చునపుడు మళ్లైమంగలం అనబడు తమగ్రామమునందు గంగలోలభించిన లింగమును ప్రతిష్ఠచేసి, కాళహస్తీశ్వరుడు కలలో కనబడి కాళహస్తికి రమ్మని చెప్పెనని యచ్చటికిపోయి ముద్రాకర్తృత్వమును వహించి నివసించియుండిరి. యాదవప్రకాశుడు కాంచీపట్టణము వచ్చిచేరి, అచ్చట తిరుమంజన కైంకర్యముచేయుచు వేంచేసియున్న ఇళయాళ్వారులనుజూచి, మిక్కిలి యాశ్చర్యపడి, తన యత్నము ఫలింపకపోయెనను మెరమెర మనసున నెలకొనగా, ఆచిహ్నమేమియు మొగమున తోచనియ్యక వారినిచేరదీసి పెక్కులు ఉపచారములుచెప్పి యూరడించి మరలచదివింప నారంభించెను.

ఈవృత్తాంతమంతయు శ్రీరంగములో వేంచేసియున్న యామునాచార్యులు విని, అట్టి మహనీయులనుచూచి రావలసినదియని నిశ్చయించి, శ్రీరంగమునుండి బయలుదేరి తిరుక్కచ్చికి వేంచేసి తిరుక్కచ్చినంబి తమ్ముజూచి సేవించి పిలుచుకొనిపోగా,

కోవెలకు వేంచేసి పేరరుళాళప్పెరుమాళ్లను పెరుందేవిత్తా యారును సేవించి, కోవెలకు ప్రదక్షిణముగావచ్చుచు తమకె దుట యాదవప్రకాశుని వెంట వచ్చుచున్న విద్యార్థులకూటమిని కటాక్షించి వీరిలో శ్రీరామానుజులు ఎవరని తిరుకచ్చినంబిని అడిగిరి. అప్పుడు తిరుకచ్చినంబి పుటముదీరిన బంగారుచాయ గలతిరుమేనుతో బాలసూర్యునివలె వెలుగుచు, శాస్త్రసిద్ధమయిన పురుషప్రమాణోన్నతిగలిగి నక్షత్రమధ్యమున వెలుగునట్టి చంద్రు డోయనదగిన ఆయాజానుబాహువు రామానుజులని వ్రేలితో చూపిచెప్పగా, శ్రీయాళవందారు ఇళయాళ్వారులనుజూచి తెలి సికొని కన్నుల నానందబాష్పములు వర్షింపగా కొలదికిమీరిన సంతోషమును వహించి, ఈ మహాపురుషుడు మద్దర్శనము నుద్ధరింపజాలువాడు అగును గాకయని యనుగ్రహించి, ఇప్పుడు మనము ఈయనతో సంభాషించునెడల పూర్వపక్ష పఠనము నకు అంతరాయము కలుగునను విచారముచేత రామానుజులతో సంభాషింపక యందుండికదలి నిజశిష్యులయిన భాగవతులును దామును శ్రీరంగమునకు వేంచేసిరి.

పిమ్మట యాదవప్రకాశుడు కాంచీపట్టణము నేలుచున్న చోళరాజుచే ప్రార్థింపఁబడి అతనికొమార్తను సోకిన బ్రహ్మరక్ష స్సును విడిపించువాడై, ఒకశిష్యునిబిలిచి ఆబ్రహ్మరాక్షసునితో యాదవప్రకాశులు నిన్ను పొమ్మన్నారు అనిచెప్పి రమ్మని చెప్పి పంపెను. ఆశిష్యుడు అట్లేచేయగా, బ్రహ్మరాక్షసుడు నేను యాదవప్రకాశుని పొమ్మన్నానని చెప్పుమని బదులుచెప్పి పంపెను. అందులకు యాదవప్రకాశుడు కోపించుకొని తానచ్చటికిపోయి ఉచ్చాటనమంత్రములను పునశ్చరణచేయగా, బ్రహ్మరాక్షసుడు ఈమంత్రములకు మామిడికాయలు రాలవు. నేనింతకంటె గొప్పమంత్రముల నెరుగుదును. నీపుట్టుపూర్వోత్తరములెల్ల నాకు విశదముగా తెలియును. వలయునన్న చెప్పెదనువినుము.

నీవు పూర్వజన్మమునందు మధురాంతకపు చెరువులోని పావలో వాసముచేయుచున్న ఉడుమవు. ఒకానొకప్పుడు కొందరు శ్రీవైష్ణవులు ఆచెరువునకువచ్చి నీరాడి పెరుమాళ్లకు ఆరగింపుచేసిన ప్రసాదమును సాపడిపోయిరి. వారు సాపడునప్పుడు కొన్ని మెతుకులు రాలగా వానిని నీవు భుజించితివి. భగవన్నివేదితమయిన యాభాగవతోచ్ఛిష్టమును భుజించిన పుణ్యవిశేషముచే ఈయుత్తమమయిన బ్రాహ్మణజన్మమెత్తి విద్వాంసుడవును అయితివి. నేనన్ననో పూర్వజన్మమునందు చతుర్వేద వేదాంగపారంగతుడైన బ్రాహ్మణోత్తముడను. ఒక యాగముచేయనుపక్రమించి, అందు సంభవించిన మంత్రలోపక్రియా లోపములవలని దోషముచే బ్రహ్మరాక్షసుడనైతిని. ఇటువంటి నన్ను నీవేమిచేయగలవు. ఇంక నేనయిన నేర్పులు చూపవత్తువేని నిన్నేమిచేయుదునో చూడుము. అని యట్టహాసముచేసి యదలించెను. అందులకు యాదవప్రకాశుడు కొంచెము జంకినవాడై, అట్లయిన నీవు ఎవరుపొమ్మన్న పోదువు అని యడుగగా, నీశిష్యగణములోపల సర్వశుభలక్షణలక్షితులై వేంచేసియుండు శ్రీరామానుజులు ఆనతిచ్చిరేని నేను పోదును అనెను. అదివిని యాదవప్రకాశుడు ఇళయాళ్వారులనుజూచి వింటిరా బ్రహ్మరక్షస్సుమాటలు అనెను. ఇళయాళ్వార్లు అతనియభిప్రాయము తెలిసికొని, బ్రహ్మరాక్షసు నుద్దేశించి నీయిష్టముచొప్పున నే నేపొమ్మనెదనుపో అని సెలవిచ్చిరి. అంతట బ్రహ్మరాక్షసుడు, స్వామీ దేవరవారి తిరువడి నాశిరస్సు సోకించినపక్షమున క్షణకాలమయినను ఇందునిలువక తొలగిపోదును అని, వారు అట్లేచేయగా, ఆచరణారవిందములను కన్నుల నొత్తుకొనుచు మారుమాటాడక తత్క్షణమే తాను వెడలిపోవుటకు గురుతుగా రాజద్వారముననెదుటనుండిన రావిచెట్టును విరుగద్రోసి రాచకొమార్తను విడిచిపోయెను. అందువల్ల యాదవప్రకాశుడు తనమనసున ముందు

కలిగియున్న యసూయ యుబ్బడింపగా మిక్కిలి సంతోషించిన వానివలెనే యభినయించి ఇళయాళ్వారుల మహిమను శ్లాఘించెను.

అనంతరము ఒకనాడు యాదవప్రకాశుడు ఒకశ్రుతివాక్యమునకు అపార్థకల్పనముచేయగా రామానుజులు ఆయర్థము సరికాదని యాక్షేపించి యందులవాస్తవార్థమును వివరించిరి. అందుకు అతడుకోపించి నీవు నాయొద్దచదువుటకు అర్హుడవు కావు పొమ్మనిచెప్పెను. అంతట ఇళయాళ్వార్లు అతనితోడి చదువుమాని తమతల్లిగారి యానతిచొప్పున తిరుకచ్చినంబిని (కాంచీపూర్ణులను) ఆశ్రయించి, వారినియమనమువలన యథాపూర్వముగా పేరరుళాళనికి తిరుమంజన కైంకర్యము చేయుచుండిరి.

ఇట్లు ఇళయాళ్వారు యాదవప్రకాశునితోడి చదువుమానుకొన్న వృత్తాంతము శ్రీయాళవందారువిని పేరరుళాళప్పెరుమాళ్లయెడల తాముచేసిన ప్రపత్తి సఫలమయ్యెనని హర్షించి, తాము రచియించిన స్తోత్రరత్నమును పెరియనంబి (మహాపూర్ణుల) చేత ఇచ్చి, నీవుదీనిగుండ ఇళయాళ్వారులను మాయొద్దకు వచ్చునట్లు చేయవలసినదని నియమించి, అదిమొదలు తిరుమేన నలకువచాతుకొని వేంచేసియుండిరి. మహాపూర్ణులును ఆచార్యనియమనమును శిరసావహించి కాంచీపట్టణమునకు వేంచేసి హస్తిగిరియందు నెలకొనియున్న శ్రీవరదస్వామిని సేవించి, అచ్చట ఆళవందారు సాదించిన స్తోత్రరత్నమును అనుసంధించి, సన్నిధిలో తీర్థప్రసాదములు స్వీకరించి, అందుండిపోయి ఇళయాళ్వార్లు సాలబావినుండి వేంచేయుమార్గములో స్తోత్రరత్నమును అనుసంధించుచు నివసించియుండిరి. అప్పుడు ఇళయాళ్వార్లు తిరుమంజనతీర్థముతీసికొని యామార్గముననే వచ్చుచు "స్వాభావికానవధికాతిశయేశితృత్వం నారాయణత్వయినమృ

ష్యతి వైదికః కః । బ్రహ్మాశ్శివశ్శతమఖః పరమస్స్వరాడి త్యేతేపి యస్య మహిమార్ణవవిప్రుషస్తే.'' అను నీశ్లోకమునువిని పరమాశ్చర్యమగ్నులై మహాపూర్ణుల పాదారవిందములపై సాగిలబడి దండములు సమర్పించి స్వామీ యీశ్లోకమును రచియించిన మహనీయు లెవరనియడుగగా వారు శ్రీవైష్ణవదర్శనోద్ధారకులగు ఆళవందారని యానతిచ్చిరి. మరల ఇళయాళ్వార్లుస్వామీ ఆమహనీయులు దాసునికి సేవనీయ లెట్లగుదురు ఆనతిండు అని యడిగి, వారు తమవెంటవచ్చిన సేవింపవచ్చునని చెప్పగా, వెంటనే ప్రయాణమై పెరియనంబిగారితోడ శ్రీరంగమునకు వేంచేయువారు కావేరిచేరువ తిరుకర్రంబనూరి రేవులో గుంపుగూడి యున్న శ్రీవైష్ణవసంఘమువలన శ్రీయాళవందారు తిరునాటికి వేంచేసి నారనువర్తమానము తెలియరాగా, ఆయామునులను లీలా విభూతియందు వేంచేసియుండగా సేవింపగానైతి మే యను విచారమును లోపల ఆపుకోలేక పెద్దపెట్టున నేడ్చుచు పోయి ఆళవందారు తిరుమేనును సేవించి, వారిశ్రీహస్తమునందు మూడువ్రేళ్లు ముడిగియుండుటనుజూచి, ఇదియేమియని యచ్చటి శ్రీవైష్ణవులనడిగి, వారు ఈవ్రేళ్లు ఇప్పుడే యిట్లుముడుగుకొన్నవి. కారణమేమో తెలియరాదు అనగా, ఇళయాళ్వార్లు వీరు తమ తిరువుళ్లమునం దేమోసంకల్పించుకొని యిట్లు వ్రేళ్లు ముడుచుకొనియుందురని నిశ్చయించి, అచ్చటిపెద్దలను అడుగగా, వారు సకలతత్వార్థ ప్రకాశకులగు శ్రీపరాశరుల తిరునామము నీలోకమునందు ఊర్జితపరుపవలెననియు, శ్రీవ్యాససూత్రములకు విశిష్టాద్వైతపరముగా భాష్యము రచియింపవలెననియు, తిరుమంత్రార్థమును ప్రతిపాదించునట్టి తిరువాయ్మొళికి వ్యాఖ్యానము చేయవలయుననియు ఆళవందారు సంకల్పించియుండిరని చెప్పిరి. అందుకు ఇళయాళ్వారు ఆచార్యకృప సంపూర్ణముగా కలిగి యుండునేని అడియనివలన నీమూడును నెరవేరును అనగా ఆ

మూఁడువ్రేళ్లను చక్కఁగాఁ జాఁగెను. అవిచూచి అక్కడ వేంచేసియున్న భాగవతోత్తములందరు ఆశ్చర్యమునుపొందుటయేగాక, ఇకను దేవరవారే దర్శనప్రవర్తకులు కాఁగలవారలు అని రామానుజులను మంగళాశాసనము చేసిరి.

అనంతరము ఇళయాళ్వారులు పెరియనంబిగారిని దండము సమర్పించి, ఆళవందారు సేవ తమకులభింప ననుగ్రహింపకపోయెనేయను సంతాపముచే శ్రీరంగనాథుని సేవింపఁబోక మరల తిరుకచ్చికి వేంచేసి తిరుకచ్చినంబిని సేవించి సర్వవృత్తాంతమును వారికి శ్రుతపరుపఁగా, వారును ఆచార్యవియోగమునకు కొంత సంతాపము నొందినవారై శ్రీచూర్ణపరిపాలనమును తిరువధ్యయనమును యథావిధిగా నడపిరి. ఇళయాళ్వార్లును తిరుకచ్చినంబిగారి చరణారవిందములయందు అత్యంతభక్తియుంచి వారి నాశ్రయించువారై యొకనాఁడు వారిని తమ తిరుమాళిగకు ఆరగింపరమ్మని ప్రార్థించి, అందులకు వారు అంగీకరింపఁగా బహువిధములయిన భక్ష్యములతో తళిగ చేయించి, తిరువారాధనము చేసి తిరుకచ్చినంబిని పిలుచుకొని వచ్చుటకై దక్షిణపుమాడవీథిని బయలుదేరిరి. అచ్చటనంబియు వేగవతిలోనీరాడి యెల్ల యనుష్ఠానములు తీర్చుకొని యుత్తరపుమాడవీథిని ఇళయాళ్వార్ల తిరుమాళిగకు వేంచేసి యారగించి తిరువాలవట్టకైంకర్యమునకై పోవలయునని యతిత్వరితముగ శ్రీవరదుని సన్నిధికి వేంచేసిరి. అంతట ఇళయాళ్వారులదేవిగారు నంబియారగించిన ఆకును కట్టితోఁగ్రుచ్చియెత్తి వెలుపల పారవేసి, ఆస్థలమును గోమయముతో అలికి శుద్ధిచేసి స్నానము చేయుచుండఁగా నంబిని వెదకిబోయిన ఇళయాళ్వార్లు వారిని కానక యెక్కడపోయిరోయని విచారించుచు తిరుమాళిగకువచ్చి భార్యనుజూచి యేల స్నానము చేసెదవు, అని యడుగఁగా, ఆమె తిరుకచ్చినంబివచ్చి యారగించి ఆలవట్టపు కైంకర్యమునకై వేంచేయుటయు, తాను

వారారగించిన ఆకును కఱ్ఱతో మెత్తి పారవేసి, శూద్రుని యెంగిలాకు తాకిన మైలకై స్నానము చేయుటయు విన్నపము చేసెను. అదివిని రామానుజులు ఆమెపై కోపించుకొని యిష్టసిద్ధి కాక పోయినందులకు తిరువుళ్లము తపింపగా నంబిసన్నిధానమునకు వేంచేసి, స్వామీ అడియడు కొన్ని సంకల్పములు కలవాడై యున్నాడు, అవి నెరవేరునట్లు అనుగ్రహింపగలందులకై దేవరవారు పేరరుళాళనితో విన్నపము చేసి, అందులకాయేలినవాడు సాధించు విషయములను అడియనికి శ్రుతపరుపవలయునని తమ మనోగతమును వారితో విన్నపించిరి. నంబి అందులకు హర్షించి నాటిరాత్రి యేకాంతసేవాసమయమునందు శ్రీమన్నారాయణుని దివ్యమంగళగుణానుసంధానము చేసి ప్రార్థింపగా, ఆయేలినవాడు, మేమే పరతత్వము, భేదమే దర్శనము, ప్రపత్తియే ఉపాయము, అంత్యకాలమునందే తలపవలెనను నియమము లేదు. దేహత్యాగమాత్రమున మోక్షము స్వతస్సిద్ధము. పెరియనంబి (మహాపూర్ణుల) తిరువడినాశ్రయించి ప్రపత్తిచేయుము అని ఇళయాళ్వారులకు శ్రుతపరుపుమని ఆనతిచ్చెను. తిరుకచ్చినంబి కృతార్థోస్మి యనుచు నాదివ్యసూక్తులు తెల్లవారగానే ఇళయాళ్వారులతో ఆనతిచ్చిరి. వారును ఆయారు రహస్యములను భగవన్నియమనము చొప్పున పరిగ్రహించి హర్షించి తిరుకచ్చినంబి తిరువడుగులకు దండము సమర్పించి నిలిచిరి. నంబియు పేరరుళాళప్పెరుమాళ్ల (శ్రీవరదరాజుల) తిరువుళ్లమును, ఇళయాళ్వార్ల యొక్క అభిప్రాయమును ఏకీభవించియున్నవని యెంతయు నాశ్చర్యము నొందినవారలైరి.

ఇక్కడ ఇట్లుండగా అక్కడ శ్రీరంగములో శ్రీయాళవందారు తిరువడినాశ్రయించిన శ్రీవైష్ణవశిఖామణు లందరును గూడి పెరియనంబిగారిని ఇక మనదర్శనమునకు ప్రవర్తకులు కాగలవారు ఎవరు అని యడుగగా, పెరియనంబిగారు, శ్రీయాళ

వందారు చరమదశయందు ముడుచుకొన్న వ్రేళ్లను చాచునట్లు
చేసిన మహానుభావులు ఇళయాళ్వార్లు ఉండగా ఎవరని సందే
హింపనేలయని యానతిచ్చిరి. అదివిని యావైష్ణవోత్తములు
దేవరవారే వారిని కటాక్షించి దర్శనప్రవర్తకత్వమునకు పాత్రు
లనుగాజేసి యిచ్చటికిరప్పింప తిరువుళ్లపట్టవలెను అని ప్రార్థిం
చిరి. పెరియనంబివారి ప్రార్థన నంగీకరించి, అప్పుడే కుటుంబ
సహితముగా బయలుదేరి కాంచీపట్టణమునకు వేంచేయుచు
మధ్యేమార్గమునందుగల మధురాంతకము అను దివ్యదేశములో
ఏరికాత్తపెరుమాళ్ల కోవెలలోదిగి యుండగా, తిరుకచ్చినుండి
వారిసేవార్థము వేంచేయుచున్న ఇళయాళ్వార్లును అచ్చటికి
వచ్చి పెరియనంబిగారిని సేవించి, ఆడబోయిన తీర్థ మెదురయ్యె
నని పరమానందము వహించిరి. పెరియనంబిగారును ఇదియేమి
వెదకబోయినతీగ కాళ్లపెనగొన్నట్టు ఈవైష్ణవశిఖామణి మన
లను ఎదురుకొనివచ్చెనని యరుదంది యత్యంత సంతుష్టులగుచు
తమకు దండములు సమర్పించిన ఇళయాళ్వార్లను గ్రుచ్చియెత్తి
రొమ్మున నొత్తుకొనిరి. అంతట శ్రీరామానుజులు పేరరుళాళని
నియమనమును తమరాకను ఆమహాపూర్ణులకు శ్రుతపరిచి, స్వామీ
అడియనిని కృతార్థునిజేయ తిరువుళ్లపట్టుడు అని ప్రార్థింపగా
వారు పేరరుళాళని సన్నిధికివచ్చి తిరుమంత్రము నుపదేశించెద
మని యానతిచ్చిరి. అందులకు ఇళయాళ్వార్లు గురురాయా
దేవరవారు అట్లు సాధించుట దాసునివలని వాత్సల్యమును కొరత
పరుచుట. "ఆలస్యమమృతంవిషమ్" అన్నట్టు వృథాకాలయా
పనమువలన కార్యము చెడును. మునుపు శ్రీయాళవందారు సన్ని
ధిని దేవరవారు గ్రహించిన పరమార్థమును దాసునకు సద్యోను
భూతంబుగా ననుగ్రహింపుడు. అని ప్రార్థించిరి. ఆప్రార్థన
నంగీకరించి యాకోవెలలోనున్న వకుళవృక్షమునొద్దకు ఇళయా
ళ్వార్లను పిలుచుకొనిపోయి పెరియనంబిగారు వారికి పంచ

సంస్కారమును తిరుమంత్రమును ప్రసాదించి నాడెల్లనుండి, మరునాడు తెల్లవారి ఇళయాళ్వార్లను వెంటరాగా తిరుక్కచ్చికి వేంచేసి శ్రీహస్తిగిరియందు నెలకొనియుండు పేరరుళాళప్పెరుమాళ్లను సేవించి, ఇళయాళ్వారుల తిరుమాళిగలో నేయునికి చేసికొని ద్రావిడవేదము, వ్యాససూత్రములు, దర్శనరహస్యములును శ్రీరామానుజులకు కాలక్షేపము సాదించుచు వేంచేసియుండిరి.

అట్లు కాలక్షేపము జరగుచుండగా ఒకనాడు శ్రీరామానుజులు తమకు అభ్యంగము చేసిన యొక శ్రీవైష్ణవునకు పురాతనమేమయిన నుండిన కొంచెము పెట్టుమని తమదేవులకు ఆజ్ఞాపింపగా ఆమె రాత్రిప్రసాదమే మిగులలేదు అని ప్రత్యుత్తరము చెప్పెను. అప్పుడు ఇళయాళ్వార్లు ఆవిషయమునందు సంశయించి తామే లోపలపోయి పాత్రమును శోధింపగా ఇద్దరైనను సాపడుటకు చాలునంత ప్రసాదము ఉండెను అదియెత్తి ఆమెకు చూపి యదియాదిగా ఆమె విషయమునందు మిక్కిలి కోపముగలవారై యుండిరి. మరియొకనాడు మంచితీర్థమునకు పోయినప్పుడు బావియొద్ద పెరియనంబిగారి దేవులకును ఇళయాళ్వారు దేవులకును తీర్థము చేదునపుడు చేదలు తాకినందులకై గొప్ప కలహమాయెను. అది తెలిసి మహాపూర్ణులు తమదేవులపై కోపించుకొని ఇళయాళ్వార్లు నీరాటమునకు వేంచేసియున్న సమయమునందు వారికి తెలియకుండ బయలుదేరి శ్రీరంగమునకు వేంచేసిరి. ఇళయాళ్వార్లును అనుష్ఠానము తీర్చుకొని తిరుమాళిగకు వేంచేసి పెరియనంబిగారిని సేవింపబోగా వారు సేవసాదింపరైరి. అందులకేమి కారణమని విచారించి, వారు శ్రీరంగమునకు వేంచేసిన వృత్తాంతము తెలిసి, తిరువుళ్ళము కలగి తమదేవులను జూచి తొలుత తిరుకచ్చినంబిగారి విషయమునను, పిమ్మట తైలమంటిన శ్రీవైష్ణవుని విషయమునను, ఇప్పుడు ఆచార్యపత్ని

విషయమునను అపచారపడితివి కాబట్టి నీతోడి సాంగత్యము మాకు కొరగాదని చెప్పి, తత్‌క్షణమే ఆమెను పుట్టినింటికిపంపి వేసి, అంతట పేరరుళాళని సన్నిధికిపోయి ఆమోదినవానిని ఆచార్యులుగావరించి త్రిదండసన్యాసమును స్వీకరించి, అర్చక ముఖమున పేరరుళాళనివలన యతిరాజు అను తిరునామమును పడసి, తిరుకచ్చినంబి నియమనముచొప్పున మఠమును కల్పించుకొని పేరరుళాళని కటాక్షమునకు పాత్రులయి అమఠమునందు వేంచేసియుండిరి.

తరువాత కొన్నాళ్లకు యతిరాజులు ఆళవందారు తిరువుళ్లముచొప్పున దర్శనోద్ధరణము చేయుటకు సాధకముగా సర్వశాస్త్రనిపుణులగు ఉళ్లంగైకొండ నయనారును (గోవింద భట్టరును) దిద్దదలచి, ఆయభిప్రాయమును పెరియతిరుమలనంబి (శ్రీశైలపూర్ణుల) సన్నిధికి చెప్పిపంపి శ్రీమన్నారాయణ దివ్య మంగళగుణానుభవముచేయుచు కాలయాపనము చేయుచుండిరి.

ఇట్లు శ్రీరామానుజులు ఆశ్రమస్వీకారముచేసి భగవద్గుణానుభవలోలురై వేంచేసియుండు వృత్తాంతము వారిభాగినేయుడైన మొదలియాండాన్ (దాశరథి) విని, కూరత్తాళ్వార్లకు ఆ సంగతి శ్రుతపరిచి వారును తామును పెరుమాళ్లకోవెలకువచ్చి యతిరాజులను సేవించి వారిసన్నిధిలో పంచసంస్కార తిరుమంత్రోపదేశములనుపడసి సేవచేయుచుండిరి. ఇందు మొదలియాండాన్ చైత్రమాసము పునర్వసు నక్షత్రమునం దవతరించినవారు. అవతారస్థలము పచ్చైవణ్ణప్పెరుమాళ్లకోవెల అనబడు పురుషమంగలము. వీరికి వాధూలదేశికులు, శ్రీవైష్ణవదాసులు, శ్రీరామానుజపాదుక అను పర్యాయ తిరునామములును గలవు. కూరత్తాళ్వారు (కూరేశులు) పుష్యమాసము హస్త నక్షత్రమునం దవతరించినవారు. వీరి అవతారస్థలము కూరము. వీరి తండ్రిగారు రామసోమయాజులు. వీరు శ్రీరామాంశ సంభ

వులు. వీరికి శ్రీవత్సచిహ్నులు, నడయాడుపతంజలి, యతీంద్ర చరణులు, అనుపర్యాయ తిరునామములుగలవు. ఇట్టి యీకూరేశదాశరథులు యతిరాజుల నెడబాయక పరిచర్యచేసి సేవించుచుండగా, శ్రీవరదరాజుయొక్క నిత్యసేవవలన యతిరాజుల యందు భక్తియుదయించిన యాదవప్రకాశుని తల్లి శ్రీరామానుజదర్శనమునందు రుచిగలదై తనకొమారుడును ఈదర్శనమును అవలంబించినపక్షమున కృతార్థుడు అగునని తలచుచు శ్రీహస్తిగిరిసోపానము లెక్కునపుడు 'అదిమేలు' అని యుపశ్రుతియు విననయ్యెను. అంతట నావృద్ధురాలు తన కుమారునియొద్దకుపోయి అతనితో తనతలపును తానువిన్న యుపశ్రుతియు తెలియజేసి, నాయనా నీవును యతిరాజుల నాశ్రయించి వారివలెనే శిఖాయజ్ఞోపవీతములను ధరించి త్రిదండసన్యాసివి అగుము. అని యొత్తిచెప్పగా విని యాదవప్రకాశుడు ఇళయాళ్వార్లు తన యొద్ద చదువునపుడు వివరించిన మంచియర్థములు మనసుననాటి యున్నందునను, గంగాయాత్ర పోవునప్పుడు తనవంచన తెలిసి వెనుకకు మరలినప్పుడు ఇళయాళ్వార్లను శ్రీవరదరాజు పెరుందేవీ సహితుడై కిరాతరూపమున సాక్షాత్కరించి అనుగ్రహించిన సంగతివిని యున్నందునను, బ్రహ్మరాక్షసునివలన శ్రీరామానుజ ప్రభావమును తనపూర్వ వృత్తాంతమును విన్నవాడైనందునను మాతృవాక్యమును ఆదరించి, అమ్మా, నీవు చెప్పినచొప్పున ఆయుత్తమాశ్రమమును అవలంబించుటకును, శ్రీయతిరాజులను భక్తిపూర్వకముగ సేవించుటకును, ఇప్పటి యీయాశ్రమస్వీకారమువలని దోషము పరిహారమగునట్లు భూప్రదక్షిణము చేసి వచ్చినగాని యనువుపడదు. అందులకు సామర్థ్యము చాలని వార్థకావస్థ నాకు సంప్రాప్తమగుచున్నది. ఇందులకు నేనేమి చేయుదును. అని తల్లితో చెప్పి మహావిచారముతో నుండెను. అది తెలిసి శ్రీవరదరాజు నాటిరాత్రి అతనికలలో సేవసాదించి, నీకీ

విచారమేల భూప్రదక్షిణమునకు మారుగా మన ఇళైయాళ్వారులను ప్రదక్షిణముచేసి, ఆయన యనుగ్రహమునకు పాత్రుడవై ముక్కోల మొదలగువానిని పరిగ్రహింపుము. అని యానతిచ్చెను. ఆయానతియందు అతనికి ప్రత్యయముపుట్టక తిరుక్కచ్చినంబిగారి సన్నిధికిపోయి తనయభిప్రాయమును విన్నవించి, ఈవిషయమునందు పేరరుళాళని తిరువుళ్లము ఎట్లున్నదో తెలిసికొని, అడియనికి తెలుపవలయునని ప్రార్థింపగా, నంబియు యాదవప్రకాశుని విజ్ఞాపనమును పేరరుళాళని సన్నిధిలో నివేదించి, అందులకు పెరుమాళ్లు తాము తొలునాడు కలలో సేవసాదించి నియమించిన విషయము నేమరల నానతియ్యగా, మరునాడు నంబి ఆసంగతి యాదవప్రకాశునికి తెలియజేసిరి. అంతట అతడు అది పేరరుళాళని నియమనమేయను నమ్మికగలవాడై రామానుజుల సన్నిధానమునకుపోయి వారి తిరువడుగులపై సాగిలబడి దండము సమర్పించి తానుగన్నకలయు తిరుక్కచ్చినంబిగారు ఆనతిచ్చిన విషయమును విన్నవించి, వారికి ప్రదక్షిణముచేసి, వారి యనుగ్రహముపడసి త్రిదండశిఖాయజ్ఞోపవీతములను పరిగ్రహించి త్రిదండసన్న్యాసియయ్యెను. అప్పుడు యతిరాజజియ్యరు ఆయనకు గోవిందజియ్యరు అని పేరుపెట్టి పంచసంస్కారాదులచే పరిశుద్ధునిజేసి, ఆయనచే రచియింపబడిన యతిధర్మసముచ్చయము అను గ్రంథమును తిరువుళ్లపట్టిరి. ఇట్లు కృతార్థతను పొందిన గోవిందజియ్యరు కొంతకాలము భగవద్గుణానుభవము చేయుచు ఆచార్యసన్నిధిలోనే నివసించియుండి అనంతరము పరమపదమును పొందెను. ఇట్లు యతిరాజులు తిరుక్కచ్చిలో లీలావిభూతియందు వేంచేసియుండగా, వారిని తమ సన్నిధికి రప్పించుకోదలచి శ్రీపెరియపెరుమాళ్లు (రంగనాయకులు) పేరరుళాళని సన్నిధికి శ్రీముఖముపంపగా శ్రీవరదరాజులు ప్రియవస్తువునందలి యపేక్ష యెల్లవారికి నొకటిగానే యుండును

కాబట్టి మీవలెనే రామానుజుల సాన్నిధ్యసేవ మేమును అపే
క్షించినవారమయి యున్నారము అని ప్రత్యుత్తరము పంపెను.
ఈసంగతి రంగనాథుని సన్నిధిలో వేంచేసియుండు పెరియ
నంబి మొదలగువారువిని ఔరా యతిరాజులపై పేరరుళాళనికి
గల కరుణ అని ఆశ్చర్యపడి, యతిరాజులను పెరియపెరుమాళ్ల
సన్నిధికి రప్పించు నుపాయము ఏదియని విచారించి హస్తిగిరీ
శుడు గానలోలుడు, గానవిద్యావిశారదులగు మన తిరువరంగ
ప్పెరుమాళరయరు అచ్చటికి వేంచేసి పేరరుళాళని సన్నిధిలో
దేవగానసరణిని భజనచేసి, ఆయేలినవాని యనుగ్రహముపడసి
యతిరాజులను అంపించుకొని రావలసినవారు, అని నిశ్చయించి,
తమ యభిప్రాయమును తిరువరంగప్పెరుమాళరయరుతో విన్న
వించిరి. అంతట అరయరు శ్రీరంగమునుండి వెడలి తిరుకచ్చికి
వేంచేయగా కాంచీపురములో వేంచేసియుండెడు వీరి బంధువు
లగు వరందరుం పెరుమాళరయరు ఎదురుకొనివచ్చి తమ తిరు
మాళిగకు వేంచేపుచేసికొనిపోయి ఆరగింపజేసి పేరరుళాళని
సన్నిధికి పిలుచుకొనిపోగా, వారువరముని తిరువడుగులను సేవించి
దేవగానపద్ధతిని పాడనారంభించిరి. ఆగానసారస్యమునకు శ్రీ
దేవరాజు హర్షించి చల్లగకటాక్షించి భాగవతోత్తమా నీగాన
మునకుమెచ్చితి నీవు ఏమికోరినను కాదనక యిచ్చెదను అడు
గుము అని యానతిచ్చి, అరయరు ఓయేలినవాడా శ్రీరామాను
జులను దాసునివెంట పంపునట్లు తిరువుళ్లపట్టవలెననగా, తమకు
సమ్మతిలేకయుండియు ముందు ఏమికోరినను ఇత్తునన్నమాటను
బట్టి శ్రీదేవప్పెరుమాళ్లు అట్లే యిచ్చితిమని యానతిచ్చి యతిరా
జులను తిరువరంగప్పెరుమాళరయరుతో గూడ తిరువరంగము
నకు వేంచేయ నియమించెను. ఇట్లు అరయరు యతిరాజులను
తమ సన్నిధానమునకు వేంచేపుచేసికొనివచ్చు వృత్తాంతము
పెరియపెరుమాళ్లు తెలిసికొని సేనమొదలియాండాన్ పెరియ

నంబి మొదలగు వారిని పరిజనసహితముగా వారికి ఎదుర్కోలు పంపి తాము ముఖమండపమున వేంచేసియుండిరి. రామానుజ యతీంద్రులును తమకెదురువచ్చిన పెరియనంబి మొదలుగాగల వారికి పెక్కులు దండప్రణామములుచేసి, పరమానంద భరితులగుచు కన్నులనుండి యానందబాష్పములు వర్షింపగా సన్నిధికి వేంచేసి శ్రీరంగనాథుని సేవించి, తిరుప్పరివట్టము శ్రీశఠగోపము మొదలగు మర్యాదలనుపడసి, అది మొదలు శ్రీరంగనాథుని నియమనముచొప్పున కోవెలయధికారమును వహించి, అకళంక నాట్టాళ్వారు అనువారిని తమతిరువడి నాశ్రయింపజేసి వారిని కోవెల కావలియందు నియమించి, ఏలోపమును లేకుండ శ్రీరంగనాథుని నిత్య కైంకర్యమును నడపుచు అందులకు కావలసిన యుపకరణ ద్రవ్యములను సేకరించుటయందు బద్ధశ్రద్ధతో ప్రవర్తించుచుండిరి.

అట్టికాలమునందు శ్రీగోవిందభట్టరు పెరియ తిరుమలనంబి గారివలన దిద్దుబాటుచేయబడి వారివల్లనే పంచసంస్కారాది శ్రీవైష్ణవచిహ్నములనుపడసి విశిష్టాద్వైతమే వేదవిహితమయిన మతమనియు శ్రీమన్నారాయణుడే నిత్యవస్తువనియు, అందులకు ప్రాపకము ఆచార్యతిరువడియేయనియు తెలిసి ద్వయానుసంధానముచేయుచు వేంచేసియుండిరి. ఆవృత్తాంతమునువిని యతిరాజులు పరమానందభరిత చిత్తులైరి. అంతట ఒకనాడు శ్రీయతిరాజులు పెరియనంబిగారిని సేవించి స్వామీ దేవరవారు ఆళవందారువలన పడసిన రహస్యములనెల్లను అడియనికి నుపదేశించి కృతార్థుని జేయరేయని ప్రార్థింప, వారు కొన్ని రహస్యములను తెలిపి, తక్కినవాని నుపదేశింప తిరుక్కోట్టియూరు నంబి (గోష్ఠీపూర్ణులు) కర్తలు అని యానతిచ్చిరి. అంతట యతిరాజులు తిరుక్కోట్టియూరికి వేంచేసి నంబిగారికి దండములు సమర్పించి, తమకోరికను విన్నవింపగా, వారును వీరియధ్యవసాయము నెరుగవలయునని మొగమిచ్చి మాటాడకపోయిరి.

అందుల కారణము తెలియకయే రామానుజులు మరల శ్రీరంగమునకు వచ్చిరి.

అనంతరము ఒకానొకప్పుడు తిరుక్కోట్టియూరునంబి ఉత్సవము సేవింపవలెనని శ్రీరంగమునకు వేంచేయగా, శ్రీరంగనాథుడు మనరామానుజులకు రహస్యార్థములను ఉపదేశింపుమని నియమించెను. అందులకు నంబి, ఒకసంవత్సరకాలమయిన శోధింపక యుపదేశింపగూడదని శాస్త్రముఖమున సాధించిన దేవరవారి నియమనమును ఎట్లు మీరుదును అనగా పెరియపెరుమాళ్లు ఆనియమము శిష్యలక్షణములన్ని పూర్తిగాలేనివారి విషయమునందు అవలంబింపవలసినదేకాని సర్వలక్షణ సమాన్వితులయిన యిట్టివారి విషయమున అవలంబింపవలసినది కాదు. అని యానతిచ్చెను. అందుమీద గోష్ఠీపూర్ణులు రామానుజులను గోష్ఠీపురమునకురమ్మని నియమించి తమాంతట తాము వేంచేసిరి. పిమ్మట రామానుజులు తిరుక్కోట్టియూరికి వేంచేసి నంబిగారిని సేవించి నిలువగా, వారు ఇదిసమయము కాదు ఇంకొకవేళ రమ్మని నియమించిరి. రామానుజులు అదియు నొక యనుగ్రహచిహ్నముగా గ్రహించి మరల శ్రీరంగమునకువచ్చిరి. పిమ్మట ఇట్లే పదునెనిమిది పర్యాయములు ఇళయాళ్వార్లు తిరుక్కోట్టియూరికిని శ్రీరంగమునకును పోకరాకలు చేసిరి.

అటుపిమ్మట ఒక సమయమునందు పెరియపెరుమాళ్లను సేవింపవచ్చిన గోష్ఠీపూర్ణుల శిష్యులను కొందరనుజూచి, ఇళయాళ్వారు వారికి దండములు సమర్పించి మిక్కిలి యార్తితో తమకోరికను విన్నవించిరి. వారును నంబిగారిసన్నిధిలో వీరి యార్తిని విన్నపము చేసిరి. అందులకు నంబిగారు హర్షించి త్రిదండపవిత్రములతో తామమాత్రము రావలసినదని రామానుజులకు వర్తమానముపంపిరి. అందులకు ఇళయాళ్వారు సంతోషించినవారై కూరత్తాళ్వార్లను మొదలియాండానును వెంట

కాగా తిరుకోట్టియూరికి వేంచేసి, నంబిగారిసన్నిధిని పొంది, దండములు సమర్పించి బద్ధాంజలులై నిలువగా, నంబిగారు ఇది యేమి ఈరాక అని భావగర్భముగాపలికి యూరకుండిరి. ఇళయాళ్వారు అందుల భావమును గ్రహించి, దేవరవారు దండపవిత్రములతో రావలసినదని నియమించితిరి నియమానుచొప్పున దండమును పవిత్రమునైన యీయిరువురితోడ దాసుడు వచ్చినాడు. అని విన్నవించిరి. నంబిగారు అట్లయిన ఇందు, దండమెవరు, పవిత్రమెవరు అని అడిగి, ఇళయాళ్వారు దండము మొదలియాండాను అనియు, పవిత్రము కూరత్తాళ్వారు అనియు వివరింపగా, ఈరహస్యములను వీరుతప్ప ఇతరులకెవరికిని ఉపదేశింపవలదు అని నియమించి చరమార్థము తప్ప తక్కిన రహస్యములన్నియు నుపదేశించిరి.

ఇట్లు ఇళయాళ్వారు తిరుకోట్టియూరు నంబిగారివలన సకల రహస్యార్థములను పరిగ్రహించి, ఇతరులు బోధించునట్టి యనర్థములే పరమార్థమనియెంచి చెడిపోవుచున్న చేతనులను కడతేర్పగోరినవారు గనుక తమ యాస్థానమునందు సేవచేయుచున్న శ్రీవైష్ణవులకు అందరకును ఆరహస్యార్థములను ప్రసాదించిరి. ఈవృత్తాంతమును తిరుకోట్టియూరు నంబిగారు విని కలుషించి, రామానుజులను తమ సన్నిధానమునకు రప్పించి, ఆచార్యనియమనమును ఉల్లంఘించువారు పొందగలగతియేదో తెలియునా? అనగా, దుర్గతియే అని ప్రత్యుత్తరము చెప్పిరి. అందులకు నంబిగారు, ఎవరయిన తెలిసి తెలియక యేమేనితప్పు చేసినను చేయుదురుగాని, ఇట్లు తెలిసితెలిసి యపచారమునకు ఒడిగట్టుదురా అనిరి. ఆమాటవిని ఇళయాళ్వారు ఈయపచారమువలన దేవరవారి తిరువడిసంబంధముగలిగి యనేకులుచేతను లుజ్జీవింతురుగాన అడియడు ఒకడు నరకమును పొందుట హెచ్చుకాదు అనుకొంటిని. అనగా నంబిగారు ఆయుక్తియుక్త

మయిన యభిప్రాయమునకు మెచ్చుకొని మన్నాథా అను నర్థముగల ద్రావిడోక్తిచే 'ఎంబెరుమానారే' అని యతిరాజులను చేరదీసి గాఢాలింగనము చేసికొని, ఇక మీకు తక్కిన రహస్యములను సయితము తెలిపెదను ఇప్పుడు పోయిరండు అని నియమింపగా, ఎంబెరుమానారు, వారి నియమనము చొప్పున అప్పుడు శ్రీరంగమునకు వచ్చి, పిమ్మట తగిన సమయమునందు ఏకాంతముగా తిరుక్కోట్టియూరికి వేంచేయగా నంబిగారు పరతత్వ ప్రతిపాదకమయిన చరమశ్లోకార్థమును సైతము ప్రసాదించి పంపిరి. పిమ్మట ఎంబెరుమానారు గోష్ఠీపూర్ణుల నియమనముపడసి మాసోపవాస నియమముచే పరిశుద్ధులయిన కూరత్తాళ్వార్లకును ఆయర్థము నుపదేశించిరి. అది తెలిసి మొదలియాండాన్ తమకును ఆయర్థమును ప్రసాదింపగోరగా నంబిగారి నియమనము కూరత్తాళ్వారుతప్ప ఇతరులకు ఉపదేశింపగూడదని కనుక నీవు వారి సన్నిధికిపోయి అనుమతినిపడసి రమ్మని చెప్పిరి. మొదలియాండాను ఆయానతి శిరసావహించి, ఆరునెలలు నంబిగారి సన్నిధి నాశ్రయించి సేవచేసి, వారిచే నీయందు మూడులోపములు గలవు. అవితొలగినయెడ ఎంబెరుమానారు తామే యారహస్యమును నీకు ప్రసాదింతురు అని యానతిచ్చి, తమ చరణారవిందములచే మొదలియాండాన్ తిరుముడి నలంకరించి పంపినంతట, ఎంబెరుమానారు ఆరహస్యమును మొదలియాండానుకును ఉపదేశించి, ఇప్పటికిగదా మీరు నాపవిత్రమును దండముననుటకు తగినవారైతిరి అని కూరత్తాళ్వార్లను దాశరథిని ప్రశంసించిరి.

పిమ్మట కొన్నాళ్లకు తిరుక్కోట్టియూరునంబి శ్రీరంగమునకు వేంచేసి యెంబెరుమానారునుజూచి తిరుమాలెయాండాన్ (శ్రీమాలాధరుల) వద్ద తిరువాయ్మొళ్రికి అర్థవిచారము చేయవలసినదని నియమించిరి. అంతట ఎంబెరుమానారు తిరుమాలె

యాండాన్ వద్ద తిరువాయ్మొళ్ళి అర్థము వినుచుండి కొన్ని పాశురములకు కొన్ని సూక్ష్మార్థములను చెప్పగా, తిరుమాలెయాండాన్ ఈయర్థములు ఆళవందారు సాధించినవికావు. ఇట్టి లేనిపోని యర్థములను కల్పించుట సంప్రదాయ విరుద్ధము. అని తిరస్కరించి, నాటితో కాలక్షేపము నిలిపివేసి యూరకుండిరి. ఈవృత్తాంతము తిరుకోట్టియూరునంబివిని శ్రీరంగమునకు వేంచేసి తిరుమాలెయాండానును కాలక్షేపము యథావిధిగా జరగుచున్నదాయని యడుగగా, వారుజరగిన వర్తమానమును విన్నవించిరి. అదివిని తిరుకోట్టియూరునంబి ఎంబెరుమానారు చెప్పిన యర్థములేవియని యడిగి తెలిసికొని, ఈయర్థములు ఆళవందారు సాధింపగా నేనువిని యుంటిని. వానిని పరిహరించుట సరికాదు అనిచెప్పి, వారును తామును ఎంబెరుమానారు మఠమునకు వేంచేసి యెప్పటివలె కాలక్షేపము జరగునట్లు నియమించి తిరుకోట్టియూరికి వేంచేసిరి. పిమ్మట కాలక్షేపము జరగునప్పుడును యతిరాజులు ఒకపాశురము నర్థమువిని, ఈ పాశురమునకు ఆళవందారు ఈయర్థమును సాధించియుండరు అనగా, తిరుమాలెయాండాన్ ఆళవందారు హృదయము వారి సన్నిధిలో పఠించినవారికంటె విశేషముగా తెలిసినట్టు చెప్పెదరే ఇదియేమియనగా, గురుసన్నిధి యెరుగని యేకలవ్యునికి గురుభక్తివలన దివ్యాస్త్రముల ప్రయోగోపసంహార మంత్రములు గోచరించినట్టు దాసునికి ఆళవందారు అనుగ్రహబలము వలన వారిసన్నిధిలో పఠింపకున్నను వారుసాధించిన యర్థములిట్టివని తోచుచున్నవి. అని ప్రత్యుత్తరము చెప్పిరి. అందులకు తిరుమాలెయాండాన్ మెచ్చుకొని కొన్నాళ్లలోపల తిరువాయ్మొళ్ళి కాలక్షేపము నిరంతరాయముగా నెరవేర్చిరి. అప్పుడు పెరియనంబి శ్రీరామానుజులను ఇక తిరువరంగప్పెరుమాళరయరువలన తెలిసికోవలసిన రహస్యమొకటికలదు. దానిని వారి

నాశ్రయించి పరిగ్రహింపుడు అనగా, ఎంబెరుమానారు అరయరుసన్నిధిలో ఆరుమాసములు కనిపెట్టియుండి, వారివలన చరమార్థములను పడసిరి.

అటుపిమ్మట శ్రీరంగనాథుని సన్నిధిలో పరిచారకులు కొందరిదోషములను కనిపెట్టి దండించినందులకై అందొకడుక్రోధించి, ఒకనాడు ఎంబెరుమానారు మాధుకరము చేయునప్పుడు వారికి విషమిశ్రమైన సాదమును సమర్పింప తనభార్యకు కట్టడ చేయగా వారు అదితెలిసికొని నాడు ఉపవాసముండిరి. ఈ వృత్తాంతముతిరుకోట్టియూరునంబివిని శ్రీరంగమునకు వేంచేయునపుడు వారిరాకవిని ఎంబెరుమానారు శిష్యసంఘముతోడ ఎదురుకొనిపోయి కావేరినదిని నిప్పులుగురియుచున్న యెండచే చుఱ్ఱుకాలుచున్న ఇసుకలో నిలిచియున్న నంబిగారి తిరువడుగులు తనతిరుముడిసోక సాగిలబడి దండముసమర్పించి లేవకుండిరి. నంబియు లెమ్మనిచెప్పరైరి. అప్పుడు కిడాంబియాచ్చాన్ గోష్ఠిపూర్ణులనుజూచి స్వామీ! ఇదియేమిటి శిష్యమర్యాద? చక్కగా వికసించి పరిమళించు పుష్పహారమును నిప్పులలో పొరలింతురా? అనిపలికి ఎంబెరుమానారును గ్రుచ్చియెత్తి నిలువబెట్టిరి. అది చూచి, గోష్ఠిపూర్ణులు ఇంతసేపు మిమ్మే మేము వెదకుచుంటిమి. ఇదిమొదలుకొని, ప్రతిదినము మీరు తళిగచేసి యేకమాధుకరముగా వీరిని ఆరగింప జేయించుచుండుడు అని నియమింపగా, కిడాంబియాచ్చాన్ ఆనియమనము చొప్పుననే కైంకర్యముచేయుచువచ్చిరి.

అనంతరము ఒక సమయమునందు యజ్ఞమూర్తియను నొకయేకదండ సన్యాసి దిగ్విజయముచేయగోరి యెల్లదేశములు తిరిగి ఆయాదేశముల విద్వాంసులను జయించుచు కాశీదేశమునకుపోయి గంగాస్నానము చేసికొని అచ్చటి విద్వాంసులను సైతము వాదమునజయించి, అందుండికదలి దక్షిణదేశయాత్ర

చేయుచు శ్రీరంగక్షేత్రమునకువచ్చి విద్యచేతను శిష్యసంపత్తిచే తను తన్నుమీరినవాడు లోకములోలేరని యహంకరించియున్న వాడు కాబట్టి ఎంబెరుమానారు వైభవమువిని వారిని వాదము నకురమ్మని పిలువగా, యతిరాజులు ఊరకవాదించుట మాకు సమ్మతిలేదు. ఏదేని యొకపందెము వేసికొని వాదముచేయు పక్షమున మేము నీతో వాదింతుము అనిరి. అందులకు యజ్ఞ మూర్తి హర్షించి నేను ఓడిపోయినయెడ మీపేరును మీసిద్ధాంత మును అవలంబించి, స్వధర్మపరిత్యాగముచేయ గలవాడను అనె ను. ఎంబెరుమానారుసరే. మేము ఓడిపోయినయెడ తత్క్షణమే గ్రంథసన్యాసముచేసి పలువురువిన మేము ఓడిపోయితిమని చెప్పె దము అనిరి.

అంతట వారిరువురకు వాదమారంభమాయెను. అందు పదునేడుదినములదాక యజ్ఞమూర్తికోటియే హెచ్చుచువచ్చెను. పదునేడవనాడు వాదమునిలిపి మఠమునకు వేంచేయునపుడు ఎంబెరుమానారువీని నెట్లు జయింపవచ్చునను విచారముచేత తిరు ముఖమండలము కళాహీనతను వహింపగా మానసు చిన్నపుచ్చు కొని పేరరుళాళని స్మరించుచు వేంచేసి సాయంసమయాను ష్ఠానములునడపి పేరరుళాళని నారాధించి శ్రీపాదతీర్థమును పుచ్చుకొని నిరాహారులై శయనించిరి. నాటిరాత్రి నాలవజాము నందు శ్రీకరిగిరీశ్వరుడు ఎంబెరుమానారు కలలో సేవసాదించి యతిరాజా! ఏల యీవలవనివిచారము. నీకు మహావిద్వాంసు డైన శిష్యుడు లభించెను. ఇది హర్షింపదగిన సమయముగాని చింతింపదగిన సమయముగాదు. ఆళవందారు సాదించిన మా యావాదఖండనము నీహస్తగతమయి యుండగా ఈమాయా వాదిని జయించుట నీకొక విషయమా? అని యానతిచ్చి యాశ్రీ కోశమునుచేత ఇయ్యగా మేలుకొని, యతిరాజులు తత్కాలా నుష్ఠానములు తీర్చుకొని పేరరుళాళనిసేవించి వాదస్థానమునకు

వేంచేసిరి. అప్పుడు యజ్ఞమూర్తి వారిముఖవికాసాదులనుజూచి శంకించి, నేడు నాకోటిహెచ్చుబోదు. వీరు నేడు నన్నుజయింపకమానరు. అని విచారించుచు తానున్నతావుననుండకే యతిరాజులకు ఎదుర్కొలుచేసి, స్వామీ నేను అకించనుడను, దేవరవారితో వాదింప సమర్థుడను కాను. పరాజితుని నన్ను శిష్యునిగా పరిగ్రహింపుడు. అనివారితిరువడుగులు తనశిరస్సుసోక చాగిలబడి మ్రొక్కగా, యతీంద్రులు, యజ్ఞమూర్తీ! ఇదియేమి? ఎప్పటివలె వాదము ప్రారంభింపుము. వాదమున మాకు గెలుపుకలిగిన పిమ్మటగదా. మనము తొలుత చేసికొన్న నిబంధనచొప్పున కాగల కార్యము అగును అనిరి. అదివిని యజ్ఞమూర్తి, స్వామీ! కొండతో ఢీకొనదలచిన తగరువలె శ్రీయనంతాళ్వారుల యపరావతారముగు మీతో వాదింపబూనితిని. నేడు మీమూర్తి నాకన్నులకు శ్రీవరదరాజులమూర్తిగా తోచుచున్నది. కనుక ఇకమీయెదుట నోరుతెరవనేరను. అనగా ఎంబెరుమానారు ఇది యంతయు శ్రీయాళవందారు అనుగ్రహమే యనుకొనుచు పేరరుళాళని యానతిచొప్పున యజ్ఞమూర్తికి మాయావాదఖండన కోశమును ఉపన్యాసరూపమున నుపదేశించిరి. అంతట ఏకదండసన్న్యాసియైయున్న యజ్ఞమూర్తి ఆదండమును పరిహరించి, ఎంబెరుమానారు, శిఖాయజ్ఞోపవీత త్రిదండములను, పేరరుళాళప్పెరుమాళెంబెరుమానారు అను తిరునామమును, పంచసంస్కార తిరుమంత్రోపదేశపూర్వకముగా అనుగ్రహింపగా, పరిగ్రహించి, యతిరాజుల తిరువారాధనమయిన పేరరుళాళని సేవించి, శ్రీపాదతీర్థమును స్వీకరించి, అనంతరము క్రమముగా పన్నిద్దరాళ్వార్లు పాడించిన దివ్యప్రబంధములన్ని యనుసంధించి, అటుపిమ్మట తిరుమంత్రార్థము మొదలగు కొన్నిరహస్యములను సయితము ప్రాపించెను.

అంతట ఎంబెరుమానారు అరుళాళప్పెరుమాళెంబెరుమానారుకు తమకువలె ఒకమఠముకట్టించి యిప్పించి, అనంతాళ్వారును, మరుదూరునంబిని, వారి తిరువడినాశ్రయింప నియమించి, అనంతాళ్వారును తిరుమలకుబంపి, తరువాత శ్రీరంగము నుండి బయలుదేరి తిరుక్కోవలూరికి వేంచేసి, ఆయనారును సేవించి, అందుండి సత్యవ్రతక్షేత్రమునకు వేంచేసి, తిరుక్కచ్చినంబిని సేవించి, వారినిముందుపెట్టుకొని పేరరుళాళని సన్నిధికి వేంచేసి, దండములుసమర్పించి, తీర్థప్రసాదములను శ్రీశఠగోపమునుస్వీకరించి, అందుండికదలి తిరుమలకు వేంచేయుచు, త్రోవతప్పి, త్రోవజూపిన తలమెత్తువానిని అనుగ్రహించి, తిరుమలలో వేంచేసియుండు పరాంకుశపరకాలాదులైన పన్నిద్దరాళ్వారుల సన్నిధుల జీర్ణోద్ధరణము చేయించి, తిరుపతిలో కొన్నాళ్లు వేంచేసియుండి, విఠలదేవరాజును శిష్యునిగా జేసికొని, తమశిష్యులైన వైష్ణవులను ముప్పదితిరునామములను అచ్చట చిరవాసము చేయ నియమించి, ఇళైమండియము అనుగ్రామమును స్వవశముచేసికొని, అచ్చటిశ్రీవైష్ణవుల వేడికోలువలన తిరుమలయెక్కి తిరువేంగడముడయని (శ్రీవేంకటాచలపతిని) సేవించి, కొండనుండి దిగి, పెరియతిరుమలనంబి (శ్రీశైలపూర్ణుల) సన్నిధిలో శ్రీమద్రామాయణ కాలక్షేపముచేయుచు సంవత్సరకాలము వేంచేసియుండి, వారిసన్నిధిలో కైంకర్యముచేయుచున్న గోవిందభట్టరును వెంటబెట్టుకొని తిరుప్పుకుళిదారిని తిరుక్కచ్చికి వేంచేసి పేరరుళాళని సేవించి, తిరుక్కచ్చినంబి సన్నిధిలో కొంతకాలము వేంచేసియుండిరి.

అట్టియెడ గోవిందభట్టరు పెరియతిరుమలనంబిగారిని ఎడబాయుటవలని క్లేశముచేత నానాటతిరుమేనుకృశించుచురాగా, యతిరాజులు వారు కృశించుటకు కారణము తెలిసికొని మరల పెరియతిరుమలనంబిగారి సన్నిధికి పంపిరి. అట్లు యతిరాజుల

యనుజ్ఞపడసి గోవిందభట్టరు పెరియతిరుమల నంబిగారి సన్నిధికి వేంచేసి దండముసమర్పింపగా వారుగోవిందభట్టరును దగ్గర చేర్చక మరల ఎంబెరుమానారు సన్నిధికిపొమ్మని నియమించిరి. అనంతరము ఎంబెరుమానారు గోవిందభట్టరును మిక్కిలియాదరించి తమతిరువడుగులందు అచంచలభక్తికలుగ ననుగ్రహించి, వారిని వెంటబెట్టుకొని శ్రీరంగమునకు వేంచేసిరి. అటుపిమ్మట గోవిందభట్టరు పరమవిరక్తులై యెంబెరుమానారు సన్నిధిలో సముచిత కైంకర్యపరులై వేంచేసియుండిరి. అంతట ఎంబెరుమానారు వారివైరాగ్యమునకు అనుగుణముగా సన్యాసాశ్రమము నుస్వీకరింపజేసి, తమతిరునామము నే చాతగా, వారు తిరుమేను గడగడ వడకగా స్వామీ అడియడు దేవరవారితిరునామమునువహింప నర్హుడనగుదునా, ఈయచేతనునియెడలకటాక్షించి తగినపేరుసాదించి కడతేర్పవలయునని ప్రార్థించిరి. అంతట శ్రీరామానుజయతీంద్రులు ఎంబెరుమానారు అను తిరునామమునందు ఆద్యంతవర్ణములను సంగ్రహించి ఎంబారు అని తిరునామముచాతిరి.

పిమ్మట ఒకనాడు కొందరు దేశాంతరులగు భాగవతులు వచ్చి యెంబెరుమానారుమఠము ఏదియని యచ్చటి శ్రీవైష్ణవులను అడుగగా వారు ఏ యెంబెరుమానారు మఠమని అడిగిరి. అందులకు ఆభాగవతులు ఇదియేమి వింతమాట వింటిమి. ఎంబెరుమానారు ఒకరుగాక మరియెందరున్నారు. అని సంశయించుచుండగా, అచ్చటి శ్రీవైష్ణవులు అరుళాళప్పెరుమాళెంబెరుమానారు ఒకరు ఉన్నారుగనుక ఏయెంబెరుమానారని అడిగితిమని మఠమునుచూపిరి. ఈవృత్తాంతము అరుళాళప్పెరుమాళెంబెరుమానారువిని మనమును ఒకమఠము కల్పించుకొనియుండుటచేతగదా [illegible]గము సిద్ధించెను అని, తమమఠమును

పడగొట్టి నేల చదరము చేయించి, ఎంబెరుమానారుల మఠము నందే వారిని సేవించుచు వేంచేసియుండి, జ్ఞానసారము, ప్రమేయసారము అను గ్రంథములను రెంటిని రచియించిరి. పిమ్మట ఎంబెరుమానారు అరుళాళప్పెరుమా ళెంబెరుమానారు, కూరత్తాళ్వారు, మొదలియాండాను అను నీ ముప్పురను ముందట నుంచుకొని శ్రీభాష్యమును రచించువారై, అందులకు బోధాయనవృత్తి గ్రంథము కావలసి విచారింపగా, ఆగ్రంథము ఉత్తరదేశమునం దున్నదను వర్తమానము తెలియవచ్చెను. అంతట యతిరాజులు కూరత్తాళ్వార్లను వెంటదీసికొని అచ్చటికి వేంచేసి, ఆ గ్రంథమును ఉపాయముగా సంగ్రహించుకొని, ఒకసారి యుభయులును చదివిచూచి, దానిని తీసికొని రానుయత్నింపగా, అచ్చటి మాయావాదులు కొందరు దానిని అపహరించుకొని పోయిరి. అప్పుడు యతిరాజులు ఎంతో ప్రయాసపడి సంపాదించిన గ్రంథము కోలుపోయెనే ఇక ఏమిచేయవచ్చును అని విచారింపసాగిరి. అదిచూచి కూరత్తాళ్వార్లు స్వామీ దేవరవారి కటాక్షవిశేషము వలన ఆగ్రంథము దాసునిమనస్సనెడు పలకలో స్ఫుటముగాలిఖింపబడినదయ్యెను. ఇకను ఆవిషయమయి విచారము అక్కరలేదని విన్నవించిరి. ఆదివ్యవాక్కు శ్రవణగోచరముకాగానే ఎంబెరుమానారు అత్యంతము సంతోషించి, కూరత్తాళ్వార్లును తామును శ్రీరంగమునకువచ్చి చేరి, మునుపు సంకల్పించుకొన్న చొప్పున శ్రీభాష్యమును రచియించి, శ్రీయాళవందారు మనోరథములు మూడింటిలోను మొదటిదానిని నెరవేర్చినవారైరి.

అనంతరము అచ్చటిభాగవతులందరు భాష్యకారులను దండముసమర్పించి, స్వామీ! దేవరవారు దిగ్విజయయాత్ర వెడలి, అచ్చటచ్చట గల కుమతములను ఖండించి, అందందుగలదివ్యదేశములనుద్ధరింప తిరువుళ్లపట్టగోరెదము అని విన్నపము చేయగా, వారు దానిని అంగీకరించి, నంబెరుమాళ్లను సేవించి, ఆయేలిన

వానిచే అనుమతులై శ్రీవైష్ణవగోష్ఠితోడ బయలువెడలి చోళమండలమునందలి కుంభకోణము మొదలుగాగల దివ్యదేశములకు విజయముచేసి, అందందు అర్చారూపమున వేంచేసియున్న శ్రీమన్నారాయణుని మూర్తులను సేవించుచు, అచ్చటచ్చటిబాహ్యమత ప్రవర్తకులనుజయించి, అందుండి దక్షిణదిశాభిముఖులై, అళ్గర్ తిరుమల మొదలుగాగల దివ్యతిరుపతులను సేవించి, ఆళ్వారు తిరునగరికి వేంచేసి, నమ్మాళ్వార్లను సేవించి, అచ్చటి యేలినవాడగు ఆదినాథుని దండముసమర్పించి, అచ్చటికి చుట్టుపట్టులనుండు దివ్యదేశములకు వేంచేసి, ఆయా తిరుపతులందున్న యన్యమతములవారిని జయించి, తిరుకుఱుంగుడికి వేంచేసి నంబిని సేవించి, ఆనంబి తిరువుళ్లముచొప్పున వారిచెవిలో తిరుమంత్రమును అనుసంధించి, వారిచే ఉడయవరు అనుతిరునామమును చాటుకొని, వారికి శ్రీవైష్ణవనంబియనిదాస్యనామముచాటి, అందుండి కదలి తిరువనంతపురమునకు వేంచేసి, అచ్చటి యర్చామూర్తిని సేవించి, అచ్చట నొకమఠముకట్టించి, దానికి శ్రీరామానుజమఠము అని పేరుపెట్టి, అందుగల యన్యమతములనుఖండించి, అచ్చటినుండి పశ్చిమసముద్రతీర మార్గమున ఉత్తరదేశమునకు వేంచేసి, ఉత్తరమధుర, సాలగ్రామము, ద్వారక, బదరికాశ్రమము, నైమిశారణ్యము, పుష్కరము, గోకులము, గోవర్ధనము, బృందావనము, శ్రీగంగాతీరఖండము మొదలయిన దివ్యదేశములను సేవించుచు, ఆయాదేశములందలి యన్యమతములను జయించి, అంతట సరస్వతీపీఠమునకు వేంచేసిరి. అప్పుడు సరస్వతి మనుష్య (స్త్రీ)రూపమున శ్రీరామానుజయతీంద్రులను ఎదుర్కొని సముచితములైన మర్యాదలుచేసి, ఒకశ్రుతివాక్యమునకు అర్థము అడిగెను. అందులకు ఉడయవరు వివరముగా అర్థముచెప్పి, సరస్వతికి సంతోషముకలుగజేసిరి. అంతట సరస్వతి ఉడయ

వరు సాధించిన శ్రీభాష్యమును తనతలనుధరించి, వారికి శ్రీభాష్య కారులని తిరునామముచాత్తి, శ్రీహయగ్రీవారాధనమును సమర్పించి, మునుపు మీవలెనే శంకరులును ఇచ్చటికివచ్చిరిగాని వారీ శ్రుతికి సంప్రదాయము తెలిసి యిట్లు అర్థముచెప్పలేక పోయిరి. ఇప్పుడు మీవల్ల నీరహస్యార్థమువిని కృతార్థురాలనైతిని. అని మిక్కిలి శ్లాఘించెను. అనంతరము భాష్యకారులు అచ్చటి బాహ్యమతములనెల్లను ఖండించి, ఆదేశపురాజును శిష్యునిజేసికొని, అందులకై కలుషించి తమపై ప్రయోగములుచేసిన ఆయా స్థానపు పండితులను పిచ్చిపట్టితిరుగునట్లు చేసి, పిదప ఆరాజు వేడికోలున వారిపిచ్చి కుదిర్చి, తమ యనుగ్రహమునకు పాత్రులను గావించి, అందుండికదలి, వారణాసిమార్గమున శ్రీజగన్నాథమునకు వేంచేసి, జగన్నాథుని సేవించి, ఆదివ్యదేశమునందు తమపేర నొకమఠమును స్థాపించి, అందుండి వెడలి శ్రీకూర్మమునకు వేంచేసి, ఆదివ్యదేశము నుద్ధరించి, శ్రీసింహాచలమును సేవించి, అందుండి అహోబలమునకు వేంచేసి శ్రీనారసింహుని సేవించి, అచ్చటినుండి తిరుమలకు వేంచేసిరి. అప్పుడు కొందరు శైవులు జతగూడి స్వరూపచిహ్నములను ధరింపక సేవసాధించుచున్న శ్రీనివాసుని తముయేలినవాడగు స్కందుడు అని శ్రీవైష్ణవులతో కలహింపసాగిరి. శ్రీభాష్యకారులు వారి యాటోపమునుజూచి, దానినణచుటకు తగినయుపాయమును విచారించి, వారిలో ముఖ్యులను బిలిచి, మనలోమనకు కలతపనిలేదు. మాదేవునిచిహ్నములు శంఖచక్రములు, మీదేవుని చిహ్నములు డమరు త్రిశూలములు. ఉభయచిహ్నములను తెప్పించి యేలినవాని సన్నిధిలో నుంచుదము. వానిలో ఏవి ఝూ యేలినవానిచే ధరింపబడునో వారే దేవుడని అనుకొందము. అని యాశైవులను సమాధానపరిచి, అనుకొన్నచొప్పున ఉభయచిహ్నములను తెప్పించి సన్ని

ఘలోమంపించి, కోవెల తలుపులుమూసి బిగముద్రలు చేయించి,
యిరుదెగలవారును తమతమ నివాసములకు పోయిరి. మరు
నాడు తెల్లవారివచ్చి తలుపులు తీయించి చూడగా శ్రీవేంకటా
చలపతి శంఖచక్రధారియై సేవసాదించెను. అంతట శైవులు
విఫలప్రయత్నులై వంచినతలలు ఎత్తక వచ్చినదారి పట్టుకొని
పోయిరి. ఇట్లు శ్రీరామానుజయతీంద్రులు శ్రీనివాసునికి శంఖచక్ర
ధారణము చేయించి, అప్పనికి తిరువిలచ్చనై సాదించిన పెరు
మాళ్లు అను తిరునామమును చాతుకొని, నన్నేలిన శ్రీనివాసా
నీ సేవనులకు ఆచంద్రార్కస్థాయిగా నిట్లు సేవసాదించుచుండు
ము అని మంగళాశాసనముచేసి, అచ్చటనుండి కదలి మార్గస్థ
ములగు దివ్యతిరుపతులను సేవించుచు తమకు నిత్యనివాసమయిన
శ్రీరంగమునకు వేంచేసి, శిష్యగణపరివేష్టితులై మఠమునందు నెల
కొనియుండిరి. అంతట వర్షాకాలమునువచ్చెను.

అట్టియెడ ఉంఛవృత్తివల్లనే దేహయాత్రనడపుచున్న కూ
రత్తాళ్వారు ఒకనాడు వాన యెడతెరపిలేక జడివట్టి కురియు
చుండగా బయట తలవెళ్లబెట్టకూడక నీరాటము మొదలగు అను
ష్ఠానములు తిరుమాళిగలోనే చేసికొని తిరువారాధనముచేసి
శ్రీపాదతీర్థమును స్వీకరించి శ్రీశఠారిసాదించిన దివ్యప్రబంధము
లను అనుసంధానము చేయుచు వేంచేసియుండిరి. వారిదేవులు
నాటితళిగకుకూడ తండులము లేమికి క్లేశమునొందుచుండి రాత్రి
శ్రీరంగనాథుడు ఆరగించు సమయమున మ్రోగుచున్న ఘంటా
ధ్వనివిని, స్వామీ రంగనాథా! భక్తపరాధీనులగు దేవరవారు
భక్తులను పస్తుపెట్టి యారగించుట భావ్యమా? అని తమలో
తాము అనుకొనిరి. అదియంతర్యామియగు శ్రీరంగనాథుడు విని
తమకు ఆరగింపుచేయవచ్చిన ఉత్తమనంబిని (ఉత్తమపూర్ణులను)
తామారగించిన ప్రసాదమును తీసికొనిపోయి కూరత్తాళ్వార్లకు

సమర్పించిరా నియమించెను. వారు అట్లేచేసిరి. అంమలకు కూరత్తాళ్వార్లు చాలహర్షించి, అడియనియెడల నంబెరుమా ళ్లకు ఎంతటివాత్సల్యమో యనుకొనుచు ధర్మపత్నీసమేతముగా ఆప్రసాదమును ఆరగించిరి. కూరత్తాండాళు ఆప్రసాద స్వీకార మహిమవలన వెంటనే గర్భముధరించి పదినెలలునిండగా, కలి యుగ గతాబ్దములు నాలుగువేల నూట యిరువదిమూడు అగు శుభకృన్నామ సంవత్సరము వైయాశి (వైశాఖ) శుక్లపూర్ణి మా తిథియందు అనూరాధనక్షత్రమున అవుఁడబిడ్డలనుకనియెను. ఆవృత్తాంతము భాష్యకారులువిని ఎంబారును తామును కూర త్తాళ్వారుల తిరుమాళిగకువేంచేసి, ఎంబారువలన నాశిశువు లను తమసన్నిధికి తెప్పించుకొని చల్లగ కటాక్షించి, తమ శ్రీహ స్తములతో తిరుమేనులునిమిరి, పంచాయుధాభరణములను సా దించి, అందు పెద్దశిశువునకు శ్రీపరాశరభట్టరు అనియు, చిన్న శిశువునకు శ్రీవ్యాసభట్టరు అనియు తిరునామములుచాత్తి, ఎం బారునుజూచి, మీరే యీబాలకులకు ఆచార్యులని వారిచేసమా శ్రయణమును చేయించి, శ్రీయాళవందారుయొక్క రెండవ మనో రథమును పూరించిరి.

తరువాత శ్రీపరాశరభట్టరు, పెరియపెరుమాళ్లు హరిద్రా స్నాన పూర్వకముగా పుత్రస్వీకారము చేసికొని సన్నిధిలోనే స్వర్ణమయమైన యుయ్యాలలోనుంచి పెంచుకొనగా శ్రీరంగ నాచ్చియారుయొక్క హస్తకమలములయందు పొదుగబడుచు పెరుగుచుండిరి. అట్టియెడ నొకనాడు శిశుత్వచాపలముచే పరా శరభట్టరు రంగనాథునికి ఆరగింపుచేయ సన్నిధిలోనుంచియున్న ప్రసాదమును లేతచిగుళ్లనుబోలిన తమ చిరుచేతులతో ముట్టి కొంచెము ప్రసాదము స్వీకరించిరి. అది లోపముగా గ్రహింపక పెరుమాళ్లును ప్రీతితో నాప్రసాదము నారగించిరి. మరి యొక

నాడు వైష్ణవగోష్ఠితోడ భాష్యకారులు కోవెలసువెంచేసి, అచ్చట వర్ధిల్లుచున్న పరాశరభట్టరుచేత ఒకశ్లోకమును వ్రాసి యిచ్చి చదువనియమింపగా భట్టరు మాఁచువారు ఆశ్చర్యపడునట్లు గడగడ చదివిరి. అందులకు ఉడయవరు మెచ్చుకొని తమ్ముపరివేష్టించియున్న శ్రీవైష్ణవగోష్ఠితో మీరు మాయందు ఎటువంటి గౌరవము ఉంచియున్నారో అటువంటిగౌరవమును ఈయనయందును ఉంచియుండవలెను అని నియమించిరి. పిమ్మట భట్టరు విద్యాభ్యాసము చేయుచుండగా ఒకనాడు వారు చదువురీతిని భాష్యకారులు కటాక్షించి, ఈయన మనదర్శనమునకు గౌరవము తేగలవాడు అగునని చెప్పి సంతోషించిరి. అటుపిమ్మట మరియొకనాడు కూరత్తాళ్వారు తిరువాయ్మొఴి అను సంధానము చేయుచుండగా "సిరుమామనిశర్" అను పాశురమును విని అయిదేండ్లప్రాయముగల భట్టరు "సిరుమెయుమ్ పెరిమెయుమ్ ఒఱరులే కూడుమో" (చిన్నతనమును పెత్తనమును ఒకదానియందే కూడునా) అని ప్రశ్నచేసిరి. అందులకు కూరత్తాళ్వారు హర్షాశ్చర్యధుర్యమానసులై, సిరియాచ్చాన్, అరుళాళప్పెరుమాళెంబెరుమానారు ఈ రెండు తిరునామములనుజూపి, వీరే అందులకు నిదర్శకులు. ఇట్టి రహస్యార్థములు అనుపనీతుడవగుటచే నీకుచెప్ప నర్హములుకావు అని యానతిచ్చిరి. అనంతరము ఒకనాడు భట్టరు నడివీధిలో దుమ్మునపొరలాడుచు ఆహ్లాదుకొనుచుండి, సర్వజ్ఞ భట్టరు అను నొకవిద్వాంసుడు తనపేరుచెప్పి తుతారలు ఊదుచు ముందునడచుచున్న సేవకులతో పల్లకీయెక్కి రాగాజూచి, ఉడయవరు మొదలుగాగల దర్శనస్థాపకాచార్యులు నెలకొనియుండెడి యీతిరువీధిని ఇట్టిబిరుదులతో వచ్చుటకు ఇతడెవ్వడు అనుచు, పిడికెడుమట్టిచేత పుచ్చుకొని అతనికెదురుగాపోయి, నీవు సర్వజ్ఞుడవుగదా? ఇదియెంతయో చెప్పుము అని పిడికిలిచూపి అడిగిరి. అందుకు అతడు భ్రమపడి ప్రత్యు

త్తరముతోచక యూరకుండెను. అది తెలిసి భట్టరు చిరునవ్వు నవ్వుచు, ఇంతేనా నీ సర్వజ్ఞత్వము? ఇందుకు ఉత్తరము చెప్పి బిరుదు నిలుపుకోనేరవైతివిగా? ఇదిపిడికెడు. ఇకనైన తెలిసికో. అని చెప్పి పరిహసించి, తమ వెంబడినున్న వారితో ఏమి తెలియని యీతనికి తుతారలు కొన్ని కావలెనా ముందు వెనుక చూడక పెరుకుకొనుడు అని ప్రౌఢముగా నియమించిరి. అంతట సర్వజ్ఞభట్టు వింతయు వెరపునుగలవాడై యిరుగుపొరుగుల ప్రజలవలన వీరు కూరత్తాళ్వారుల కొమారులని తెలిసికొని, సింహమునకు పరాక్రమము పుట్టుకయందేగాక నడుమంత్రముననా వచ్చును? అనుచు, సంభ్రమముతో భట్టరును ఎత్తి తనపల్లకిలో నుంచుకొని వారి తిరుమాళిగ మోసలకు తీసికొనిపోయెను. అప్పుడు హేమాంబయను నాచ్చియారు ఎదురుగావచ్చి పల్లకిలోనున్న భట్టరును ఎత్తుకొని ముద్దాడుచు కొనిపోయి కూరత్తాండాలుచేత సమర్పించెను. అంతట ఆమె దృష్టిదోషపరిహారముగా శ్రీపాదతీర్థము బిడ్డనిపై ప్రోక్షించి, కన్నులుకడిగి, తిరుమేనిదుమ్ముతుడిచి గారవించెను.

పిమ్మట భట్టరు ఉపనీతులై తండ్రిచే వేదాధ్యయనముచేయింపబడి, ఒక నాడు మాత్రము అధ్యయనముచేసి మరునాడు వీధుల వెంబడి ఆటలాడుచు మెలగసాగిరి. అది తెలిసి తండ్రియగు కూరత్తాళ్వారు నాయనా అధ్యయనము చేయవలసిన సమయమునందు అదిమాని ఆట్లాడవచ్చునా? అని యడుగగా, భట్టరు నిన్న చెప్పినదానినే నేడును ఉపాధ్యాయులు విద్యార్థులకు చెప్పుచున్నారు. అది నాకువచ్చునుగనుక ఆడుకొనుచున్నాను అనిరి. అందుకు ఆళ్వారు ఏదీ నిన్నటిపాఠము ఒప్పింపుము. అనియడిగి, భట్టరు నిరాఘాటముగా ఒప్పింపగా, మిక్కిలి యాశ్చర్యపడి, ఆసంగతి తమదేవులకును తెలియజేసి, అది మొదలు కుమారుడు చదువకపోయెనను విచారములేక భగవద్గుణానుభవము చేసికొ

నుచు హాయిగానుండిరి. భట్టరును ఉడయవరు నియమనముచొప్పున ఎంబారునాశ్రయించి సర్వరహస్యములు తెలిసికొని సదా శాస్త్రసిద్ధాంత ప్రవచనపరులై వేంచేసియుండిరి.

ఇట్లు భట్టరు సకలవిద్యాసంపన్నులును యౌవనసంపన్నులునైయుండగా జూచి, కూరత్తాళ్వారు వారికి తిరుక్కల్యాణముచేయువారై తగినకులవయశ్శీలములుగల కన్యక యెక్కడ లభించునోయని విచారించుచుండగా, ఆసడి తెలిసి ఉడయవరు పెరియనంబిగారి దాయాదులైన బృహచ్చరణమువారి తిరుమాళిగలో ఒకకన్యకయున్నది. ఆకన్యక మనభట్టరుకు తగియుండునని సాదించిరి. అందులకు అనుగుణముగా శ్రీరంగనాథుడు కన్యక తల్లిదండ్రులకు స్వప్నములో సేవసాదించి మీకొమార్తను కూరత్తాళ్వారు కొమారుడైన పరాశరభట్టరుకు ఇచ్చి వివాహము చేయుదురేని మీరు కృతార్థులగుదురని యానతిచ్చెను. అనంతరము క్రమముగా తగినపురుషకారులవలన ఆకన్యయే భట్టరుకు దేవులుగాజేయ నిర్ణయింపబడి తిరుక్కల్యాణ మహోత్సవమును మహావైభవముతో జరగెను. ఇట్లు భట్టరు గృహస్థాశ్రమమును స్వీకరించి తదనుగుణప్రవర్తనమున వర్తించుచుండిరి.

ఈప్రకారము ఉడయవరు పరమాచార్య మనోరథసిద్ధి కావించి కృతార్థంమన్యమానులై యొకనాడు గోష్ఠిసమయమునందు మేము మాముదలియాండాన్ తప్ప తక్కినవారితోడి సంగమును నేటితో పరిత్యజించితిమి, అని యానతిచ్చిరి. అందులకు తక్కినవారు దేవరవారివంటివారు ఇట్లు సాదింపవచ్చునా? అని విన్నవింపగా, ఉడయవరు ఈ యాశ్రమమునందుండి త్రిదండమును పరిత్యజింపరాదు కాబట్టి ముదలియాండానుదక్క తక్కిన వారిని పరిత్యజించితిమని చెప్పితిమని ఆనతిచ్చి, కేవలభగవద్గుణానుభవపరులై వేంచేసియుండిరి.

అట్టికాలమునందు చోళదేశపురాజు కొందరు బాహ్యమత ప్రవర్తకులచే బోధింపబడినవాడై శివుడే పరదైవమని నిశ్చయముచేసికొని, ఒకపత్రికయందు "శివాత్పరతరంనాస్తి" అని వ్రాయించి దానియడుగున సర్వమతములవారిని సంతకముచేయుడని నిర్బంధించునట్టును, కొందరు పిరికిపోతులు రాజాజ్ఞమీర వెరచి సంతకములుచేసినట్టును, విశిష్టాద్వైత ప్రతిష్ఠాతలగు ఉడయవరుచేత బలాత్కారముగా చేవ్రాలుచేయింప యత్నించుచున్నట్టును ఒకవృత్తాంతము ప్రకటమాయెను. అప్పుడు ఉడయవరు కారణాంతరవ్యవస్థచే ఆరాజును నిరాకరింపనెల్లక, పెరియపెరుమాళ్ల నియమనమువలన కూరత్తాళ్వారులచే కాషాయధారణము చేయించి, తాము ధవళవస్త్రధారులై ముదలియాండాన్ మొదలగు అంతరంగశిష్యులను కొందరిని వెంటదీసికొని పశ్చిమదేశమునుగూర్చి వెడలిరి. అది తెలిసి రాజభటులును వెంబడించిరి. అంతట భాష్యకారులు తమవెంటవచ్చు శ్రీవైష్ణవపరివారముచే ఇసుకచల్లించి రాజభటులను మరలించి, నల్లాన్ శిష్యులయిన బోయలపల్లె ప్రవేశించి, అందు నాలుగునాళ్లునివసించి, మరల కాషాయధారులై 'వహ్నిపురక్కరణై' అను గ్రామమునకు వేంచేసి, అచ్చట కొంతకాలముగడపి, అచ్చటనుండి మిథిలాసాలగ్రామమునకు వేంచేసి, అచ్చటి మతాంతరప్రవిష్టులను శ్రీమొదలియాండాన్ చరణారవింద వైభవముచేతనే దిద్దుపాటు చేయించి, వారందరు శిష్యులై సేవింపగా, వడుగనంబిని కటాక్షించి, సింగరికోవెలకువేంచేసి, అందుండి శ్రీవైష్ణవ విరోధియయిన చోళరాజు క్రిమికంఠుడై నశించునట్లు మంత్రోచ్చాటనముగావించి, తొండనూరికి వేంచేసి, అచ్చటి యేలికయయిన దేవరాజు అనువాని కొమార్తను సోకియున్న పిశాచమును శ్రీపాదతీర్థప్రదానముచే నివర్తింపజేసి, దేవరాజును శిష్యునిగావించుకొని, అచ్చట వాదముచేయవచ్చిన శ్రమణులనేడు ప్రత్యర్థులను

తెరచాటుననుండి శ్రీయనంతాళ్వారై సహస్ర ఫణాముఖముల తోను వాదించి జయించి, వారిమతము ననుసరించిన కొందరను తమతిరువడి నాశ్రయింపజేసి, దేవరాజువలన సత్కృతులై, ఆ తొండనూరికి అభిమానియగు శ్రీమన్నారాయణుని అర్చామూర్తికి నంబితంబిరాన్ అని తిరునామముచాతి, మరలసింగరి కోవెలకువచ్చి, అచ్చట వేంచేసియుండి, ఒకనాడు తిరుమణి చిక్కక చాల ఆయాసపడి, నాటిరాత్రి ఇక తిరుమణికై యేమిచేయవచ్చును అని విచారించుచు శయనించిరి. వేగుజామున వారిస్వప్నములో యదుగిరినిలయుడగు తిరునారాయణస్వామి సాక్షాత్కరించి, మేము యదుగిరిలో నీరాకను కోరుచు వసించియున్నాము. అచ్చటికి వచ్చితివేని కావలసినంత తిరుమణిదొరకును. మాకు కోవెలకట్టించుట మొదలయిన కైంకర్యములును చేయ నెదవును. అని యానతిచ్చెను. అంతట భాష్యకారులు మేలుకొని తత్క్షణమేబయలుదేరి యదుగిరి ప్రాంతదేశమునకు వేంచేసి, తమశిష్యుడును విష్ణువర్ధనుడు అను నామాంతరముగలవాడునైన దేవరాజుచే అచ్చటి యడవియంతయు నరకించి, బహుధాన్యనామసంవత్సర పుష్యమాసమునందు యాదవాద్రి నెక్కి, దానిపైని తులసీవృక్షముక్రింది పుట్టలో మునుపు స్వప్నములో సేవసాదించినట్టే సేవసాదించుచున్న తిరునారాయణస్వామిని సేవించి, ఆనెలలోనే శుక్లపక్షచతుర్దశీ గురువారమునాడు పునర్వసు నక్షత్రమునందు క్షీరముచే తిరుమంజనమును తిరువారాధనమునుచేసి, "ఒరునాయకమ్" అను తిరువాయ్మొళ్ళి అనుసంధించుచు చాటుబడిచేసి, సన్నిధికి వాయవ్య భాగమునందు త్రిదండముతో త్రవ్వి తిరుమణిగనిని కనిపట్టి, హర్షించి కావలసిన తిరుమణి తిరువుళ్ళపట్టి, తిరునారాయణప్పెరుమాళ్ళకు మూన్నాళ్లు తామేయారాధనచేసి, అనంతరము తగిన యారాధకులను

నియమించి, వెంటనే కోవెలయు పట్టణమును గట్టించి, ఆపట్టణమునకు తిరునారాయణపురము అని పేరుపెట్టి, పిమ్మట పెరుమాళ్లను కోవెలలో వేంచేయింపజేసి, పాంచరాత్రవిధిని సంప్రోక్షణాదులు నడపించి, ఉత్సవరు ఏమయిరోయని చింతించుచుండగా, ఒకనాటికలలో తిరునారాయణుడు సేవసాదించి, రామప్రియుడు అను పేరితో ఉత్సవరు డిల్లీలో వేంచేసియున్నారు అని యానతిచ్చెను. భాష్యకార్లును ఆయానతిని డిల్లికిపోయి రామప్రియుని వేంచేపుచేసికొని రమ్మనుటగా భావించి, తత్క్షణముబయలుదేరి డిల్లికి వేంచేసి, తమప్రార్థనచే డిల్లీపాదుషా కూతురైన బీబినాచ్చారు పడకటింటనున్న రామప్రియుడు గజ్జెలు మువ్వలు మ్రోగగా ఎల్లవారు చూచుచుండ పాదచారమున వేంచేసి తమ యొడిలోవచ్చి కూర్చుండునట్లుచేసి, పరమానంద భరిత చిత్తులై "ఎన్ చెల్వప్పిళ్లయో" (నాసంపత్పుత్రుడో) అనియెత్తి చంకను బెట్టుకొనిరి. అదికారణముగా రామప్రియుడు చెల్వపిళ్లరాయడు అన బరగెను. అట్లు కృతకృత్యులై భాష్యకారులు చెల్వపిళ్లరాయనిని యదుగిరికి వేంచేపుచేసికొనివచ్చి కోవెలలో నెలకొలిపి, ఆదివ్యదేశమునందు తమపేరట ఒకమఠమును స్థాపించి, అందు తమప్రతిరూపమును అర్చావతారముగా కల్పించియుంచి, ఏబదియిరువురు కైంకర్యపరులను కోవెలలో నియమించి, సకల కైంకర్యములును యథావిధిగా జరగునట్లుచేసిరి. ఇదియంతయు నగునంతలో పండ్రెండు సంవత్సరములాయెను. అప్పటికి కూరత్తాళ్వారు చోళరాజు నిర్బంధమునకు లోబడక "శివాత్పరతరం నాస్తి" అను దానిక్రింద "ద్రోణమస్తితతఃపరమ్" అని వ్రాయుటయు, అందులకు వాడుకోపించి నేత్రోత్పాటనముచేయ యత్నింపగా, నీవంటిపాతకునిజూచిన కన్నులనుధరించుట మాకునర్హాము కాదని తామే తమనేత్రములను ఉత్పాటించుకొనిరి అనియు, అనంతరము ఆయపచారబాహుళ్యముచే వాడు నోటపురుగులు

పడి చనిపోయెననియు వర్తమానములు తెలియరాగా, ఆళ్వార్ల విషయమై విచారమును, చోళునినాశమునుగూర్చి సంతోషమును పొందినవారై తిరునారాయణ పెరుమాళ్లయానతిపడసి, యదు గిరినుండి కదలి శ్రీరంగమునకు వేంచేసి, శ్రీవరదరాజ స్తవమువలన కూరత్తాళ్వార్లకు పునర్నేత్రప్రాప్తికా ననుగ్రహించి, అంతట కూరత్తాళ్వార్లు, మొదలియాండార్ మొదలగువారితోడ తిరు కచ్చికి వేంచేసి పేరరుళాళని సేవించి, అందుండి తిరుపతికి వేం చేసి, ఆదివ్యదేశమునందు తిల్లగోవిందరాయని ప్రతిష్ఠచేసి తిరు వేంగడముడయని సేవించి, మురల నంబెరుమాళ్ల సన్నిధికి వేంచే సి, శిష్యకోటికి కాలక్షేపముసాధించుచు నివసించియుండి, నాచ్చి యార్ తిరుమొళ్లి ప్రస్తావములో అళ్గకరు (సుందరభుజుని) తిరు మలకు వేంచేయు వేడుకజనింపగా అచ్చటికి వేంచేసి అళ్గగరుకు నాచ్చియారు సాధించినచొప్పున నూరుతళిగలు అక్కారవడి సలు (క్షీరాద్యనేక సంయుక్తగుడాన్నము.) ఆరగింపుచేయించి, అచ్చటినుండి శ్రీవిల్లిపుత్తూరికి వేంచేసి, శ్రీవటపత్రశాయిని సేవిం చి, గోదాదేవి సన్నిధికివేంచేసి, ఆ నాచ్చియారువలన నాత్మో ద్దేశపూర్తిచేసినందులకు ప్రతినిధిగా, నల్గోయిలణ్ణార్ (గోదా గ్రజుడు) అను తిరునామముచాతుకొని, తీర్థప్రసాదములను స్వీక రించి, అందుండి తిరునగరికివేంచేసి, శ్రీశఠారాతిని, ఆదినాథుని సేవించి, తీర్థప్రసాదములను స్వీకరించి, అచ్చటవిశ్రమించి, చింతే క్రిందిశఠారిని సేవించి, శేషాంశసంభూతమయి చిరజీవియై యొ ప్పుచున్న తిరుప్పుళియాళ్వారును (తింత్రిణీవృక్షమును) సేవించి, పిమ్మట అచ్చటజరిగెడు మహోద్భుతమయిన నమ్మాళ్వార్ల తిరు మజ్జనోత్సవమును సేవించి, అమానుషమును అత్యద్భుతము నైన యాళ్వార్ల ప్రభావమునకు పరమాశ్చర్యమును వహించి, అచ్చట వేంచేసియున్న వైష్ణవకోటితో, అనాదిసిద్ధమును అస మానమునైనను, మతాంతరవిజృంభణముచే ఎక్కడనో అడగి

యుండిన యీ శ్రీవైష్ణవదర్శనమును ఉద్ధరించి, ఆస్మదాదులకు నుపకారములై యుండ దేవతలకు సైతము అగమ్యములై అతిగోప్యములై యొప్పునట్టి వేదరహస్యార్థములు వెల్లడియగునట్లు ద్రావిడభాషా రూపమున ప్రబంధములను రచియించి, సర్వలోకపాలకులై వెలసిన ప్రపన్నజనకూటస్థులయిన యాళ్వారుల విషయమై నేనుచేయగల కైంకర్యము ఏదియు గానరాదే. పుత్రుడున్నయెడల పేరైన పెట్టుకోవచ్చును. సన్యాసి యగువానికి పుత్రోత్పత్తియు అసంభావితమే కదా? అని ఆనతిచ్చి, ఏమియు తోచక విచారించుచుండగా, పెరియతిరుమలనంబిగారి కుమారులయిన, తిరుమలనంబియనువారు, భాష్యకారులను దండము సమర్పించి, దాసుడు అర్హుడగునేని పుత్రుడుగా తిరువుళ్లపట్టి మనోరథసిద్ధి పొందుదురుగాక అనిరి. అందులకుభాష్యకారులు చాలహర్షించి, వారిని పుత్రస్వీకారముచేసికొని, తిరుక్కురుగైప్పిరాన్ పిళ్లాన్ (శ్రీకురుకేశులు) అని తిరునామముచాతి ఆళవందారుయొక్క మూడవ మనోరథమును నెరవేర్చి, కృతార్థంమన్యమానులైరి. అప్పుడు ఆళ్వార్లు ఉడయవరులయందు వాత్సల్యము పొదుకొలిపి, తమతిరువడి నెలవును ప్రసాదించిరి. అంతట ఉడయవరు పరమహర్షమాణ మానసులగుచు నేటికాలమునకు ఏలినవారి తిరువడి నెలవుకనంగాంచితిమి అనుకొనుచు, ఆళ్వార్లు లీలావిభూతియందు వేంచేసియున్న భావముతో నొక యర్చావిగ్రహమును వేంచేయింపజేసి, మహావైభవముతో తిరుమజ్జనోత్సవమునునడపి, తిరుమంగ యాళ్వారు మునుపు వేంచేయింపజేసి యున్నచొప్పున శ్రీయాండాళును, తక్కినయాళ్వారులను తిరుమంగయాళ్వార్లను అర్చావిగ్రహరూపమున వేంచేపుచేసి, అందుండి శ్రీరంగమునకువచ్చి యెప్పటివలె శిష్యసంఘమునకు కాలక్షేపముసాదించుచు మఠములో నెలకొనియుండిరి.

ఇట్లు భాష్యకారులు శ్రీవైష్ణవదర్శనమును సర్వత్రవ్యాపజేసి, తమతిరువడినాశ్రయించిన ప్రపన్నులలో కొందరకు ఆచార్యపదమును సాదింపకున్నయెడల గురుపరంపరాగతమయిన యీదర్శనప్రవృత్తి యవిచ్ఛిన్నముగా నేర్పడనేరదని, డెబ్బదినాలుగు సుదర్శన పాంచజన్యములనుచేయించి, వానిని శ్రీభాష్యకోశములను నాలుగింటిని తమతిరువారాధనమయిన పేరరుళాళని సన్నిధిలోనుంచి, ఎల్లప్రపన్నులను సన్నిధికిరప్పించి, తమతిరువుళ్లముచొప్పున డెబ్బదినాలుగు తిరునామములకును డెబ్బదినాలుగు సుదర్శనపాంచజన్యములను సాదించి, అందు నలువురకు శ్రీభాష్యకోశములు నాలుగింటిని అనుగ్రహించి, ఇంకొకరికి భగవద్విషయకోశమును ప్రసాదించి, ఇదిమొదలు శిష్యకోటికి సమాశ్రయణము మొదలగువాని ననుగ్రహింపను, ఉభయవేదాంతోపదేశములు చేయను మీరు స్వతంత్రులు అని యానతిచ్చి, డెబ్బది నలువురకు ఆచార్య పురుష సింహాసనాధిపత్యమును, నలువురకు దానితోడ భాష్యసింహాసనాధిపత్యమును, బిరుదులతోడ ప్రసాదించిరి.

వీరుగాక ఏళ్నూరుగురు జియ్యంగార్లును, పండ్రెండువేల పరమైకాంతులును, అనేకులు భగవత్కైంకర్యపరులును, కొందరు అమ్మంగార్లును, కొందరు దాసనంబులును ఉడయవరు తిరువడినాశ్రయించి వారిచేనియమితములైన కైంకర్యములను కావించుచుండిరి. అందు మొట్టమొదట యతిరాజులనాశ్రయించినవారును వయోవృద్ధులునైన కూరత్తాళ్వార్లు, నడాదూరాళ్వాన్, మొదలియాండాన్, కిడాంబియాచ్చాన్ మొదలగువారును, పిమ్మట భాష్యకారులచే జ్ఞానపుత్రుడుగా స్వీకరింపబడిన తిరుకురుకైప్పిరాన్ పిళ్లానును, శ్రీపరాశరభట్టరును ముఖ్యులైయుండిరి. ఉడయవరు శాస్త్రానుమతమును, తమ తిరువుళ్లమునకు సరిపడినదియునైన వారియునికికి చాలనాహ్లాదమును వహించిరి.

# చతుస్సప్తతి సింహాసనాధిపతులయిన యాచార్యపురుషుల తిరునామములు.

---

౧. శ్రీయామునాచార్యపుత్రులైన శొట్టనంబిగారు.
౨. పెరియనంబి కొమారులయిన పుండరీకాక్షులు.
౩. తిరుక్కోట్టియూరు నంబి కొమారులు తెర్కాళ్వాన్.
౪. తిరుమాలెయాండాన్ కొమారులు సుందరత్తోళుడయార్.
౫. పెరియతిరుమలనంబి కొమారులు తిరుక్కురుహై ప్పిరాన్ పిళ్లాన్.
౬. పిళ్లైత్తిరుమలనంబి.
౭. కూరత్తాళ్వారులు.
౮. కూరత్తాళ్వార్ల కుమారులయిన పరాశరభట్టరు.
౯. సీరామపిళ్లై (లేక) వ్యాసభట్టరు.
౧౦. మొదలియాండాన్.
౧౧. నడాదూరాళ్వాన్.
౧౨. ఎంగళాళ్వాన్.
౧౩. నడువిలాళ్వాన్.
౧౪. గోమడత్తాళ్వాన్.
౧౫. తిరుక్కోవలూరాళ్వాన్.
౧౬. తిరుమోగూరాళ్వాన్.
౧౭. పిళ్లయాళ్వాన్.
౧౮. అనంతాళ్వాన్.
౧౯. మిళగాళ్వాన్.
౨౦. నెయ్యుండాళ్వాన్.
౨౧. శెట్టలూరుసిరియాళ్వాన్.
౨౨. వేదాంతియాళ్వాన్.
౨౩. కోయిలాళ్వాన్.
౨౪. ఉక్కలాళ్వాన్.
౨౫. అరణపురత్తాళ్వాన్.
౨౬. ఎంబారు.
౨౭. కిడాంబియాచ్చాన్.
౨౮. కణియనూరుసిరియాచ్చాన్.
౨౯. కొంగిలాచ్చాన్.
౩౦. ఈచ్చంబాడియాచ్చాన్.
౩౧. తిరుమలైనల్లాన్.
౩౨. వంగిప్పురత్తాచ్చాన్.
౩౩. తిరుక్కణ్ణపురత్తాచ్చాన్.
౩౪. సిరియగోవిందపెరుమాళ్.
౩౫. కిడాంబిపెరుమాళ్.
౩౬. అమ్మంగిపెరుమాళ్.
౩౭. ఆనూరిప్పెరుమాళ్.
౩౮. పిళ్లయప్పన్.
౩౯. వంగిప్పురత్తునంబి.
౪౦. ముడుంబైనంబి.
౪౧. పరాంకుశనంబి.
౪౨. తిరుక్కురుంగుడినంబి.
౪౩. తొండనూర్నంబి.
౪౪. అరుణపురత్తునంబి.

౪౫. మరుమూర్నంబి.
౪౬. మఱ్ఱియూర్నంబి.
౪౭. వడుగనంబి.
౪౮. కురవినంబి.
౪౯. కందాడైయాండాన్.
౫౦. సోమాసియాండాన్.
౫౧. జియ్యరాండాన్.
౫౨. ఈశాండాన్.
౫౩. పెరియాండాన్.
౫౪. సిరియాండాన్.
౫౫. అమ్మంగియాండాన్.
౫౬. ఆళవందారాండాన్.
౫౭. ఉక్కలమ్మాళ్.
౫౮. పరుత్తికొల్లైయమ్మాళ్.
౫౯. వైత్తమానిధియార్.
౬౦. సిరువళ్లి దేవరాజభట్టర్.
౬౧. పిళ్లైయురందయుడయార్.
౬౨. పిళ్లై త్తిరువాయ్మొళ్లి యరయర్.
౬౩. పిళ్లై త్తిరునరయూరరయర్.
౬౪. పిళ్లై రాజమహేంద్రప్పెరుమాళరయర్.
౬౫. అధికారిప్పిళ్లై.
౬౬. తిరునగరిప్పిళ్లై.
౬౭. ఆర్కాట్టుప్పిళ్లాన్.
౬౮. కొమాండూరుపిళ్లై.
౬౯. అనంతసోమయాజియార్.
౭౦. కాంచిసోమయాజియార్.
౭౧. అలంకారవేంగడవర్.
౭౨. కుంజిప్పూర్ సిరియాండాన్.
౭౩. కొమాండూరు ఇళయవల్లి.
౭౪. మాఱొన్ఱిల్లా మారుతియాండాన్.

---

ఈ చెప్పబడిన సింహాసనాధిపతులలో తిరుక్కురుగైప్పిరాన్ పిళ్లాన్, నడదూరాళ్వాన్, కిడాంబియాచ్చాన్, మొదలియాండాన్ అనునీ నలుగురును శ్రీభాష్యప్రవచన సింహాసనాధిపతులు. ఇందును తిరుక్కురుగైప్పిరాన్ పిళ్లాన్ పిమ్మట శ్రీభాష్య భగద్విషయోభయ సింహాసనాధిపత్యమునుగూడ వహించిరి.

మరియు శ్రీరంగనారాయణ జియ్యరు, ఈచ్చంబాడి జియ్యరు, గోవిందజియ్యరు, శట్టైప్పళ్లిజియ్యరు, తిరుమల్లిశజియ్యరు, తిరువెళ్లరజియ్యరు, తిరుప్పుడుక్కుడిజియ్యరు, ఆడొక్కండవిళ్లి

---

ఈ తిరునామములలో కొన్ని ప్రత్యంతరములలో భేదపడి యున్నవి. అవి వారినామాంతరములుగా నుండునని తోచెడిని.

జియ్యరు, తిరుమాలిరుంజోలై జియ్యరు మొదలుగాగల పత్తొన్నిదుగురు జియ్యంగార్లును, నంబి గురుదేవర్ మొదలుగాగల పండ్రెండు వేలమంది పరమైకాంతులును, తూయముని వేళ్ళవర్ మొదలుగాగల కైంకర్యపరుల నేకులును, తిరువరంగమాయోన్ మొదలుగాగల కావలిప్రజలును, పిళ్లయురుంగావల్లిదాసులు మొదలుగాగల దాసనంబులును, తిరువనందపురత్తమ్మై మొదలుగాగల అమ్మంగార్లును శ్రీభాష్యకారుల చరణారవిందములందు ప్రవణులయి తమతమ కైంకర్యములం దేమరక వర్తించుచుండిరి. ఉడయవరు తిరువడి నాశ్రయించినవారిలో కూరత్తాళ్వార్లు, మొదలియాండాన్, నడాదూరాళ్వాన్, గోవిందభట్టరును శ్రీభాష్యరచనకు తోడుపడినవారైరి. అరుళాళప్పెరుమాళెంబెరుమానారు ఉడయవరునియమనముచొప్పున శ్రీగజేంద్రవరదు నారాధించువారైరి. కిడాన్బియాచ్చాన్ తిరుమడప్పల్లి కైంకర్యమునందు నియమితులై యుండిరి. మరియు పిళ్లయురంగవల్లిదాసులు బొక్కసదారులును, అమ్మంగియాండాన్ పాలుకాగబెట్టువారును, ఉక్కలమ్మాళ్ ఆలవట్టముపట్టువారును, మారుతిప్పెరియాండాన్ చేతిచెంబుపట్టువారును, ముత్తొనిల్లా మారుతిచ్చిరియాండాన్ మఠమునందు తండులశాకాదివస్తువులు సంగ్రహించియుంచువారును, తూయముని వేళ్ళవర్ తిరుమజ్జనకైంకర్యము చేయువారును, తిరువరంగమాళిగయరయర్ బొక్కసము నధికారులును, వండర్, శండర్ అను వారు రాజునొద్ద వేలికి వేయివరాలు పుచ్చుకొని మఠమునందు చిల్లరపనులు చేయువారును, రామానుజసేవకులు తిరుమేనికావలివారును, అకలంక నాట్టాళ్వారు ప్రతిపక్ష నిరసనము చేయువారునై యుండిరి. వడుగనంబి శ్రీరామానుజ చరణారవిందయుగ్మమే ఉపాదేయమనినమ్మి, తిరువారాధనము చేయుచువచ్చిరి. అనంతాళ్వారు భాష్యకారులచే నియమితులై తిరుమలలో పూదోటకైంకర్యము చేయుచువచ్చిరి.

ఇట్లు ప్రపన్నులగు శ్రీవైష్ణవశిఖామణులందరు ఉడయవరు సేవయందు బద్ధానురాగులై వర్తించుచుండగా, ఒకనాడు కొందరు శ్రీవైష్ణవులు ఉడయవరుజ్ఞానపుత్రులగు తిరుక్కురుగూర్ పిరాన్ పిళ్లాన్ గారిని, అనువర్తించి, ఆళ్వారుసాదించిన శ్రీసూక్తుల రహస్యార్థములు తెలియబడునట్టి వ్యాఖ్యానమొకటి కావలెనని ఉడయవరుతో విజ్ఞాపనముచేయుడని విన్నవింపగా, వారు అట్లే కావించిరి. అందులకు భాష్యకార్లు హర్షించినవారై, ఆపిళ్లాన్ నమ్మాళ్వార్లనుండి వచ్చినయవిచ్ఛిన్నగురుపరంపరకు నాథులైన నాథమునుల వంశమునందు ప్రభవించిన ఆళవందారు నియమనమునుతప్పక నడపువారైన పెరియ తిరుమలనంబిగారి కుమారులుగనుకను, స్వభావజన్యమైన ప్రబంధవిషయ గౌరవముగలవారుగనుకను, తిరువాయ్ మొళ్లియొక్క అర్థానుసంధాన క్రమమునెరిగిన మీరే నాలాయిరమునందును ప్రధానమైన తిరువాయ్ మొళ్లికితగినట్టు ఆరాయిరప్పడిగా ఒకవ్యాఖ్యానమును కావింపుడని వారికి ఆజ్ఞాపించిరి. ఆయాజ్ఞననుసరించి పిళ్లాన్, ఆరాయిరప్పడి రచియించి, ఉడయవరుల సన్నిధిలో సమర్పించిరి. దానిని భాష్యకార్లుకటాక్షించి, ఆళవందారుల నియమనముచొప్పున మీకు తిరుక్కురుగైప్పిరాన్ పిళ్లాన్ అని నామకరణము చేసినందులకు తగినఫలము లభించెనని శ్లాఘించి, ఆ యారాయిరప్పడికి భగవద్విషయమని పేరుపెట్టి, కాలక్షేపముల యందు మా సూత్రభాష్యము ఎట్లో అట్లు ఇదియును ఉపాసింప దగినది అని నియమించి, పిమ్మట తిరుక్కురుగైప్పిరాన్ పిళ్లానికి ఉభవేదాంత ప్రవచన సింహానాధిపత్యమును ప్రసాదించిరి. ఈయర్థములనెల్లను సంగ్రహించి వడుగనంబిగారు యతిరాజవిభవమునందు ఆనతిచ్చిరి. ఇదిగాక శ్రీభాష్యకారులు తాము రచియించిన గీతాభాష్యము, వేదాంతసారము, వేదాంతదీపము, వేదార్థ సంగ్రహము, శరణాగతిగద్యము, శ్రీరంగగద్యము, వైకుంఠగద్య

ము అను గ్రంథములను సయితము సన్నిధి నాశ్రయించినవారికి నిత్యము కాలక్షేపము సాదించుచువచ్చిరి.

అటుపిమ్మట కొన్నాళ్లకు కూరత్తాళ్వార్లు నిశ్శ్రేయసాపేక్షులై పెరియపెరుమాళ్లను సేవించి ఆమేలినవాడు తిరుమాలలు మొదలగువానినిసాదింపగా ఉడయవరుల శ్రీపాదతీర్థమును స్వీకరించి ద్వయానుసంధానము చేయుచు నిత్యవిభూతికి వేంచేసిరి.

అప్పుడు ఉడయవరు నాథమునుల నియమనానుసారముగా శ్రీచూర్ణ పరిపాలనముచేసి, బ్రహ్మమేధవిధిని సంస్కారముచేయుట మొదలుగాగల ద్వాదశాహకర్మములను యథావిధిగా భట్టరువలన చేయించి, తరువాత గౌతమోక్తప్రకారమున సంహితా పారాయణమును, తిరువాయ్మొళ్రి అనుసంధానమును చేయించి, తమవిషయమునందు అముదనార్ సాదించిన నూత్తందాది ననుసంధించుచు ఇయల్ నడుచునట్లుచేసి, నమ్మాళ్వార్లకు సంభావన సమర్పింప నియమించి, అదియంతయు నైనపిమ్మట సన్నిధి శిష్యులందరుచేరి తమకు సంభావనసమర్పింపగా దాని నంగీకరించి, ఇదిమొదలు శ్రీవైష్ణవులందరు చరమ కైంకర్యము నిట్లేనడపవలసినదని సిద్ధాంతస్థాపనమును చేసిరి.

పిమ్మట ఉడయవరు భట్టరుతోగూడ మఠమునకు వేంచేసి తాము నిత్యవిభూతికి వేంచేయువారై, పడమటిదేశమునందు వేదాంతియని యొకగొప్పవిద్వాంసు డున్నాడు వానిని సన్మార్గమునకుత్రిప్పి శ్రీవైష్ణదర్శన ప్రవర్తకుడు అగునట్లుచేయుమని భట్టరునునియమించి, సన్నిధివైష్ణవులనుకటాక్షించి, మీరుచేయు కైంకర్యము-శ్రీభాష్యమును అధికరించుట,ఒకరిచేఅధికరింపించుట,దివ్యప్రబంధార్థములను వినుట, వినిపించుట, దివ్యదేశములలో అముదుపడి చాతుపడి మొదలగువాని నడపుట, తిరునారాయణ పురములో గుడిసెయైనకట్టుకొని కొన్నాళ్లు వాసముచేయుట, అర్థముతోడ ద్వయానుసంధానముచేయుట, చేయించుట, ఒకభాగ

పక్షుని యభిమతమునకు భంగము కలుగజేయకుండుట అను నీయాదుప్రకారములు గలదై యుండును. ఇందు లభించినమాత్రమునైకొనుచు మూడువిధములయిన అపచారములును పొసగకుండునట్లు ఎచ్చరికకలిగి ప్రవర్తింపుడు అని యానతిచ్చి, నడాదూరాళ్వానుకు శ్రీభాష్యపరిజ్ఞానమును ప్రసాదించి, ప్రపత్తిపరమయిన ఆళ్వార్ల ముఖ్య శ్రీసూక్తులయందలి సుజ్ఞానమును భట్టరుకు అనుగ్రహించి, తమకు చరమకైంకర్యము చేయను, తమయవతారస్థానమయిన శ్రీపెరుంబూదూరునందు తమ యర్చావిగ్రహమును ప్రతిష్ఠచేయను పిళ్లానికి ఆజ్ఞాపించి, పిళ్లాన్ మొదలైన సన్నిధిశిష్యుల నందరను భట్టరువిషయమునందు భక్తి శ్రద్ధలుగలిగి మెలగనియమించి, మరియు చేయవలసిన నిబంధనలు అన్ని చేసి, చెప్పవలసిన బుద్ధులెల్లను చెప్పి, పెరియపెరుమాళ్ల శ్రీపాదతీర్థమును ప్రసాదమును స్వీకరించి, ఆళవందారు చరణపంకజములను అచంచలనిష్ఠాగరిష్ఠులై ధ్యానింపసాగిరి. అంతట మొదలియాండాన్ పిళ్లాన్ ఆచ్చాన్ మొదలయిన శిష్యులు భాష్యకారుల తిరువుళ్లము వికాసమునువహించునట్లు, వారియవతారస్థలమైన శ్రీపెరుంబూదూరిలోను, దర్శనప్రతిష్ఠచేసిన శ్రీరంగములోను, జీర్ణోద్ధరణము కావించిన తిరునారాయణపురములోను, పన్నిద్దరాళ్వార్లతోపాటు తమదివ్యవిగ్రహ ప్రతిష్ఠచేయ నియమనమును పడసినవారై, ఒకవిగ్రహమును అప్పుడే కావింపించి, మునుపు నమ్మాళ్వారు భవిష్యద్రామానుజ విగ్రహమిదియని శ్రీమన్నాథమునులకు సాదింపగా వారును, ఆనాథమునులవలన ఉయ్యకొండారును, వారివలన మణక్కాలనంబియు, వారివలన ఆళవందారును, వారివలన తిరుకోట్టియూరునంబియు, వారివలన వారికొమార్తయయిన అత్తుళాయమ్మయు పరిగ్రహించి యారాధించుచున్న దివ్యమంగళవిగ్రహము సన్నిధిలో వేంచేపుచేయించి తిరువుళ్లపట్టవలెనని ప్రార్థింపగా, ఆవిగ్రహములను తాము కౌగి

వించుకొని, ఆండాళ్, పిళ్లాన్ ఈయిరువురిని కటాక్షించి, ఇందు ఒక విగ్రహమును శ్రీపెరుంబూదూరిలోను, మరియొక దానిని పెరియపెరుమాళ్ల సన్నిధిలోను ప్రతిష్ఠచేయుడు అనినియమించి, ఆచ్చానుతో మేము ఏబది యిరువురి కొరకు ప్రసాదించిన మా యర్చావిగ్రహమును తిరునారాయణపురములో ప్రతిష్ఠచేయింపు మని యానతిచ్చి, తక్కిన దివ్యదేశములందు తమయర్చావిగ్రహ మును ప్రతిష్ఠచేయ నడాదూరాళ్వాన్ మొదలుగాగల శిష్యు లకు ఆజ్ఞాపించి, తమతిరువారాధనమయిన పేరరుళాళనిని, శ్రీ హయగ్రీవునిని పిళ్లానికి ప్రసాదించి, భట్టరు మొదలియాండాన్ మొదలగువారికి విశేషార్థముల నెల్ల ననుగ్రహించి, పెరియనంబి తిరువడి తిరువుళ్లమునందు నిలిపి ధ్యానించుచు, పెరియ పెరు మాళ్ల సన్నిధికి వేంచేసి తాము రచియించిన గద్యమునందు దోచు రీతిని శ్రీరంగనాథుని మంగళాశాసనము చేసి, తమకు నిత్యవిభూతి ప్రసాదింప ప్రార్థింపగా, శ్రీరంగనాథుడును తిరుమాలెలు మొద లగు మర్యాదలనుప్రసాదించి, తిరుముఖ మండలమునందు విచార చిహ్నముకనబడ సేవసాదింపగా, ఉడయవరును పెరియపెరు మాళ్ల నియమనమునుపొంది మరల మఠమునకు వేంచేసి, ఆళవం దారు శ్రీపాదతీర్థముస్వీకరించి, భట్టరు మొదలగువారుపరమభక్తి పరులై యుపనిషత్తులను, తిరువాయ్మొళిని అనుసంధించుచుం డగా, బ్రహ్మరంధ్రమువిచ్చి అభిజిన్ముహూర్తమునందు శ్రీభాష్య కారులు నిత్యవిభూతిపరులై శ్రీవైకుంఠమందిరమునకు వేంచేసిరి.

వీరు నిత్యవిభూతికి వేంచేసినది పింగళ సంవత్సర మాఘ శుక్లదశమీ యుక్తమయిన ఆర్ద్రానక్షత్రమునందు.

వీరు లీలావిభూతియందు వేంచేసియుండినది నూట యిరువది తిరునక్షత్రములు.

ఇది శ్రీభాష్యకారుల వైభవము.

## శ్రీపరాశరభట్టరు వైభవము.

అనంతరము పిళ్లాన్ భట్టరు మొదలగువారు చాలపరితాపమును పొందినవారై కొంతసేపు స్మృతితప్పి పడియుండి పిమ్మట కళదెలుపుకొని శ్రీరంగనాథుని నియమనముచొప్పున ఉడయవరులను ఒకయావరణములో వేంచేయింపజేయగా శ్రీరంగనాథుడు ఉభయనాచ్చిమారులతో అచ్చటికి వేంచేసియుండెను. అంతట ఉడయవరులకు తిరుమంజనమును, పిమ్మట తక్కిన చరమకైంకర్యములును శ్రీయాళవందారుకు ఎట్లో అట్లు యథావిధిగా నడపనయ్యెను. అటుపిమ్మట ఉడయవరుల నియమనముచొప్పున భట్టరు మొదలగువారు తిరువధ్యయనమును ఇయలును నడపి శ్రీపాదతీర్థమును స్వీకరించిరి. అదిమొదలు శ్రీభాష్యకారుల నియమనముచొప్పున ఎల్లవారును పిళ్లాన్ భట్టరు ఈ యిరువురి సన్నిధిని ప్రవృత్తిచేయుచువచ్చిరి. మొదలియాండాన్ వలన శ్రీపెరుంబూదూరిలోను, పిళ్లాన్ వలన శ్రీరంగములో శయనస్థానమునందును, కిడాంబియాచ్చాన్ నల్లాన్ మొదలుగాగల కొందరివలన తిరునారాయణపురములోను శ్రీయతిరాజ దివ్యమంగళ విగ్రహములు ప్రతిష్ఠింపబడెను. కుంభకోణము మొదలయిన తక్కిన దివ్యదేశములలోను అందందుగల కైంకర్యపరులచే శ్రీయతిరాజ దివ్యమంగళ విగ్రహప్రతిష్ఠ చేయబడెను. ఇట్లు శ్రీభాష్యకారులవైభవము శ్రీభగవదర్చావతార వైభవమునుబోలి సర్వత్ర నిరంతరాయముగా ప్రవర్తిల్లెను. భట్టరు నియమనమువలన శ్రీభాష్యకారుల తిరునక్షత్రమగు ఆర్ద్ర యందు మహావైభవముతో ప్రతిదివ్యదేశమునందును నెలనెల తప్పక మహావైభవముతో ఉత్సవములు జరగసాగెను.

తరువాత తిరుమలనుండి పిళ్లై తిరుమలనంబి (అనంతాళ్వార్) మొదలగువారును, తూర్పుదేశమునుండి పచ్చాన్ మొదలగువారును, పడమటిదేశమునుండి సోమాసియాండాన్ మరుదూరునంబి తొండనూర్నంబి మొదలగువారును, మరియు దక్షిణ దేశాంతరములనుండు శ్రీవైష్ణవులు అందందుండియు సంఘములు సంఘములుగాగూడి శ్రీరంగమునకువచ్చి ఉడయవరుల వియోగమునకు చాలదుఃఖితులై, పిమ్మట భట్టరు వారిని సేవించి, కొంతకొంత మనఃపరితాపము చల్లపడగా వీరేమనపాలికి ఎంబెరుమానారు అని భట్టరు వారివలన తమయిష్టార్థములను అడిగి తెలిసికొని, "ప్రత్యక్షము అనుమానము శాస్త్రము అను త్రివిధ ప్రమాణములచేతను, అన్యమతస్థులనెడి యేనుగుల కుంభస్థలములను భేదించునట్టి శ్రీపరాశరభట్టరు అను సింహము వెలుగొందుచున్నది" అను నర్థముగల శ్లోకములు మొదలగువానిచే భట్టరు వారిని కొనియాడి వారి యనుమతిపడసి తమతమ నివాసదేశములకునరిగిరి.

తదనంతరము పరాశరభట్టరు శ్రీయతిరాజుల నియమనము చొప్పున దిగ్విజయ యాత్రవెడలి యనేకదేశములందు జయధ్వజములను నాటుచు శారదాపీఠమునకుబోయి అందు శారదాదేవిని ప్రత్యక్షము చేసికొని, ఆమహాదేవివలన శ్లాఘింపబడి, అందుండి మరలి శ్రీవేంకటాచలమునకు వేంచేసి, అందు శ్రీనివాసుని సేవించి శ్రీరంగమునకు వచ్చుచు మధ్యేమార్గమునందు ఒక గొల్లచిన్నదానికి పరమపదము కలుగ ననుగ్రహించి శ్రీరంగనాథుని సన్నిధికివచ్చి, అర్చారూపమున వేంచేసియుండు శ్రీభాష్యకారులను సేవించి, చేతులు జోడించుకొని సన్నిధిలో నిలువబడి ధ్యానింపనారంభింపగా, భాష్యకారులు చాలహర్షించి,

అర్చక ముఖమున వేదాంతోదయనాచార్యుడు అని తిరునామము చాతిరి.

పిమ్మట పరాశరభట్టరు కిడాంబియాచ్చానుకు శ్రీయాళవందారు స్తోత్రములో ఒకశ్లోకము నర్థము విశదముగా ఆనతియ్యగా వారు విని సంతోషించి భట్టరుగారివద్ద ప్రపత్తిచేసిరి. అంతట వారిశిష్యులు మహానుభావులగు మీరు ఇట్లు చేయనేలయని విన్నపముచేయగా కిడాంబియాచ్చాన్ ఆశిష్యులతో శ్రీభాష్యకారుల నియమనముచేతను దర్శన ప్రవర్తకులని తెలియబడుటచేతను నేను వీరియెడల ప్రపత్తిచేయుచున్నాను అని యానతిచ్చిరి.

మరియొకనాడు భట్టరు తిరునెడుందాండకమునందు ఒక పాశురమునకు యుక్తమయిన అర్థమును కల్పించిచెప్పిరి. అది విని తిరువరంగప్పెరుమాళరయరు మునుపు అడియని యాచార్యులవద్ద నిట్టియర్థమును విన్నవాడనుగాను. ఇప్పుడు భట్టరు సన్నిధిలో వింటిని. ఏమి వీరివిద్యామహిమయని చాల ప్రతిపత్తి చేసిరి.

ఆవల నొకనాడు కొందరు విద్వాంసులు భట్టరుతో వాదముచేయరాగా వారినందరను వాదమునందు జయించిరి. అంతట వారు భట్టరువారి సర్వజ్ఞత్వమును పరీక్షింపగోరి, ఒకబుంగలో పాము నొకదానిని పిడిచి నోరుకప్పి బిగగట్టి తెచ్చి దీనిలోనేమి యున్నది చెప్పుడని యడుగగా, భట్టరు శ్రీరంగనాథుని శ్వేతచ్ఛత్రము కాదా అనిరి. అందులకువారు, ఓరా సర్వజ్ఞత్వము అని పరిహాసము చేయుచు బుంగనోటి మూతవిప్పి, అందుండి పాము బయలువెడలగా చూచితిరా పెరుమాళ్లగొడుగు అనిరి. అప్పుడు భట్టరు "నివాస శయ్యాసన పాదుకాంశుకోపధాన వర్షాతపవారణాదిభిః" అని శ్రీయాళవందారు పాడించియున్నారుకాబట్టి యిది శ్రీశ్రియఃపతియొక్క గొడుగు అనుటకు ఆక్షేపమే

లేదని వారియాక్షేపమును నిరసించిరి. అంతట వారు భట్టరువారి సర్వజ్ఞత్వమును ఒప్పుకొని, వారిసమయోచితస్ఫురణకు ఆశ్చర్యపడి పొగడుచు పోయిరి.

పిమ్మట కొందరు కుత్సితులు భట్టరుయొక్క విషయ విరక్తిని పరీక్షింపదలచి వారు ఆరగించునపుడు నెయ్యముదుకుమారుగా వేపచమురు పరిమారిరి. భట్టరు ఆవిషయమునందు వెగటులేక నిర్విచారముగా నారగించిరి. అప్పుడు ఆకృత్యమునకు పాలుపడినవారందరు వీరు జితేంద్రియులు వీరియెడల తెలివిమాలి యపచారపడితిమని యనుకొనిరి.

అటుపిమ్మట ఒకనాడు శ్రీపరాశరభట్టరు తిరువడిసంబంధులయిన శ్రీవైష్ణవులతో గోష్ఠిగావేంచేసి దర్శన నిర్వాహము చేయుచుండగా, తీర్థవాసియైన యొకబ్రాహ్మణుడువచ్చి భట్టరును సేవించి, వారు కాలక్షేపము సాదించు చాతుర్యమును, గోష్ఠివైభవమును చూచి యాశ్చర్యపడి, స్వామీ! దేవరవారి విద్యామహిమయు గోష్ఠివైభవమును జూడగా, పశ్చిమ దేశమునందుండు వేదాంతియను విద్వాంసుని విద్యావిశేషమును గోష్ఠివైభవమును స్మరణకు వచ్చుచున్నది. అని విన్నవించెను. అందులకు భట్టరు ఏమేమీ? అంతటి గొప్పవిద్వాంసుడొకడు పశ్చిమదేశమునందున్నాడా? అనగా, ఔను. ఉన్నాడు అని చెప్పి, భట్టరుచే ఆనతిపుచ్చుకొని ఆబ్రాహ్మణుడు మరల పశ్చిమదేశమునకుపోయి, వేదాంతినిజూచి, విద్యచేతను గోష్ఠివైభవముచేతను మీతోపోల్పదగినవారి నొకరిని శ్రీరంగములో సేవించినాను. వారి పేరు పరాశరభట్టరు. అనిచెప్పెను. అదివిని వేదాంతి యాశ్చర్యపడి, ఆభట్టరు నిజముగా నన్నుబోలుదురా? అనగా, బ్రాహ్మణుడు, వారు మిమ్ముబోలినవారే కారు. మీకంటె అధికులును అగుదురు. అనెను.. అందుకు వేదాంతి, సరే, వారికి ఏశాస్త్రమునందు విశేష ప్రవీణతకలదు. అనియడుగగా, బ్రాహ్మణుడు,

క్షవి అది అననేల? తర్క-వ్యాకరణాదులు అన్నిటియందును వారు ప్రవీణులే. అని ప్రత్యుత్తరము చెప్పెను. అందులకు వేదాంతి కొంచెము శంకించి, ఈలోకములో శాస్త్రపరిచయమునందు మనమే అధికులము. మనకు ఎదురు ఎవరును లేరు అని, ఆరుశాస్త్రములను పరిశీలించినవారము అని బిరుదొకటి పెట్టుకొనియున్నాము. ఇట్టిమనలను మించినవారును ఒకరున్నారని యీబ్రాహ్మణుని మాటవలన తెలియవచ్చుచున్నది. ఇది విచారింపదగినది అని తనలోతాను ఆలోచించుకొనుచుండెను. ఆబ్రాహ్మణుడు అంతటితో ఊరకయుండక మరల శ్రీరంగమునకువచ్చి భట్టరుసన్నిధిలో, స్వామీ! మీవైభవములన్నియు పశ్చిమదేశవాసియైన వేదాంతికి శ్రుతపరిచి వచ్చితిని, అనగా భట్టరు బ్రాహ్మణుని కటాక్షించి, అతడు ఏమియుత్తరము చెప్పెనని యడిగిరి. వేదాంతి, వారు ఏవిషయమునందు సమర్థులని యడిగెను. నేను తర్క-వ్యాకరణాదులయిన యారుశాస్త్రములందును ప్రవీణులేయని చెప్పితినని బ్రాహ్మణుడు చెప్పెను. అందులకు భట్టరు, అయ్యా! నీవు ఇంకనొకటికొరత పెట్టితివి. తిరునెడుందాండకము వచ్చుననియు చెప్పవలసియుండెను. అనగా బ్రాహ్మణుడు మహాప్రసాదమని అప్పుడే బయలుదేరి పడమటిదేశమునకుపోయి వేదాంతితో భట్టరుకు తిరునెడుందాండకమును దెలియునట అనెను. అప్పుడు వేదాంతి తిరునెడుందాండకము అను మాటకు అర్థము తెలియక అదియేమివిషయమో, ఆవిషయము నెరిగినవారు ఎటువంటి మహాత్ములో అని విచారించుచుండెను.

పిమ్మట భట్టరు ఉడయవరు ఆనతినితలచుకొని వేదాంతిని దిద్దువారై పెరియ పెరుమాళ్ల సన్నిధిలో తమ మనోభిప్రాయమును నివేదింపగా, పెరుమాళ్లు భట్టరు తమకుమారులను మాట వెల్లడియగునట్లు వస్త్రభూషణాది సంపత్తిని పరిపూర్తిగా ననుగ్రహించి, యాత్రకువలయుపరికరములను సయితము ఒడగూర్చి,

సుఖముగాపోయి వేదాంతినిదిద్ది పిలుచుకరమ్మని యానతిచ్చెను. అట్లు సకలపరికర సమేతులయి భట్టరు శ్రీరంగమునుండి వెడలి పశ్చిమదేశమునకు వేంచేయుచుండగా, తిరుక్కావేరిదరిని సిరుప్పత్తూరియొద్ద నాయూరిలో నివసించియున్న అనంతాళ్వారు వీరి రాకయెరిగి కావేరితీరమునకు ఎదుర్కొనివచ్చి సేవించి, స్వామీ మహారాజపుత్రులగు దేవరవారు రాళ్లు ముండ్లు నిండుకొనియుండు నీయడవిమార్గమున నిట్లు శ్రమపడి రానేలయని మిగుల పరితాపముతో అడుగగా, భట్టరు అనంతాళ్వారి తిరువడుగులను సేవించి, ఉడయవరుల నియమనముచొప్పున నంబెరుమాళ్ల యానతియు పుచ్చుకొని వేదాంతినిదిద్దుటకై వెడలినవర్తమానమును విన్నవించిరి. అనంతాళ్వారును అందులకు మహానందమునొంది మాకులము నేలినా! అని భట్టరును అట్టెకౌగిలించుకొని "ఎంగళ్ కుడిక్కరసు" అని తిరునామము చాతిరి. అనంతరము భట్టరు అనంతాళ్వారును తమవెంట వెడలిరాగా యదుగిరికి వేంచేసి తిరుక్కల్యాణియను పుష్కరిణిలో నీరాడి నిత్యకర్మములు నడపుకొనుచుండగా, అచ్చట యేబదియిరువురు కైంకర్యపరులు మొదలుగాగల సన్నిధి వైష్ణవులందరు శ్రీశఠగోపము మొదలగు మర్యాదలతోవచ్చి కోవెలలోనికి వేంచేపు చేసికొని పోయిరి. అట్లు కోవెలప్రవేశించి, ఎంబెరుమానారును ఆళ్వారులను సేవించి, గర్భగృహముచొచ్చి తిరునారాయణుని సేవించి, ఎల్లమర్యాదలతోడను ఆపెరుమాళ్ల యనుగ్రహముపడసి, అందుండి కదలి కూరత్తాళ్వారులతనయులు, శ్రీరంగనాథునిప్రియపుత్రులు, వేదాంతాచార్యులు, బ్రహ్మణ్యశిరోమణులు, పరవాదిమదహస్తిపంచాననులు, శ్రీపరాశరభట్టరు వచ్చెదరు వచ్చెదరు అని బిరుదులు ఉగ్గడించుచు దాసజనులు మోసలనడవగా, తిరుచ్చిన్నములు, తుతారలు, పెద్దనగారాలు, డంకాలు మొదలగు వాద్యములు బోరుకలగగా, వేదాంతియుండు ఊరిచేరువకు వేంచేసిరి.

ఈకోలాహలమువిని అందలి బ్రాహ్మణోత్తము లిరువురువచ్చి, భట్టరును సేవించి, స్వామీ! దేవరవారు ఈ యాడంబరముతో వేంచేసిన పక్షమున వేదాంతి మీకు గోచరింపనేరడు. ఆయన యిల్లువిడిచి బయట వచ్చువాడు, బయటిపనులు ఏమియున్నను అతనిశిష్యులే నిర్వహించుకొని పోవుచుందురు. ఎవరేని విద్వాంసులు శాస్త్రవాదము నపేక్షించివత్తురేని, వారిని అతనిశిష్యులు ఈవాదములుచేసి తలవాకిటనుండియే వెళ్లగొట్టుచుందురు. అని విన్నవింపగా, భట్టరు మరియేవిధమున మేము వేదాంతినిచూడ వచ్చును అని యడిగిరి. అందుకు బ్రాహ్మణులు అతడు ఎడతెగక బ్రాహ్మణసంఘములకు సంతర్పణ చేయుచుండును కాబట్టి భోజనార్థము పోవువారు అతనియింటికి ధారాళముగా పోవుచు వచ్చుచుందురు. మీరును ఆబ్రాహ్మణ భోజన సమయమునకు, అందుకు తగినవేషముతో పోయినపక్షమున వేదాంతిని సులభముగా చూచి మాటలాడవచ్చును. అని చెప్పిరి. అంతట భట్టరు ఇదియే యిందులకు దగినయుపాయము. ఇట్టి మంచియుపాయమును దెలిపిన మీకు ఏమియిచ్చినను చెల్లును అని యథోచితముగా వారిని సన్మానించిపంపి, తమ పరిభవమంతయు ఊరివెలుపలనే యుండ నియమించి, అలంకారమును తొలగించి, కాషాయవస్త్రధారులు, ఉదకపూరితకమండలు కరులునునై, అనంతాళ్వారును వెంట బెట్టుకొనిపోయి వేదాంతియిల్లుచొచ్చి, ఒకమండపములో ఉన్నత పీఠమునందు గూర్చుండి, భోజనార్థులై యెడతెగకవచ్చుబ్రాహ్మణోత్తములనుజూచి హర్షించుచున్న వేదాంతినిజూచి, అందరితో పాటుతాము భోజనశాలకుపోక వేదాంతియున్న మండపమునందు నిలుచుండగా, అతడు మీరెవరు? ఇచ్చటికేలవచ్చితిరి. అని యడిగెను. భట్టరు భిక్షుకైవచ్చితిమి అనిరి. అందులకు వేదాంతి భిక్షుకువచ్చినవారికి ఇక్కడ పనియేమి? భోజనశాలకు పొండు అనెను. అంతట భట్టరు మేము అన్నభిక్షుకు వచ్చినవారము కాము

కాబట్టి మాకు భోజనశాలకుపో నక్కఱలేదు. మేము పేక్షించిన భిక్ష లభించుచోటు ఇదేకనుక ఇచ్చటపనిగలదని నిలిచితిమి అనిరి. ఆమాటలను వేదాంతి యించుకశంకించియు ధీరుడుకాబట్టి మీరు అన్నభిక్షుకురాకున్న మరియేభిక్షుకు వచ్చితిరి. అని యడిగి వాద భిక్షుకని భట్టరు ఆనతియ్యగా, మునుపటి తీర్థవాసిమాటలుతలచుకొని మీరు శ్రీరంగవాస్తవ్యులగు పరాశరభట్టరా యేమి? అని యడిగెను. భట్టరు ఔను అనిచెప్పి, తత్క్షణమే యతివేషమును తొలగించి,గృహస్థవేషముధరించి వస్త్రభూషణాలంకృతులై కొంచెమయిన జంకులేక వాదమునకు సిద్ధపడిరి. వేదాంతి యంతకు మునుపే వారిప్రభావమును వినియుండియు చక్కగా విమర్శింప గోరి వాదింప బూనుకొనెను. అట్లు ఇరువురును వాదమునందు అభినివేశముగలవారై సింహములవలె గర్జిల్లుచు తొమ్మిది దినములు వాదింపగా, పదియవనాడు భట్టరు మాయావాదియైన వేదాంతిని మీరి, అతని సిద్ధాంతమును ఖండించి, విశిష్టాద్వైత సిద్ధాంతమును స్థాపించిరి. అంతట వేదాంతి వికలుడై యేమియు తోచక లేచి శ్రీరంగనాథుడే దేవరవారు అనుచు భట్టరుకు మువ్మారు ప్రదక్షిణములుచేసి వారి పాదారవిందములు తనతలసోక సాష్టాంగదండముసమర్పించి దాసుని నేరమును సహించి మన్నింప వలయునని వినయముతో వేడుకొనెను.

అప్పుడు భట్టరు తమసంకల్పసిద్ధియైనందులకు నుప్పొంగుచు ప్రేమరసము ఉట్టిపడ వేదాంతినిగ్రుచ్చి కౌగిలించుకొని ప్రియములుపలికి అతనికిని అతని శిష్యకోటికిని పంచసంస్కారముచేసి, ప్రపత్తి తలకొలిపి, వేదాంతినిజూచి, అయ్యా! నీవు సర్వజ్ఞుడవు. నీకు నావలన దెలిసికోవలసిన యంశములు ఏవియు నుండవు. కాబట్టి విశిష్టాద్వైతమే సర్వోత్తమమయిన మతమని తెలిసికొని మునుపటి మాయావాదవాసననునిరసించి, శ్రీమన్నారాయణుని పాదపద్మములను ఆశ్రయించి, శ్రీరామానుజ సిద్ధాంత

మును అనుసరించి, శ్రీయాళ్వారులు సాధించిన నాలుగువేల దివ్యప్రబంధములను పఠించి యనుసంధించి ప్రపత్తినిష్ఠను వహింపుము. అని యానతిచ్చి, ఊరిముందరనున్న తన పరివారమంతయువచ్చి పరివేష్టింపగా మహావైభవముతో శ్రీరంగమునకు వేంచేసి, తనజయవార్త శ్రీరంగనాధుని సన్నిధిలో నివేదించి సేవించి, శ్రీశఠగోపాది సన్నిధి మర్యాదలెల్లను పరిగ్రహించి తిరుమాళిగకు వేంచేసి, దర్శననిర్వహణ నిష్ఠితచిత్తులై నివసించియుండిరి. మాయావాద నిరసనముచేసి, అట్టియన్యమత ప్రవర్తకులనెల్లను విశిష్టాద్వైత ప్రవర్తకులుగాదిద్ది దర్శననిర్వాహము చేయు మహిమ శ్రీభాష్యకారులందును శ్రీపరాశరభట్టరు వారియందునేగాని ఇతరులయందు గానరాదను జనశ్రుతి యెల్లదేశములందును అల్లుకొనెను.

తరువాత పశ్చిమదేశమునందు తెక్కగలై అను గ్రామమునందు శ్రీవైష్ణవ తదీయారాధనచేయుచు భగవద్భాగవతసేవాపరాయణుడై యుండు వేదాంతియొక్క తిరుమాళిగకు ఒకానొకప్పుడు ఇరువురు శ్రీవైష్ణవులువేంచేసి కొంచెము ప్రసాదము సాధింపుడని యడుగగా, వేదాంతి భార్యలు ఇరువురును ఇంటి యజమానులు నీరాటమునకు వేంచేసియున్నారు. వారుతప్ప మిమ్ము, ఆదరించువారు ఇచ్చట ఎవరునులేరు. అని యనాదరము చేసిరి. అంతట ఆశ్రీవైష్ణవులు వేదాంతి యనుష్ఠానముచేసికొనుచున్న తావునకువేంచేసి తమస్థితిని విన్నవింపగా, వారు కలత నొందిన చిత్తముతో తిరుమాళిగకువచ్చి తమదేవులను కోపించి, ఇక ఇట్టివారితోడి సాంగత్యముకొరగాదని మితిలేనితనయాస్తియంతయు మూడుభాగములుగా విభాగించి, అందు రెండుభాగములయాస్తిని ఇరువురుభార్యలకును సమభాగముగాపంచిపెట్టి, మూడవ భాగమును తమ యాచార్యులకు సమర్పించువారై పుచ్చుకొని, ఉత్తమాశ్రమమునుస్వీకరించి, కావేరి తీరమునందలి

సిరుప్పుత్తూరికివచ్చి శ్రీయనంతాళ్వారును సేవించి, వారుసాదించిన ప్రబంధములను అనుసంధించుచు శ్రీరంగమునకువచ్చి, భట్టరు సన్నిధిలో తనసర్వస్వమును సమర్పించి నిలువగా, వారును వీరివైరాగ్య సంపత్తికి మెచ్చుకొని మనజియ్యరు వచ్చిరియని మహాహర్షముతో బిగ్గకౌగిలించుకొని సన్మానించిరి. అదిమొదలు వేదాంతిగారికి ద్రావిడమున మనజియ్యరు అనునర్థముగల 'నంజియ్యరు' అను తిరునామము వ్యవహరింపబడనాయెను. వీరికి తొలుత మాధవాచార్యులు అనియు, తరువాత వేదాంతియనియు, కడపట నంజియ్యరు అనియు తిరునామములు. ఇట్టి నామత్రయ విశిష్టులయిన నంజియ్యరు భట్టరువారిసన్నిధిచేరి, వారి నెడబాయక సేవించుచు, వారుసాదించు దర్శన ప్రవచనార్థములను వినుచు భక్తిప్రపత్తులు వెలయవేంచేసియుండిరి.

అటుపిమ్మట ఒకానొకప్పుడు భట్టరు నంజియ్యరు మొదలుగాగల ప్రపన్నులతోగూడ బయలుదేరి తిరువణకు (సేతువునకు) వేంచేసి, సేతుస్నానముచేసి మరల శ్రీరంగమునకు వచ్చునపుడు పాదిరి అనుగ్రామమునొద్ద సూర్యాస్తమయముకాగా, ఆయూరిలో ఒకబోయవానియింట నాటిరాత్రి నివసించి యథోచిత సల్లాపములుచేయుచు భట్టరు ఆబోయవానిని ఇచ్చట నేమయిన విశేషముగలదాయని యడుగగా, వాడు, స్వామీ! నేనీయూరి వెంబడి యడవిలో వేటాడబోయి ఒకచోట తారాడుచున్న కుందేటిపిల్లనుజూచి పట్టుకొంటిని. అప్పుడు దానితల్లి నామొదటికివచ్చినిలిచి కన్నులనీరుగార్చుచు మ్రొక్కసాగెను. అందువల్ల నామనసున కనికరముపుట్టి, అయ్యోపాపము బ్రతికిపోనీ, అని యాకుందేటిపిల్లను విడిచిపెట్టివచ్చితిని. ఇంతకంటె విశేష వర్తమానములు ఏవియు నిచ్చటగానరావు. అని విన్నవించెను. భట్టరు ఆమాటలు తిరువుళ్లపట్టి మృగములనుచంపి జీవించునట్టి యీ వేటకానికే శరణాగతరక్షణ బుద్ధిపుట్టినప్పుడు సర్వజీవ

దయాపరుడయిన శ్రీయఃపతికి శరణాగతరక్షణమునందు మక్కువ కలిగియుండుననుటకు అనుమానమేమి? ఇందులకు శాస్త్రప్రమాణమేల? అని యందరువిన నానతిచ్చి, తెల్లవారగానే అందుండి వెడలి శ్రీరంగమునకు విజయముచేసిరి.

తరువాత నొకనాడు భట్టరు నంజియ్యరునుజూచి తిరువాయిమొళ్ళిలో ఒకపాశురమును గానరూపమున అనుసంధింపుడు అనగా, వారు ద్రావిడులును, ద్రావిడభాషయందు లక్ష్యలక్షణజ్ఞానముగలవారును కాబట్టి భట్టరుసాధించిన మేరకు ఒక పాశురమును గానరూపమున అనుసంధింప నారంభించిరి. ఆ గానసారస్యమునకును, అందువలని భగవద్గుణానుభవ విశేషమునకునుచొక్కి భట్టరుజ్ఞప్తితప్పి నేలకొరగిరి. అదిగని నంజియ్యరు జాలినొంది గానమునిలిపి భట్టరుకు కళదెలిపి, ఇంతటిసారవశ్యమునకు నాస్పదమయిన తిరువుళ్ళము పలువంకలవ్యాపించు పాటనువిని యెట్లు నిర్వహించును? అని విన్నవించిరి. మరియొకనాడు, ఆకాలమునందు కోవెలకు ప్రాకారముకట్టించుచున్న వీరసుందర బ్రహ్మారాయడు అను రాజు తానుకట్టించు ప్రాకారపు చాలునకు అడ్డముగానున్నదని కూరత్తాళ్వారు శిష్యులగు పిళ్లైప్పిళ్ళయాళ్వాన్ అనువారి తిరుమాళిగను ఇడియగొట్ట యత్నింపగా, ఆరాజును భట్టరు తమసన్నిధికి బిలిపించి, ఏమహానుభావుల మంగళాశాసనము పెరుమాళ్లకు సంరక్షకమో ఆపిళ్లైప్పిళ్ళయాళ్వాన్ తిరుమాళిగకు అపాయము కలుగజేయ దలచితివట, నీమనసున మబ్బుకమ్ముకొనెనా ఏమి? పూర్వము పరమకైంకర్యపరులయిన తిరుమంగయాళ్వార్లు ప్రాకారము కట్టించునపుడు అడ్డముగానున్న తొండరడిప్పొడి యాళ్వార్ల తిరుమాళిగను ఒదిగించి కట్టించినట్టు నీవును పిళ్లైప్పిళ్ళయాళ్వాన్ తిరుమాళిగను ఒదిగించి ప్రాకామును కట్టింపుము. అని నియమింప

గా, వాడు భాగవతాపచారమునకు జంకక భట్టరు తిరువాక్య-ముల్లంఘించి తనయిష్టముచొప్పున ప్రాకారమునుకట్టించి ముగించుటయేగాక భట్టరును శ్రీరంగమునందు ఉండనీక పలుసంకటములు కలుగజేయగా, భట్టరు ఇది వీని నిరాకరింపదగిన సమయముకాదనియెంచి నంజియ్యారుతోడ శ్రీరంగమునుండి వెడలి తిరుకోట్టియూరికి వేంచేసిరి. అప్పుడు ఒకశ్రీవైష్ణవుడు భట్టరు సన్నిధికివచ్చి 'తిరువిరుత్తము' అను దివ్యప్రబంధమునకు అర్థము సాదింపవలెనని ప్రార్థించెను. అందుకు భట్టరు నంజియ్యారును జూచి, శ్రీరంగక్షేత్రమును శ్రీరంగనాథుని ఎడబాసినందున నా చిత్తము క్లేశము వహించియున్నది. కనుక నోరుతెరచి యొక మాటయైన చెప్పుటకు శక్తుడనుగాకయున్నాను. మీరు ఈయనకు నామారుగా తిరువిరుత్తము నర్థమునుజెప్పుడు అని యానతియ్యగా, నంజియ్యారును వారినియమనము నంగీకరించి నడపువారైరి. భట్టరు తిరువుళ్లమును క్లేశపెట్టిన వీరసుందర బ్రహ్మరాయడు ఆయపచార దోషమువలన స్వల్పకాలములోనే రోగపీడితుడై మృతినొందెను. అంతట పిళ్లైప్పిళ్లైయాళ్వాన్ తిరుకోట్టియూరికి వేంచేసి భట్టరునుజూచి మీవిషయమునందపచారపడిన నీచుడు మరణించెను. ఇక నిశ్శంకముగా శ్రీరంగమునకు వేంచేయవచ్చునని మందలింపగా, భట్టరు పరమానందభరితచిత్తులై పిళ్లైప్పిళ్లైయాళ్వాన్ తిరువడుగులపై సాగిలబడి దండములు సమర్పించి, అప్పుడే తిరుకోట్టియూరినుండి బయలువెడలి శ్రీరంగమునకువచ్చి నంబెరుమాళ్ల సేవచేసికొని తిరుమాళిగ ప్రవేశించి యథాపూర్వముగా దర్శనమును నిర్వహించుచు వేంచేసియుండిరి.

పిమ్మట ఒకనాడు భట్టరు నంబెరుమాళ్లను సేవింపబోయి నప్పుడు, ఆపెరుమాళ్లు భట్టరుకు అరుళప్పాడిడి ఉడయవరు శ్రీ భాష్యమును, గీతాభాష్యమును కావించిరిగదా? మీరు సహస్ర నామమునకు భాష్యముచేసి ప్రపత్తిపరులగు వైష్ణవశిరోమణుల కెల్ల మేలు సమకూర్పుడు అని యానతియ్యగా, భట్టరు ఆయాన తిని శిరసావహించి సహస్రనామమునకు నొకభాష్యమును రచి యించిరి. మరియు ఉడయవరుకు పిమ్మటి పూర్వాచార్యుల కం దరకును తామే ఆచార్యులయి విశిష్టాద్వైత సిద్ధాంతము నుద్ధ రించువారైనందున తిరుమంత్రవ్యాఖ్యానమయిన అష్టశ్లోకిని సయి తము పిమ్మట రచియించిరి. ఆయష్టశ్లోకియే తిరుమంత్రవ్యాఖ్యా నము లన్నిటిలోను మొట్టమొదటిది. ఇదివీరికి ఉడయవరు చాతి యుండిన వేదాంతాచార్యులు అను తిరునామమును సార్థకము చేయుచున్నది. ఇంతేకాక వీరికి పిమ్మటివారిలో తూప్పిల్ పిళ్లె వీరిచాయను పొందియున్నందున వారికిని పెరియ పెరుమాళ్లు వేదాంతాచార్యులు అనుతిరునామము కలుగజేసెను. తూప్పిల్ పిళ్లె భట్టరుచాయను అనుసరించినవారు అనుటకు తూప్పిల్ పిళ్లె విషయమయిన వేదాంతదేశికోదయము అను డెబ్బదిశ్లోకములు గల గ్రంథమునందు తూప్పిల్ పిళ్లెయైన వేదాంతాచార్యులు కూ రత్తాళ్వారు పుత్రులయిన భట్టరు పోలికగలవారై యున్నారు అని చెప్పబడియుండుటయే ప్రమాణము. ఇట్లు పూర్వాచార్యుల కందరి కంటెను మహిమగల శ్రీపరాశర భట్టరు సాదించిన గ్రంథములు:—

౧. శ్రీసహస్రనామభాష్యము.
౨. తిరుమంత్రవ్యాఖ్యానమైన అష్టశ్లోకి.
౩. తత్త్వరత్నాకరము.
౪. ప్రణవవివరణము.
౫. శ్రీగుణరత్నకోశము.

౬. శ్రీరంగరాజస్తవము.

౭. క్రియాదీపము.

౮. తత్త్వత్రయశ్లోకములు.

ఇత్యాది దర్శన నిరూపక గ్రంథములను రచించి మించిన శ్రీపరాశరభట్టరు వైభవము పాలసముద్రమువలె స్వచ్ఛముగా నెల్లయెడల వ్యాపించి వెలయుచున్నదే అయినను కొన్నివిషయములు ఇందు ఉదహరింపబడెను.

ఇట్లు భట్టరు దర్శనోద్ధరణము చేయుచు నంజీయ్యారుకు పిళ్లాన్ ఆరాయిరప్పడి సాకల్యముగా నుపదేశించిరి. నంజీయ్యారును దానిని క్రమముగా అధికరించి భట్టరు నియమనమునుపడసి, ఆయారాయిరప్పడికి వివరణరూపమయిన ఒన్బదునాయిరప్పడి అను వ్యాఖ్యానమొకటిచేసిరి. పిమ్మట ఒకనాడు భట్టరు వరాహపురాణమునందలి కౌశిక మాహాత్మ్యమయిన యధ్యాయమును పఠించుచుండి యాభాగమునకు తక్కిన భాగములకువలెగాక ఒక్కొక్క పదమునకు బహువిధముల యర్థములను కల్పించి చెవులపండుగుగా సాదింపసాగిరి. అందులకు పెరియపెరుమాళ్లు చాల హర్షించి తాము చాతుకొనియున్న తిరుమాల తిరుప్పరివట్టము తిరువాభరణములు మొదలయినవానిని సాదించి, తమదివ్యసింహాసనమును ప్రసాదింపగోరి, భట్టరూ! మీకు ఉత్తమపదమును ఇచ్చితిమి అని యానతియ్యగా, భట్టరు ఓరా, ఎంతఘనతను వహింపనాయెను అనియత్యంతము సంతోషించిరి. శ్రీవైష్ణవగోష్ఠియంతయు కలతపడి భ్రమించి నిలిచెను. వెంటనే భట్టరు మహానందపరవశులగుచు శ్రీరంగనాథుని సేవించి, సకలమర్యాదలతోను కోవెలపరిచారకులును తక్కిన శ్రీవైష్ణవసంఘమును పరివేష్టించి సేవింపగా బ్రహ్మరథమున రంగనాథునిసన్నిధినుండి తిరుమాళిగకు వేంచేసి, తల్లిగారగు ఆండాళుగారిని సేవించి, వారు "నలముందమిల్లాదోర్ నాడుపుగువీర్" అని యాశీర్వదింపగా, అమ్మా ఇదేమిమ్మ

సేవించుదినములలో కడపటిది అని విన్నవించి, ఆదివ్యదేశమునందలి శ్రీవైష్ణవులందరు తమతమ తిరుమాళిగలలో యథావిధిగా తిరువారాధనచేసి ఆరగించివచ్చి తమ్ము ఆవరించుకొని తిరునెడుందాండకమును అర్థసహితముగా అనుసంధించుచుండగా, పెరియతిరువడిపై వేంచేసి సేవసాదించిన శ్రీవైకుంఠనాథుని సేవించుచు కపాలమార్గమున లీలావిభూతినుండి వెడలి నిత్యవిభూతికి వేంచేసిరి.

అంతట సన్నిధివైష్ణవులు ఆవర్తమానము ఆండాళమ్మగారికి శ్రుతపరిచిరి. అదివిని యాయమ్మగారు హృదయము భేదిల్లగా ఆదివ్యమంగళవిగ్రహమును కదియవచ్చి గ్రుచ్చియెత్తి రొమ్ముననెత్తుకొని, మనోవికారమును, ముఖవికారమును తొలగించి కన్నులనీళ్లు విడువక సొమ్ముగలవారు సొమ్ముగొనిపోయిరి. పరులసొమ్మునకు పలవింపమనకేలయని యానతియ్యగా, శ్రీరంగవాసులందరు దుఃఖసాగరమునందు మునిగి తేలుచుండగా, నంజియ్యరు వేరుతెగినమ్రాని పోలిక కళతప్పి నేలకొరగగా, పెరియపెరుమాళ్లు ఉభయనాచ్చిమారులతో వేంచేసి, వింజామరలు, ఆలవట్టము, తెల్లగొడుగు, ముత్యాలకలశము, ముత్యాలహారములు మొదలగు తమపరికరములెల్ల ప్రసాదించి, తమయవభృథోత్సవము నడపునట్లు భట్టరుకును అవభృథమును నడపనియమించి, తిరుముఖమునందు దైన్యచిహ్నమును తోపించుచు, నాచ్చిమారులతో తిరుమంజనము తిరువుళ్లపట్టి, పుత్రవియోగము నొందినవారి చిహ్నమును సూచించుచు సన్నిధికి వేంచేసెను.

భట్టరు లీలావిభూతియందు వేంచేసియున్న తిరునక్షత్రములు ఇరువదియెనిమిది. వీరు నిత్యవిభూతికి వేంచేసినది కార్తిక శుక్లద్వాదశి.

ఇది శ్రీపరాశరభట్టరు వైభవము.

పిమ్మట నంజీయ్యారు మొదలుగాగల ప్రపన్నులందరుగూడి భట్టరువారికి శ్రీరామప్పిళ్లగారిగుండ చరమ కైంకర్యము నడపించిరి. అనంతరము శ్రీరామప్పిళ్లగారు శ్రీరంగనాథుని సన్నిధికివేంచేసి సేవింపగా నంబెరుమాళ్లు వారినాదరించి కృపయా సేవసాదించి నాయనా మనము భట్టరును పోగొట్టుకొంటిమిగా, అయినను నీవు అందులకై చింతిల్లకుము. నీపాలిట ఆయనమారుగా మేము ఉన్నాము అని నమ్ముము. ఎందులకును నీవు క్లేశమునొంద నక్కరలేదు. అని యానతిచ్చి, మునుపు భట్టరుకు నడుచుచువచ్చిన సన్నిధి మర్యాదలన్నియు శ్రీరామప్పిళ్లగారికిని నడచునట్లు అనుగ్రహించి బ్రహ్మరథముపై నుంచితిరుమాళిగకు పంపెను. అట్లు శ్రీరామప్పిళ్లగారు రంగనాథుననుగ్రహముపడసి బ్రహ్మరథమునందు నెలకొని తిరుమాళిగకు వేంచేసి క్లేశరహిత మానసులై దర్శనమును నిర్వహించుకొనుచు వేంచేసియుండిరి.

అప్పుడు నంజీయ్యారు భట్టరు వారి యానతిచొప్పున శ్రీభాష్య సంఖ్యానుసారముగా కావింపబడిన ఒంబదునాయిరప్పడి వ్రాయింప తిరువుళ్లపట్టి అలేఖమును తెప్పించి తాము ద్రవిడలేఖనమునందు నిపుణులయ్యును తమకంటె నిపుణులగు వారివలన వ్రాయింపగోరి తిరువడిసంబంధులగు ప్రపన్నుల నందరను తమ సన్నిధికి రప్పించి ద్రవిడలేఖనమునందు నిపుణతగలవారెవరైన గలరాయని యడిగిరి. అందుకు వారు తిరుకావేరితీరమునందు వాసముచేయునట్టి నంబూరు వరదరాజు దేవరవారు ఆనతిచ్చిన పనికి తగును. ఆయనను రేపుప్రొద్దున ఇచ్చటికిరప్పించెదము. అని విన్నవించిరి. జీయ్యారు సరేయని యావిన్నపమునుతిరువుళ్లపట్టిరి. మరునాడు తెల్లవారి నంబూరివరదరాజులు తమసన్నిధికిరాగా కటాక్షించి, వారు పంచసంస్కార పరులుకాక తిరుపలచ్చనై

లేకయుండుటబట్టి తిరువాయిమొళ్రి వ్యాఖ్యానమును వ్రాయను అర్హులుకారనియెంచి, ఆయభిప్రాయమును సూచింపగా, వరదరాజుగారు స్వామీ అడియని పరిశుద్ధునిగావించి పనిగొన తిరువుళ్లపట్టరాదాయని విన్నవించిరి. అందులకు జియ్యరు హర్షించి, అప్పుడే వారికి పంచసంస్కారమును సాధించి, ఆరాయిరప్పడియు, ఒంబెదునాయిరప్పడియు ఆనతిచ్చి, ఒంబెదునాయిరప్పడి వ్రాయుమని నియమింపగా, వారు ఆగ్రంథమును చేతబుచ్చుకొని జియ్యరు నియమనముచొప్పున తమ తిరుమాళిగకుపోయి వ్రాసి తెచ్చువారై వెడలి కావేరిలోదిగి పోవుచుండగా, పూర్ణప్రవాహమువచ్చి దరిచేరుటయే దుస్తరమయ్యెను. అట్లు బహు ప్రయాసమున ఈదుకొనిపోయి యావలిగట్టెక్కి, తాము ఎంతో పదిలముగా పట్టుకవచ్చియు ఒంబెదునాయిరప్పడిగ్రంథము వెల్లువలో కొట్టుకొనిపోయినందున చాలవ్యాకులపడి, వల్లదప్పినప్పుడు ఏమిచేయవచ్చునని మరల ధైర్యము తెచ్చుకొని జియ్యరు తిరువడినే ధ్యానించుచు తిరుమాళిగకు వేంచేసి, ముందు తాము చూచియున్న చొప్పున ఒకయక్షరమేనియు తప్పకుండ ఆగ్రంథమును పూర్తిగవ్రాయుటయేగాక ద్రావిడభాషయందు తమకుగల నిపుణత వెల్లడియగునట్లు వలసినచోట్ల అర్థవివరణముచేసి తీసికొనిపోయి జియ్యరు సన్నిధిలో సమర్పించిరి. జియ్యరుకటాక్షించి ఇది మునుపటికంటె ఇప్పుడు విశేషించినది. ఏదేనిచేసిన పని ఇట్లుగదా ఉండవలెను? అని ఆనతిచ్చిరి. అందులకు వరదరాజులు అర్థాంతరమును కల్పించుకొని భయభ్రాంతులై అడియని యపరాధమును క్షమింపవలెను. ఇందు దాసుడు మనసెరిగిచేసిన యపరాధము అందందుగల యర్థవివరణమే. అని తిరుకావేరిలో తాముపడిన సంకటమును మూలప్రతిప్రవాహగతమయిన వృత్తాంతమును శ్రుతపరిచిరి. అంతట జియ్యరు పరమానంద భరితచిత్తులై వరదరాజులను చేరబిలిచి బిగ్గర కౌగిలించు

కొన్ని, వారిసామర్థ్యమునకు మెచ్చుకొనుచు "నంబిళ్లయో" (నాబిడ్డయో) ఈతిగుక్కలి కన్నిదాసుడు (ఈవిద్దెలగని యగు దాసుడు) అని యానతిచ్చిరి. అదికారణముగా నంబూరి వరద రాజులు నంబిళ్ల అను తిరునామమును చాతుకొనిరి. ఇట్లు నంబిళ్లగారు జియ్యరు సన్నిధిజేరి యెడతెగక పరిచర్య చేయుటచే జియ్యరు తిరువాయిమొళ్రి అర్థమును నూరుమారులు నిర్వహించి చాతుబడిచేయగా వారికినంబిళ్ల సదా అభిషేకోత్సవము కావించిరి.

ఆనంబిళ్లగారి తిరువడిని పెరియవాచ్చాంబిళ్ల, వడక్కు త్తిరువీధిప్పిళ్ల, పిణ్బళ్గియ పెరుమాళ్ జియ్యరు, ఇయ్యుణ్ణి మాధవ పెరుమాళ్లు మొదలగువారు అనేకులు ఆశ్రయించిరి. ఒకనాడు నంబిళ్లగారు కాలక్షేపము సాధించి గోష్ఠికలసిపోగా వేంచేయుచున్న శ్రీవైష్ణవ సంఘమును శ్రీవైష్ణవుడైన యొక రాజుచూచి, ఈకలసివచ్చుగోష్ఠి నంపెరుమాళ్లదో నంబిళ్లగారిదోయని యాశ్చర్యము నొంది నిలిచెను. మరియొకనాడు మొదలియాండాన్ మనుములును కందాడయాండాన్ కుమారులు నగు కందాడై తోళప్పరు నంబిళ్లయెడల కొంచెము అసూయ గలవారై కొన్నియపచారవాక్కు లుపలికి, ఉత్తమవంశ సంభూతులును మహావిద్వాంసులును గనుక పిమ్మట తమదోషమును తామే తెలిసికొని నంబిళ్లతిరువడి నాశ్రయించి వారికి లోకాచార్యులని తిరునామమును చాతిరి. ఇంకొకనాడు కూరత్తాళ్వారుల మనుమలును శ్రీరామపిళ్లగారి కుమారులునగు నడుత్తిరువీధిప్పిళ్ల భట్టరు విద్యావివేకములచేత అధికులుగానుండియు నంబిళ్లగారి విద్యావిశేషమునకు వెగటుపడుచుండువారు రాజునాస్థానమునకు వేంచేయుచు నంబిళ్లగారి శిష్యులయిన పిణ్బళ్గియ పెరుమాళ్ జియ్యరునుజూచి, జియ్యరూ, మనము రాజునగరికి పోయి వత్తము రమ్మని పిలువగా, వారు, భట్టరును తమయాచార్యు

చితో తుల్యులు అను అధ్యవసాయముచేత వారివెంట రాజ సభకు వేంచేసిరి. అప్పుడు రాజు వీరినిజూచి, ఆస్థానమునుండి లేచి యెదురోళ్ళలు చేసి, తగిన పీఠములందు వేంచేయింపజేసి, తాను పెద్దల గోష్ఠియందు విశేషపరిశ్రమచేసినవాడు కాబట్టి భట్ట రు వైభవమును పరిశోధింపదలచి శ్రీరామాయణములో ఒకయా క్షేపఘట్టమును ఎత్తి విన్నవింపగా భట్టరు ఆప్రశ్నమునకు తగిన యుత్తరముతోచక విచారించుచుండి అంతలో రాజు విషయాం తర విచారమునం దున్నందున అది సందుచేసికొని జియ్యరును నంబిళ్లగారు ఈఘట్టమునందు ఎట్లు అర్థము నిర్వహించిరి అని యడుగగా, వారు నంబిళ్లగారి నిర్వాహమును సంగ్రహముగా శ్రుతపరిచిరి. అంతట భట్టరు అదియె రాజునకు నుత్తరముగా సాదించిరి. అందులకు రాజు పరమానందము నొంది వెలలేని రత్నాభరణములును అపరిమిత ధనమును భట్టరు తిరువడియందు సమర్పించి సేవించి తగినమర్యాదలతో తిరుమాళిగకు వేంచేపు చేసెను.

అంతట భట్టరు పిళ్బళ్ళగియ పెరుమాళ్ జియ్యరు శ్రీహ స్తములను గట్టిగాపట్టుకొని స్వామీ ఈ యాభరణములును ధన మును నంబిళ్లగారి సన్నిధిని జేరవలసినదిగాని దాసునికి గ్రహిం పదగినదికాదు. అని, వారును తామును జతగూడి నంబిళ్లగారి సన్నిధికిపోయి, వారు తనయాచార్య సంతతియను గౌరముచేత ఎదురువచ్చి సేవించి యాదరింపగా హర్షించి, స్వామీ దేవర వారు సాదించిన శ్రీసూక్తులలో చేదరిపోయిన యొకదివ్యసూక్తి పొందినకానుక ఇది. అడియనితోడ ఈకానుకను దేవరవారు పరిగ్రహింపవలెను అని నంబిళ్లగారి తిరువడికి సాగిలబడి దండ సమర్పించిరి. అందులకు నంబిళ్లగారు సమ్మతింపరైరి. అం తట భట్టరు కన్నుల నీళ్లురాల్చుచు మారల సాగిలబడి సేవించి లేవకపోగా నంబిళ్లగారు వారినిగ్రుచ్చియెత్తి బిగ్గర కౌగిలించు

కొని వారివిజ్ఞాపనమును ఆదరించి వారికి ఎల్లయర్థవిశేషములను సాధించిరి. పిమ్మట మరియొకనాడు నంబిళ్ల గారు శ్రీవైష్ణవ గోష్ఠితోడ తిరువెళ్లరై నాచ్చియారును సేవింపవలెనని కోవెలకు వేంచేయునప్పుడు తిరుకావేరి యిరుదరులు మునిగి ప్రవహించు చున్నందున ఇద్దరిద్దరు తెప్పమీదదాటిపోవలసివచ్చెను. అందువల్ల క్రమముగా అందరుదాటునంతలో ప్రొద్దుగ్రుంకి చీకటిదట్టముగా కమ్ముకొనెను. వానయునుకురియ మొదలుపెట్టెను. అప్పుడు నంబిళ్ల గారు కావేరియావలి దరినుండెడు తమకుటీరమునెద్ద నుండి ఒక అమ్మంగారుతోగూడ తెప్పయెక్కి వచ్చుచుండిరి. చీకటియైనందున దారితెలియక తెప్ప యొకసుడిలో తగులుపడి గిరగిర తిరుగసాగెను. అప్పుడు తెప్పవాడు అయ్యో అపాయము వచ్చునట్లున్నది. ఇప్పుడు ఈ తెప్పపైనుండు వారిలో ఒకరైన దిగనియెడల దరిజేరలేము అని కూతలుపెట్టసాగెను. అదివిని యా తెప్పపైనున్న అమ్మంగారు నాయనా నీవు నాయాయుస్సును పోసికొని చిరకాలము జీవింతువుగాని, ఎట్లయిన ఈలోకమునకు ప్రాణమయిన నంబిళ్ల గారినిమాత్రము దరిజేర్పుము. అని చెప్పి తెప్పవానిని బహువిధముల దీవించుచు ఆప్రవాహములో దుమికెను. అందులకు నంబిళ్ల గారు వ్యాకులపడుచుండగా తెప్ప దరిజేరెను. ఆయమ్మగారును నంబిళ్ల తిరువడియందలి ప్రతిపత్తి బలమువలన ఆ వెల్లువలో కొట్టుకొనిపోక అనాయాసముగా గట్టెక్కి తమపోకడకు చింతిల్లుచున్న నంబిళ్ల గారి సన్నిధికివచ్చి, దేవరవారి యనుగ్రహమునేడు తెప్పకలుగగా ఈప్రవాహమును దాటుట దాసురాలికి అసాధ్యమా అనివిన్నవించి సేవించినిలిచెను. అందులకు నంబిళ్ల గారు హర్షించిరి. ఈవృత్తాంతము విన్నవారందరు ఆశ్చర్యపడి నంబిళ్ల గారి ప్రభావమును గొనియాడిరి.

తరువాత ఒక నాడు ఒక శ్రీవైష్ణవుడు నంబిళ్ల గారు వేంచేసియుండు కుటీరమును పెద్దతిరుమాళిగగా కట్టింపవలెనని ఆ వేం

బడినున్న ఒక అమ్మగారి నివేశమునుజూచి, అమ్మా, నంబిళ్లై గారు వసించు తిరుమాళిగ మిక్కిలి యిరుకటముగా నున్నది. మీరు ఈనివేశనమును ఆచార్య తిరువడియందు సమర్పించినపక్షమున శ్రీవైష్ణవగోష్ఠి విశాలముగా వేంచేసి కాలక్షేపముచేయును అని మందలింపగా, ఆయమ్మగారు, శ్రీరంగనాథుని సన్నిధిలో ఇంతమాత్రపునివేశనము ఎవరికిచిక్కును. ఇట్టిదుర్లభప్రదేశమును నాదేహమున్నంతవరకు నొకరికి సమర్పింప నాకు ఎట్లు మనసు వచ్చును. దేవరవారు ఇట్లు నియమించుట యుక్తముకాదు. ఊరక వేంచేయుడు అని ప్రత్యుత్తరము చెప్పెను. ఆశ్రీవైష్ణవుడు అంతట ఊరకుండక ఆయమ్మగారిని పదేపదేతగినమాటలుచెప్పి అడుగుచువచ్చెను. అందులకు ఆమెమనసుకరగి దేవరవారి తిరువుళ్లము చొప్పున నడపెదనుగాని దాసురాలికి ఈపాటినివేశనము పరమపదమునందు లభింప ననుగ్రహించెదరా! అని యడిగెను. ఆవర్తమానము ఆవైష్ణవునివలన నంబిళ్లైగారువిని, శ్రీపరమపదనాథుడు మనకు పరమాప్తుడు కాబట్టి ఆయేలినవానితో ఈవిషయమును విన్నవించి ఆమెయిష్టముచొప్పున ఈపాటి నివేశనము ఇప్పించెదమని చెప్పుమనిరి. అంతట వైష్ణవుడు ఆవృత్తాంతమును ఆమెకు తెలియజేసి, ఆమెయందులకు పత్రమువ్రాసి యిప్పింపవలయుననగా, ఓరా అమ్మగారి నమ్మికయని శ్లాఘించి నంబిళ్లైగారు పత్రమును వ్రాయించి యిప్పించిరి. అమ్మగారు ఆపత్రమును పుచ్చుకొని తననివేశనమును నంబిళ్లైగారికి సమర్పించి, వారి సన్నిధిలో నాడును మరునాడును సేవచేయుచుండి, మూడవ నాడు అచ్చటి శ్రీవైష్ణవులందరు చూచుచునేయుండగా పరమపదమునకు చనియెను. అప్పుడు ఆశ్రీవైష్ణవులందరును శ్రీపరమపదనాథుడు ఆయమ్మగారికి చోటిచ్చునను విషయమునందు నమ్మిక కలిగి పత్రమువ్రాసియిచ్చిన నంబిళ్లైగారి అంతరంగశుద్ధికి మిక్కిలి యాశ్చర్యమునొందిరి.

అటుపిమ్మట ఒకనాడు మహాగోష్ఠిలో తిరువాయిమొళ్ళికి అర్థము సాధించుచున్న నంబిళ్లగారిని నంబెరుమాళ్లు కటాక్షించి, తిరువాయిమొళ్ళి అర్థమును మా తిరుముడి ప్రక్కనుండి నిర్వహింపుము అని నియమింపగా, ఓ యేలినవాడా దేవరవారిచే నియమింపబడినచోటు మునుపు దుర్యోధనుడు ఉండినది కాబట్టి, అడియనికి నిలువదగినది కాదని తోచుచున్నదేయని నంబిళ్లగారు విన్నవించిరి. అందులకు పెరుమాళ్లు హర్షించి యెప్పటివలె తిరువడితట్టేయుండి కాలక్షేపము సాధింప నియమించెను.

మరియొకనాడు నంబిళ్లగారు తను మహాగోష్ఠితో తిరువాయిమొళ్ళి నిర్వహించుచుండగా కొందరు వైష్ణవులు నిత్యపురప్పాట్టులో గోష్ఠినుండి వేరుపడి పోవునట్లు నాడును పోయిరి. అది గోష్ఠికలయుటగా తిరువుళ్లపట్టి నంబెరుమాళ్లు ఈగోష్ఠి కలసి పోయినపిమ్మట పురప్పాట్టు అక్కర లేదని వెనుకకు మరలెను. అది కారణముగా నాడు మొదలు అట్లే నడపబడుచు వచ్చెను.

ఇంకొకనాడు నంబిళ్లగారు తిరువాయిమొళ్ళి పఠించుచుండగా నంబెరుమాళ్లు ఆస్థానమునుండి లేచివచ్చి సన్నిధిదారబంధమును పట్టుకొని నిలువబడి లోపలనుండియే నంబిళ్లగారిని తొంగిచూచుచుండెను. అప్పుడు తిరువిళక్కు-పిచ్చన్ అను నతడు తిరువిళక్కు చక్కబెట్టవచ్చి నంబెరుమాళ్లను సేవించి తనకుగల భక్తిపారవశ్యముచేత ఆయేలినవాడు నిలువబడియుండుటకు సహింపక స్వామీ దేవరవారు ఆస్థానమునందు వేంచేసియుండక యిట్లు సేవసాధించుట యుక్తమాయని తత్తరిల్లుచు విన్నవింపగా, అతని వేడుకోలు అంగీకారముగా నున్నట్లు అభినయించి, నీవు చెప్పినట్లు ఈమాయునికి సరి కాదుగాని నంబిళ్ల మహాగోష్ఠిని జూచుటయందలి వేడుక నన్ను ఇచ్చటికి తెచ్చినందులకు నీవు సహించుకొమ్ము అని యానతిచ్చి యెప్పటివలె ఆస్థానమునందు

నెలకొనెను. ఆవృత్తాంతము క్రమముగా అచ్చటి గోష్ఠి స్వాములకు అందరకు తెలియనయ్యెను. అది కారణముగా నంబిళ్లగారి కాలక్షేప గౌరవమును తిరువిళక్కుపిచ్చన్ భక్తివిశేషమును, నంబెరుమాళ్లకు వారియెడలగల కృపావిశేషమును వెల్లడియై యెల్లవారిని సంతోషపెట్టెను.

ఇట్లు నంబిళ్లగారు మహావైభవముతో వేంచేసియుండగా నంజియ్యరు నూరు తిరునక్షత్రములు అయి తిరుమేనున నెప్పిచాతుకొని, తెక్కాళ్వానును భట్టరును తమ్ముసేవించి ఇప్పుడు దేవరవారి విషయమై నడపవలసిన కార్యము లేవియనియడిగి, అందులకు నంజియ్యరు మాకు పెరుమాళ్లతిరుమేనును సాక్షాత్కారముగా సేవింపవలయు. అది కోవెలయధికారులగు మీచే నెనగూడవలసినదిగదా అని యానతియ్యగా, వారు ఇరువురును పెరుమాళ్లసన్నిధిలో నంజియ్యరు కోరికను విన్నవించి, పెరుమాళ్లను నంజియ్యరు మఠద్వారమునకు వేంచేపుచేసుకవచ్చి, ఆయేలినవాని దివ్యమంగళ విగ్రహమును ఆపాదమస్తకమును సావధానముగా సేవింపజేసిరి. అంతట నంజియ్యరు తెక్కాళ్వాన్ భట్టరు మొదలగువారికి కొన్నిరహస్యార్థముల నుపదేశించి, నంబిళ్లగారిని చల్లగాకటాక్షించి వారికి ఆనతియ్యగలయర్థములెల్లను ఆనతిచ్చి శ్రీపరాశరభట్టరు తిరువడినను సంధించుచు తిరునాటికి వేంచేసిరి. వీరితిరునక్షత్రము పంగునియుత్తరము. వీరురచించిన ప్రబంధములు. ౧, తిరువాయిమొழிకి ఒన్బదునాయిరప్పడి యను వ్యాఖ్యానము. ౨, తిరుప్పావకును, కణ్ణినుణ్ సిరుత్తాంబునకును వ్యాఖ్యానము. ౩, శ్రీసూక్తభాష్యము. వీరితిరునామములు వేదాంతవేద్యులు, మాధవాచార్యులు, నంజియ్యరు అనునవి. వీరు ఈలీలావిభూతియందు వేంచేసియుండినది నూరుతిరునక్షత్రములు.

ఇది నంజియ్యరు వైభవము.

ఇట్లు నంజియ్యరు తిరునాటికివేంచేయగా నంబిళ్లగారు వారికి చేయవలసిన చరమకైంకర్యములన్ని యథావిధిగాజేయించి, తిరువాయిమొళ్ళి నిర్వహించుచు వేంచేసియుండగా, నడుత్తిరువీధిప్పిళ్లభట్టరు సన్నిధిలో నంబిళ్లసాదించిన తిరువాయిమొళ్ళి ప్రబంధములనన్నిటిని చదివి ఒకటితప్పక రాత్రులెల్ల వ్రాసివ్రాసి ముగించి తీసికొనిపోయి నంబిళ్లగారి సన్నిధిలో సమర్పించెను. నంబిళ్లగారు ఆకోశమును విప్పిచూచి, ఇది లక్షయు ఇరువదియైదువేల గ్రంథముగా ఏర్పడుచున్నది. ఇంతవిపులముగా తిరువాయిమొళ్ళికి అర్థమువ్రాసి ప్రచురింపవచ్చునా? ఇందువల్ల శిష్యాచార్య క్రమముచెడునే అని వ్యాకులపడి, ఆ ప్రతిని అప్పుడే నీళ్లలోతడిపి చెదలుపుట్టలోపెట్టించి మట్టిలో కలిపివేసిరి. పిమ్మట పెరియవాచ్చాంబిళ్ల తమయాచార్యులయిన నంబిళ్లగారి నియమనమునుపడసి, తిరువాయిమొళ్ళికి ఇరువత్తు నాలాయిరప్పడి అను వ్యాఖ్యానమును రచియించిరి. పిమ్మట నంబిళ్లగారికి అంతరంగశిష్యులయిన వడక్కు త్తిరువీధిపిళ్లయు నంబిళ్లగారు సాయించు విషయములను పగలెల్ల వినుచు ఏదినము విన్నవిషయమును ఆదినమురాత్రి వ్రాసిపెట్టుచువచ్చి కడపట ప్రబంధపరిపూర్తికాగానే తీసికొనిపోయి ఆచార్యసన్నిధిలో ఉంచిరి. వారుదానిని కడవెళ్లగటాక్షించి, ఇది అతివిపులమును అతిసంగ్రహమునుగాక మిక్కిలి యుక్తముగానున్నది. అయినను, మాయనుమతిలేక వ్రాయబడినందున దీనియంగీకారమునకు కొంత వ్యవధికావలసియుండును అని ఆగ్రంథమును తీసి దాచియుంచిరి. దీనికి పెరియపెరుమాళ్ల నియమనముచేత శిష్టపరిగ్రహముకలిగి యెల్లదేశములలోను వ్యాపించునంతటి స్థితివచ్చునని యెంచి, నంబిళ్లగారి ముఖ్యశిష్యులగు ఇయ్యుణ్ణిమాధవపెరు

మాళ్లు పెరుకా-నాళ్లు పెరియపెరుమాళ్ల సేవచేసి ప్రార్థింపగా, పెరియపెరుమాళ్లు వారియెడల ననుగ్రహించి నీకోరిక యేమి చెప్పుమని యడుగగా, స్వామీ మాయాచార్యులసన్నిధిలో ముప్పత్తారాయిరప్పడియను తిరువాయిమొళ్రి వ్యాఖ్యానము ఉన్నది. ఆకోశమును అడియనికి అనుగ్రహించునట్లు వారికి నియమింపవలయునని ప్రార్థించెను. ఆప్రార్థనమును తిరువుళ్లపట్టి యటు పిమ్మట నొకనాడు నంబిళ్లగారు సన్నిధికి వేంచేయగా వారికి సన్నిధిమర్యాదలన్ని నడపననుగ్రహించి, అర్చకముఖమున ఇయ్యుణ్ణిమాధవపెరుమాళ్ల యభిమతము నానతిచ్చి, దీని నెరవేర్పుమని నియమించెను. అందులకు నంబిళ్లగారు హర్షించి మాధవపెరుమాళ్లకు ముప్పత్తారాయిరప్పడిని ప్రసాదించిరి. నంబిళ్లగారి తిరునక్షత్రము కార్తికమాసమున కృత్తిక. వీరియవతారస్థలము తిరుకా-వేరి గట్టుననుండెడి నంబూరు. వీరి తిరునామములు- వరదరాజులు, తిరుక-లికన్నిదాసులు, కలివైరిదాసులు, లోకాచార్యులు, శ్రీసూక్తిసాగరులు అనునవి. వీరురచియించిన ప్రబంధములు. ౧, నంబిళ్లరహస్యము. ౨, తిరువిరుత్తవ్యాఖ్యానము మొదలగునవి. వీరు కలియుగాది ౪౩౦౯-అను ప్రభవనామ సంవత్సర కార్తికమాసమునందు కృత్తికానక్షత్రమునందు అవతరించినవారు.

ఇది నంబిళ్లగారి వైభవము.

## పెరియవాచ్చాంబిళ్ల వైభవము.

పెరియవాచ్చాంబిళ్ల కలియుగాది ౪౩౨౯-అను సర్వజిన్నామసంవత్సర శ్రావణమాసమున రోహిణీ నక్షత్రమునందు అవతరించినవారు. వీరుమతసిద్ధాంత విషయమునందె ప్రసిద్ధినొంది

పిమ్మట నంబిళ్లైగారి నియమనమునుపొంది, తిరువాయిమొళ్ళి తప్ప తక్కినయిరువదిమూడు ప్రబంధములకును వ్యాఖ్యానములను, మంత్రవ్యాఖ్యానమైన రహస్యము మొదలగువానిని రచియించిరి. ముప్పత్తారాయిరప్పడి మొదలగువ్యాఖ్యానములు పిళ్లాన్ సాదించిన ఆరాయిరప్పడికి మిగులఅనుకూలములయి దానినిమూలగ్రంథముగా జేసికొని అందలి పదములను అర్థములను అనువర్తించుకొని దానియర్థమునే వివరించియున్నవి. వీనికన్నిటికి భట్టరు సాదించిన అష్టశ్లోకియను తిరుమంత్రవ్యాఖ్యానమును, సహస్రనామ భాష్యమును మూలములుగానుండును. పెరియవాచ్చాంబిళ్ల తిరునామము శ్రీకృష్ణపాదులు. వీరు ఒకానొకప్పుడు పెరియపెరుమాళ్ల సన్నిధికివేంచేసి, సేవించి నిలువబడి, ఓయేలినవాడా దేవరవారు పరమకారుణికులు అను బిరుదును వహించినవారు కాబట్టి సకలచేతనులును ఉజ్జీవించునట్లు తిరువాయిమొళ్ళి మొదలగు దివ్యప్రబంధములను బయలుపరిచి, సంప్రదాయము చెడకుండ నమ్మాళ్వార్లగుండ నాథమునులకును వారిగుండ తదీయ శిష్య పరంపరకును లభింప ననుగ్రహించితిరి. ఇట్టి యీదర్శనవిషమయి తూప్పిల్ పిళ్ల అను నతడు పూర్వాచార్య సంప్రదాయమునకు విరుద్ధముగా కొన్నినవీనమార్గములను ఏర్పరుచుకొని, ఇవి ఉపాసనా బలముచే లభించినవియని అపచారపడె, ఆమార్గములనే వృద్ధినొందించుచున్నాడు. ఇప్పుడు దేవరవారు ఈ లోపమును తిరువుళ్లపట్టి పూర్వాచార్యసంప్రదాయముచొప్పున నడచుకొనునట్లు ఆయనను దిద్ది యనుగ్రహింపవలెనని విన్నపము చేసికొనిరి. ఆవిన్నపమును పెరియపెరుమాళ్లు తిరువుళ్లపట్టి తూప్పిల్ పిళ్ల స్వప్నములో శ్రీరంగదివ్యనగరము పచ్చలతోరణములచేతను పన్నీటికల యంపులచేతను ముత్యాల ముగ్గులచేతను అలంకరింపబడియుండగా, తిరుచ్చిన్నములు మొదలగు మంగళవాద్యములు ఘోషింపగా, పువ్వులవానలు కురియగా, మం

గళోశాసనములు చేయుచును ధూపదీపాద్యుపచార ద్రవ్యములతో జియ్యాంగార్లును శ్రీవైష్ణవులును గోపురద్వారమునకు వేం చేయగా, పెరియపెరుమాళ్లు ఉభయనాచ్చిమారులతోను నిత్యముక్తులతోను వారిని ఎదుర్కొని, పెరియవాచ్చాంబిళ్లను లోపల పిలుచుకొనిపోయినట్టును, వారి వెంట తక్కిన శ్రీవైష్ణవులును లోపల ప్రవేశించుచున్నట్టును, వారితోపాటు తూప్పిల్ పిళ్లె తానును ప్రవేశింపబోగా ద్వారపాలకులుచూచి నీవు పెరియ పెరుమాళ్లు ప్రవర్తింపజేసిన ప్రపన్నదర్శనము విషయమున అపచారపడితివి కాబట్టి నీరాకయేలినవారికి ప్రియముకాదు ఇక్కడనుండి వెనుకకు మరలుము అన్నట్టును తోచునట్లు చేయగా, తూప్పిల్ పిళ్ల మేలుకొని మనసున కలవరపడుచు ఈస్వప్నమునకు కారణము ఏమియని విచారించుచుండి, అంతలో తెల్లవారినందున నిత్యకర్మానుష్ఠానములు చేసికొని, అప్పుడు తిరుమేనున నొవ్వు చాతుకొనియున్న పెరియవాచ్చాంబిళ్ల సన్నిధికిపోయి వారిని సేవించి దేహస్థితిని విచారింపగా, వారు తూప్పిల్ పిళ్లను కటాక్షించి దగ్గరకురమ్మని కదియబిలిచి, మాలీలావిభూతిలో అర్చావతారానుభవము లన్నియు నయ్యెను. ఇక మేము నిత్యవిభూతికి పోయెదము అని యానతిచ్చిరి. అందులకు తూప్పిల్ పిళ్ల కొంచెముచింతించి తాను కలగన్న వర్తమానమును విన్నవించెను. ఆవృత్తాంతము చెవిసోకగానే పెరియవాచ్చాంబిళ్ల అత్యంతముహర్షించి దేహస్మృతిలేనివారై సర్వావయవములు గగుర్పొడువగా తూప్పిల్ పిళ్లను బిగ్గరకౌగిలించుకొని, ఈశుభవార్త నాచెవిసోకించినందులకు నేనుచేయగల యుపకారము యేదియగును. అనగా, ద్వారపాలకులు దాసుని నడ్డగించుటకు దేవరవారు ఏమిగా తిరువుళ్లపట్టితిరి అని తూప్పిల్ పిళ్ల యడిగెను. పెరియవాచ్చాంబిళ్ల వారి తిరుమొగమున తమచల్లనికడగంటిచూపులు వ్యాపింపజేసి, అందులకు కారణము ఏలానిదియని

చెప్పిన మీమాంసను చిన్నపామగదా అని యడిగి, తూప్పిల్ పిళ్ల దేవరవారు సాధించు విషయమునందుగూడ అట్టిది కలుగునా యని ప్రత్యుత్తరము చెప్పగా, మీరు బహువిషయ పరిశోధకులు గానుండియు అనుకూల సహవాసమును మాని, అహంకారా దులచే ఇతరసహవాసము చేయుచు, ప్రయోజనాంతరపరులై విద్యాపేక్షచే ఇతరులవలన మంత్రాంతరముల నుపదేశింపించు కొని శ్రీహయగ్రీవోపాసనచేసి, అందువలన లభించిన విద్యావిశే షముచే గర్వమును పొందియున్నారు. ఉపాసనా విశేషము వలన లభించినవిద్యకు ఇతరమత నిరసనమును పూర్వాచార్య సంప్రదాయ పరిపాలనమును ఫలములగునో? పూర్వాచార్య సంప్రదాయ సిద్ధములయిన వర్తనములనుఖండించి, అర్థాంతర వివక్షచే నూతనాచారములను ప్రవర్తింపజేయుట ఫలమగునో? చెప్పుడు. మీరుకలుగచేసిన నవీన సంప్రదాయములవలన మహాప చారము సంప్రాప్తమయ్యెను కాబట్టి పెరియపెరుమాళ్ల తిరువు ళ్లమున కెక్క ప్రవర్తించినవారు కాకపోయితిరి. మీరీమార్గమును పరిహరింపుడు అని యానతిచ్చిరి. అందుకు తూప్పిల్ పిళ్ల, అడి యడు శ్రీభాష్యాదిగ్రంథములనే ప్రవచనముచేయుచు వానినను సరించి కొన్నిగ్రంథములను కావించి లోకములో ప్రవర్తింపజే యుచున్నాడుగాని యితరమేమియు నెరుగడే అని విన్నవింపగా, పెరియవాచ్చాంబిళ్ల మేముచెప్పినది భాష్యాది గ్రంథవిషయము కాదు. కాకపోయినను ఆవిషయమునందుగూడ కొన్నియాక్షే పములున్నవి. శ్రీభాష్యగ్రంథములో అచ్చటచ్చట కొన్నిలోపము లున్నవని మీరు దిద్దివ్రాయనారంభించి శ్రీభాష్యకారులు కలలో సేవసాధించి దండించినందుమీదగదా మీరు అనుతాపమునొంది భయభక్తులతో ప్రవర్తించితిరి. ఆయపరాధక్షమకై యతిరాజ సప్తతియను రామానుజ స్తోత్రమునుగూడ రచియించితిరే. అది యటుండనిండు నమ్మాళ్వార్లు శ్రీనాథమునులకు దివ్యప్రబంధవిష

యముగాను రహస్యవిషయముగాను ప్రసాదించిన యర్థవిశేష
ములను పూర్వపక్షముచేసి కొన్ని నవీనార్థములను కల్పించి
వ్యాఖ్యానములను పెంచితిగే అది యపచారముకాదా? వానిని
మేమిప్పుడు త్రోసివేయుచున్నాము అని యానతిచ్చిరి. అదివిని
తూప్పిల్ పిళ్ల నమ్మాళ్వార్లు రహస్యములకును దివ్యప్రబంధ
ములకును అర్థవివరణము చేసియుండిగదా దాసుడు పూర్వపక్ష
ముచేసిన ట్లేర్పడవలెను. వారు అట్టిది యేమియుచేయకుండగా
దాసునికి ఈనిందయేల! భాష్యకారులకు పిమ్మటివారగు భట్టరు
మొదలగువారు చేసిన యర్థవిశేషములుకలవు. అందు కొన్ని
ప్రామాణికములుగా నుండకపోవుటనుబట్టి దాసుడు పూర్వపక్ష
ముచేసినదియు కలదు. అనివిన్నపముచేసిరి. పెరియవాచ్చాం
బిళ్ల ఆలాగా, కలియుగాదిని నమ్మాళ్వార్లు మధురకవియా
ళ్వార్లగుండ ప్రవర్తింపజేసిన తిరువాయిమొళ్లి మొదలగునవి
జీర్ణములయిపోగా పెరియపెరుమాళ్లు యనుగ్రహము పడసిన
నాథమునులకు అర్చావతారమునొందిన నమ్మాళ్వార్లు సాక్షా
త్కారముగా ప్రసాదించిన యర్థవిశేషములు అవి. వానిని తరు
వాతివారు మందమతులగు చేతనులకు తెలియునట్లు వివరించిరి.
అట్టివానిని నవీనవ్యాఖ్యానములుగా నెంచి మీరట్లుచేయుట పరి
హరణీయము. అని యానతియ్యగా తూప్పిల్ పిళ్ల ఎవరైనసరే
బ్రాహ్మణ ప్రవర్తనమునకు విరుద్ధముగా అర్థము నిర్వహింప
వచ్చునా? అని, అందుకు పెరియవాచ్చాంబిళ్ల, ఆళ్వార్లు తమ
ముక్తిదశలో అన్నిటినివిమర్శించియున్నవారు కాబట్టి తమయను
భవార్థములనెల్ల నాథమునులమూలముగ లోకమున ప్రవర్తింప
జేసిరి కాబట్టి వానికి సరిపడియుండునవియే ప్రమాణములు.
తక్కినవి ప్రమాణములుకావని గ్రహింపవలెను. దొరకినదాని
గ్రహించి దొరకనిదానిని వెదకిచూడవలసినదేగాని మనకు గోచ
రములుకానివన్నియును అప్రమాణములని పరిహరింపరాదు. ఆళ

వందారు, ఎంబెరుమానారు, తిరుక్కురుగైప్పిరాన్ పిళ్లాన్, కిడాంబియాచ్చాన్, అరుళాళప్పెరుమా ళెంబెరుమానారు, శ్రీపరాశరభట్టరు, నంజియ్యరు మొదలుగాగల యాచార్యుల ప్రభావములను మీరు విన్నవారు కారా? వారికెల్ల తెలియని ప్రమాణములును అనుభవములును మీకా తెలిసెను? పూర్వాచార్యులు శాస్త్రార్థవిమర్శనముచేసి, ఆళ్వార్లనియమనమునకు సరిపడియుండు శాస్త్రములు బలీయములని, తత్త్వమునందును అనుష్ఠానమందును నాథమునుల మూలముగ ఆళ్వార్లు ప్రవర్తింపజేసిన నియమనములచొప్పున నుపదేశించుచువచ్చిరి. అటుపిమ్మట తర్కీన వారును అవియె సత్యములని నిర్ణయించి, అందులకు సరిపడనివచనములను కపిలాదులవచనములుగా పూర్వపక్షముచేసి, పూర్వాచార్య సంప్రదాయార్థములనే తమతమ తిరువడిసంబంధులకు ఉపదేశించుచువచ్చిరి. అందువల్ల శిష్టాచారము చెడకయుండెను. కనుక మీరును పూర్వాచార్య సంప్రదాయములకు సరిపడిన ప్రమాణములనే కైకొని అర్థవిచారము చేయుచు నవీనమార్గమును పరిహరించి వర్తింపవలసినది అని యానతిచ్చిరి.

అంతట తూప్పుల్ పిళ్లె స్వయంసర్వజ్ఞులుకావున స్వప్నానుభవమును పెరియవాచ్చాంబిళ్లగారి యుపదేశమును మనసునందు అనుతాపమును కలుగజేయగా పూర్వాచార్యుల వ్యాఖ్యానములను అన్నిటిని ఆళ్వార్లవలన ప్రత్యక్షముగావచ్చిన యుపదేశపరంపరయని తెలియక తర్కీనకావ్యనాటకాదుల వ్యాఖ్యానములవలె వారివారి విద్యావైశద్యముకొలదిని చేయబడినవనియెంచియుంటిని. ఇప్పుడు స్వప్నానుభవమువల్లను దేవరవారి యనుగ్రహమువల్లను అడియనికి వాస్తవార్థము తెలియనాయెను. అని పెరియవాచ్చాంబిళ్ల సన్నిధిలో విన్నపముచేసి, తాము రచియించిన నూతనమార్గబోధక గ్రంథములను ఎవ్వరును పఠింపగూడదని యొట్టుపెట్టి, అంతకుమునుపు తమవలన దేశాంతరములలో

అనుష్ఠింప జేయబడిన నవీనార్థప్రవచనమునకై తమలో నొచ్చుకొనుచు పెరియవాచ్చాంబిళ్లను ఆశ్రయించినవారయిరి.

అంతట పెరియవాచ్చాంబిళ్ల తూప్పిల్ పిళ్లను కౌగిలించుకొని మీమనసున అనుతాపము పుట్టినప్పుడే మొల్లయపచారములును పరిసిపోయెను. పెరియపెరుమాళ్ల సన్నిధిని, నమ్మాళ్వార్ల సన్నిధిని, ఎంబెరుమానారు సన్నిధిని సత్కాలక్షేపములుచేసి అందువలని దోషలేశమును మాన్పుకొనుడు. అని యానతియ్యాగా, తూప్పిల్ పిళ్ల అట్లేచేసి, కడపట ఆళ్వార్ల విషయమయిన యొక ప్రబంధమును గావించి పెరియవాచ్చాంబిళ్ల సన్నిధిలో పఠింపఁగా వారి తిరువుళ్లముచల్లబడి తూప్పిల్ పిళ్లకు సకలరహస్యార్థములను ప్రసాదించిరి. తూప్పిల్ పిళ్ల యట్లుకృతకృత్యులై అడియనికి తిరువారాధనమును సాదింపవలెనని విన్నవింపగా, పెరియవాచ్చాంబిళ్ల తమకోవిలాళ్వారు తిరుక్కాప్పుడొడ్చి మీరుకన్నులుమూసికొనిపోయి యొకపెరుమాళ్లను వేంచేపుచేసికొనుడు అని నియమించి, వారుసన్నిధిలో దండముసమర్పించి నియమనముచొప్పున వేంచేపుచేసికొని యీవలవచ్చిచూడగా ఆమూర్తి తిరుప్పాణాళ్వారుగానుండెను. అదిచూచి పెరియవాచ్చాంబిళ్ల, పెరుమాళ్లు మీచిత్తశోధనముచేయువారై యిట్లు అనుగ్రహించిరి. వీరి నేశ్రీయఃపతిగా నెంచి నిత్యము నారాధించుచు వీరుసాదించిన అమలనాదిప్పిరాన్ అనుప్రబంధమునకు ఒకవ్యాఖ్యానమును చేయుడు అని యానతిచ్చి, తమపాదుకలను సైతము సాదించిరి. తూప్పిల్ పిళ్లయు ఆపరమవస్తువులను బడసి, అమలనాదిప్పిరాన్ అనుప్రబంధమునకు వ్యాఖ్యానమును చేసి పెరియవాచ్చాంబిళ్ల సన్నిధిలో విన్నవించి వారిని సంతోషింపజేసిరి. ఇట్లు తూప్పిల్ పిళ్ల పెరియవాచ్చాంబిళ్ల యనుగ్రహామునుపడసి పూర్వాచార్యసంప్రదాయముననుసరించి కాలక్షేపము చేయుచు వేంచేసియుండగా, పెరియవాచ్చాంబిళ్ల తిరునాటికి వేంచేసిరి.

అప్పుడు వారి తిరువడిసంబంధులవలన తూప్పిల్ పిళ్లయే వారికి చరమకైంకర్యములను యథావిధిగా చేయించిరి.

విశిష్టాద్వైతసిద్ధాంతమునుబట్టి శ్రీవైష్ణవులకు తిరుప్పల్లాండు మొదలయిన దివ్యప్రబంధములకంటె వేరుగతిలేకపోవుటయేగాక పూర్వాచార్య పరంపరా సంప్రదాయమునుండి వచ్చిన దివ్య ప్రబంధ తాత్పర్యములను తెలిసికొనుటకు పెరియవాచ్చాంబిళ్ల సాధించిన వ్యాఖ్యానములకంటె అన్యమయినగతిలేదు. కాబట్టి శ్రీవైష్ణవులందరు పెరియవాచ్చాంబిళ్ల తిరువడి సంబంధమును పొంది వారికి శిష్యులైయుందురు. ఈపెరియవాచ్చాంబిళ్ల రచియించిన గ్రంథములు. ౧, తనిశ్లోకి. ౨, పరందపడి. ౩, త్రిమతసిద్ధాంతసారసంగ్రహము. ౪, కలియనరుళిప్పాడు. మొదలగునవి.

ఇది పెరియవాచ్చాంబిళ్ల వైభవము.

---

## పిళ్లలోకాచార్యుల వైభవము.

నంబిళ్లగారి శిష్యులైన వడక్కు త్తిరువీధిపిళ్లకు కలియుగము ౪౩౬౭ అను క్రోధననామ సంవత్సరమున ఆశ్వయుజమాసమునందు శ్రవణనక్షత్రమున ఒక కుమారరత్న మవతరించెను. [క్రీ.శ. 1366 అనగా 648 సం॥ క్రితం.] ఆకుమారశిరోమణికి వారు తమయాచార్యులైన లోకాచార్యులు అను తిరునామమును చాతిరి. బిడ్డయగు లోకాచార్యులు గాన వీరుపిళ్ల లోకాచార్యులు అనబరగిరి. ఈవృత్తాంతమును నంబిళ్లగారు తిరువుళ్లపట్టి తమమనోరథము సిద్ధింపదయ్యెనని వడక్కు త్తిరువీధిపిళ్లకు ఇంకొక కుమారుడుకల్గుగ ననుగ్రహించిరి. ఆ రెండవపుత్రుని జననకాలమునందు వారితిరుమాళిగకు నంబిళ్లగారు వేంచేసియుండి అழగియ మణవాళప్పెరుమాళ్ నయనారు అని ఆశిశువునకు తిరునామముచాతిరి. అట్లు జనించి పెరు

సుచున్న యిరువురు బాలకులును దినదినప్రవర్ధమానులై యెల్ల శాస్త్రములు నభ్యసించి, శ్రీభాష్యము మొదలగు సంప్రదాయ గ్రంథములనెల్లను తమతండ్రిగారి సన్నిధినే సేవించి, ఉపదేశ పరంపరచే లభించిన యర్థవిశేషములెల్ల ప్రబంధరూపమున విస్తరిల్ల జేసి లోకములోని యాత్మలు ఉజ్జీవింప ననువైన సులభమార్గ మును గల్పించిరి.

అందు పిళ్లలోకాచార్యులు సాధించిన ప్రబంధములు. ౧, రహస్యత్రయము. ౨, తత్వత్రయము. 3, సారసంగ్రహము. ౪, శ్రీవచనభూషణము. ౫, తత్వత్రయమునకు సిరియపడి పెరి యపడియను రెండువ్యాఖ్యానములు మొదలగునవి. అళగియ మణవాళప్పెరుమాళ్ నయనారు సాధించినవి. శ్రీవచనభూష ణస్థాపనా రూపకమయిన ఆచార్య హృదయము మొదలయినవి. ఇవిగాక వీరిచే శ్రీనాథమునులు మొదలుగాగల పూర్వాచార్య పరంపరవలన ఉపదేశింపబడుచువచ్చు రహస్యార్థములును దివ్య ప్రబంధార్థములును స్థాపింపబడినవి.

ఒకనాడు నంబెరుమాళ్ల పురప్పాట్టు సమయములో తూ ప్పిల్ పిళ్లకును అళగియమణవాళ ప్పెరుమాళ్ నయనారునకును శ్రీవచనభూషణ విషయమయిన వాదము సంభవించి, నయనారు ఉపన్యసించిన యర్థములను నంబెరుమాళ్లు తిరువుళ్లపట్టిన పక్షమున తూప్పిల్ పిళ్ల శ్రీరంగమునువిడిచి పెరుమాళ్ల సేవకు దూర స్థులయి పోవునట్లును, తిరువుళ్లపట్టని పక్షమున నయనారు గ్రంథ సన్యాసము చేయునట్లునుగా పరస్పరము ప్రతిజ్ఞలు చేసికొని పెరుమాళ్లు వేంచేసెడు తిరువీధులు నాలుగింటను నాలుగు ప్రక రణములను నయనారు ఉపన్యసింపగా పెరుమాళ్లు చాతుకొని యున్న నాలుగు తిరుమాలలును ఒకొ్కక ప్రకరణము ముగి సినప్పుడు ఒకొ్కకట్టిగా వీడిపడియెను. అందువల్ల నయనారు

చేసిన ఆచార్యహృదయమునే నంబెరుమాళ్లు తిరువుళ్లపట్టినట్టు పర్చడెను. అంతట తూప్పుల్ పిళ్ల తమ ప్రతిజ్ఞచొప్పున నంబెరుమాళ్ల సేవకు దూరస్థులై దేశాంతరవాసము చేయ బోయిరి. పిమ్మట నయనారును పరమవిరక్తులై నైష్ఠికబ్రహ్మచర్యమునందు వర్తించుచుండి యుత్తమాశ్రమ స్వీకారము చేసి ఆచార్యహృదయము మొదలగు సంప్రదాయ గ్రంథములను ధౌతవస్త్రకులోద్భవులగు పెత్తార్ అను వారికి ప్రసాదించిరి. వారు తిరునారాయణపురత్తాయికి అను గ్రహించిరి. మరియు అళగియ మణవాళప్పెరుమాళ్ నయనారు సన్నిధిలో కిడాంబియచ్చాన్ మేనల్లుడైన కిడాంబి తిరుమలై నయనారు శ్రీభాష్యాది గ్రంథముల నెల్లను అధికరించిరి. పిమ్మట శీఘ్రకాలములోనే నయనారు తిరునాటికి వేంచేసిరి.

సర్వజ్ఞులైనపిళ్ల లోకాచార్యులును అనేకులు ప్రపన్నులు తమతిరువడి నాశ్రయింపగా దర్శనప్రవచనము చేయుచు వేంచేసియుండిరి. వారి తిరువడినాశ్రయించిన వారిలో కూరకులోత్తమదాసులు, మణప్పాకపునంబి, కొల్లికావల్ దాసులు, కోడియిలణ్ణాన్, తిరువాయిమొళిప్పిళ్ల, వారి తండ్రియైన అణ్ణాన్, వారి తల్లి, విళాంజోలైప్పిళ్ల అను వారు ముఖ్యులు. అందు మణప్పాకపునంబికి దేవప్పెరుమాళ్లు కొన్ని రహస్యార్థములు ఆనతిచ్చి, ఇంకను కొన్ని చెప్పవలసిన యర్థములుకలవు వానిని కోవెలలో ఆనతిచ్చెదము అచ్చటికివచ్చి నివసించియుండుమని నియమింపగా, నంబియు కోవెలకు వేంచేసి అచ్చట ఉనికిచేసికొని దేవప్పెరుమాళ్లు ప్రసాదించిన యర్థములను రహస్యస్థానమునందుండి మననము చేయుచుండిరి. ఒకనాడు పిళ్లలోకాచార్యులు తమతిరువడి సంబంధులైన శ్రీవైష్ణవులును తామునుగాపోయి ఒకతావున విశ్రమించి, పొరుగున మణప్పాకపునంబి యుండుట తెలియక రహస్యార్థముల నుపన్యసించుచుండిరి. అది నంబివిని

తమకు మునుపు తేవప్పెరుమాళ్లు సాదించిన యర్థములును అప్పుడు పిళ్ల లోకాచార్యులు ఆనతిచ్చునట్టి యర్థములును ఒక్క-టిగా నున్నవని మీరేకదా తేవప్పెరుమాళ్లు అనుచు పిళ్ల లోకాచార్యులను సేవించి వారిసన్నిధిలో నిలువబడిరి. వారును నంబిగారిని ఆదరించి మీరెవరని యడుగగా వారు తమవృత్తాంతము సర్వమును విన్నవించిరి. అందులకు పిళ్ల లోకాచార్యులు చాల హర్షించి వారిని తమకు అంతరంగ శిష్యులనుగా పరిగ్రహించి తేవప్పెరుమాళ్లు కోవెలలో ఆనతిచ్చెదమన్న యర్థములను ఆనతిచ్చుచుండిరి. పిమ్మట పెరుమాళ్లు నంబిగారి కలలో సేవసాదించి యీయర్థముల నెల్ల జేర్చి యొకనిబంధన గ్రంథముగా రచియింప పిళ్ల లోకాచార్యులను ప్రార్థింపుము అని నియమించి వేంచేసెను.

అంతట నంబిగారు పిళ్లలోకాచార్యులతో ఆవిషయము విన్నపము చేసిరి. ఆపెరుమాళ్ల నియమనమును శిరసావహించి ఉపదేశపరంపర ననుసరించి నాథమునులు మొదలయిన పూర్వాచార్యుల శ్రీసూక్తుల నెల్ల సంగ్రహించి యెల్లయర్థములను ప్రతిపాదించునట్టి ప్రబంధమునుగా జేసి దానికి శ్రీవచనభూషణము అని తిరునామము చాతిరి. ఈనిబంధనగ్రంథ స్థాపనార్థమే ఆచార్యహృదయము పుట్టెనను విషయముమీద చెప్పబడియున్నది.

ఇట్లు విశేషవైభవముతో పెరియపెరుమాళ్లకు ప్రాణభూతులైన పిళ్లలోకాచార్యులు వేంచేసియుండు కాలమునందు తురుష్కులవలని యుపద్రవము అనివార్యమైనందున కోవెలలోని యునికి సరిపడక నంబెరుమాళ్లు నాచ్చిమారులతోగూడ బయట వెడలిరి. పిళ్లలోకాచార్యులును పలినవాని యెడబాటునకు సహింపక పెరుమాళ్లను వెంబడించి యంగరక్షకులై వేంచేసిరి. అట్లు జ్యోతిషక్కుడి అను గ్రామము చేరగా, అచ్చట పిళ్లలోకాచా

ర్యులు తిరుమేనున నోవు చాతుకొని తమ్ము నాశ్రయించివచ్చిన విళాంజోలై పిళ్లను తిరువనంతపురములో నిత్యనివాసముచేయించి శ్రావణశుక్లదశమినాడు తిరునాటికి వేంచేసిరి.

ఇది పిళ్లలోకాచార్యుల వైభవము.

---

## తిరువాయిమొళ్రిప్పిళ్లవైభవము

అంతట నంబెరుమాళ్లు పుత్రవియోగము నొందినట్లు మహాక్లేశముతో జ్యోతిష్కుడియందు నిలువక తిరుమాలిరుంజోలై అను దివ్యదేశముచేరి అచ్చట కొన్నాళ్లు వేంచేసియుండ "అళ్ళగియమణవాళ్ కేణర్" అని తనపేర నొక బావిని కల్పించి, అందుండికదలి కోళ్రికోట్టు అను గ్రామమునకు వేంచేసెను. అప్పుడు తక్కిన దివ్యదేశముల పెరుమాళ్లును నమ్మాళ్వార్లును కోళ్రికోట్టుకు వెలుపలితట్టువచ్చి వేంచేసియుండిరి. అందు వేంచేసియున్న తేవప్పెరుమాళ్లు తమసన్నిధికివేంచేసిన నమ్మాళ్వార్లను మిక్కిలి యాదరించి తమ దివ్య సింహాసనమయిన వట్టువగద్దెను, ముత్యాలకవచమును, తీర్థపడిగమును ప్రసాదించెను. కాబట్టి నాడు మొదలు తేవప్పెరుమాళ్లకు వట్టువగద్దె మొదలగునవి లేవు. నంబెరుమాళ్లు అందుండి వెడలి పశ్చిమదేశమునందలి దివ్యదేశమగు తిరునారాయణపురమునకు వేంచేసి, అందునునిలువక తిరుమలకువచ్చి, అక్కడ కొన్నాళ్లు నివసించెను.

ఇట్లు నంబెరుమాళ్లు కోవెలనుండి బయటవెడలగానే వివేకశూన్యులగు మ్లేచ్ఛులు కోవెలనాక్రమించి, ఒక ప్రాకారమును ఇడియగొట్టి ఆప్రాకారపు రాళ్లను గొనిపోయి కన్ననూరిలో ఒకనగరు కట్టించుకొనుటయేగాక బహువిధములయిన యుపద్రవములను చేయసాగిరి. ఆకాలమునందు పెరుమాళ్లకు ముఖ్య

స్థానమయిన అట్ఠగియమణవాళర్ అను గ్రామమునందున్న స్థానికులలో సింగప్పిరాన్ అను ముఖ్యబ్రాహ్మణుడు ఆమ్లేచ్ఛులకు కార్యకర్తగా నేర్పడి వారికి అనుకూలునివలెనే నటించుచు వారి యిష్టముచొప్పున సర్వధ్వంసము చేయనియ్యక ప్రాకారములు తిరుమాళిగలు గోపురములు తిరుమామణిమండపము మొదలగు వానిని మూలవరగు పెరియపెరుమాళ్లను వారి యుపద్రవము వలననుండి తప్పించెను. అది తెలిసి యచ్చటి శ్రీవైష్ణవులందరు ఆసింగప్పిరానును ప్రియములుచెప్పి యుపచరించుచు వచ్చిరి.

అనంతరము తిరువాయిమొళిప్పిళ్లె తల్లిగారు మనయాచార్యులగు పిళ్లలోకాచార్యుల నెడబాసియుండుట యెట్లని పరమపదమునకు వేంచేసిరి. తిరుమలైయాళ్వార్ అను నామాంతరముగల తిరువాయిమొళిప్పిళ్లను వారి పినతల్లిగారు పోషించుచుండిరి. ఆతిరుమలెయాళ్వార్ ఉగ దెలిసియు ద్రావిడమునందు విరాగము గలిగియుండిరి అట్టియెడ పిళ్లలోకాచార్యుల శిష్యులును విశేషవైభవము గలవారునైన కూరకులోత్తమ దాసులు శ్రీరంగనివాసులకు అందరకు సంత్రవ్యాఖ్యానమును ఉపన్యసించి దర్శనప్రవర్తనమును వృద్ధిపొందింపదలచి, తిరుమలెయాళ్వార్ చెవి సోకునట్లు తిరువిరుత్తమును అనుసంధించిరి. అదివిని తిరుమలెయాళ్వార్ స్వామీ దానికి అర్థమేమి అని యడుగగా, కూరకులోత్తమదాసులు దీని యర్థమును మీకు చెప్పరాదు అనిరి. ఆవర్తమానము తిరుమలెయాళ్వార్ తమ పినతల్లిగారితో చెప్పి, ఆమె నీవు పిళ్లలోకాచార్యుల వారితిరువడి అతిబాల్యమున నాశ్రయించినవాడవు కాబట్టి యిప్పుడు ఆయర్థమును వినుటకు అర్హుడవుకావైతివి. అని లోకాచార్యుల సంబంధమును తలపించెను. అంతట వారు ఆచార్యవరణమునందు అభిముఖ్యముగలవారై యుండిరి. ఆకాలమునందు ముందుచెప్పిన సింగప్పిరాన్ చేయు మపకారమునకు అచ్చటి యాచార్యులందరు ప్రీతినొందినవారై

ఆయనకు తిరుమణత్తూణ్ నంబియని తిరునామముచాత్తి, వారి వారికి తెలిసిన యర్థవిశేషములను తలా ఒకటిగా చెప్పుచువచ్చిరి. సింగప్పిరాణ్ పలువురివలన గ్రహించునట్టి యర్థవిశేషములు పరస్పరము అభిప్రాయభేదములు గలవియగుటవలన ఆయన ఇట్లు పలువురి యుపదేశములచేత నిశ్చయజ్ఞానము పట్టుపడుట దుర్లభమని యెంచి, అడియనికి ఉపదేశకర్తలు మీలో నెవరైన ఒకరుగా నుండవలెనని వేడగా, నలువురును ఏకీభవించి తిరుమలెయాళ్వానును నియమించిరి. అట్లు నియమితులైన తిరుమలెయాళ్వాణ్ సింగప్పిరానికి అర్థప్రవచనము చేయుచుండునపుడు కూరకులోత్తమదాసులు అందు సంప్రదాయవిరుద్ధములయిన యర్థములు కలవని తెలిసి, తిరుమలెయాళ్వానికి ఆలోపములను కనబరిచి పిమ్మట పిళ్లలోకాచార్యులు ఆనతిచ్చిన శ్రీవచనభూషణమునందు నిర్దేశింపబడిన చొప్పున సకలసంప్రదాయార్థములను వివరించి యానతిచ్చి వారిని సర్వసత్ప్రవర్తకులుగా జేసిరి. అది కారణముగా కూరకులోత్తమదాసులు ఉదారులు అను తిరునామమును చాత్తుకొనిరి. అనంతరము కూరకులోత్తమదాసులు తమకు అంత్యదశ ప్రాప్తింపగా తిరుమలెయాళ్వానును పిలిచి, మీరు విళాంచోలైప్పిళ్లవలనను, తిరుకణ్ణంగుడిపిళ్లవలనను కొన్ని రహస్యములను తిరువాయిమొళిని పరిగ్రహింపుడని నియమించి తిరునాటికి వేంచేసిరి. పిమ్మట తిరుమలెయాళ్వాణ్ తిరుకణ్ణంగుడిపిళ్ల సన్నిధిని తిరువాయిమొళి సేవించుచు వారు ఆనతిచ్చు ముఖ్యతాత్పర్యమునువిని తృప్తినొందక మరియొకతూరి పదార్థవివరణముతోడ ఆనతియ్యవలయునని విన్నపము చేయగా, వారు అందులకు తిరుప్పుట్కుడిజియ్యరు సన్నిధికిపొమ్మని నియమించిరి. ఆనియమనముచొప్పున తిరుప్పుట్కుడికి వేంచేసి జియ్యరు తిరునాటికి వేంచేసి అప్పటికి పండ్రెండునాళ్లు ఆయెనన్నవార్తవిని చింతిల్లుచుండగా, నంబిళ్ల శిష్యులైన యియ్యుణ్ణి మాధవాచార్యుల

శిష్యులు నయనారాచ్చాంబిళ్లైఁ సేవసాదించిరి. వారిని సేవించి వారితో తమయుద్దేశ్యమును విన్నవించి వారిసన్నిధి నాశ్రయించి తిరువాయిమొழிని పదార్థవివరణముతోడ సేవించుచుండిరి.

ఈవృత్తాంతము తిరునారాయణపురపు ఆయిప్పిళ్లై మొదలగువారువిని నైనారాచ్చాంబిళ్లను తిరునారాయణపురమునకు వేంచేయవలసినదిగా ఎంబెరుమానారు శ్రీముఖమును వ్రాసి పంపగా, ఆశ్రీముఖమును శిరసావహించి తిరుమలెయాళ్వాను తోడ అచ్చటికివేంచేసి భాష్యకారులకు తృప్తిగా ఆయిప్పిళ్లై మొదలగువారికి ఈడు ముప్పత్తారాయిరప్పడి సాంతముగా ప్రసాదించి, తిరుమలెయాళ్వానికి తమ తిరువారాధనమైన కణ్ణనిని ఇచ్చిరి. తిరుమలెయాళ్వాను ముప్పత్తారాయిరప్పడిని తిరువారాధనమును పడసి కృతకృత్యులగుచు నమ్మాళ్వార్లను సేవించువారై తిరునారాయణపురమునుండి వెడలి తిరుక్కణాంబియను ఊరిలో వేంచేసియుండు నమ్మాళ్వార్లను సేవించి, అందుండి తిరునగరికివచ్చి, అచ్చట పట్టణము పాడుపడిపోగా దట్టముగా పెరిగియున్న యడవియంతయునరకించి, వాసయోగ్యస్థలముగా జేసి, అచ్చట కొన్ని కుటుంబముల వైష్ణవులను కాపురముంచి, మరల తిరుక్కణాంబికివేంచేసి, అందుండి ఆళ్వార్లను వేంచేపు చేసుకవచ్చి యథాపూర్వముగా తిరునగరిలో ప్రతిష్ఠచేయించి, కోవెలగోపురము మొదలగువానిని కట్టించి, నిత్యోత్సవము మొదలగువానిని నడపిరి.

అందులకు నమ్మాళ్వార్లు చాలహర్షించి శఠగోపదాసులు అను తిరునామమును చాతగా, పరమానంద భరితచిత్తులై అందుండి తిరువనంతపురమునకు వేంచేసి, అందు విళాంజోలై ప్పిళ్లైను సేవించి, వారివలన విశేషార్థములనుపడసి, వారివిషయమైతనియమొకటి విన్నపముచేసి మరల తిరునగరికి వేంచేసిరి.

అంతట కొన్నాళ్లకు పిళ్లాంజోలై పిళ్లయు తిరునాటకి వేంచేసిరను వర్తమానము వచ్చెను. అందులకు తిరుమలెయాళ్వార్ కొంచెము చింతించి వారికి శిష్యసంబంధమువలన తాము చేయవలసిన కృత్యములన్ని చేసినవారై, మరికొన్నాళ్లకు తమమేనల్లుని పుత్రస్వీకారము చేసికొని తేవప్పెరుమాళ్లు అని నాలూరాచ్చాంబిళ్ల తిరునామమును చాతిరి. పిళ్లలోకాచార్యుల శిష్యులయి కొల్లికావల్ దాసులు అనబరగిన కోట్టూరఴగియ మణవాళప్పెరుమాళ్ పిళ్లయు లోకాచార్యుల సన్నిధిని తాము పడసిన అర్థవిశేషములను అనుసంధించుచు సిక్కిల్ కెడారమను ఊరిలో నుండగా, డెబ్బదినలుగురు సింహాసనాధిపతులలో నొకరగు గోమఠత్తాళ్వార్ వంశస్థులయిన తిరునావుడయపిరాన్ దాసులు కొల్లికావలిదాసుల కొమార్తెను పెండ్లాడి సిక్కిల్ కెడారములో వారి తిరుమాళిగలోనే నివసించి, వారివలన సకలరహస్యములను అధికరించి వారిని లోకాచార్యులేయని సేవించుచుండిరి.

పిమ్మట కొల్లికావల్ దాసులును తిరునాటికి వేంచేయగా తిరునావుడయపిరాన్ దాసులు తమదేవులను బిలుచుకొని తిరునగరికి వేంచేసి అచ్చట నివాసముగానుండిరి. ఆకాలమునందు నమ్మాళ్వార్ల సన్నిధినుండి అనుస్యూతముగావచ్చిన ప్రపత్తిసంప్రదాయము తగ్గుచువచ్చుటను తిరువుళ్లపట్టి పెరియపెరుమాళ్లు ఎంబెరుమానారువలె ఆత్మలను ఉజ్జీవింపజేయగల యొక ప్రపన్నశిరోమణిని అవతరింపజేయదలచి శ్రీయనంతాళ్వార్లను కటాక్షించి నీవు నీయంశావతారమయిన తిరుప్పాళియాళ్వారుకు నివాసమయిన తిరునగరిలో తిరునావుడయపిరాన్ దాసరణ్ణర్ అను శ్రీవైష్ణవోత్తమునికి పుత్రుడవై యవతరించి నిఖిలచేతనులను ఉజ్జీవింపజేయుము అని యానతియ్యగా, అనంతాళ్వార్లను

మహాభాగ్యమును తిరునావుడయపిరాన్ దాసరణ్ణన్ దేవులగర్భమునందు ఆవేశించెను.

### మణవాళమహామునుల అవతారాదికథనము.

శ్రీమన్నారాయణుని నియమనముచొప్పున కలియుగమున నాలుగువేలనన్నూట డెబ్బదిరెండవదియగు సాధారణనామ సంవత్సరమునందు ఆశ్వయుజశుక్ల చతుర్దశీ గురువారమునాడు మూలానక్షత్రమున, తిరునావుడయపిరాన్ దాసరణ్ణన్‌గారికి శ్రీయనంతాళ్వారు కుమారులై యవతరించిరి. అణ్ణన్‌గారును ఆకుమారశిరోమణికి జాతకర్మమునడపి పండ్రెండవనాడు తిరువిలచ్చ్యవయను సాధించి, ఆకుమారుల మూర్తివైభవమును అళ్గియమణవాళన్ మూర్తివైభవమును నొక్కటిగా నుండుట బట్టి ఆపెరుమాళ్ల తిరునామమునేచాతి వారియందు పుత్రసామాన్యబుద్ధితో నుండక పరమాదరపరులై యుండిరి.

పిమ్మట ఆకుమారులు సిక్కిల్ కెడారములో మేనమామగారి తిరుమాళిగలో పెరుగుచు జనకులయిన అణ్ణన్‌గారు శాస్త్రమునందు చెప్పబడినచొప్పున అన్నప్రాశనము చౌలము ఉపనయనము మొదలగు వైదికక్రియలు యథాకాలములయందు కావింపగా, యుక్తకాలమునందు అక్షరాభ్యాసమును చేయబడినవారై వేదశాస్త్రములను అధికరించుచు తాము శ్రీయనంతాళ్వారే యనుటకు సూచనగా ఎల్లవారికి వింతపుట్టించునట్టి మహామేధయు, పాలసముద్రమును చంద్రమండలమును స్వచ్ఛతచేత క్రిందుపరుచునట్టి తేజస్సును, మహాపురుష చిహ్నములయిన ముప్పదిరెండు లక్షణములచేతను పొందుపడియుండు నందమును, అందులకుదగిన సౌశీల్యమును గలవారై వేంచేసియుండిరి.

ఆకాలమునందు చెంజిరాజధానిలో ప్రధానిగానుండిన గోపణార్యులు అనునతడు తమరాజునను మతి పుచ్చుకొని తిరుమలలో

మున్న నంబెరుమాళ్లను చెంజికి వేంచేపుచేయించుకొనివచ్చి అచ్చట కొన్నాళ్లు ఆరాధనచేయుచుండి శ్రీరంగమును ఆక్రమించుకొనియున్న తురకలను తరుమగొట్టి అళగియమణవాళర్‌గారు అవతరించిన మూడవసంవత్సరము అనగా పరీధావి నామసంవత్సరము వైయాశినెల పదియేడవ తిథినాడు చెంజి నుండి నంబెరుమాళ్లను శ్రీరంగమునకు వేంచేపుచేయించుకొని వచ్చి కోవెలలో యథాపూర్వముగా ప్రతిష్ఠచేయించెను. అది మొదలు నంబెరుమాళ్లు తమకెదుట సిక్కిల్ కెడారమునందు వర్ధిల్లుచున్న అళగియమణవాళర్‌గారిని కటాక్షించుచు, పరమానందభరితులై వేంచేసియుండిరి.

పిమ్మట అణ్ణర్‌గారు తమకొమారులకు తిరుకల్యాణమహోత్సవమును నడపినవారై కొన్నాళ్లకు పరమపదమునకు వేంచేసిరి. అంతట వారికి కొమారులైన అళగియమణవాళప్పెరుమాళ్లు చరమకైంకర్యములన్ని యథావిధిగా నడపి, తమ జన్మదేశమాయిన తిరునగరికి వేంచేసి, అక్కడ ఇకదగ్గిన ప్రవర్తకులు కాగలవారు ఎవరు అని విచారించుచు వేంచేసియుండు తిరుమలెయాళ్వార్ తిరువడినాశ్రయించి, వారి సన్నిధిలో ద్రావిడ వేదార్థములనెల్లను అధికరించి, అందు నిర్వాహకులై యుండిరి. తిరుమలెయాళ్వార్‌గారు తిరువాయిమొళ్రి రసానుభవమునందు గౌరవముగలవారయి యున్నందున వారికి తిరువాయిమొళ్రిప్పిళ్ల అనియు తిరునామము కలిగియుండెను. అట్టి యాతిరువాయిమొళ్రిప్పిళ్ల పిమ్మట కొన్నాళ్లకు అళగియమణవాళప్పెరుమాళ్ల నిష్ఠావిశేషమునకు మిగుల హర్షించి వారికి ఉడయవరు తిరువడి సయితము ప్రసాదించిరి. అళగియమణవాళప్పెరుమాళ్లును అట్లు పరమగురు తిరువడినిపడసి కృతార్థులయి వేంచేసియుండిరి. పదపడి తిరువాయిమొళ్రిప్పిళ్ల తిరునగరిలో ఉడయవరుకు ప్రత్యేకముగా ఒకకోవెలకట్టించి, ఆకోవెలకు నాలుగుప్రక్కలను శ్రీదా

మానుజ చతుర్వేదమంగళము అని నాలుగు తిరువీధులేర్పడ నొకయగ్రహారమును కట్టించి, అందు సత్సంప్రదాయ ప్రవర్తకులగు భాగవతోత్తములను కాపురమునిచిరి.

అటుపిమ్మట అఴ్ఴగియమణవాళప్పెరుమాళ్లు ఆయుడయవరు తిరువడుగులందు ఎడతెగని భక్తిగలవారై వారి విషయమున యతిరాజవింశతియను స్తోత్రమును విన్నవించిరి. దానిచే అఴ్ఴగియమణవాళప్పెరుమాళ్లకు యతీంద్రప్రవణులు అను తిరునామము కలిగెను. అయినను ఈయతిరాజవింశతి ఆళ్వారు తిరునగరియందలి చతుర్వేదమంగళ అగ్రహారమునందు వేంచేసియుండు ఎంబెరుమానారును సేవించి వారివిషయమై చేయబడిన గ్రంథముగాని ఉడయవరుయొక్క అవతారస్థలమగు శ్రీపెరుంబూదూరికి వేంచేసి అచ్చటి యుడయవరు సన్నిధిలో రచియించినది కాదు. మరియు ఈయతిరాజవింశతిని తిరువాయిమొళ్ళిప్పిళ్లె తిరువుళ్లపట్టి హర్షించి తిరువ్వాళియాళ్వార్లక్రింద తాము సేవించిన యుడయవరు నారాధించుచుండునట్లు నియమించి, ఒక రహస్యప్రదేశమునందు భగవద్గుణానుభవము చేయుచు వేంచేసియుండిరి. అప్పుడు తిరువాయిమొళ్ళిప్పిళ్లె తిరువడిసంబంధులు కొందరు యతీంద్రప్రవణులయెడ అసూయకలవారు కాగా, అది సర్వజ్ఞులయిన తిరువాయిమొళ్ళిప్పిళ్లెగారు తెలిసికొని, వీరు శేషావతారముకాబట్టి వీరియెడల అసూయచేసి అపచారపడకుడు అని వారికి దృష్టాంతములతోడ కనబరిచి యతీంద్రప్రవణులయెడల భక్తివిశ్వాసములు కలుగజేసిరి. ఇట్లుండగా యతీంద్రప్రవణులకు కుమారులొకరు అవతరించిరి. వారికి వారు తిరువాయిమొళ్ళిప్పిళ్లె నియమనము చొప్పున రామానుజజియ్యరు అని తిరునామము చాతిరి.

అనంతరము తిరువాయిమొళ్ళిప్పిళ్లె తమ తిరువారాధనమగు కణ్ణనునందు అత్యంతభక్తిగలవారుగనుక ఆకణ్ణను చరిత్ర

మును ప్రతిపాదించునట్టి పెరియాళ్వార్ తిరుమొళ్రికి విపులముగా వ్యాఖ్యానము ఒకటి యానతిచ్చి, ఆవల కొన్నాళ్లకు తిరుమేనునందు నొప్పి చాతుకొనియుండిరి. అప్పుడు యతీంద్రప్రవణులు మొదలగువారు సన్నిధికివచ్చి సేవించి నిలిచిరి. అందు యతీంద్రప్రవణులు వారి తిరుముఖమండలము వికాసము తప్పియుండుటను తిరువుళ్లపట్టి దేవరవారికిగల కొరతయేమియని యడుగగా తాము రచియించిన తిరుమొళ్రి వ్యాఖ్యానమును కనబరిచి, ఇది కలికాలము, ఇక ఆళ్వార్ల శ్రీసూక్తులను విశ్వాసముతో సేవించి లోకమునందు ప్రవర్తింపజేయువారు ఎవరు అని మానసము క్లేశపడుచున్నది. ఈకొరతను తీర్చువారు ఎవరు అని యానతిచ్చిరి. అంతలకు యతీంద్రప్రవణులు అడియడు ఉండగా దేవరవారికి ఈవిచారమేల అని విన్నపము చేయగా తిరువాయిమొళ్రిప్పిళ్లె యీవిషయమునందు ఇంతమాత్రముతో నమ్మకము పుట్టదు. అని యానతిచ్చి, యతీంద్రప్రవణులు తిరువడి ముట్టి దాసుడు ఈతిరువడిసాక్షిగా ఆళ్వార్ల శ్రీసూక్తులతోనే యుజ్జీవింపగలవాడు అని విన్నపము చేయగా విశ్వసించి, మీరు గీర్వాణశాస్త్రములలో భాష్యకారుల ముఖోల్లాసార్థముగా శ్రీభాష్యమును మాత్రము ఒక పర్యాయము సేవించి, సర్వదా ఆళ్వార్ల శ్రీసూక్తులనే అనుసంధానముచేయుచు, ఇతరులను అనుసంధింపజేయుచు మాకును ఉడయవరులకును ప్రీతిపుట్టింపవలసినది అని నియమించి, తమతిరువడి నాశ్రయించిన శ్రీవైష్ణవోత్తములనెల్ల యతీంద్రప్రవణులకు ఒప్పించి, వారలతో యతీంద్రప్రవణులు అవతారపురుషులుగాని సామాన్యులుకారు గనుక మీరు మేమే వీరుగా భావించి సేవింపవలసినది అని నియమనము చేసి, పిళ్లలోకాచార్యుల తిరువడిని అనుసంధానము చేయుచు వైశాఖబహుళ అష్టమినాడు పరమపదమునకు వేంచేసిరి. వీరు అవతరించిన తిరునక్షత్రము వైశాఖవిశాఖము. వీరి యవతార

స్థలము కుంతినగరము. తిరునామములు తిరుమలెయాళ్వార్, శ్రీశైలేశులు, తిరువాయిమొళ్లిప్పిళ్లై, శ్రీశఠగోపదాసులు, కావు క్కాట్టియయ్యర్, అనునవి. వీరు సాదించిన ప్రబంధములు. పెరియాళ్వార్తిరుమొళ్లి వ్యాఖ్యానము శ్రీవచనభూషణ వ్యాఖ్యానము. వ్యాప్త్యను సంధానము మొదలగునవి.

ఇది తిరువాయిమొళ్లిప్పిళ్లై వైభవము

## మ ణ వా ళ మ హా ము ను ల వై భ వ ము.

అనంతరము యతీంద్రప్రవణులు తిరువాయిమొళ్లిప్పిళ్లకు మహావైభవముతో చరమకైంకర్యము నడపి తిరునగరిలోనే దర్శమును నిర్వహించుచు వేంచేసియుండిరి. అప్పుడు అళ్లగియ వరదర్ గోక్ ముదలియారణ్ణర్ మొదలగువారు వీరి వైభవమును వినివచ్చి సేవించి వీరి తిరువడినాశ్రయించిరి. అందు అళ్లగియవరదర్ అనువారు సన్యాసాశ్రమ స్వీకారముచేసి రామానుజజియ్యరు అను తిరునామముతో యతీంద్రప్రవణులకు ఎడతెగక పాదసేవచేయుచుండిరి. అట్టియెడ యతీంద్రప్రవణులు నంబెరుమాళ్లకు మంగళాశాసనముచేయ తిరువుళ్లపట్టి, ఆళ్వార్ల సన్నిధికి వేంచేసి వారి తిరువడినారాధించి, నంబెరుమాళ్లు విరోధులనెల్ల నాశముచేసి తిరువరంగ తిరుపతిలో యధాపూర్వముగా వేంచేసియున్నారు దాసునికి వారిని సేవింప ననుజ్ఞ సాదింపవలెనని విన్నపముచేసికొనగా, ఆళ్వార్లును అట్లే అనుగ్రహించిరి. అంతట యతీంద్రప్రవణులు భాగవతగోష్ఠితోడ తిరునగరినుండి వెడలి శ్రీవిల్లిపుత్తూరికి వేంచేసి ఆండాళును, పెరియాళ్వార్లను, శ్రీవటపత్రశాయిని సేవించి, అందుండి తిరుమాలిరుంజోలై అను దివ్యతిరుపతికి వేంచేసి అచ్చట సుందరరాజును (అళ్లగరును) సేవించి, అక్కడనుండి వెడలి తిరువరంగం పెరియ

గోవెలకు వేంచేసి, సన్నిధి యధికారులు సపరివారముగా ఎదురువచ్చి సేవించి యెల్లమర్యాదలతోను సన్నిధికి వేంచేపుచేసి కొనిపోగా, పదు తిరువీధులనువలగొని, పిళ్లలోకాచార్యులవారి శిష్యులగు కోడెయిలణ్ణర్ అనువారు శ్రీరంగనాథుడు కోవెల వదలి బయట వేంచేసియున్నప్పుడు తాము బయలుదేరి తిరుమెయ్యత్తను గ్రామమునందు నివసించి ఇరుపత్తునాలాయిరప్పడి ప్రవచనము చేయుచుండి, పెరుమాళ్లు కోవెలకు వేంచేయగానే తాము వేంచేసినవారుగనుక వారు మహనీయులని వారి తిరుమాళిగకు వేంచేసిరి. వారును యతీంద్రప్రవణులమొదల అవతార విశేషులు అని అత్యంతము గౌరవముగలవారై, కోవెలకు ముఖ్యాధికారులగు తిరుమాలై తంద పెరుమాళ్ భట్టరు తిరుమాళిగకు వేంచేపుచేసికొనిపోయిరి. అప్పుడు భట్టరును యతీంద్రప్రవణులకు యథాయోగ్యముగా మర్యాదచేసి, తగినపీఠమునందు వేంచేయింపజేసి, తిరువాయిమొళియర్థము నానతిమ్మని ప్రార్థింపగా, అందులకు హర్షించి ప్రతిపాశురమునకును విమర్శముగా అర్థము ఆనతిచ్చిరి. ఆయర్థవిమర్శనమునకు భట్టరు సంతోషించి వారికి ముప్పత్తారాయిరప్పెరుక్కు అని తిరునామముచాత్తి, నంబెరుమాళ్ల మంగళాశాసనమునకై సన్నిధి వైష్ణవులతోడ నంబెరుమాళ్ల సన్నిధికి బంపిరి.

అప్పుడు యతీంద్రప్రవణులు సేవాక్రమముచొప్పున నంబెరుమాళ్ల తిరువడియందు దండము సమర్పించి మిక్కిలి యనురానందముతో మంగళాశాసనము చేసి, ఆయేలినవాని సన్నిధినుండి వెడలి కోడెయిలణ్ణరుతోడ వారి తిరుమాళిగకు వేంచేసి, వారు పిళ్లలోకాచార్యులు మొదలగు పూర్వాచార్యుల వైభవములను ఉపన్యసింపగా విని, ఆపూర్వాచార్యులు వేంచేసియున్న తిరుమాళిగలతట్టుతిరిగి సేవించి వారిదివ్యగుణానుభవము నే చేయుచునుండిరి.

అంతట ఒకనాడు యతీంద్రప్రవణులు సేవార్థము నంబెరుమాళ్ల సన్నిధికి వేంచేసినప్పుడు నంబెరుమాళ్ల ప్రవాళవర్ణమగు శ్రీముఖద్వారమునుండి యొక తిరువాక్కు వినబడెను. అది యేమియనగా, మీరు మాయుడయవరువలె మాకోవెల కార్యములను నడపుచు, దర్శమును నిర్వహించుచు ఈశరీరావసాన పర్యంతము మాసన్నిధియందే నివసింపవలసినది. అను తిరువాక్కు చెవిసోకగానే, అది శ్రీరంగనాథుడు తమకుచేసిన నియమనమని తిరువుళ్లపట్టి శ్రీరంగమునందే నిత్యనివాసము చేయునట్లు సంకల్పించుకొని, పూర్వాచార్యులు ఆనతిచ్చిన ప్రబంధముల నన్నిటిని విమర్శించిచూచి, తిరుప్పణి తిరువారాధనములను విమర్శముగా నడపగలందులకై ఉత్తమనంబి యనబరగిన వరాదాళ్వార్లను తామొక్కమాత్రముగాక పెరుమాళ్లు నయితము నియమించునట్లుచేసి, తిరుమల మొదలగు ఉత్తరదేశపు దివ్యతిరుపతులను సేవింపవలెనను తిరువుళ్లముతో, నంబెరుమాళ్ల యానతియు పడసి మహాగోష్ఠీసమేతులై శ్రీరంగమునుండి వెడలిరి.

అట్లు యతీంద్రప్రవణులు దివ్యదేశయాత్ర వెడలి తిరువెళ్లరై మొదలగు దివ్యదేశములను సేవించుచు తిరుమలకు వేంచేసి తిరువేంగడముడయుని సేవించి, అందుండి తిరుకచ్చికి వేంచేసి, తిరువనంత సరస్సునందు నీరాడి, ఆళ్వారాదులను, కరియమాణిక్యస్వామిని, అళగియసింగరిని, శ్రీపెరుందేవితాయారును సేవించి, శ్రీహస్తిగిరియెక్కి పేరరుళాళని తిరువడిని సేవించి, ధ్యానించుచుండగా, ఆపెరుమాళ్లును తిరుప్పవళవాయి తెరచి మనరామానుజులవలె దర్శనస్థాపకాచార్యులై యుండుడని యానతిచ్చి, ఎల్ల మర్యాదలను ప్రసాదించి వీడుకొలిపెను. అట్లు పేరరుళాళని యనుగ్రహమును పడసి, అచ్చటనుండెడి తక్కిన తిరుపతుల పెరుమాళ్లనెల్ల సేవించి, అందుండికదలి శ్రీపెరుంబూదూరికి వేంచేసి శ్రీభాష్యకార్లను సేవించి, వారివలన శ్రీభాష్యకాలక్షేపమునకు

అనుజ్ఞపడసి, మధురల పెరుమాళ్లకోవెలకు వేంచేసి కిడాంబి
యాచార్య్యార్ తిరువంశసంజాతులయిన బ్రహ్మతంత్ర జియ్యరు
సన్నిధిలో శ్రీభాష్యకాలక్షేపము చేసి, శ్రీలోకాచార్య్యుల యను
జులైన అళ్గియమణవాళ ప్పెరుమాళ్ నయనారు సన్నిధిలో
సకలరహస్యములతోడ ముప్పత్తారాయిరప్పడి మొదలగు సంప్ర
దాయ గ్రంథములను అన్నిటిని అధికరించి, తమతిరువడి నాశ్ర
యించిన ప్రపన్నులకెల్లను ఉభయవేదాంతములను సాధించుచు
యథోక్తకారి సన్నిధిలో కొంతకాలము వేంచేసియుండి, అనంత
రము శ్రీరంగమునకు వేంచేసి, శ్రీరంగనాథుని నియమనముచొప్పున
నచ్చటనే నిత్యనివాసముగా వేంచేసియుండగా, ఒకనాడు
ఒకయాశౌచ వృత్తాంతము వచ్చినందున నంబెరుమాళ్ల సేవకు
అంతరాయము పొసగెను. అందులకు యతీంద్రప్రవణులు చాల
క్లేశము నొందినవారై, వెంటనే తమ యాచార్య్యులయిన తిరు
మలెయాళ్వార్ల శిష్యులైన శఠగోపజియ్యరు సన్నిధికి వేంచేసి,
వారి యనుగ్రహమువలన ఆశ్రమస్వీకారమును చేసి, శఠగోప
జియ్యరు అను తిరునామము చాతుకొని, నంబెరుమాళ్ల సన్నిధి
యందు దండము సమర్పించి నిలువగా, నంబెరుమాళ్లు మును
పటిదైన తమతిరునామమునే వారికి ముఖ్యనామముగా నియ
మించి, అళ్గియమణవాళ జియ్యరని ఎల్లవారు వ్యవహరించు
నట్లు చేసి, సకలమర్యాదలతోను పల్లవరాయని మఠమునకు వేం
చేయుడని, ఉత్తమముని మొదలగు పరిజనులనుగూర్చి పంపెను.

అటుపిమ్మట అళ్గియమణవాళ జియ్యరు రామానుజ
జియ్యరు మొదలుగాగల వారివలన మఠమును బాగుచేయించి,
తిరువాయిమొళిప్పిళ్ల తిరునామముతో తిరుమలెయాళ్వార్లని
యొక వ్యాఖ్యానమండపమును ప్రతిష్ఠచేసి, ఎల్లరహస్యములకు
పుట్టినచోటయిన లోకాచార్య్యులవారి తిరుమాళిగల ముంగిళ్ల
లోని మట్టితో ఆమండపమును మెత్తించి, అందు నివసించుటకొ

తనకు గురుకులవాసముగా నిర్ణయించుకొని తిరువాయిమొళి ప్పిళ్లై తిరువడిచాయలో కాలక్షేపము చేయుచు, పెరియ పెరుమాళ్ల మంగళాశాసనమును నిర్వహించుచు పెరియజీయ్యరు అను తిరునామముతో భాగవతోత్తములగు శ్రీవైష్ణవుల కందరకును ఆశ్రయులై వేంచేసియుండిరి. శ్రీగోవిందరాజభట్టరు జీయ్యారును పెరియజీయ్యారు నాశ్రయించి వారిసేవయందు అప్రమత్తులై వర్తించుచుండిరి. పెరియజీయ్యారును పెరియ పెరుమాళ్ల నియమానముచొప్పున ఆశ్వయుజ శ్రవణమునందు శ్రీరంగనాథుని తమకు తిరువారాధనముగా వేంచేపుచేసి నిరంతరమును ఆరాధించుచు తమయాచార్యస్థితికి అనుగుణమయిన వర్తనముతో వేంచేసియుండిరి. అప్పుడు దేశములోని వారందరు వీరివైభవమును నేత్రానందముగా చూచియు వినియు గుంపులవెంబడి గుంపులుగావచ్చి వీరితిరువడి నాశ్రయింపసాగిరి. మఱియును శ్రీరంగము చుట్టుపట్టుల వేంచేసియుండు వైష్ణవశిఖామణులందరకు పెరియ పెరుమాళ్లు కలలో సాక్షాత్కరించి పెరియజీయ్యారే నేను నాకును వారికిని భేదములేదు కాబట్టి వారి నాశ్రయించి తరింపుడు అని ఆనతియ్యాగా, ఆనియమనమును శిరసావహించి కందాడయాండాన్ మొదలుగాగల ఆచార్యపురుషులును పెరియజీయ్యారు విషయమున మేరలేని ప్రీతిగలవారై వీరి నాశ్రయించి వర్తించుచుండిరి.

ఆకాలమునందు కృష్ణానందులు అను ఏకదండి శ్రీరంగమునకువచ్చి పెరియజీయ్యారుతో శాస్త్రవాదము చేయగోరినట్టు వారికి సమాచారమంపెను. అప్పుడు పెరియజీయ్యారు అతనితో వాదముచేయునెడల రంగనాథుని మంగళాశాసనమునకు భంగమువచ్చును. వాదముచేయనియెడల విరోధి నిరసనమునకు అవకాశము కలుగదు. ఇందుకు ఏమిచేయవచ్చునని విచారించుచుండగా, పెరియపెరుమాళ్లు పెరియజీయ్యారు పంపినట్టుగా

ఒక శ్రీముఖమును వేడలప్ప అను వారికి పంపెను. అంతట మొదలియాండాన్ వంశస్థులయిన యా వేడలప్పగారు ఆ శ్రీముఖమును కన్నులనొత్తుకొని తమ సన్నిధిని సమస్తశాస్త్రములను అధికరించి నిర్వాహకులయి వేంచేసియుండెడు దాశరథియాచ్చాన్ అను వారిని వెంటబెట్టుకొని కోవెలకు వేంచేసి నంబెరుమాళ్లను మంగళాశాసనముచేసి సన్నిధి మర్యాదలన్నియు పడసి, బిల్వవృక్షమునకు చాపుగా వచ్చినపుడు అచ్చట నివసించియున్న యేకదండి వారినిచూచి లేచి దండము సమర్పించి, మీయనుగ్రహముచే సమస్తశాస్త్రములను అభ్యసించిన మాణవకుడనుగానా నేను అని తన్ను దెలుపుకొని నిలువబడెను. వేడలప్పగారు అతనిఁజూచి నీవు ఇచ్చటికి ఏమిపని గలిగి వచ్చినావు అని యడిగి, అతడు పెరియజియ్యరుతో వాదించుటకు అని చెప్పగా, అందులకు వారి మారుగా మేమే వచ్చినాము ఏమి వాదించెదవో వాదింపుము అని మందలించిరి. ఆ తిరువాక్యములు చెవిసోకగానే అతడు స్వామీ అపచారపడితిని క్షమింపవలెనని ప్రార్థించెను. అంతట వేడలప్పగారు అణ్ణన్ తిరుమాళిగకు వేంచేసి, అచ్చట దాశరథియాచ్చాన్‌తోడ ఆరగించి, కృష్ణానందులకును ప్రసాదము పంపిరి. ఆయన యాప్రసాదమును స్వీకరించి వాదవిచారమును మానుకొని పోయెను.

పిమ్మట వేడలప్పగారు, అణ్ణన్ దాశరథియాచ్చాన్ ఈ యిరువురును వెంటరాగా పెరియజియ్యరు సన్నిధికి వేంచేసి దండము సమర్పించి కృష్ణానందుల వృత్తాంతమును శ్రుతపరుపగా, పెరియజియ్యరు ఆముగ్గురిని ఆదరించి, మొదలియాండాన్ తిరువడి విషయమయి రెండుశ్లోకములు ఆనతిచ్చి, వేడలప్పగారిని దాశరథియాచ్చానును, తమసన్నిధిలోనే నిరంతరము ఉండునట్లు నియమించిరి. వేడలప్పగారు ఆనియమనమును అంగీకరించి, తాము వృద్ధులగుటచే దాశరథియాచ్చానును జియ్యరుసన్నిధిలో

నిలిపి, పెరియజియ్యరువలన మంత్రార్థములు స్వీకరించి తమ నివాసగ్రామమగు వేడలకు వేంచేసిరి. దాశరథి యాచ్చాన్ వేడలప్పగారి నియమనము చొప్పున పెరియజియ్యరు సన్నిధిలో నివసించి, ఎల్లరహస్యములను అధికరించుచుండగా, ఒకనాడు పెరియజియ్యరు వారిని ఏకాంతమునందు కటాక్షించి, మీరు వచ్చి చాలదినములాయెను. ఒకతూరిపోయి మీ అయ్యగారిని సేవించిరండు అని, భూపాలరాయనిచే తిరువారాధన చేయబడిన ఉభయనాచ్చిమారులతోడి నంబెరుమాళ్ల దివ్యమంగళవిగ్రహము ప్రసాదించిపంపి, ప్రతివాదిభయంకర అణ్ణన్ అనువారు మహావాగ్మియై కంచిలో వేంచేసియున్నారన్నమాటవిని, వారిని పూర్వాచార్య సంప్రదాయ ప్రవర్తకులనుగాచేయ తిరువుళ్ల పట్టి శ్రీముఖముపంపి వారిని సన్నిధికిరప్పించుకొని, వారికి పంచసంస్కారముతోడ సకలరహస్యములను ముప్పత్తారాయిరప్పడి మొదలగు సంప్రదాయ గ్రంథములను ప్రసాదింపగా, వారును పెరియజియ్యరు మహానుభావమునకు చాలహర్షించి పరమభక్తి వైరాగ్యములతో సేవచేసి శ్రీమొసలియాండాన్ తిరునామముగు శ్రీవైష్ణవదాసులు అను తిరునామమును సయితము పెరియజియ్యరు తిరువాక్కువలన పడసి వారికి మిక్కిలి యంతరంగులయి వేంచేసియుండిరి.

ఆ కాలమునందు పెరియజియ్యరుకు పూర్వాశ్రమమునందు కుమారులైన శ్రీరామానుజాచార్యులకు తీర్థకర అను గ్రామములో అళగియ మణవాళప్పెరుమాళ్ నయనారు అను తిరునామముతో ఒకకుమారులు అవతరించిరి. పిమ్మట ఆరామానుజాచార్యులకే శ్రీపిళ్లిపుత్తూరిలో ఇంకొక కుమారులు అవతరింపగా వారికి పెరియజియ్యరు ఆనతిని పెరియాళ్వారు అని తిరునామముచాతిరి. ఆకుమారులు ఉగదెలిసినతోడనే పెరియ

జియ్యరు తిరువడి నాశ్రయించి, జియ్యరు, నయనారు అను విశేష నామధేయమునుపొంది దర్శన ప్రవర్తకులయి వేంచేసియుండిరి.

అంత మరికొంతకాలమునకు పెరియజియ్యారు పెరియపెరుమాళ్ల నియమనమునుపడసి తిరునగరికి వేంచేసి, అచ్చట ఆళ్వార్లను మంగళాశాసనముచేసి, అందు తమతిరువడి నాశ్రయించిన వారినెల్ల నాదరించి కొన్నాళ్లు వేంచేసియుండి, ఆచార్యహృదయమును అధికరింప తిరునారాయణ పురత్తాయి సన్నిధికిపోయిరి. ఆయి వీరొక యవతారవిశేషము అని చాల ఆదరింపగా, వారిసన్నిధిని ఆచార్యహృదయమును అధికరించి, మహావైభవముతో వేంచేసియుండి, కొందరు అసూయాపరులగు దుష్టులు తాము వేంచేసియున్న తిరుమాళిగకు నిప్పుపెట్టింపగా, పెరియజియ్యారు ఆయగ్నిబాధను తప్పించుకొనుట యసాధ్యము కాకపోయినను తమ స్వస్వరూపమును కనబరుప తిరువుళ్లపట్టి శ్రీయనంతాళ్వారుల యాకృతినివహించి, ఇంటిలోని నీళ్లు బయటపోవుటకై యేర్పరుపబడియున్న తూముగుండ బయటికి వేంచేసి మరల యెప్పటియాకారమును తాల్చిరి. ఈ వృత్తాంతమును రాజువిని ఆతిరుమాళిగకు చిచ్చుపెట్టిన దుష్టులనుపట్టి శిక్షింపబోగా, వారిని పెరియజియ్యారు కరుణించి ఆశిక్షవలన నుండి తొలగించిరి. పిమ్మట ఆదుష్టులలో కొందరు అనుతాపపడి జియ్యారు తిరువడి నాశ్రయించి అపరాధ క్షమచేసికొనిరి. అటుపిమ్మట పాండ్యదేశమునకు ప్రవర్తకుడయియున్న యొక గొప్పవాడు పెరియజియ్యారు వైభవమునకు హర్షించి వారి తిరువడి నాశ్రయించెను. అతనికి జియ్యారు పంచసంస్కారాదులను సాధించి శఠగోపదాసుడు అని దాస్య నామమును చాతిరి. అటుతరువాత పెరియజియ్యారు, తిరునగరిలో తిరుమండపమును తిరువీధులను అళగియమణవాళన్ మండపమును బాగుచేయించి, అందుండి తిరుక్కురుంగుడికి వేంచేసి, అక్కడనున్న

తిరువేంగడముడయర్ అను బ్రాహ్మణుని శిష్యునిగా జేసికొని, ఆయనకు తిరువేంకటదాసుడు అను దాస్యనామమును చాతి సన్నిధి కైంకర్యములను నడపనియమించి, నిర్కారనంబి, ఇరుక్కాద నంబి, కిడందనంబి, తిరుప్పార్కడల్ నంబి, తిరుమలైనంబి అన బరగిన పంచనంబులకును గర్భగృహములు మొదలగువాని నుద్ధరించి, అచ్చటనుండి మరల శ్రీరంగమునకు వేంచేసి నంబెరుమాళ్ల సేవచేయుచునుండిరి.

ఆసమయమునందు ఎఱుంబియలప్పా అనునతడు కోవెలకు వచ్చి పెరుమాళ్లను సేవించి, తనకు దేహసంబంధ బంధువైన కందాడయాండార్ అణ్ణనుతోగూడ పెరియజియ్యరు సన్నిధికి వచ్చుచుండగా తానునువచ్చి సేవించెను. జియ్యరు ఆయన మహావిద్వాంసుడు అని తెలిసికొని, తిరువాయిమొళిలో ఒక ఘట్టమును ఉపన్యసించి, దానికి ఆయిరప్పడిగా అర్థముసాదింపగా, ఆయనవిని పారవశ్యమును పొందినవాడు అయ్యును విధివశముచేత ఆసమయములో జియ్యరు తిరువడినాశ్రయింపకయే తమయూరికి పోయెను. అట్లుపోయి తమయింటి తిరువారాధనమయిన చక్రవర్తి త్తిరుమగనారును ఆరాధింప కోవెలాళ్వార్ల తిరుకాపులు పుచ్చపోగా అది సాధ్యముకాకపోయెను. అందులకు ఆయన చాలచింతనొందినవాడై భోజనముచేయక యూరక యుండెను. నాటిరాత్రి చక్రవర్తి త్తిరుమగనారు ఆయన కలలో సేవసాదించి, శ్రీ అనంతాళ్వార్లను సేవింపజేసి, వారే పెరియజియ్యరు అనుటకు నిదర్శనమునుజూపి, ఇట్టివారిని సేవించియు వీరియనుగ్రహముపడయక వచ్చినందున నీవుచేయు నారాధనము మాకు అంగీకారము కాకపోయెను అని యానతియ్యగా, అప్పా అప్పుడే అదిరిపడిలేచి, అదియె సుముహూర్తమని బయలుదేరి శ్రీరంగమునకుపోయి అణ్ణర్ పురుషకారమువలన పెరియ జియ్యరు తిరువడినాశ్రయించి వరవరమునిదాసులు అను దాస్య

నామమును వహించి, అచ్చటనే నివసించియుండెను. అట్టి వర వరమునిదాసులు అణ్ణనును తాము పెరియజియ్యరు సన్నిధిలో, మునుపు ఒకతూరి తాము స్థాలీపాకమునకై శ్రీరంగరాజ వివాహస్థానమయిన లాటపురమునకు వేంచేసి యుండగా, ఆ స్థాలీపాక కాలమునందు అత్తికాయతళిగ చేయించినదేగాక మరుగును వేయించిరి. అదికారణముగా తమకు శ్రీరంగరాజునకును లాటపురపు సంబంధమునందు గలిగిన విరోధమును పరిహరించుకోవలెనను నభిప్రాయమును తేటపడ విన్నపించిరి. ఆవిన్నపమును తిరువుళ్లపట్టి పెరియజియ్యరు తిరుక్కుడందలో అప్పాను, అణ్ణనును, వేదలప్పాను, దాశరథి యాచ్చానును శ్రీముఖముఖమున రప్పించి, కందాడయాండానును ఎరుంబియిలప్పాను జతగూర్చి, మదలియాండాన్ సంతతియు, వాధూలగోత్రులును-ఉడయవరుసంతతియు, హరితగోత్రులును మొదలుగా ఆరుగోత్రములవారు తమలో తాము సంబంధములు చేసికోవలసినది. ఇందులకు తప్పినవారు మాయానతి మీరినవారు అగుదురు. అని శ్రీముఖములు వ్రాయించి, ఉడయవరు వంశస్థులును మొదలియాండాన్ వంశస్థులునైనవారికి అందరకును పంపగా, ఆయానతిచొప్పున వారెల్లవారును నడచుకొనువారైరి. ఇప్పటికిని ఆ పద్ధతిమారక నడచుచువచ్చుచున్నది. వాధూలగోత్రము ప్రధానమయినందున దాని మొదలుచేసికొని తక్కిన యారుగోత్రములవారును కందాడవారు అని వాడబడుచున్నారు. వీరిలో డెబ్బదినలువురైన సింహాసనాధిపతులలో పరిగణితులయిన మొదలియాండాన్, ముడుంబైనంబి, ముడుంబై అమ్మాళ్, వీరు నడాదూరివారు. ఆసూరి పెరుమాళ్లు, కిడాంబి పెరుమాళ్లు, కొమాండూరు ఇళయవల్లి యాచ్చాన్, వంగిప్పురత్తునంబి అను నీయేడుగురి సంతతివారే పదుగోత్రములవారు. ఈక్రమము పెరియజియ్యరు నియమనమును అనుసరించి యిప్పటికిని నడచుచు వచ్చుచున్నది.

పిమ్మట ఒకనాడు పెరియజియ్యరు పెరియపెరుమాళ్లను సేవించునప్పుడు తిరువాలవట్ట కైంకర్యము చేయుచున్న యుత్తమనంబి తిరువనంతాళ్వార్ల యవతారమయిన జియ్యరు దివ్యమంగళ విగ్రహచ్ఛాయనుగని అన్యథా శంకగలవారై స్వామిసన్నిధికి వేంచేసి చాలసేపు ఆయెనుగదా అని విన్నపముచేయగా పెరియజియ్యరు వారి యభిప్రాయమును తిరువుళ్లపట్టి మంచిదిస్వామీ ఇదిగో పనివినియెదను అని మఠమునకు వేంచేసిరి. అంతట ఆలవట్టము పట్టుకొని నిలిచిన ఉత్తమనంబి నిలిచినట్టే నిద్రాపరవశులై అచ్చటి కిటికీతలుపుపైని ఒరగిరి. అప్పుడు పెరియపెరుమాళ్లు అనంతాళ్వార్లనుజూపి వీరేనయ్యా పెరియజియ్యరూగా అవతరించినవారు అని యానతిచ్చినట్టు వారికి స్వప్నమయ్యెను. వెంటనే ఉత్తమనంబి కనువిచ్చిచూచి చాల భయపడినవారై తత్తరపడుచు మఠమునకు వేంచేసి పెరియజియ్యరును సేవించి అపరాధక్షమచేసికొనిరి.

పిమ్మట మరియొకనాడు శఠగోపకొర్త్తి అనబరగినయొక అమ్మంగారు పగలు గోష్ఠికలసినతోడనే తిరుమలై యాళ్వారు అను వ్యాఖ్యానమండపములో తిరుకాపులుచేర్చి యేకాంతముగా వేంచేసి, అచంచలవైభవముతో యోగమునందుండిన పెరియజియ్యరును తలుపులసందులగుండ సేవించి, వారితిరుమేను శ్రీయనంతాళ్వారి తిరుమేనువలె కానరాగా, ఆయమ్మంగారు దేహముమరచి నిలిచియుండెను. కొంతసేపటికి పెరియజియ్యరు యోగనిష్ఠమాని యెప్పటి ప్రాకృతశరీరముతో సేవసాదించి, తమ నిజవ్యక్తి తెలిసికొన్న అమ్మంగారునుబిలిచి నీవు ఇప్పటి నీయనుభవమును బహిరంగము చేయబోకుమని నియమించి పంపిరి.

ఇట్లు పెరియజియ్యరు మహావిభవముతో వేంచేసియుండగా, వారితిరుమేని తేజస్సువలనను, పెరియపెరుమాళ్లకు నిరతిశయ వైభవముకనబడ పరిచర్యచేయుటవలనను, దర్శన నిర్వా

హాకత్వమువలనను, తిరునగరిలో జలనిర్గమద్వారమున వెలువడుటవలనను, ఎరుంబి అప్పాకు చక్రవర్తి తిరుమగళ్ కలలో వీరివైభవము ఇట్టిదని యానతిచ్చుటవలనను, ఉత్తమనంబికి కలలో పెరియపెరుమాళ్లు కానిపించిన స్వరూపదర్శనమువలనను, పిమ్మట కొత్తియమ్మంగారు పట్టపగలే వ్యాఖ్యాన మండపమునందు సేవించుటచేతను పెరియజియ్యరు శేషావతారమే యను విషయము ఎల్లయెడలను ప్రసిద్ధముగా వాడబడనయ్యెను. ఇట్టి పెరియజియ్యరు ఒకనాడు తమతిరువడి నాశ్రయించిన ప్రపన్న గోష్ఠితోడ పెరియపెరుమాళ్లు వీరినికటాక్షించి మీరు రేపటినుండి మనపెద్దతిరుమండపములో తిరువాయిమొళి వ్యాఖ్యానములలో ముఖ్యమయిన ముప్పత్తారాయిరప్పడిని ప్రవచింపవలసినదని యానతిచ్చిరి. ఆయానతి శిరసావహించి పెరియజియ్యరు తిరుమండపములో గోష్ఠిచేయ నారంభింపగా పెరుమాళ్లు ఉభయనాచ్చిమారులతో పెరియతిరువడిపై వేంచేసి సేనముదలియారు ఆళ్వారాదులు మొదలుగాగల నిజపరిజన సమూహముతో సేవసాదించి, ముప్పత్తారాయిరప్పడి తొడక్కము చేయించి, అందువలని వైభవమును మహోహ్లాదముతో తిరువుళ్లపట్టి, ఇట్లు ఒక సంవత్సరకాలము కాలక్షేపము చేయవలసినది యని నియమించిరి.

ఇట్లు కాలక్షేపము నిరంతరాయముగా జరగుచురాగా శాత్తుమొరకు ముందునాడు కందాడయాండాన్, వానమామలజియ్యరు, పరవస్తు భట్టరుపిరాన్ జియ్యరు అను నీముగ్గురిలో ఒకరు రెండుపాదములును తక్కిన యిద్దరు రెండుపాదములునుగా పెరియజియ్యరు విషయమై ఒక తనియశ్లోకమును చేసికొనివచ్చి అతిరహస్యముగా నుంచుకొని, రేపు శాత్తుమొరకాగానే విన్నపము చేయుదము అని సంకల్పించుకొని యుండిరి. మరునాడు మునుపటివలెనే పెరియపెరుమాళ్లు గరుడవాహనా

రూఢులై అనంతకొత్తు పరిజనముతోడ పెరియ తిరుమండపము
నకు వేంచేసి సేవసాదించి, పెరియజియ్యరుకు అరుళప్పాడిడి
చాత్తుమొరకు నియమనముచేయగా, జియ్యరును చాత్తుమొర
నడపువారైరి. అప్పుడు కందాడయణ్ణన్ మొదలగువారు తమ
సంకల్పముచొప్పున తనియను విన్నపముచేయ ప్రయత్నపడుచుం
డిరి. అంతలో దివ్యమంగళవిగ్రహధారియై అయిదేండ్ల బాలకు
డొకడువచ్చి గోష్ఠిలోచొచ్చిపోయి పెరియపెరుమాళ్ల సన్నిధిని
నిలువబడి "శ్రీశైలేశదయాపాత్రం ధీభక్త్యాదిగుణార్ణవమ్।
యతీంద్రప్రవణంవందే రమ్యజామాతరంమునిమ్." అను శ్లోక
మును చెప్పి తటాలున మరిగిపోయెను. అందులకు ఆమహాగోష్ఠి
లోని వైష్ణవోత్తములందరు పరమాశ్చర్యమానసులై ఎవరికీ
తోచినట్లు వారు ముచ్చటింప నారంభింపగా, కందాడయణ్ణన్
మొదలయిన యాముగ్గురును అతిగోప్యముగా మనము సంక
ల్పించుకొనియున్న యీతనియను మనకంటె ముందుగావచ్చి
ప్రసిద్ధపరిచినందున ఈబాలుడు సర్వాంతర్యామియగు పెరియ
పెరుమాళ్లేగాని యితరుడుకాడు. మరియొకడు అగునేని అం
తలో మాయమైపోవునా అని విచారించి, తమయుద్దేశ్యమును,
పెరుమాళ్లు తిరువుళ్లపట్టిన ప్రకారమును చాలసంతోషముతో
జియ్యరుసన్నిధియందు ఎల్లవారువిన విన్నవించిరి. అంతట నం
బెరుమాళ్లు పెరియజియ్యరుకు తిరుప్పరివట్టము, తిరుమాల, శ్రీ
శఠారి మొదలుగాగల సన్నిధిమర్యాదలన్నియు కొరతలేకుండ
ననుగ్రహించి, పరమప్రీతితో శ్రీవైష్ణవగోష్ఠిసహితముగ సన్నిధి
యందు దివ్యగుణానుభవము చేయుచున్న పెరియజియ్యరును
కటాక్షించి, ఇదిమొదలు మనకోవెల మొదలుగాగల యెల్లదివ్య
దేశములందును దివ్యప్రబంధానుసంధానము చేయునపుడు తొ
లుత ఈతనియ అనుసంధింపబడవలసినది. అని నియమించిరి.
అదియాదిగా దివ్యప్రబంధాను సంధానమునకు ముందు ఈతని

యను అనుసంధించు సంప్రదాయము పంచగౌడము పంచద్రావిడము అను పదితెగలభాషలు వ్యవహరింపబడు దేశములయందంతటను ఈతనియ అనుసంధింపబడుచున్నది. దీనివివరణము మీద తెలియజేయబడును.

ఆకాలమునందు అయోధ్య రామానుజులు అను వారొకరు బదరికాశ్రమమునకు వేంచేసి, బదరీ నారాయణుని సేవించి తదీయ దివ్యగుణానుభవము చేయుచుండగా, ఆనారాయణుడు వారికి ప్రసన్నుడై యీతనియను ఉపదేశించెను. ఆయుపదేశము వలన వారు కృతార్థమ్మన్యమానులై రహస్యముగా ఈతనియను అనుసంధానము చేయుచు కొన్నాళ్లు అచ్చటనే యుండి, పశ్చాత దక్షిణ దివ్యదేశయాత్రాపరులై తిరుమలకువచ్చి; అక్కడ ఈతనియ వృత్తాంతమును విని మిక్కిలి యాశ్చర్యమునొంది, తమకు శ్రీమన్నారాయణు డుపదేశించుటను తలచుకొని తలచుకొని యానందించుచుండిరి.

ఈవిధముగా ఈతనియను తొలుత అణ్ణర్ మొదలగు ముగ్గురు సంకల్పించుకొన్న దనుటచే వారు సాధించిన దనియు, పెరియపెరుమాళ్లు బాలరూపమున సేవసాధించి యానతిచ్చినందున పెరిపెరుమాళ్లు సాధించినదనియు, బదరికాశ్రమునందు శ్రీబదరీనారాయణుడు సాధించినదనియు చెప్పబడుచున్నది. ఈన్యాయము ఇతిహాసపురాణాదులకును గలదు. ఎట్లు అనగా, పదునెనిమిది పురాణములును ప్రత్యేకము ఒక్కొక్క ఋషిచే నొక్కొకటి రచియింపబడెననియు, అన్నియు నొకవ్యాసునిచేత నేరచియింపబడినవనియు వక్తృభేదద్వారా వినబడుటను ఎల్లవారును అంగీకరించియున్నారు. ఇట్లే వేదకల్పనమును వాడబడుచున్నది. అట్లు ఈతనియను వక్తృభేదమువలన అనేకులచే నానతియ్యబడిన దనుట అసంభవముకాదు. కోయిల్ కందాడయణ్ణర్ చేసిన పదిపాటలలోను ప్రతివాది భయంకరం అణ్ణర్ చేసిన

పడికప్పు పాటలలోను ఈతనియను యొక్క వైభవము చెప్పబడియున్నది. ఇట్లు పెరియజియ్యరు పెరియ పెరుమాళ్లచే నాదరింపబడినవారై లోకాచార్యులు ఆనతిచ్చిన రహస్యములకు వ్యాఖ్యానములను మరికొన్ని సంప్రదాయ గ్రంథములను కావించిరి. అవి యేవియనగా:—

౧. రహస్యత్రయ వ్యాఖ్యానము.
౨. తత్వత్రయ వ్యాఖ్యానము.
౩. శ్రీవచనభూషణ వ్యాఖ్యానము.
౪. ఆచార్యహృదయ వ్యాఖ్యానము.
౫. పెరియాళ్వార్ తిరుమొళ్ళి వ్యాఖ్యానము.
౬. నూత్తందాది యర్థము.
౭. జ్ఞానసార వ్యాఖ్యానము.
౮. ప్రమేయసార వ్యాఖ్యానము.
౯. పళ్ళ్ పాట్టు వ్యాఖ్యానము.
౧౦. గీతాతాత్పర్య దీపము.
౧౧. తత్వత్రయ ప్రమాణకోటి
౧౨. ముప్పత్తారాయిరప్పడి ప్రమాణకోటి.
౧౩ ఉపదేశ రత్నమాల.
౧౪. తిరువాయిమొళ్ళి నూత్తందాది.
౧౫. యతిరాజ వింశతి.
౧౬. చాటుప్రబంధములు.
౧౭. చాటుశ్లోకములు.
౧౮. ఇయల్ చాతుబడి.
౧౯. ఆర్తిప్రబంధము.

ఇవిమొదలుగా అనేక గ్రంథములు రచియించిరి.

ఇట్లు నిఖిలచేతనోజ్జీవన నిర్వాహకులయి యుండి, పెరియజియ్యరు తమమఠమును దానిని సంబంధిన క్షేత్రములను శ్రీరంగ

నాథునికి సమర్పించి, తమభండారములోని సర్వద్రవ్యములను శ్రీ
రంగనాథుని భండారమునందు జేర్పించిరి. అంతట లోకనాథు
పెరుమాళ్ పిళ్ల అను వారు తమతిరువడి నాశ్రయింప రాగా
ఒంటరిగా వచ్చితివని వారిపై కోపించి ఆరునెలలు వారిని పరి
శోధించి, పిమ్మట కటాక్షించి, దీక్షపెంచి యున్నావేమి యడు
గగా వారు నిజమును విన్నపము చేసిరి. అది తిరుపుళ్లపట్టి నేటి
దినము నీవు దీక్షావిసర్జనము చేయుము అని యానతిచ్చిరి. వా
రును భాగ్యము అని యీవలవచ్చి తిరుముడి విళక్కము కావిం
చుకొని, అంతలో తమభార్య ప్రసవించి పదిదినములాయె నన్న
సమాచారము విని హర్షించిరి. ఆసంగతి విని అచ్చటి వారందరు
పెరియ జియ్యరుయొక్క సర్వజ్ఞత్వమునకు ఆశ్చర్య హర్షము
లను పొందిన వారలైరి.

అటుపిమ్మట పెరియజియ్యరు కంచి తిరుమల మొదలగు
దివ్యదేశములను సేవించువారై అణ్ణన్ మొదలుగాగల వారి
తోడ వెడలి కంచికి వేంచేసి తేవప్పెరుమాళ్లను సేవించి, కొ
న్నాళ్లు అచ్చట నివసించి, వైయాశి యుత్సవమునందు పేరరు
ళాళన్ పెరియ తిరువడిపై వేంచేసి గంగయిగొండ తిరుమండ
పమునకు వేంచేయునపుడు తామును మంగళాశాసనము చేయు
చు వెంబడి వేంచేయుచు, తిరుణాళ్లకై వచ్చియున్న యెఱుంబి
యప్పా ప్రమాదవశమున తమ్ముమాని పెరుమాళ్లను సేవించి,
వెంటనే యెచ్చరికపడి తమ్ము సేవించి తమ పురుషకారము వ
లన మరల పెరుమాళ్లను సేవించెను. అప్పుడు పెరియజియ్యరు
అప్పాకు తమయెడల గల ప్రతిపత్తికి హర్షించి, తిరుణాళ్లకడ
వెళ్ల సేవించి అయిన పిమ్మట, అప్పాను వెంటబెట్టుకొని తిరుప్పు
ట్కుళి శ్రీదాసిని ఘటికాచలమునకు వేంచేసి అక్కారియ సింగరిని
మంగళాశాసనముచేసి, అందుండి యెఱుంబికి వేంచేసి, ఆయూ
రికి వడతిరువరంగమునియు, అచ్చట తిరుకోవలనికి తిరుక్కావేరి

యనియు, అప్పాను అప్పగియ మణవాళదాసులు అనియు కృపయాతిరునామములు సాతి, అందుండి, తిరుపతికి వేంచేసి, ఉడయవరును గోవిందరాజులను అచ్చట ప్రతిష్ఠితులయియున్న పన్నిద్దరాళ్వారులను సేవించి, తిరుమలయెక్కి, అచ్చటి జియ్యంగార్లు మొదలగు వారు ఎదురువచ్చి సేవింపగా వారినెల్లను ఉపలాలించి, సేవాక్రమమున కోవెలకు వేంచేసి తిరువేంగడముడయని సేవించి, ఎల్ల మర్యాదలతోడ తీర్థప్రసాదములను పరిగ్రహించి, కోవెల కార్యములను నిర్వహింప ఇళంగేళ్వి యెంబెరుమానారు జియ్యరు అను వారిని నియమించి, అందుండి వెడలి తిరువెవ్వళూరు, తిరునిన్రయూరు, తిరుమళ్ళిశై, పచ్చైవారప్పెరుమాళ్ కోవెల, పూవిరుందవల్లి, తిరువల్లికేణి, తిరునీర్మల, శ్రీపెరుంబూదూరు మొదలుగాగల దివ్యదేశములను సేవించుచు మరల పెరుమాళ్ల కోవెలకు వేంచేసి, పేరరుళాళని మంగళాశాసనముచేసి, శ్రీమధురాంతకమునందు చక్రవర్తి త్తిరుమగనారును వకుళవృక్షమును సేవించి, తిరువహీంద్రపురమునకు వేంచేసి దేవనాయకుని సేవించి, తిరువాలి నగరిలో తిరుమంగయాళ్వార్లను, తక్కిన తిరుపతులను సేవించి, తిరుకణ్ణపురమునకు వేంచేసి శౌరిరాజును సేవించి, అందుండి దక్షిణపు దిక్కునకు వెడలి శ్రీమన్నైనారును మంగళాశాసనము చేసి "మాసరుశోద" అను ప్రబంధమును నిత్యానుసంధానము చేయునట్లు నియమించి, తిరుక్కుడంధై (కుంభకోణము) మొదలయిన తిరుపతులను సేవించుచు మరల శ్రీరంగమునకు వేంచేసి, యతిరాజులను పెరియపెరుమాళ్లను సేవించి, తామచ్చటచ్చట సంపాదించుకొని వచ్చిన దివ్యాభరణములను ఛత్రచామరాదులను రంగనాథునికి సమర్పించి మఠమునందు ఎప్పటివలె నెలకొనిరి.

అనంతరము ఎఱుంబి యప్పా తమయాచార్యులైన పెరియ జియ్యరును ఎడబాసి యుండనేరక వారి దినచర్యలను అనుసం

ధ్యానము చేయుచు దినచర్యయనెడి ప్రబంధమొకటి రచియించి జియ్యరు సన్నిధికి కొనివచ్చి సమర్పింపగా జియ్యరు కటాక్షించి ఆచార్యులయెడల అప్పాకుగల నిష్ఠావిశేషమునకు చాలహర్షించి అప్పాను తమసన్నిధియందు వ్యాఖ్యానగోష్ఠిలో నుండ నియమించిరి. ఆకాలమునందు కందాడ యణ్ణన్ తిరుమాళిగ కలిమియంతయు అళగియ సింగరి యారాధన విషయమున వెచ్చపడి నానాటతగ్గుచు వచ్చుచుండెను. ఆవిషయమును పెరియజియ్యరు తిరువుళ్ళపట్టి తిరుమనెకానికగా తమకు వచ్చు ధనమంతయు ప్రతిదినమును కందాడ యణ్ణనికి ఇచ్చునట్లు నియమించిరి. మరి కొన్నాళ్లకు ఎరుంబిఅప్పాకు తమ తిరుమేనువలె నొకయర్చావిగ్రహమును ప్రసాదించి ఆయనను ఊరికిపొమ్మని నిర్బంధింపగా ఆయన విధిలేకపోయి యెరుంబిచేరెను.

పిమ్మట అళగియవరదర్ అనబరగిన రామానుజజియ్యరు వానమామల శ్రీకార్యమునకు నియమితులై జియ్యరువలన శ్రీరంగనాథుని తిరువారాధనముగాబడసి వానమామలకు వేంచేసిరి. అందువల్ల వారికి వానమామల రామానుజజియ్యరు అను తిరునామముకలిగెను. అటుపిమ్మట పెరియజియ్యరు గోవిందదాసరప్పగారిని చాలసన్మానించి వారికి అళగియ మణవాళని తిరువారాధనముగా ననుగ్రహించి పంపగా, వారు శ్రీవిల్లిపుత్తూరిలో ఆండాళు ఉత్సవమును క్రమముగా నడపుచు తిరువాడిప్పూరమునాడు (ఆషాఢ పుబ్బనక్షత్రము) ఆండాళు తీర్థప్రసాదములను శ్రద్ధాభక్తులు తెలియబడ కొనివచ్చి సమర్పింపగా, పెరియజియ్యరు తిరువుళ్ళపట్టి, ఆండాళుకు ప్రియముగా, ఆగోవిందరాజరప్పగారికి భట్టరుపిరాన్ దాసులు అని తిరునామముచాతిరి. అంతట వారు జియ్యరుసన్నిధిని పరమవినీతులై యాశ్రమ స్వీకారముచేసికొని భట్టరుపిరాన్ జియ్యరు అను తిరునామమును వహించిరి.

తరువాత పెరియజియ్యరు నవమ్మాళ్వార్లను సేవింపగోరి పెరియపెరుమాళ్ల యానతిని శ్రీరంగమునుండి వెడలి మధురకు వేంచేసి, కూడలళ్గరును మంగళాశాసనముచేసి, నాడు అచ్చట నివసించి, అప్పుడాదేశపు రాజైన మహాబలివాణరాయడు వచ్చి తమతిరువడి నాశ్రయింపగా, అతనికి పంచసంస్కారము సాధించి, అందుండి మరునాడు తెల్లవారుజామున ప్రయాణమై వేంచేయగా, ఆదేశపురాజు వారు ఎక్కిన తిరుపల్లకినివహించుచు శ్రీవైష్ణవులలో మారువేషముతో కలసి రెండామడదూరముపల్లకి మోసుకవచ్చి వైఘానదిగట్టుచేర్చి, అప్పటికి చక్కగా తెల్లవారినందున అనుష్ఠానమునిమిత్తము జియ్యరు పల్లకినుండిదిగగా, రాజుమొలను కాసెకట్టును దేహము నందంతట చెమటయు గలవాడై వచ్చి దండముసమర్పించి, తన గురుభక్తికి చాలమెచ్చుకొనునట్లు అప్పుడు తాముదిగినచోటైన ముత్తరుసు అనుగ్రామమును సమర్పింపగా, జియ్యరు పరిగ్రహించి, దానికి అళ్గియమణవాళ నల్లూరు అనిపేరుపెట్టి, ఆరాజును సన్మానించి వెనుకకుబంపి, తిరుప్పుల్లాణిమార్గముగా వేంచేయుచు ఎండవేండ్రమునకు సహింపలేక సన్నిధివైష్ణవులు తల్లడిల్లుటను తిరువుళ్లపట్టి పరపైన కొమ్మలుగల యొకపెద్ద చింతమ్రానినీడను కొంతసేపువిశ్రమించి వడతీర్చుకొని, అందుండి లేచిపోవునపుడు వైష్ణవుల వేడుకోలున నావృక్షమును తమశ్రీహస్తములచేనిమిరి నీవు నిత్యపదవిని పొందుదువుగాకయని ఆనతిచ్చిరి. అంతట చూచువారు ఆశ్చర్యము నొందునట్లు ఆచెట్టులోని యాకులన్ని రాలి యెండిపోయెను. అట్లు ప్రయాణముసాగించి తిరునగరికి వేంచేసి ఆళ్వార్లను మంగళాశాసనముచేసి, అందుకొన్నాళ్లునివసించి, అందుండి కదలి శ్రీపిల్లిపుత్తూరికి వేంచేసి వటపత్రశాయిని సేవించి, తిరుమాలిరుంజోలెకు వేంచేసి మూలవరును మంగళాశాసనముచేసి, కలహములవలన అళ్గరు తిరుక్కురుంగుడిలో

యనుజ్ఞపడసి గోవిందభట్టరు పెరియతిరుమల నంబిగారి సన్ని ధికి వేంచేసి దండముసమర్పింపగా వారుగోవిందభట్టరును దగ్గర చేర్చక వరల ఎంబెరుమానారు సన్నిధికిపొమ్మని నియమించిరి. అనంతరము ఎంబెరుమానారు గోవిందభట్టరును మిక్కిలియాద రించి తమతిరువడుగులందు అచంచలభక్తికలుగ ననుగ్రహించి, వారిని వెంటబెట్టుకొని శ్రీరంగమునకు వేంచేసిరి. అటుపిమ్మట గోవిందభట్టరు పరమవిరక్తులై యెంబెరుమానారు సన్నిధిలో సముచిత కైంకర్యపరులై వేంచేసియుండిరి. అంతట ఎంబెరు మానారు వారివైరాగ్యమునకు అనుగుణముగా సన్యాసాశ్ర మము నుస్వీకరింపజేసి, తమతిరునామము నే చాతగా, వారు తిరుమేను గడగడ వడకగా స్వామీ అడియడు దేవరవారితిరు నామమునువహింప నర్హుడనగుదునా, ఈయచేతనునియెడలకటా క్షించి తగినపేరుసాదించి కడతేర్పవలయునని ప్రార్థించిరి. అం తట శ్రీరామానుజయతీంద్రులు ఎంబెరుమానారు అను తిరునా మమునందు ఆద్యంతవర్ణములను సంగ్రహించి ఎంబారు అని తిరు నామముచాతిరి.

పిమ్మట ఒకనాడు కొందరు దేశాంతరులగు భాగవతులు వచ్చి యెంబెరుమానారుమఠము ఏదియని యచ్చటి శ్రీవైష్ణవు లను అడుగగా వారు ఏ యెంబెరుమానారు మఠమని అడిగిరి. అందులకు ఆభాగవతులు ఇదియేమి వింతమాట వింటిమి. ఎంబె రుమానారు ఒకరుగాక మరియెందరున్నారు అని సంశయించు చుండగా, అచ్చటి శ్రీవైష్ణవులు అరుళాళప్పెరుమాళెంబెరు మానారు ఒకరు ఉన్నారుగనుక ఏయెంబెరుమానారని అడిగితి మని మఠమునుచూపిరి. ఈవృత్తాంతము అరుళాళప్పెరుమా ళెంబెరుమానారువిని మనమును ఒకమఠము కల్పించుకొనియుం డుటచేతగదా యిట్టి సంశయము సిద్ధించెను అని, తమమఠమును

నాటి అను వారిని తోడుచేసికొని నాలుగుపదుల కొలది వ్యా
ఖ్యానమును ఆనతిచ్చిరి.

అప్పుడు చాల పసివాండుగా నుండిన కందాడైనాయన్
అచ్చటికి వేంచేసి జియ్యరు వ్యాఖ్యానమును పెరియ వాచ్చాం
బిళ్లె వ్యాఖ్యానములో "శేషధరనామ్" అనునది తొలుమాట
గాగల పాశురము మొదలుకొని పదిపాశురముల వ్యాఖ్యానము
ను చదివిచూచి, జియ్యరుతో స్వామీ దేవరవారు సాధించిన
యీనలువది పాశురముల వ్యాఖ్యానము విశేషించినదై యున్న
దేయని విన్నపము చేయగా, జియ్యరు సంతోషించి నాయనును
వీరొక యవతార విశేషమని బిగ్గర కౌగిలించుకొని, అంతట
తిరుప్పాణాళ్వార్ తాదానయనారుకు పిళ్లెలోకాచార్యుల తిరు
వారాధనమయిన శ్రీరంగనాథుని నిచ్చిపంపి, తోడనే ఆచార్య
హృదయమునకును వ్యాఖ్యానముచేయ తిరువుళ్లపట్టి, తిరుమేని
యాయాసమును పాటింపక పీఠమునందు ఒరగి వేంచేసియుండి
మొదలునొవ్వగా తాళపత్రములలో లిఖింపనారంభింపగా, కం
దాడయణ్ణన్ చూచి, దేవరవారికి ఇంతప్రయాసపడ నేలయని
అడిగిరి. అందులకు జియ్యరు మీపుత్రాదులకొరకు అని యాన
తిచ్చి వ్యాఖ్యానమును కడవెళ్లవ్రాసి ముగించి, పరమతనిరసన
పూర్వకముగా స్వమతస్థాపనమును గావించిరి.

అప్పుడు తిరుమలనంబి తిరువంశస్థులయిన వేట్టూరి సింగరా
చార్యులు అనువారు జియ్యరు తిరువడి నాశ్రయించిరి. జియ్య
రును వారినంగీకరించి పంచసంస్కారాదులచే పరిశుద్ధులనుగా
జేసి వారిమూలమునవచ్చిన ధనమును ఆళ్వారు తిరుగోపుర
కైంకర్యమునకై తిరునగరికిబంపి, కొంచెము కొరతపడగా తమ
మనుమలైనజియ్యరునయనారుగుండ కైంకర్యపూర్తిచేయించిరి.

ఇట్లు తిరుక్కురుంగుడి మొదలగు దివ్యతిరుపతులలో జి
య్యరు ఉద్ధరించిన విమానగోపుర మండపప్రాకారాదులతోను

వారిచే నియమితులైన కార్యకర్తలకోను, వారు నియమించిన నియమనములు ఇప్పటికిని వెలుగొందుచున్నవి. లెక్కలేని యాచార్యపురుషులకు ఆశ్రయమయిన పెరియజియ్యరు తిరువడినాశ్రయించినవారిలో వానమామలై జియ్యరు, తిరుమల యెంబెరుమానారు జియ్యరు, భట్టర్ పిరాన్ జియ్యరు, కోయిల్ కందాడయణ్ణన్, ఎఱుంబియిల్ అప్పా, అప్పిళ్ళ, అప్పిళ్ళార్, ప్రతివాది భయంకరం అణ్ణన్ అనునీ యెనమండ్రును అష్టదిగ్గజములు అనబడుదురు. వీరిలో కోయిల్ కందాడయణ్ణన్, ప్రతివాది భయంకరం అణ్ణన్ అను నీయిరువురను జియ్యరు తమమనుమలైన జియ్యరునయనారుకు ఈడు ముప్పత్తారాయిరప్పడిని శ్రీభాష్యమును సాధింప నియమించిరి.

ఇట్లు పెరియజియ్యరు, లోకులందరు తమ తిరువడి నాశ్రయించియు, తమవలన నుపదేశములను పడసియు, తమకటాక్షమునకు గురియయ్యు, తమ తిరుమేనిని సేవించియు, తమ తీర్థప్రసాదములను స్వీకరించియు, తమ తిరువడియందు ఆత్మసమర్పణము చేసియు, తమ తిరునామము ననుసంధించియు, తమ దైన దివ్యకల్యాణగుణానుభవము చేసియు, తాము ఉండుదిక్కును గూర్చి దండము సమర్పించియు, తమదివ్య వైభవమును స్మరించియు, తమ సేవకులకు సేవకులైనవారి సంబంధమును కలుగజేసికొనియు, తమ పాదధూళిసోకిన పూరేకులను శిరసావహించియు, ఉజ్జీవించునట్లు చేసి, దూరస్థులు సమీపస్థులు మాధ్యస్థులు నగు సమస్తులును నానందించునట్లు పెరుమాళ్ల నియమనము చొప్పున తమయవతారకార్యమును నెరవేర్చినవారై పెరియ జియ్యరు పరమపదమునకు వేంచేయు తిరువుళ్ళముతో తిరుమేనియందు నోవుచాటుకొనిరి.

అప్పుడు పెరియపెరుమాళ్లు తిరుత్తేరెక్కి మఠము వాకిటికి వేంచేసి సేవసాధింపగా, జియ్యరు ఆయేలినవాని సేవించి తమ

మహాస్తేపర కొనియాడిరి. అనంతరము మఱియొకనాడు జియ్యారు తత్తరించుచుండగా, నంబెరుమాళ్లు మఠద్వారమునకు వేంచేసి సేవసాదించి జియ్యారు నానందింపజేసిరి. అటుపిమ్మట వానమామల జియ్యారు మొదలగువారికి శ్రీముఖములుపంపి వారందరువచ్చి సన్నిధిలో సేవించుచుండగా, జియ్యారు తిరుమేనునందు రుగ్మత కొంతశమించినట్లు తోచెను. అంతట వానమామల జియ్యారు శ్రీకార్యావసరమువలన మరల సేవింపవచ్చెదనని జియ్యారుతో విన్నపముచేసి వారియానతిచేతనే వానమామలకు వేంచేసిరి. మరి రెండు మూడు నాళ్లలో జియ్యారుకు పరమపదవాంఛ మిక్కుటమై అందువలని యార్తిని అరువదిపాశురములుగల ప్రబంధముగా ఆనతిచ్చిరి. అదియే యిప్పుడు ఆర్తి ప్రబంధమని వ్యవహరింపబడునది. అప్పుడు పశ్చిమదేశవాసులగు తోళప్పరును, వారి యన్నగారగు అళగియ మణవాళప్పెరుమాళ్ నయనారును, భట్టర్పిరాన్ జియ్యారుయొక్క పురషకారమువలన పెరియజియ్యారును సేవించి వారిమూరుగా తిరునారాయణపురమునందు నిత్యనివాసమును ప్రతిష్ఠించిరి. వెంటనే తిరుమలనల్లాన్ వంశస్థులును పరమతఖండన ప్రచండులును తిరువేంగడముడయానికి పురోహితులును మహాప్రభావ సంపన్నులునైన అణ్ణరాయ చక్రవర్తి అనువారు భట్టర్పిరాన్ జియ్యారు పురుషకారముచేతనే పెరియజియ్యారును సేవించి, వారి తిరువడుగులు తమతిరుముడిపై జేర్చి, మీరు మనతిరుమల యెంబెరుమానారు జియ్యారును తిరువేంగడమును ఆదరముతో కాపాడుచు మనదర్శన ప్రవర్తనమును లెస్సగా నిర్వహించినవారు కారా అని యానతిచ్చి, భట్టర్పిరాన్జియ్యారు శ్రీహస్తద్వారా పంచసంస్కారములను ప్రసాదించి ప్రపత్తినిష్ఠులను జేయగా కృతార్థులయిరి. పిమ్మట పిళ్లాన్, జియ్యారునయనారు తుయిరువురును పెరియజియ్యారు తిరువడుగులను సేవించి, దేవరవారి

దివ్యమంగళ విగ్రహమును అస్మదాదులకు అర్చా విగ్రహముగా ననుగ్రహింపగోరెదము అని ప్రార్థింపగా జియ్యరు పరమపద యాత్ర నాలుగుదినములు కలదనగా పెద్దగోష్ఠిగూర్చి నాలుగు వేల దివ్యప్రబంధమును అనుసంధింపజేసి హర్షించి, సన్నిధి శ్రీ వైష్ణవుల కందరకును హితమునుపదేశించి, తమ తిరువారాధన మాయిన ఉడయవరును, శ్రీరంగరాజులను, శ్రీకోశములను నంబెరు మాళ్ల యధీనముచేసి, లోకాచార్యుల తిరువడిని తిరువుళ్లము నందు నెలకొలిపి, రుధిరోద్గారినామసంవత్సర మాఘ బహుళ ద్వాదశీనాడు శ్రవణనక్షత్రమున పరమపదమునకు వేంచేసిరి. ఈ లీలావిభూతియందు వీరు వేంచేసియున్న తిరునక్షత్రములు డెబ్బదియారు.

ఇది మణవాళ మహామునుల వైభవము.

---

## శ్రీ మణవాళ మహామునుల పరమపదయాత్రానంతర వృత్తాంతము.

అట్లు పెరియజియ్యరు పరమపదమునకు వేంచేసిన పిమ్మట వారి నాశ్రయించియున్న శ్రీవైష్ణవోత్తము లందరు పూర్వము ఉడయవరుకు శ్రీపరాశరభట్టరు మొదలగువారు నడపిన రీతిని మహావైభవముతో జియ్యరు నయనారుగుండ వారికి చరమ కైంకర్యము నడపినవారై, ఆదికేశవప్పెరుమాళ్ల తిరువడికి దిగు పత్తుగాను దక్షిణపు తలయంపిగాను తిరుపళ్లి పరపించిరి. అంతట జియ్యరు నయనారు కందాడయణ్ణన్ మొదలగు వారి తోడ శిష్యకృత్యము ననుసరించి తిరుముడివిళక్కము కావించు కొని అవభృథస్నానమును చేసిరి. పిమ్మట చేయవలసిన వైదిక క్రియలన్నియు జియ్యరు నయనారు యథావిధిగా నడపి, కడపట వారి వైభవమునకు దగినట్టు మహాగోష్ఠితో తిరువధ్యయనమును చేసి, నంబెరుమాళ్ల సన్నిధినుండి వచ్చిన తిరుమాల తిరుప్పరివ

తోను వెండితోను చేయబడిన పాత్రములకంటె రాతితో చేయబడిన పాత్రము విశేషముకాబట్టి జియ్యరు తిరువుళ్లమునకు ఆ రాతితొట్టియే ప్రీతికరముగా నుండెను. ఇట్లు పెరియజియ్యరు వైభవము ఉడయవరు వైభవమును భట్టరు వైభవమును బోలి పూర్వికులచే గ్రంథములందు మిక్కిలి విస్తరించి వ్రాయబడియున్నది. ఇందు అది సంక్షేపముగా వ్రాయబడినది.

## గురుపరంపరా సంగ్రహము.

పెరియపెరుమాళ్లు మొదలు పెరియజియ్యరు తుదిగాఁగల గురుపరంపరాక్రమము—పెరియపెరుమాళ్లు, పెరియపిరాట్టి, సేనమొదలియారు, నమ్మాళ్వారు, నాథమునులు, ఉయ్యక్కొండారు, మణక్కాల్ నంబి, శ్రీయాళవందారు, పెరియనంబి, ఉడయవరు, ఎంబారు, భట్టరు, నంజియ్యరు, నంబిళ్ల, వడక్కుత్తిరువీధిపిళ్ల, పిళ్లలోకాచార్యులు, తిరువాయిమొళిపిళ్ల, పెరియజియ్యరు. ఇది లోకమునందు ముఖ్యతమమగు గురుపరంపర. ఇక డెబ్బదినలుగురు సింహాసనాధిపతుల వంశస్థులకు ఉడయవరుకు పిమ్మట ఆశ్రయణ గురుపరంపరలు వేరు వేరుగా గలిగియుండును. ఈగురుపరంపర ఆశ్రయణ గురుపరంపర గ్రంథగురుపరంపర అని రెండువిధములై యుండును. అందు గ్రంథ గురుపరంపర రహస్యగ్రంథ గురుపరంపర, దివ్యప్రబంధ వ్యాఖ్యాన గురుపరంపర, శ్రీభాష్య శ్రుతప్రకాశికాది గురుపరంపర అని మూఁడువిధములు గలదైయుండును. అందు రహస్యగ్రంథ గురుపరంపర, ఉడయవరు, ఎంబారు, నంజియ్యరు, నంబిళ్ల వడక్కుత్తిరువీధిప్పిళ్ల, పిళ్లలోకాచార్యులు, కూరకులోత్తమదాసులు, తిరువాయిమొళిప్పిళ్ల, పెరియజియ్యరు. దివ్యప్రబంధ వ్యాఖ్యాన గురుపరంపర - ఉడయవరు, తిరుక్కురుగైప్పిరాన్పిళ్లాన్, ఎంబారు, భట్టరు, నంజియ్యరు, నంబిళ్ల, ఇయ్యుణ్ణిమాధవాచార్యులు, ఇయ్యుణ్ణి పద్మనాభులు, కోలవరాహనయనారు, నాలూరి దేవరాజులు, తిరు

వాయిమొళిప్పిళ్ళై, పెరియజియ్యరు. ఇందు ఉడయవరు ఎంబారు అని క్రమము చెప్పబడెను. పిళ్లాన్, ఆళ్వాన్ ఈ యిరువురును ఉపకారకతనుపొంది అందు అణగియుందురు. భట్టరు, నంజియ్యరు, నంబిళ్లై, పెరియవాచ్చాంబిళ్లై, వారికొమారులు నయనారాచ్చాంబిళ్లై, వాదికేసరి, అళ్గియమణవాళజియ్యరు, వారిశిష్యులు తిరుమాలెయాండాన్ తిరువంశస్థులయిన వాదికంఠీరవులు. ఇత్యాదిగా ఒక అవాంతర విభాగమునుగలదు. ఇందు నయనారాచ్చాంబిళ్లై రచియించిన ప్రబంధములు - ముక్తభోగావలి, తత్వసంగ్రహము, జ్ఞానార్ణవము, చరమోపాయనిర్ణయము, మొదలగునవి యనేకములు. వాదికేసరి రచియించిన ప్రబంధములు - తిరువాయిమొళికి పన్నిరాయిరప్పడి, తాత్పర్యసారము, తత్వదీపము, మొదలైనవి యనేకములు. వాదికిరీరవులు. రహస్యత్రయసారము అను గ్రంథమును సాధించిరి.

శ్రీభాష్యగురుపరంపర - ఉడయవరు, ఎంబారు, భట్టరు, నంజియ్యరు, నంబిళ్లై, వడక్కు_త్తిరువీధిప్పిళ్లై, పిళ్లైలోకాచార్యులు ఇత్యాదిగా ఒకక్రమముగలదు.

ముందు ఉడయవరు మేనల్లురై వారివలన శ్రీభాష్యసింహాసనాధిపత్యమును వహించిన నడాదూరాళ్వాన్ మనుమలైన నడాదూరమ్మాళుకు తాతగారైన నడాదూరాళ్వాన్ సంప్రదాయముతప్పి ఎంగళాళ్వాన్ అనబడు శ్రీవిష్ణుచిత్తుల సన్నిధిని శ్రీభాష్య సంప్రదాయము లభించెను. అదియెట్లు అనగా, మ్మాళు శ్రీభాష్యమును అధికరింపగోరి తనతండ్రికి తల్లివంక బంధుత్వమున అన్నగారయిన కందాడయాండాన్ సన్నిధికిపోయి అడియనికి పరమత నిరాకరణప్పడియు స్వమతస్థాపనప్పడియు ననుగ్రహించి శ్రీభాష్యమును ప్రసాదింపవలయునని ప్రార్థింపగా, మిగుల వృద్ధులయిన కందాడయాండాన్ నీకు నీ మేనమామగారగు శ్రోత్రియన్ (విష్ణుచిత్తులు) విశదముగా భాష్యము చెప్ప

మరు వారియొద్దకుపొమ్మని యానతిచ్చిరి. అమ్మాళును వారి యానతిచొప్పున శ్రీవిష్ణుచిత్తుల సన్నిధికి వేంచేసి తన యభీష్టమును విన్నవింపగా, వారు అనపత్యులుగనుక నీవు నాకు పుత్రత్వమునువహించి అగ్నిసంస్కారాది చరమక్రియలు చేసెడు పక్షమున నీయిష్టమును నెరవేర్చెదను అని ఆనతిచ్చిరి. అమ్మాళు అందులకు సమ్మతించి వారిసన్నిధిలో శ్రీభాష్యమును అధికరించిరి. కాబట్టి ఉడయవరు, తిరుక్కురుగైప్పిరాన్‌పిళ్లాన్, ఎంగళాళ్వాన్, నడాదూరమ్మాళ్, కిడాంబియప్పుళ్లార్, తూప్పిల్ పిళ్లయనబడు వేదాంతాచార్యులు, తూప్పిల్ నయనారాచార్యులు, ప్రతివాది భయంకరం అణ్ణన్ పోళిప్పాక్కం నయనార్ •అని ఇదియొక పరంపరకలిగెను. ఇందు పిళ్లాన్ తిరువాయిమొళికి ఆరాయిరమును, పరమపద రహస్యము అనెడు రహస్యగ్రంథమును రచియించిరి. శ్రీవిష్ణుచిత్తులు (ఎంగళాళ్వాన్) శ్రీవిష్ణుపురాణ వ్యాఖ్యానమును, సారాంశ చతుష్టయమనెడు రహస్యమును, శ్రీభాష్యమునకు సంగతిమాల అనెడి వ్యాఖ్యానమును చేసిరి. నడాదూరమ్మాళు తత్వసారము, ప్రమేయమాల, సారార్థ చతుష్టయమును కారికలు మొదలగు ప్రబంధములను చేసిరి. అప్పుళ్లార్ శ్రీభాష్యమునకు ఒక వ్యాఖ్యానమును, న్యాయకులిశమ్ అను గ్రంథమును రచియించిరి. ఈ యప్పుళ్లార్ తమ తోడబుట్టువు కొమారులైన తూప్పిల్ పిళ్లను తాము శ్రీభాష్య కాలక్షేపము చేయుచోటికి పిలుచుకొని పోగా, అప్పుడా తూప్పిల్ పిళ్లను నడాదూరు అమ్మాళ్ చూచి వీరు దర్శనమునందు అభివృద్ధులు అగుదురు అని ఆనతిచ్చిరి. పిమ్మట తూప్పిల్ పిళ్ల శ్రీహయగ్రీవోపాసనచేసి సకలశాస్త్రార్థములందును అతి నిపుణులై అప్పుళ్లార్ తిరువడి నాశ్రయించి సకల రహస్యములను అధికరించి కవితార్కికకేసరి అనియు, సర్వతంత్ర స్వతంత్రులు అనియు, వేదాంతాచార్యులు అనియు

తిరునామములను వహించి అనేక గ్రంథములను రచియించిరి. వానిలో పిళ్లాన్ సాదించిన ఆరాయిరప్పడికిని, పరమ రహస్యమునకును, తక్కిన పూర్వాచార్యులు సాదించిన గ్రంథములకును విరుద్ధముగా మంత్ర వ్యాఖ్యానాదులు కొన్ని యేర్పడినందున పెరియ పెరుమాళ్లకు తిరువుళ్లముకలిగినది అను నిది మొదలగు వృత్తాంతము మునుపు చెప్పబడియే యున్నది గనుక ఇచ్చట ఆ విషయమును చెప్పక విరమింపనయ్యెను. ఈ వేదాంతాచార్యుల కొమారులగు తూప్పిల్ నయనారాచార్యులును అనిర్వచన ఖండన విరోధపరిహారాది గ్రంథములనుచేసి శ్రీరామానుజ సిద్ధాంత విషయాధీనులై వేంచేసియుండిరి. ప్రతివాది భయంకరం అణ్ణన్ అను వారును అష్టశ్లోకి వ్యాఖ్యానము మొదలయిన యనేక గ్రంథములను కావించిరి.

ఇదిగాక డెబ్బదినలుగురు సింహాసనాధిపతుల వంశస్థులకు వారివారి కూటస్థులనుబట్టి శ్రీభాష్య పరంపరలు భిన్న భిన్నములుగా నేర్పడియుండును. నడాదూరు అమ్మాళ్ హస్తిగిరి యుపత్యకయందు శ్రీభాష్యమును నిర్వహించుచుండగా శ్రీరంగమునుండి శిష్యసంచారముచేయుచు సుదర్శనభట్టరు అచ్చటికివచ్చి, అమ్మాళ్ భాష్యనిర్వాహము చేయువిధమును జూచి హర్షించి, వారిసన్నిధిలో భాష్యమును అధికరించువారై సంచారము పోవుటను నివర్తించుకొని పండ్రెండు సంవత్సరములు దీక్షపట్టి అంతలో శ్రీభాష్యమును పదిమారులు విన్నవారైరి. ఆకాలమునందు వారు అర్థభేదములను శబ్దభేదములను పరిశీలించి ఒకటితోనొకటి పొందియుండునట్లు రహస్యముగా దిద్దుకొనుచు మౌనముగా వినుచుందురు. ఇట్టి వీరిసామర్థ్యమును అమ్మాళు తెలిసియుందురు. అట్లుండగా, ఒకనాడు కాలక్షేపగోష్ఠికి సుదర్శనభట్టరు ప్రొద్దుపోయి వేంచేసిరి. వారు వేంచేయునంతలో అమ్మాళు భట్టరు ఏలరాలేదని తక్కినవారిని అడిగిరి. అందుకు

వారి మౌనరీతి యిట్టిదని తెలియనివారగు అప్పుళ్లార్ మొదలగు వారు అతినిపుణులుగదా అని వారియెడల కొన్నిదోషములను ఉగ్గడించి విన్నవింపగా, అమ్మాళు ఊరకవినుచుండి భట్టరు వేంచేయగానే, మావల్ల విన్నవిషయము లేమైనమీకు తెలిసియున్నయెడల కొన్నిటిని ఉపన్యసింపుడు అని వారితో ఆనతిచ్చిరి. అంతట సుదర్శనభట్టరు, తామధికరించినది సర్వమును పూర్వోత్తర సందర్భములు చెడకుండను శబ్దములయు అర్థములయు సంబంధము పొసగియుండను మహాధాటితో నుపన్యసింపగా అమ్మాళును తక్కినవారును కర్ణానందముగావిని వారిసామర్థ్యమునకు నాశ్చర్యమొందిరి.

అటుపిమ్మట సుదర్శనభట్టరు అమ్మాళు నియమనమును పడసి శ్రీరంగమునకు వేంచేయగా పెరియపెరుమాళ్లు, వారికి అరుళప్పాడు సాదించి శ్రీవేదవ్యాసులని తిరునామముచాతి శ్రీభాష్యమునకు ఒకవ్యాఖ్యానము చేయ నియమించిరి. ఆనియమనమును శిరసావహించి సుదర్శనభట్టరు తాము ఆచార్యసన్నిధిలో శ్రవణముచేసిన యర్థమునెల్ల వ్యాఖ్యానరూపమునను ప్రకాశింపజేసి, ఆకోశమునకు శ్రుతిప్రకాశిక అని తిరునామముచాతిరి. అనంతరము శ్రుతదీపికయని శ్రీభాష్యమునకొక లఘువ్యాఖ్యానమును, వేదాంతసంగ్రహ దీపికయు, గద్యత్రయవ్యాఖ్యానమును, ప్రపత్తిప్రయోగకారికయు భాగవత వ్యాఖ్యానము మొదలగునవియు చేయబడెను.

అప్పుడు తూప్పిల్ పిళ్ల ఆశ్రుతప్రకాశికా భట్టరు తిరుమాళిగకుపోయి వారిపుత్రులయిన ఉద్దండభట్టరునడిగి యాకోశమును తీసికొని సంతుష్టినొంది, వెంటనే శ్రుతప్రకాశికా భట్టరుసన్నిధిలో ఉభయవేదాంతములను అధికరించి, జ్ఞానాది షడ్గుణ పరిపూర్ణులై పరమత నిరసన సమర్థులగుటచే ఉద్దండులనివాద గోష్ఠిలో ప్రసిద్ధివహించిన శ్రుత ప్రకాశాచార్యుల కొమారులైన

ఉద్దండభట్టరు సహాయులుగా పశ్చిమదేశమునకు వేంచేసి, సంప్రదాయశుద్ధిగల ఆయుద్దండ భట్టరు సన్నిధిలో శ్రుతప్రకాశికను అధికరించి పెక్కుప్రతులు వ్రాయించి వానిని యోగ్యులగు వారియెడల నుపయోగింపగా ఆసంప్రదాయము చొప్పున ఇప్పుడును శ్రుతప్రకాశికతో గూడిన శ్రీభాష్యమును అధికరింతురు. మరియు శ్రీభాష్య పరంపరలో "శ్రీమాన్ వేంకటనాథార్యః" అను శ్లోకమును అనుసంధించుచు వచ్చెదరు. శ్రీభాష్యకారుల కాలములోనే కలిగిన 'నయప్రకాశిక' మొదలగు వ్యాఖ్యానములతో గూడిన భాష్యాన్వయమునందు ఈ తనియను అనుసంధించుటలేదు.

ఇట్టి త్రివిధ గ్రంథ సంప్రదాయ పరంపరలో ద్రావిడవేద భాష్య ప్రవర్తకులయిన శ్రీవిష్ణుచిత్తులు నడాదూరమ్మాళు మొదలగువారిని వడవాచార్యులనియు గ్రంథములలో వ్రాయబడియుండును. ఈయిరువురకును ఉభయభాష్య ప్రవర్తకత్వము కలదుగనుక తక్కినవానిబట్టియు వాడుకకలదు.

ఇట్లుండు వాడుకల నెరుగమిచే తెన్గలవారు అని వడగలవారు అని లోకవాదము ఒకటి పొసగియున్నది. శ్రీరంగాది ప్రదేశములలో వసించి దక్షిణవాక్కయిన ద్రావిడ వేదభాష్య ప్రవర్తనమే ముఖ్యముగా వర్తించువారు తెన్నాచార్యులు అనియు, కంచి మొదలగు ప్రదేశములలో వసించి సంస్కృత వాణియగు శ్రీభాష్యాది ప్రవర్తనమే ముఖ్యముగా వర్తించువారు వడవాచార్యులు అనియు చెప్పబడిరి. కాబట్టి యీవిషయమును విచారించి పదార్థమిదియని యెల్లవారును కరతలామలకముగా తెలిసికోవచ్చును.

ఆళ్వారాచార్యుల వైభవము,

సంపూర్ణము.